శ్రీమతే రామానుజాయ నమః
శ్రీమతే కూరనాథాయ నమః



కూరేశగాథామృతలహరి

(కూరేశుల జీవిత చరిత్ర, నిర్వాహాలు, ఐతిహ్యాలు, వార్తలు)

సంకలనము - వివరణము
పండితరత్న, వేదాంతవాచస్పతి
డా॥ శ్రీమాన్ ఈ.ఏ. శింగరాచార్య స్వామి

కూరనాథసహస్రాబ్ద పూర్తి మహోత్సవ స్మృతిజ్ఞాపిక - 2010
సమర్పణము
శ్రీమతి అలర్‌మేల్‌మంగ, శ్రీమాన్ పి.గోపాలకృష్ణమూర్తి దంపతులు

కూరేశగాథామృతలహరి

సంకలనము, వివరణము :
పండితరత్న, డా॥ శ్రీమాన్ ఈ.ఏ. శింగరాచార్యులు

ప్రథమముద్రణము – మార్చి, 2010

ఆవిష్కరణము – 12-3-2010

సందర్భము – ఉభయవేదాంత సదస్సు

వేదిక – శ్రీలక్ష్మీనారాయణ ఆర్యవైశ్య కల్యాణమందిరం, విజయవాడ-1

ప్రతులు – 500

వెల – అమూల్యము.

అన్ని హక్కులు – వ్యాఖ్యాతవే.

ముఖచిత్రం – కూరత్తాళ్వాన్ – కూరం

ఈ గ్రంథం భగవద్భాగవతాచార్య కైంకర్యనిష్ఠులు
శ్రీమతి అలర్‌మేల్‌మంగ, శ్రీమాన్ పి.గోపాలకృష్ణమూర్తి,
దంపతులు (హైదరాబాద్) భక్తి శ్రద్ధలతో సమర్పించిన పవిత్ర ద్రవ్యంతో ముద్రింపబడింది.

గోపాలకృష్ణేన సమర్పితాయాం దాసేన భక్త్యా పరయాఽవగాహ్య ।
కూరేశగాథామృతశీతవీచ్యాం ప్రపన్నచిత్తాని ముదం లభంతామ్ ॥

ప్రతులకు: శ్రీమాన్ పి. గోపాలకృష్ణమూర్తి
17-83/3, రోడ్ నెం.3., శ్రీనగర్‌కాలనీ
దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్-500 060
ఫోన్ 9848129366

డి.టి.పి. : **1. యస్.చంద్రశేఖర్,** తిరుపతి.
2. శ్రీమతి ఏ.యస్.జయలక్ష్మి, భవానినగర్, తిరుపతి.
3. కుమారి ప్రశాంతి, తిరుపతి

ప్రింటింగ్ : **సి.ఎన్. ప్రింటర్స్,** ప్రకాశంరోడ్, తిరుపతి.

అక్షరోపాయనం

శ్రీవత్సాంక మహం వందే కల్యాణగుణశేవధిమ్ ।
యత్సంబంధాత్ ధ్రువా ముక్తి రితి రంగేశ్వరోఽవదత్ ॥

శ్రీవైష్ణవపూర్వాచార్య రత్నహారంలో నాయకమణిగా వెలిగే భగవద్రామానుజులకు వేలాదిమంది శిష్యులు ఉన్నా, వారిలో ప్రథమగణ్యులు **"మొళియై క్కడక్కుమ్ పెరుమ్ పుకళ్వాన్"** అని, **"వాచామగోచరమహాగుణదేశికాగ్ర్య"** అని పొగడబడే కూరేశులే. వీరు అవతరించి వేయి సంవత్సరాలు పూర్తి అయిన శుభసందర్భంగా ఈ ఏడు సర్వత్ర సహస్రాబ్ద పూర్తి వేడుకలు జరుగుతున్నవి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఈ గ్రంథం కూరేశుల శ్రీచరణాలలో అక్షరోపాయనంగా సవినయంగా సమర్పింపబడుతున్నది. ఈ గ్రంథంలో కూరేశుల జీవితచరిత్ర, దివ్యప్రబంధవ్యాఖ్యానాలలో కూరేశులకు చెందిన ఐతిహ్యాలు, వారి అర్థ నిర్వాహాలు, వార్తలు, దివ్యప్రబంధరహస్యగ్రంథవ్యాఖ్యలలో ప్రమాణాలుగా ఉట్టంకింపబడ్డ పంచస్తవిలోని ప్రమాణాలు, వాటి ఆకరాలు యథావకాశం తెలుపబడ్డాయి.

దివ్యప్రబంధవ్యాఖ్యలలో కన్పించే కూరేశులకు చెందిన పలు ఐతిహ్యాలను బట్టి వారి వ్యక్తిత్వంలోని వైలక్షణ్యాన్ని గ్రహించవచ్చు. బాల్యాత్‌ప్రభృతి వీరిలో శ్రీవైష్ణవ లక్షణపూర్తి ప్రకాశించిందనే విషయం తిరువాయ్‌మొళి (5-5-1) పాశురం ఈడు వాఖ్యలో, పెరియాళ్వార్ తిరుమొళి (1-7-11) పాశురం తిరువాయ్‌మొళి ప్పిళ్ళైవ్యాఖ్యలో గోచరిస్తుంది. కూరేశులను వారి తండ్రి అయిన కూరత్తాళ్వార్ ఎంతో క్రమశిక్షణతో పెంచారనే సంగతి తిరుమాలై ప్రబంధం 7వ పాశురవ్యాఖ్యలో కన్పిస్తుంది. ఇటువంటి విలక్షణ వ్యక్తిత్వాన్ని కలవారు కనుకనే కూరేశులు **"వళ్ళ ముక్కుమ్బామ్ కుళియై క్కడక్కుమ్ నమ్ కూరత్తాళ్వాన్"** అని ప్రశంసింపబడ్డారు. ఈ విధంగా విద్యా-ధన - అభిజనమదాలను వీరు ఏమాత్రం లేనివారనే విషయాన్ని పలు ఐతిహ్యాలు నిరూపిస్తాయి.

భగవద్రామానుజులకు శ్రీభాష్యరచనలో సహాయం చేయగల్గిన. అగాధమైన పాండిత్యాన్ని కలవారైనా కూరేశులు ఎంతో వినయంగా మెలిగేవారు. ఈ సంగతి పెరియ తిరుమొళి (7-5-2) పాశురవ్యాఖ్యలో కన్పడుతుంది. చాలా ఉన్నతం అయిన కులంలో అవతరించినా కూరేశులకు ఆభిజాత్యాంహంకారం ఇసుమంత అయినా లేదు. ఈ సత్యం తిరువాయ్‌మొళి (7-10-5) పాశురానికి గల ఈడువ్యాఖ్యలో ప్రస్ఫుట

మవుతుంది. తమ భార్యచేతిలో నుండి బంగారు పాత్రను దూరంగా విసరివేసిన కూరేశులకు ధనమదం ఏమాత్రం లేదుకదా! ఈ విధంగా మదత్రయాన్ని జయించిన వారు కూరేశులు. కూరేశుల కటాక్షం సోకితేచాలు ఎటువంటి నాస్తికుడైనా ఆస్తికుడు కాగలడని పెరియతిరుమొழி- (8-1) దశక ప్రవేశంలోని ఐతిహ్యం తెలుపుతున్నది.

కూరేశుల విషయంలో భగవద్రామానుజులకు ఉన్న వాచామగోచరమైన ప్రేమను తిరువిరుత్తంలోని 99వ పాశుర వ్యాఖ్యలో గల ఐతిహ్యం, పెరియాழ்వార్ తిరుమొழி (3-8-4) పాశురానికి మణవాళ మహామునుల వ్యాఖ్యలోని ఐతిహ్యం మొదలైనవి చాటుతున్నాయి. ఈ సందర్భంలో తిరువాయ్‌మొழி (4-4-10) పాశురం ఈడు వ్యాఖ్యలోని ఐతిహ్యం కూడా స్మరణీయం. భగవద్రామానుజులకేకాక, పెరియనంబి వంటి ఆచార్యులకు సైతం వీరి విషయంలోగల విశేష ప్రతిపత్తిని తిరువాయ్‌మొழி (7-10-5) పాశుర ఈడు వ్యాఖ్యలోని ఐతిహ్యం, (3-5-7) పాశురం ఈడువ్యాఖ్యలోని ఐతిహ్యం- మొదలైనవి చాటుతున్నాయి. తమకు తీరని అపకృతిని చేసిన నాలూరాన్ విషయంలో సైతం అపారమైన కరుణను చూపించిన కూరేశుల ఆత్మగుణ సంపత్తిని విలక్షణ మోక్షాధికారమనే గ్రంథంలో ఎఱుమ్బియప్పా ఉట్టంకించిన వార్త తెలుపుతున్నది.

దివ్యసూరుల ప్రపబంధాలలో వీరి అగాధమైన అవగాహనను పెరియతిరుమొழி (3-8-1), తిరువాయ్‌మొழி (1-1-1) పాశురాల వ్యాఖ్యలలో, తిరువాయ్‌మొழி (4-9) దశక ప్రవేశంలో, తిరువిరుత్తం 99వ పాశురం పెరియవాచ్చాన్ పిళ్ళై వ్యాఖ్యలోని ఉట్టంకింపబడ్డ అర్థ నిర్వాహాలు నిరూపిస్తున్నాయి. భగవానుడే యోగక్షేమ నిర్వాహకుడు అనే మహావిశ్వాసం కూరేశులకు ఎంత దృఢంగా ఉన్నదో తిరువిరుత్తం-33వ పాశురానికి నమ్బిళ్ళై ఈడు వ్యాఖ్యలోని ఐతిహ్యం, తిరువాయ్‌మొழி (5-5-7) పాశురానికి ఈడు వ్యాఖ్యానంలో ఉట్టంకింపబడ్డ ఐతిహ్యం, తిరువాయ్‌మొழி (7-2) దశక ప్రవేశంలోని ఐతిహ్యం ఋజువుచేస్తున్నాయి. దివ్యప్రబంధ పాశురాలకు వేర్వేరు అర్థనిర్వాహాలను చేసేటపుడు సమకాలీనులైన ఆచార్యులను ఉదాహరణగా కూరేశులు ఉట్టంకించిన వైనానికి తిరువాయ్‌మొழி (1-5-11) , (8-10-3) పాశురానికి ఈడువ్యాఖ్యలో గల నిర్వాహం తార్కాణం. దీనినిబట్టి సమకాలీనులపై కూరేశులకున్న గౌరవం, తద్ద్వారా కూరేశుల వ్యక్తిత్వంలోని మహత్త్వం వ్యక్తమవుతున్నాయి.

కూరేశులు అనుగ్రహించిన సూక్ష్మమైన సంప్రదాయార్థాలుకూడా పలుచోట్ల వ్యక్తమవుతున్నాయి. దీనికి దృష్టాంతంగా పరన్దపడి అనే రహస్యగ్రంథంలో పిళ్ళైలో కాచార్యులవారు ఉట్టంకించిన నిర్వాహం, వార్తామాలైలోని 214వ వార్త మొదలైన వానిని ఉదాహరించవచ్చు. శ్రీరామాయణ సూక్తులలోని మాధుర్యాన్ని కూరేశులు

వివరించడాన్ని తిరుప్పావై 27వ పాశురానికి మూవాయిరప్పడివ్యాఖ్య, పెరియతిరుమొழி (6-9) దశక ప్రవేశం మొదలైన సందర్భాలలో చూడవచ్చు. కూరేశుల విషయ వివేచనా శక్తి అసాధారణమనే విషయాన్ని తిరువాయ్‌మొழி (4-6-1) పాశురానికి ఈడు వ్యాఖ్యలో గల ఉదాహరణం ఋజువు చేస్తున్నది. కూరేశుల శిష్య వాత్సల్యానికి తిరుమాలై 43వ పాశుర వ్యాఖ్యలోని వార్త మొదలైనవి తార్కాణాలు. వీరి భూతదయను, కరుణను తిరువాయ్‌మొழி (4-9) దశక ఈడు వ్యాఖ్యానప్రవేశం చివరలో ఉట్టంకింపబడ్డ కప్ప వృత్తాంతం సూచిస్తుంది. తిరువాశిరియమ్ మొదటి పాశురవ్యాఖ్యలో ఉట్టంకింప బడ్డ వృత్తాంతంవల్ల కూరేశులకు పుత్రులుగా పరాశరవ్యాసభట్టారకులు జన్మించడానికి ముందుగా ఒక కుమారుడు జన్మించి, అకాలమరణాన్ని పొందినట్లు తెలుస్తున్నది. అదేవిధంగా పాశురవ్యాఖ్యానంలోని ఐతిహ్యాన్నిబట్టి కూరేశులు ఒక కుమార్తెకూడా జన్మించిందని తెలుస్తున్నదని కొందరు భావిస్తున్నారు. కాని, సంప్రదాయంలో కూరేశులకు పుత్రికాసంతానం ఉన్న ప్రసిద్ధి లేదు. ఈ విధంగా కూరేశుల చరిత్రకు చెందిన పలు అంశాలుకూడా కన్పిస్తాయి. పలుగ్రంథాలలో పూర్వాచార్యులు ఉట్టంకించిన పలు అర్థ నిర్వాహాలు, ఐతిహ్యాలు, వార్తలు కూరేశుల వ్యక్తిత్వంలోని వైశిష్ట్యాన్ని ప్రకాశింపజేస్తున్నాయి.

కూరేశులు రచించిన పంచస్తవిలోని పలు శ్లోకాలను శ్రీపరాశరభట్టర్ మొదట పలువురు పూర్వాచార్యులు తమ కృతులలో, వ్యాఖ్యాలలో పరమ ప్రమాణాలుగా ఉట్టంకించారు. అసంఖ్యాకంగా ఉండే ఈ గ్రంథాలలో వ్యాఖ్యలలో ఎక్కడెక్కడ ఏయే శ్లోకాలు ప్రమాణాలుగా గ్రహింపబడ్డాయో, వాటి వివరణ తెలుపడం ఇంచుమించుగా అసాధ్యం. కొన్ని పూర్వాచార్య కృతులలో, దివ్యప్రబంధవ్యాఖ్యలలో పంచస్తవి శ్లోకాలు ప్రమాణాలుగా చూపబడ్డ సందర్భాలు మాత్రం దిఙ్మాత్రంగా చివరలో అనుబంధంగా ఇవ్వబడ్డాయి. ఈ ప్రమాణాలలో కొన్ని ఇప్పుడు పంచస్తవిలో కన్పించక పోవడం గమనించదగిన విషయం. ఉదాహరణకు- తిరువాయ్‌మొழிలోని (2-10) పాశురానికి ఈడు వ్యాఖ్యాన అరుంబదంలో ప్రమాణంగా ఉట్టంకింపబడ్డ **"సంజ్ఞా సుందరమ్"** ఇత్యాది అనే శ్లోకం అధస్సూచికలో సుందరబాహుస్తవ శ్లోకంగా చూపబడింది. కాని ఇపుడా శ్లోకం సుందరబాహుస్తవంలో లేదు. శ్రీపరాశరభట్టర్ సహస్రనామభాష్యంలో కూరేశకృతంగా, ప్రమాణంగా చూపిన **"సర్వజ్ఞతామేవో పలభామహే..."** ఇత్యాది శ్లోకం పంచస్తవిలో లేదు. పంచస్తవి వ్యాఖ్యాతలు వ్యాఖ్యానించలేదు కూడా. వీటినిబట్టి కూరేశులు పంచస్తవికంటే ఇంకే ఏమయినా కొన్ని స్తుతులను రచించారా! ఇదమిత్థంగా తెలియడంలేదు. విజ్ఞులైన పెద్దల సూక్తి ఈ విషయంలో ప్రమాణం.

గడచిన సంవత్సరం ఫిబ్రవరినెలలో (2009, ఫిబ్రవరి) నరసాపురం (ప.గో. జిల్లా) లోని ఆదికేశవ- ఎమ్బెరుమానార్ స్వామివార్ల కోవెలలో భాగవతాగ్రేసరులు

శ్రీమాన్ పి. గోపాల కృష్ణమూర్తిగారు మహోత్సాహంతో నిర్వహించిన కూరేశ సహస్రాబ్ద పూర్తి మహోత్సవాలలో వారు అందించబడిన ఆర్థికసాహ్యంతో కూరేశుల పంచస్తవి తాత్పర్య, విశేషాలతో ముద్రింపబడి ఆవిష్కరింపబడింది. ఇపుడు ఈ ఏడు జరుగుతున్న కూరేశుల సహస్రాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆళ్వార్ దివ్యప్రబంధప్రాజెక్టు, తి.తి.దే. వారు విజయవాడలో జరిపే ఉభయవేదాంతసదస్సులో కూరేశుల జీవితచరిత్రను, వారి ఐతిహ్యాలను, అర్థనిర్వాహాలను, వార్తలను తెలిపే ఈ **"కూరేశ గాథామృతలహరి"** గ్రంథాన్ని సంకలనం చేయడంలో మార్గదర్శనాన్ని చేసి ప్రోత్సహించి, మంగళాశాసనాలను కృపచేసిన పితృపాదులు, **న్యాయవేదాంత విద్వాన్, ఉ.వే. శ్రీమాన్ ఈయుణ్ణి రంగాచార్యస్వామివారి** సన్నిధిలో సవినయంగా, కృతజ్ఞతాపూర్వకంగా మోకరిల్లుతున్నాను. ఈ కృతి కూడా శ్రీమాన్ పి. గోపాలకృష్ణమూర్తిగారి ఆర్థికసహాయంతో ముద్రింపబడి ఆవిష్కరింపబడు తున్నది. ఇటువంటి సత్కార్యాలను ఎన్నిటినో చేస్తున్న శ్రీమాన్ గోపాలకృష్ణమూర్తిగారిని, వారి సహధర్మచారిణి శ్రీమతి అలర్‌మేల్‌మంగను నేను హృదయపూర్వకంగా అభినందిస్తూ, వారి భగవద్భాగవతాచార్యసేవ నిరంతరంగా కొనసాగాలని మనసార కోరుకొంటున్నాను. చాలా తక్కువ కాలవ్యవధిలో సిద్ధం చేయబడ్డ ఈ గ్రంథంలో చాలా లోపాలు చోటు చేసుకొన్నాయనే విషయం సత్యం. ఆ లోపాలను సరిదిద్ది ఆశీర్వదించ వలసినదిగా అభిజ్ఞులైన పెద్దలను వేడుతున్నాను. సకాలంలో గ్రంథాన్ని డిటిపి చేసిన శ్రీమతి జయలక్ష్మి, కుమారి ప్రశాంతి, శ్రీ చంద్రశేఖర్‌గార్లకు, అందంగా ముద్రించి అందించిన శ్రీహర్షవర్ధన్‌గారికి అనేక కృతజ్ఞతలు. స్వస్తి.

జయతు జయతు నిత్యం దేశికః కూరనాథో
జయతు జయతు పుణ్యా జన్మభూమి స్తదీయా ।
జయతు జయతు సూక్తిః తస్య భవ్యాఽనుభావ్యా
జయతు జయతు పంక్తిః తద్విదాం మే గురూణామ్ ॥

ఇట్లు,

భాగవత విధేయుడు
ఈ ఏ. శింగరాచార్యులు

తిరుపతి
5-3-2010

శ్రీమతే రామానుజాయ నమః
శ్రీమతే కూరనాథాయ నమః

కూరేశగాథామృతలహరి

అర్వాంచో యత్పదసరసిజద్వంద్వ మాశ్రిత్య పూర్వే
మూర్ధ్నా యస్యాన్వయ ముపగతా దేశికా ముక్తి మాపుః ।
సోఽయం రామానుజముని రపి స్వీయముక్తిం కరస్థాం
యత్సంబంధా దమనుత కథం వర్ణ్యతే కూరనాథః ॥

అంతు లేని, సాటి లేని వైభవాన్ని కలవారు, అపారమైన కరుణకు సముద్రం వంటివారు, సమస్తకల్యాణగుణాలను కలవారు, శ్రీమన్నారాయణుడే పరతత్త్వం అనే సత్యాన్ని ప్రతిపాదించే పరమవైదికసిద్ధాంతమైన విశిష్టాద్వైతాన్ని రక్షించడంకోసం తమ నేత్రాలను రెండింటిని త్యాగం చేసినవారు, పరమపావనచరిత్రులు, పంచస్తవ ప్రణేతలుగా ప్రసిద్ధులు అయిన శ్రీవత్సాంకనామధేయులు, శ్రీవైష్ణవసంప్రదాయంలో కూరత్తాళ్వాన్, కూరేశులు, కూరనాథులు– ఇత్యాదినామాలతో కూడా ప్రసిద్ధులు. వీరి మహిమను వర్ణించడానికి వాచస్పతిగా కీర్తింపబడే బృహస్పతికూడా సమర్థుడు కాడన్నది పొగడ్త కాదు; వాస్తవం. శ్రియఃపతివైభవాన్ని వర్ణించడం ఒకవేళ సాధ్యమైనా, శ్రీరామానుజుల మహిమను వర్ణించడం వీలయే పనికాదని భగవద్రామానుజుల అంతరంగశిష్యులలో ఒకరైన ముదలియాణ్డాన్ (దాశరథి) అనేవారు. శ్రీరామానుజుల మహిమను వర్ణించడం సాధ్యమైనా, శ్రీకూరేశుల మహిమను వర్ణించడం మాత్రం సాధ్యం కాదని మన పూర్వాచార్యులు ముక్తకంఠంగా నొక్కి వక్కాణించే అభిప్రాయం.

మానవునకు ఉండవలసిన గుణాలో ముఖ్యమైనవి జీవకారుణ్యం, ఆచార్యభక్తి, భగవద్భక్తి, లౌకికసుఖంలో వైరాగ్యం, వైదుష్యం, సత్కర్మానుష్ఠానం మొదలైనవి. ఇవి అన్నీ మూర్తీభవించిన రూపమే కూరేశులు. వీరి దివ్యచరితానుసంధానం శ్రీవైష్ణవు లందఱికీ తప్పక కర్తవ్యం. ప్రత్యేకించి, కూరేశుల సహస్రాబ్ద పూర్తి ఉత్సవాలు జరిగే ఈ సమయంలో ఈ మహనీయులను స్మరించడం అవశ్యకర్తవ్యమనే అభిప్రాయంతో వారి మహావైభవసముద్రంలోని చిన్ని కణాలను కొన్నిటినిమాత్రం ఆస్వాదించి ఆనందించడానికి ఈ చిన్న ప్రయత్నం చేయబడుతున్నది.

కూరేశుల అవతారం

ముక్తిప్రదాయకాలైన క్షేత్రాలుగా పౌరాణికప్రసిద్ధిని పొందినవానిలో ఒకటైన కాంచీనగరానికి వాయవ్యదిక్కులో **"కూరమ్"** అనే ఒక అగ్రహారం ఉన్నది. కూరేశుల తండ్రి పేరు కూరత్తాళ్వార్ అని దివ్యప్రబంధవ్యాఖ్యానాలలో తెలుపబడింది. కూరేశులు సౌమ్యవర్షంలో (కీ.శ.1008 సం) పుష్యమాసం హస్తనక్షత్రంలో కూరత్తాళ్వార్‌కు కుమారులుగా అవతరించారు. తండ్రిగారు వీరికి శ్రీవత్సాంకులనే పేరు పెట్టారు. వీరి అవతారాన్ని గూర్చిన కారణాన్ని సంప్రదాయజ్ఞులైన ఆచార్యులు ఈ విధంగా వివరిస్తారు. భగవానుడు శ్రీమన్నారా యణుడు శ్రీరామచంద్రుడై భూమిపై అవతరించినపుడు, ఆ స్వామికి అంతరంగ కైంకర్యాన్ని చేయడంకోసం ఆదిశేషుడు లక్ష్మణుని రూపంలో అవతరించి **"అహం సర్వం కరిష్యామి జాగ్రతః స్వపతశ్చ తే"** అని అంటూ ఆ శ్రీరామునకు సర్వదేశ-సర్వకాల-సర్వావస్థలలోను కైంకర్యాన్ని చేశాడు. **"రామస్య దక్షిణో బాహుః"** అనిఅన్నట్లు ఆ స్వామికి కుడిభుజమై నిలిచాడు. మళ్ళీ కొన్నాళ్ళకు భగవానుడు ధర్మసంస్థాపనం కోసం భూమిపై అవతరించదలచినపుడు "పూర్వంవలెనే ఈ అవతారంలోకూడా తనకు సహాయంగా ఉండమని ఆదిశేషుని భగవానుడు అడిగాడు. అపుడు ఆదిశేషుడు వినోదంగా- "మీరు శ్రీరామునిగా అవతరించినపుడు నేను తమ్మునిగా పుట్టి పలు క్లేశాలను అనుభవించాను. అది చాలు లెండి" అన్నాడట. అపుడు శ్రియఃపతి "ఈ అవతారంలో ఆ క్రమం వ్యత్యస్తం కానిద్దాం. నీవు అన్నగా అవతరించు, నేను తమ్మునిగా జన్మిస్తాను" అన్నాడట. ఆ రీతిలోనే ఆదిశేషుడు బలరాముడుగా, భగవానుడు శ్రీకృష్ణుడుగా అన్నదమ్ములుగా అవతరించారు. అయినా ఈ అవతారంలో కూడా భగవానునకు కొంత కొఱత మిగిలి పోయింది. "అయ్యో! ఇంతవరకు నేను శేషిత్వాన్నే ప్రధానంగా చేసికొని వ్యవహరించాను. నిజానికి నాకు శేషిత్వాన్ని అనుభవించడం కంటే భక్తులపట్ల శేషత్వాన్ని కల్గి ఉండడమే చాలా అభిమతం. అందువల్ల ఆ శేషిత్వానుభవం కోసం ఇంకా వేఱొక అవతారాన్ని పరిగ్రహించాలి" - అని మనస్సులో భావించిన భగవానుడు ముందుగా తాను శ్రీవత్సాంకుల రూపంలో శేషభూతుడుగా అవతరించి, ఆదిశేషులను శేషిస్థానంలో భగవద్రామానుజులుగా అవతరింపజేశాడు. ఇంతటితో ఆగకుండా, శ్రీయతివరపు నరవతారభూతులుగా చెప్పబడే వరవరమునుల రూపంలో ఆదిశేషులను శేషిస్థానంలో అవతరింపజేసి, తాను ప్రతివాదిభయంకరమ్ అణ్ణన్ అనే నామంతో శేషభూతునిగా అవతరించాడు- అని సంప్రదాయజ్ఞులైన పెద్దల సూక్తి. శ్రియఃపతి వక్షఃస్థలంలో వెలిగే శ్రీవత్సమనే పుట్టుమచ్చవంటి గుర్తును వీరు కల్గి ఉండడం వీరి పరమపురుషత్వాన్ని సూచిస్తుందని, అందువల్ల వీరు భగవానునివలె శ్రీవత్స లాంఛనులనే నామాన్ని పొందారనికూడా ప్రసిద్ధి.

కూరేశులు ఆళ్వాన్ అయ్యారు

వీరికి శ్రీవైష్ణవసంప్రదాయంలో **"ఆళ్వాన్"** అని పేరు. భగవద్భక్తిరసంలో, భగవద్గుణాను భవరసంలో మునిగి ఉండేవారని ఈ నామంయొక్క తాత్పర్యం. ఈ పేరు వీరికి కల్గడానికి సంబంధించిన, ఒక ఆసక్తికరమైన దివ్యప్రబంధ వ్యాఖ్యానంలో కన్పించే ఐతిహ్యం ప్రకృతంలో అనుసంధేయం. భగవద్భక్తి రసార్ద్రహృదయులైన శ్రీకూరేశులద్వారా తిరువాయ్‌మొళిలోని రస్యరహస్యార్థాలను ఆలకించాలని ఒక పర్యాయం భగవద్రామానుజులు ఆశపడ్డారు. శేషత్వంలో చరమావధిని కల్గి ఉండే కూరేశులు జగదాచార్యులైన శ్రీరామానుజులకు తాము తిరువాయ్‌మొళి అర్థాలను చెప్పడానికి ఇష్టపడలేదు. శ్రీరామానుజుల బలవంతంపై వారిద్దరిమధ్య ఒక ఒప్పందం కుదిరింది. అది ఏమంటే - కూరేశులు - దాశరథీ మొదలైన శిష్యులకు తిరువాయ్‌మొళిలోని అర్థాలను తెలియజేయాలి. ఆ శిష్యులు వానిని శ్రీరామానుజులకు తిరిగి చెప్పాలి- అన్నది ఆ ఒప్పందం. అదే మంచి తరుణం అని సంతోషపడిన శ్రీవైష్ణవుల పలువురి గోష్ఠి సమకూడింది. కూరేశులు తిరువాయ్‌మొళిలోని **"ఉయర్వఱ ఉయర్‌నలమ్"** అని ప్రారంభం అయే పాశురాన్ని అనుసంధించడం ఆరంభించిన క్షణంలోనే ఆ పాశురార్థాన్ని స్మరించి తన్మయత్వంతో మోహాన్ని పొందారు. "మతాంతరులు సద్గుణనిధి అయిన పరమాత్మను నిర్గుణునిగా అన్నారు. కాని, ఆళ్వార్లు మొదటి పాదంలోనె అతులితమహానందధామునిగా పరమాత్మను స్తుతించారు. ఆహా!" అని అంటూ మాటిమాటికీ పాశురాన్ని స్మరించి, మూర్ఛిల్లారు. అపుడు గోష్ఠిలో ఉండే దాశరథివంటి శ్రీవైష్ణవులు పరుగెత్తి పోయి, శ్రీరామానుజులవద్ద ఈ సంగతిని చెప్పారు. శ్రీరామానుజులు వెంటనే కూరేశుల దగ్గరకు వచ్చి "భగవానుని ఉలూఖలబంధ వృత్తాంతాన్ని **"ఎత్తిఱమ్ ఉరలినోడు ఇణైన్దిరున్దు ఏఙ్గియ వెళివే"** అని అంటూ స్మరించి ఆఱు నెలలకాలం మోహదశను పొందిన నమ్మాళ్వార్లను మనం ఇపుడు సేవించలేక పోయినా, అటువంటి గుణానుభవాన్నే పొంది, ముగ్ధులైన ఈభక్తవరేణ్యులను చూడగలిగాము కదా! ఆహా!" అని గద్గదస్వరంతో పల్కుతూ, చిరకాలం వేచి ఉన్నారు. కూరేశులు కొంత కాలానికి స్మృతిని పొందారు. అపుడు రామానుజులు వారిని **"ఆళ్వాన్! ఆళ్వాన్!"** అని గట్టిగా సంబోధిస్తూ, వీపు తట్టి లేవదీశారు. కూరేశులు మళ్ళీ **"ఉయర్వఱ ఉయర్‌నల ముదైయవన్"** అని అనుసంధిస్తూ దిగ్గున పైకి లేచారు. భగవద్గుణానుభవంవల్ల మనస్సు కఱిగిపోయే సుకుమారమైన స్వభావాన్ని కల్గి ఉండడంలో నమ్మాళ్వార్లవంటివారు కూరేశులు అనే భావంతో శ్రీరామానుజులు వీరిని "ఆళ్వాన్!" అని సంబోధించారు. ఆ పేరు వీరికి ప్రసిద్ధనామంగా స్థిరపడింది.

పూచిన పూవు వెంటనే పరిమళించింది

కూరేశుల చిన్నతనంలోనే వారి జ్ఞానభక్తులు పరిమళించాయి. **"పిఞ్ఞాయ్ పళ్ళుత్తాళై"** అంటూ గోదాదేవి విషయంలో శ్రీవరవరమునులు చిన్నతనంలోనే పరిణతిని పొందినట్లు పల్కిన సూక్తి వీరి విషయంలోకూడా పూర్తిగా అన్వయిస్తుంది. కూరేశుల చిన్నతనంలోనే తల్లిని కోల్పోయారు. కూరేశుల తండ్రి కూరత్తాళ్వాన్ ద్వితీయవివాహం చేసికోవాలని ఒక దశలో తలచారు. కాని, కుమారుని విలక్షణమైన యోగ్యతను, భగవద్భక్తిని చూచి, తాము మళ్ళీ వివాహమాడితే రాబోయే భార్య సవతి తల్లే అవుతుంది కనుక, ఆమె ఒకవేళ సవతితల్లి భావంతో కూరేశుల విషయంలో అపచారం చేస్తే, ఆ అపచారంలో తమకుకూడా అన్వయం ఉంటుందని భయపడి, సామాన్యమైన గృహస్థాశ్రమ ధర్మపాలనకంటే, భాగవతాపచారాన్ని చేయకపోవడం అనే విశేషధర్మాన్ని పరిపాలనే యుక్తతరం– అని భావించి రెండవమాఱు వివాహం చేసికోవడం మానివేశారు.

కూరేశుల లౌకికవిషయవైరాగ్యం

కూరేశులు తాము జన్మించిన కూరం అనే అగ్రహారానికి అధిపతులు. ఒకనాటి రాత్రి నగరసంచారాన్ని చేసే వీరికి ఇక ఇంటిలో జరిగే సంభాషణ యాదృచ్ఛికంగా చెవిలో పడింది. వెంటనే రహస్యంగా ఆ సంభాషణను పూర్తిగా విన్నారు. అపుడు వారికి తెలిసిన విషయం ఏమంటే – 'ఆ ఇంటియజమాని కుమార్తెను వివాహమాడిన వరుడు త్వరలో మరణిస్తాడు' అని జ్యోతిషపండితులు చెప్పారు. ఆమాట విన్నతరువాత ఎవరూ ఆమెను వివాహమాడడంకోసం ముందుకు రావడం లేదు. ఆమెకు వివాహ వయస్సు మీరి పోతున్నది. ఈమెను ఇంకా ఇంటిలో పెట్టుకొంటే అది లోకాపవాదానికి కారణం అవుతుంది. అందుచేత ఆమెను వధించడమే తప్ప వేఱు దారి లేదు– అని బంధువులు నిర్ణయించుకున్నారు.

ఈ సంగతిని రాత్రి జరిగిన సంభాషణద్వారా గ్రహించిన కూరేశులు మఱునాడు ఆ ఇంటిసభ్యులను రాజసభకు రమ్మని, రాత్రి మీ ఇంటిలో జరిగిన సంగతిని గూర్చి నివేదించమని అన్నారు. వారుకూడా యథార్థాన్ని వెల్లడించారు. అపుడు శ్రీకూరేశులు "రాజ్యంలోని ప్రజలను ఆపదలనుండి కాపాడడమే కదా పాలకుని పరమకర్తవ్యం. అందువల్ల మీ కుమార్తెను నేను వివాహం చేసికొంటాను" అని మాట ఇచ్చారు. "అయ్యో! ఇదేమి న్యాయం! మీకు ఏదయినా సంభవిస్తే రాజ్యం గతి ఏమి కావాలి? మాకు దిక్కెవరు!" అని అంటున్న వారిని లెక్కజేయకుండా, "మీకు కల్గిన ఆపదకు ఇదే పరిష్కారం. వివాహానికి రెండు ప్రయోజనాలు– ధర్మానుష్ఠానం, పుత్రలాభం. ప్రజోత్పత్తికోసం భార్యతో శరీరసుఖం అపేక్షితం అవుతుంది. కాని, దానిని ఉపేక్షించి కేవలం గృహస్థాశ్రమ

ధర్మానుష్ఠానంకోసం ఈమెను వివాహం చేసికొంటే నాకు ఏ విపత్తు సంభవించదుకదా" అని ఆమెను వివాహం చేసికొన్నారు. ఆసాధ్వీమణి కూడా పతిని అనుసరిస్తూ, విషయసుఖాలపట్ల జుగుప్సను కల్గినదై, సద్భక్తిని, వైరాగ్యాన్ని కల్గినదై, **"ఆణ్డాళ్"** అనే వ్యవహారనామాన్ని సార్థకం చేస్తూ భర్తతో సుఖంగా కాలం గడిపింది. **"కరణేషు మంత్రీ"** అనే రీతిలో భర్తకు అపుడపుడు కల్గిన శాస్త్రసందేహాలను సైతం తీరుస్తూ **"పత్నీ సుదక్షిణేత్యాసీత్"** అన్నట్లు తగిన భార్యగా వెలుగొందింది.

భాగవతారాధననిష్ఠాతిశయం

సకలవిధాలైన సంపదలను సమృద్ధిగాకల కూరనాథులు యతిరాజ శ్రీచరణ సమాశ్రయణం చేయడానికి ముందు, తమ నగరంలో నివసిస్తూ మహోత్సవసమయాలో కూడా వరదరాజస్వామిని సేవించడంకోసం కాంచీనగరానికి వెళ్ళకుండా అతిథి సమారాధనను శ్రద్ధగా చేస్తూ తమ ఇంటిలోనే ఉండేవారు. వరదరాజస్వామికి జరిగే వైశాఖోత్సవాన్ని సేవించాలనే కుతూహలంతో ఉత్తరదేశంలో చాలా దూరాన ఉన్న ఇద్దరు భక్తులు మార్గమధ్యంలో కూరానికి వచ్చి, కూరేశుల ఇచ్చిన ఆతిథ్యాన్ని స్వీకరించి, కంచికి వెళ్ళారు. అక్కడ వరదరాజస్వామి ఉత్సవాన్ని సేవించారు. గరుడసేవనాడు కూడా కంచికి రాని కూరేశులను వారిద్దరు తక్కువచేసి మాటలాడారు. "పలు యోజనాలదూరంనుండి ఎంతో వ్యయాన్ని, ప్రయాసను ఓర్చి భక్తులు వచ్చి కంచి గరుడసేవను సేవిస్తూ ఉండగా, చాలా సమీపంలోనే ఉండే కూరేశులు తమ ఇంటిలోనే ఉంటూ, ఉత్సవాలను సేవించడంలేదే !" అని కొంచెం అగౌరవంగా అన్నారు. తరువాత వారు భగవత్సేవకోసమై ఆలయానికి వెళ్ళారు. ఎంత ప్రయత్నించినా వారిద్దరికీ భగవద్దర్శనం లభించలేదు. మనస్సులో చాలా బాధపడిన వారిద్దరిని వరదరాజస్వామి అర్చకముఖంగా –"మీరు మహాభక్తులైన కూరేశుల విషయంలో మానసికంగా చాలా అపచారపడ్డారు. అందువల్ల వెంటనే వారిదగ్గరకు పోయి క్షమను అర్థించండి. లేకపోతే మీకు నా దర్శనాన్ని ఇవ్వను" అని హెచ్చరించాడు. అదేవిధంగా వారిద్దరు కూరేశుల పాదాలపై పడి జరిగినదానిని తెలిపి తమ తప్పును మన్నించమని వేడారు. అపుడు కూరేశులు చిఱునవ్వుతో "మీరు వెళ్ళిరండి. భగవానుడు కరుణాపూర్ణకటాక్షంతో మిమ్ములను అనుగ్రహిస్తాడు" అని ఓదార్చారు. వారిద్దరు తరువాత కంచిని సేవించి, ఆనందించారు.

సంపత్పరిత్యాగం – ఆచార్యసమాశ్రయణం

కూరం అగ్రహారంలోని కూరేశుల భవనం మహేంద్రభవనాన్ని, కుబేరహర్మ్యాన్ని మించి ఉండేది. వారి భవనంలోని ప్రధానద్వారకవాటాలకు పొదగబడ్డ ముప్పల గంటల

ధ్వని యోజనదూరంవరకు విన్పించేది. అంతటి గొప్ప సంపదను కల కూరేశులు ప్రతిదినం భక్తులను, సాధువులను, దరిద్రజనులను ఇతరులను పలు రీతులలో అన్నపానాదులతో ఆనందింపజేస్తూ ధార్మికాగ్రేసరులుగా ప్రకాశించారు.

ప్రతిదినం కంచిలోని భగవదాలయంలో శ్రీహస్తిశైలశిఖరోజ్జ్వలపారిజాతం అయిన వరదరాజస్వామికి ఆరాధన అయిన తరువాత ప్రధానద్వారం తలుపులు మూసిన పిమ్మటనే కూరేశుల భవనకవాటాలు మూయబడేవి. ఒకనాడు కంచిలో ఉత్సవకారణంగా ఆలయం తలుపులు రాత్రి చాలా సేపు అయినా మూయబడలేదు. ఈ విషయాన్ని గుర్తించని కూరేశుల గృహరక్షకులు యథాపూర్వం కూరేశుల ఇంటి తలుపులను రాత్రి పొద్దుపోయిన తర్వాత మూసివేశారు. తలుపులను మూసేటపుడు వినబడిన తలుపుల గంటల చప్పుడు యోజన దూరంలో ఉన్న శ్రీవరదరాజస్వామి చెవులకు వినబడింది. అపుడు ఆ స్వామి ఆ ధ్వనిని ఆలయకవాట ధ్వనిగా భావించి తనకు ఆలవట్టం వీచే కైంకర్యాన్ని చేసే అంతరంగ సేవకులైన కాంచీపూర్ణులను చూచి "ఈనాడు మన ఆలయంలో ఆరాధన పూర్తి కాకుండానే తలుపులను ఎందుకోసం మూశారు?" అని ప్రశ్నించాడు. కాంచీపూర్ణులు "స్వామీ! ఈ ధ్వని తమ ఆలయంలోనిది కాదు. కూరేశుల భవనకవాటలను మూసినపుడు వచ్చిన ధ్వని ఇది" అని అన్నారు. వరదస్వామి చిఱునవ్వు నవ్వి "కూరేశుల సంపద్వైభవం అంతటిదా! మాకు కూడా ఈ రీతిగా భ్రమను కల్గించిందే!" అని అన్నారు.,

తరువాత ఈ ఇరువురి సంభాషణ వివరాన్ని విన్న కూరేశులు మనస్సులో చాలా నొచ్చుకొని సిగ్గుపడి పరమవైరాగ్యాన్ని పొంది, తమ సమస్తసంపదను పరిత్యజించి, సత్పాత్రదానాన్ని చేశారు. శరీరపోషణకు అవసరం అయినంత ధనాన్నిమాత్రం పెట్టుకొన్నారు. సదాచార్యసమాశ్రయణాన్ని చేసి ఆత్మోజ్జీవనంకోసం ప్రయత్నించాలని నిశ్చయించుకున్నారు. అప్పటికే భగవద్రామానుజులు వరదరాజస్వామి సన్నిధిలో సన్న్యాసాశ్రమాన్ని స్వీకరించారనే విషయాన్ని విని, కంచికి వచ్చి, వారి శ్రీపాదాలను ఆశ్రయించి, వారిని ప్రార్థించి, వారివల్ల పంచసంస్కారాలను పొంది, వారి శ్రీచరణసన్నిధానంలోనే సామాన్యశాస్త్రాలను, అధ్యాత్మశాస్త్రాలను, సంప్రదాయార్థాలను అధికరించి, ఇతరులకు బోధిస్తూ కాలం గడిపారు.

కూరేశుల శ్రీరంగప్రయాణం

కొంతకాలం తరువాత ఒకనాడు శ్రీరంగనాథుని ఆజ్ఞానుసారం తిరువరఙ్గ ప్పెరుమాళ్ అరైయర్ అనే దివ్యప్రబంధగాయకులు శ్రీరంగంనుండి కంచికి వచ్చి తమ దివ్యగానంతో వరదరాజస్వామిని సంతోషపెట్టారు. అపుడు వరదుడు ఎంతో ప్రీతితో– "మీకేమి వరం కావాలో అడగండి, ఇస్తాను" అని అన్నాడు. అరైయర్– "స్వామీ!

శ్రీరంగనాథుని సన్నిధి సమృద్ధికోసం భగవద్రామానుజులను మీరు మాకు అనుగ్రహించాలి" అని ప్రార్థించారు. "అయ్యో! వీరు ఈ విధంగా శ్రీరామానుజులను పంపమని అడుగుతున్నారు. రామానుజులను ఏవిధంగా విడచి ఉండగలను!" అని మనస్సులో వరదరాజస్వామి కొఱతపడినా, తాను ఇచ్చిన మాటను కాదనలేక శ్రీరామానుజులను అరైయర్‌కు ఇచ్చి, శ్రీరంగానికి పంపాడు. ఈవిధంగా శ్రీరంగానికి ప్రయాణమైన శ్రీరామానుజులను విడచి ఉండలేని కూరేశులు తాముకూడా వారి వెంట శ్రీరంగాన్ని చేరారు.

చరమశ్లోకార్థలాభం

భగవద్రామానుజులు గోష్ఠిపూర్ణుల శ్రీపాదసన్నిధిలో ఉండి చాలా శ్రమపడి శ్రీగీతాచరమశ్లోకరస్య రహస్యార్థాలను శ్రవణం చేసి, తమ మఠానికి తిరిగివచ్చారు. ఆచార్యుల రాకను విన్న కూరేశులు వారి వద్దకు వెళ్ళి నమస్కరించి మౌనంగా నిలిచారు. అపుడు రామానుజులు "నాయనా! కూరేశా! గోష్ఠిపూర్ణులు నాకు చరమశ్లోక రహస్యార్థాలను ఉపదేశించి, వీనిని ఎవరికీ చెప్పవద్దని, గోప్యంగా ఉంచి రక్షించమని అన్నారు. అపుడు నేను పరమభాగవత శిఖామణి అయిన నా శిష్యులు కూరేశులకు మాత్రం చెప్పకుండా ఉండలేను– అని అన్నాను. కాంచీపూర్ణులు, కూరేశులు వినే యోగ్యతను కలవారైనా, వారి అధ్యవసాయాన్ని పరీక్షించి, ఒక సంవత్సరకాలం వారినుండి శుశ్రూషను పొంది, ఆ పిమ్మటనే ఉపదేశించండి– అని నాకు అనుమతిని ఇచ్చారు." అని అన్నారు. ఆర్తులైన కూరేశులు **"స్వామీ! "మిన్నిన్ నిలైయిల మన్నుయిరాక్కైకళ్"** అన్నట్లు ఈశరీరం క్షణభంగురం, మెఱపు మెఱసినంతకాలం కూడా ఉంటుందో ఉండదో చెప్పలేమే! ఒక సంవత్సర కాలంపాటు నేను నిలచి ఉంటానని ఏమి నమ్మకం! అంత కాలం ఈ రహస్యార్థాలను వినకుండా ఉండలేను" అని పల్కి, "ఆచార్యభవన ప్రాంగణంలో ఒక మాసం ఉపవాసం చేస్తే అది ఒక సంవత్సరకాలం శుశ్రూషచేయడంతో సమానం" అనే శాస్త్రమర్యాదనుబట్టి ఆ రీతిగా ఒక నెలపాటు ఉపవాసాన్ని చేసి, చరమశ్లోకార్థాలను శ్రీరామానుజులద్వారా విన్నారు.

బంగారుపాత్రను విసిరివేశారు

భగవద్రామానుజుల శ్రీపాదపద్మాలను నిరంతరం అనుసంధించే పరమై కాంతులు, ఆచార్యులనే పరదేవతగా భావించేవారు అయిన కూరేశులు దైనందిన జీవనానికి ఆవశ్యకం అయినంత తక్కువ సంపదనుమాత్రం తమవద్ద ఉంచుకొని కొంతకాలం గడిపారు. తావన్మాత్రమైన సంపదను సైతం తమవద్ద పెట్టుకొని కాపాడుకోవడం కూడా స్వరూపవిరుద్ధమని భావించి, ఆ సంపదను కూడా భాగవతులకు

దానం చేసివేశారు. అన్ని విధాల త్రికరణశుద్ధితో తనను అనుసరించే ధర్మపత్ని ఆణ్డాళ్‌తోపాటు శ్రీరంగానికి బయలుదేరారు. దారి నడుమ మధురాంతక క్షేత్రసమీపంలో వారు ప్రయాణం చేసే సమయంలో ఆణ్డాళ్ కూరేశులతో "స్వామీ! నాకు చాలా భయంగా ఉన్నది" అని అన్నారు. కూరేశులు "మన దగ్గర విలువైన వస్తువు ఏదైనా ఉంటే కదా భయపడాలి. నీవు దేనికైనా తీసికొనివస్తున్నావా! ఏమి!" అని ఆమెను ప్రశ్నించారు. ఆణ్డాళ్– "స్వామీ సమస్తం దానం చేసినా, మీరు ప్రతిదినం సాపాటు చేసే సువర్ణభాజన పత్రాన్ని (ఆకును) మాత్రం మనవెంట తెస్తున్నాను" అని మెల్లగా అన్నారు. వెంటనే కూరేశులు ఆ పాత్రను ఆమెదగ్గరనుండి తీసికొని, దగ్గరలో ఉండే ముళ్ళపొదలలోకి వేసిరివేసి "ఇక నిర్భయంగా ప్రయాణం చేయవచ్చు, పద" అని ధర్మపత్నితో అన్నారు. ఆ క్షేత్రంలో తమ ఆచార్యులైన భగవద్రామానుజులకు అభయాన్ని ప్రసాదించిన భగవానుడు **"ఏరికాత్త రామన్"**ను సేవించి, దారిలో ఉండే దివ్యదేశాలను మంగళాశాసనం చేస్తూ శ్రీరంగాన్ని చేరి, ఆచార్యుల సన్నిధిలో కైంకర్యం చేసికొంటూ ఆ పుణ్యదంపతులు ఆనందంగా కాలం గడువసాగారు.

తిరువరఙ్గత్తముదనార్ కూరేశులను ఆశ్రయించడం

అపుడు ఆ సమయంలో శ్రీరంగాలయపరిజన పాలనాధికారాన్ని నిర్వహించే తిరువరఙ్గత్తముదనార్ భగవద్రామానుజులు సన్నిధికి వచ్చి "నేను పలు పాపాలను చేశాను. భగవచ్ఛేషభూతుణ్ణి అయేటట్లుగా నన్ను సంస్కరించే ఒక మహానుభావుణ్ణి నాకు ఆచార్యులుగా నిశ్చయించండి" అని వారిని ప్రార్థించారు. అపుడు శ్రీరామానుజులు కూరనాథులను పిలిచి – "వీరు మన శ్రీరంగనాదుని ఆలయనిర్వహణ ధురంధరులు. వీరిలో ఉండే దోషాలను వేనినీ లెక్కించకుండా, వీరిని అనువర్తిస్తూ అనుకూలంగా ప్రవర్తించి నావద్దకు తీసికొని రండి' అని ఆదేశించారు. శ్రీవత్సాంకులు ఆచార్యాదేశాను సారం తిరువరఙ్గత్తముదనార్‌ను సంస్కరించి రామానుజుల సన్నిధికి తీసుకొనివచ్చారు. శ్రీరామానుజుల నియమనంతో అముదనార్ కూరేశులవద్ద పంచసంస్కారాలను పొందారు. అముదనార్ శ్రీరామానుజులను కీర్తిస్తూ రచించిన ఇరామానుశనూ*ఱ్ఱ*న్దాది ప్రబంధంలో– **"మొళ్ళియై క్కడక్కుమ్ పెరుమ్ పుకళ్ఞాన్ వఞ్ఞ ముక్కుఱుమ్బామ్ కుళ్ళియై క్కడక్కుమ్ నమ్ కూరత్తాళ్వాన్"** (మాటకు అందని గొప్ప కల్యాణగుణాలను కలవారు, మానవుని వంచించే ధన– విద్యా–అభిజనమదాలనే మూడు పాడు గోతులలో పడకుండా దాటిన మన కూరేశులు) అని ఆచార్యసద్గుణ సంకీర్తనాన్ని చేసి ధన్యులయ్యారు.

కూరేశుల అంతరంగభక్తులైన అముదనార్ ఆచార్యసన్నిధిలో దర్శనగ్రంథాలను అధ్యయనం చేస్తూ ఉండగా అముదనార్ తల్లి పరమపదాన్ని చేరారు. దశాహకైంకర్యం

పూర్తి అయిన తరువాత ఏకాహశ్రాద్ధనిర్వహణంకోసం అముదనార్ భోక్తగా ఎవరిని అయినా యోగ్యులను పంపవలసినదిగా శ్రీరామానుజులను అర్థించారు. వారు కూరేశులను అందుకోసం వెళ్ళమని ఆదేశించారు. కూరేశులు మనస్ఫూర్తిగా ఆ ఆదేశాన్ని స్వీకరించడాన్ని చూచి అముదనార్ తమ భాగ్యానికి ఉబ్బి తబ్బిబ్బు అయ్యారు. ఏకాహశ్రాద్ధంనాడు తమ సమస్తసంపదను ఆ ఆచార్యులకు సమర్పించారు. కూరేశులు ఆ సంపదను అంతటినీ తీసికొని దారిలో నాల్గు వైపుల విసరి వేసి కావేరీనదిలో స్నానం చేసి, ఊర్ధ్వపుండ్రధారులై యతిరాజపాదసన్నిధిని చేరి నమస్కరించారు. మీకు సమర్పించిన ధనం ఏమయిందని శ్రీరామానుజులు ప్రశ్నించగా, అనర్థహేతువు అయిన ఆ అర్థం నష్టమైనది– అని అంటూ జరిగిన వృత్తాంతాన్ని కూరేశులు నివేదించారు. కూరేశుల విరక్తివైలక్షణ్యాన్ని చూచి శ్రీరామానుజులు ఆశ్చర్యపడి చాలా ఆనందించారు.

శ్రాద్ధసమయంలో భోక్తగావచ్చిన వారిని యజమాని **"కిం సకలం సంపూర్ణమ్"** (అంతా పూర్ణమే కదా!) అని ప్రశ్నించినపుడు భోక్త **"సకలం సంపూర్ణమ్"** అని తృప్తిగా బదులివ్వడం శాస్త్రపరిపాటి. అపుడే ఆ శ్రాద్ధం పూర్తి అయినట్లు లెక్క. రామానుజులు కూరేశులను భోక్తగా పంపినపుడు అముదనార్ శ్రీరంగాలయం కుంచికను (తాళం చెవులు) మేము సమర్పిస్తే తప్ప **"తృప్తోఽస్మి"** అని అనవద్దని నియమించారు. కూరేశులు శ్రీరామానుజుల మాటప్రకారం అముదనార్‌వల్ల శ్రీరంగ ఆలయపరిపాలనాధికారాన్ని, కుంచికను వారివల్ల భోక్తదక్షిణగా పొంది, వానిని ఆచార్యసమర్పణం చేశారు. శ్రీరామానుజులు శ్రీరంగదేవాలయపరిపాలన తమ అధీనమైనందులకు సంతోషించి, ఆలయకైంకర్య నిర్వహణలో చేయదగిన సంస్కరణలను చేసి, ఆలయ అభివృద్ధిని, కలుగజేశారు. అందువల్లనే ఈనాటికీ **"శ్రీమన్! శ్రీరంగశ్రియ మనుపద్రవా మనుదినం సంవర్ధయ"** అని, **"రామానుజార్యదివ్యాజ్ఞా వర్ధతా మభివర్ధతామ్"** అని ప్రతిదినం పెద్దలు మంగళాశాసనసమయంలో అనుసంధిస్తున్నారు.

కూరేశుల అసాధారణ మేధావిలాసం

భగవద్రామానుజులు బాదరాయణుల బ్రహ్మసూత్రాలకు భాష్యాన్ని రచించి శ్రీయామునాచార్యులవారి మనసులో మిగిలిపోయిన కొఅతను తీర్చదలచి, బ్రహ్మసూత్రాలపై భగవద్బోధాయనప్రణీతమైన వృత్తిని ముందుగా చూడదలచారు. ఆ గ్రంథం కాశ్మీరదేశంలోని శారదాపీఠంలో రక్షింపబడుతున్నదని తెలిసి, కూరేశులతో కలసి అక్కడకు బయలుదేరి శారదాపీఠాన్ని చేరారు. రామానుజుల కీర్తిప్రతిష్ఠలను గూర్చి అంతకు ముందే విన్న సరస్వతీభాండాగారాధికారివల్ల ఆ గ్రంథాన్ని పొంది ప్రథమాధ్యాయంవరకు కటాక్షించారు. కూరనాథులు రాత్రివేళకూడా ఆ గ్రంథాన్ని చదివే

కూరేశులు ద్వితీయాధ్యాయంనుండి చివరివరకు పఠించి, అందలి విశేషాలను తమ మేధలో నిక్షిప్తం చేశారు. అసూయాళువులైన కొందఱి మాటలను విన్న భాండాగారాధికారి తిరిగి ఆ గ్రంథాన్ని రామానుజులను చూడనివ్వలేదు. 'మొదటి అధ్యాయం తరువాత గల గ్రంథభాగాన్ని చూడలేక పోయామే!' అనే అతృప్తిని రామానుజులు వ్యక్తం చేసినపుడు కూరేశులు తాము ఆ వృత్తిగ్రంథాన్ని పూర్తిగా చదివినట్లు తెలిసి వారు ఆజ్ఞాపిస్తే ఆ గ్రంథాన్ని ఒక్కపంక్తికూడా విడువకుండా అప్పగించగలనని అన్నారు. కూరేశులు అసాధారణమేధావిలాసాన్ని చూచిన రామానుజులు చాలా ఆశ్చర్యపడ్డారు.

శ్రీభాష్యరచనలో శ్రీరామానుజులకు తోడ్పాటు

"భవాం స్తు సహ వైదేహ్యా గిరిసానుషు రంస్యతే, అహం కరిష్యామి జాగ్రత స్స్వపతశ్చ తే" (నీవు సీతాదేవితోపాటు పర్వతసానువులలో విహరించేటపుడు మెలకువగా ఉన్న సమయంలో, నిద్రించే సమయంలోను అన్ని కైంకర్యాలను చేస్తాను) అని ప్రార్థించి లక్ష్మణుడు సీతారాములకు ఇద్దఱికీ సకలవిధకైంకర్యాలను చేశాడు. లక్ష్మణుని సేవలకు శ్రీరాముడు ఆనందించి– **"భావజ్ఞేన కృతజ్ఞేన ధర్మజ్ఞేన చ లక్ష్మణ, త్వయా పుత్రేణ ధర్మాత్మా న సంవృత్తః పితా మమ"**అని ప్రశంసిస్తూ, లక్ష్మణునివల్ల తనకు తండ్రి జీవించలేడనే కొఱత తీరిందని అన్నాడు. ఆ రీతిలోనే బోధాయనుల వృత్తి గ్రంథాన్ని బుద్ధిస్థం చేసికొని, నాకు ఆనందం కల్గించిన మీ వల్ల ఆ గ్రంథాన్ని నేను చూడలేక పోయాననే బాధ తీరింది. అది మన చేతులకు అందినట్లే ఆనందిస్తున్నాను" అని శ్రీరామానుజులు కూరేశులను ప్రశంసించారు. తరువాత రామానుజులు, కూరేశులు శ్రీరంగానికి చేరారు.

శ్రీభాష్యరచనకు ఉపక్రమించిన రామానుజులు కూరేశులతో "నేను బోధాయన వృత్తిని పూర్ణంగా చూడలేదు. అందువల్ల నా భాష్యరచనలో ఎక్కడైనా వృత్తిగ్రంథ విరోధం ఏర్పడవచ్చు. అపుడు నాకు ఆ విరోధాన్ని మీరు తప్పక సూచించాలి" అని అన్నారు. కూరేశులు రామానుజులతో "సర్వజ్ఞులైన మీరు ఈ విధంగా అనదగునా? నేను ఆ విధంగా చేయలేను?" అని అన్నారు. రామానుజులు అపుడు– "పోనీ, ఒకపని చేయండి. మీకు వృత్తి గ్రంథానికి విరోధంగా నా భాష్యం తోచినపుడు మీరు నేను చెప్పే భాష్యాన్ని వ్రాయడం మానివేయండి. ఊరికే ఉండండి" అని ఒక నియమాన్ని ఏర్పరచారు. కూరేశులు దానికి ఒప్పుకొన్నారు. కూరేశుల సహాయంతో రామానుజులు శ్రీభాష్యరచనను పూర్తిచేశారు. **"భావజ్ఞేన"** అనే శ్లోకార్థాన్ని స్మరిస్తూ రామానుజులు కూరేశుల సాహచర్యంవల్ల, సహకారంవల్ల తమకు భగవద్యామునులు లేరనే కొఱత లేకుండా పోయిందని భావించారు. కూరేశులు కూడా అభినందించారు.

గోష్ఠీపూర్ణులకు శుశ్రూష

భగవద్రామానుజులు అనుగ్రహించే ఉభయవేదాంతకాలక్షేపగోష్ఠి నడుస్తున్న ఒకానొక సమయంలో ఆత్మకు అంతరంగనిరూపకం జ్ఞాతృత్వమా? లేక, శేషత్వమా? అనే విషయం చర్చకు వచ్చింది. భగవద్రామానుజులు సర్వజ్ఞులైనా, యథార్థం ఆచార్య ముఖంగా లోకానికి తెలియజేయాలని తలచి, "కూరేశా! మీరు గోష్ఠీపురానికి (తిరుక్కోట్టియూర్‌కు) పోయి గోష్ఠీపూర్ణుల సన్నిధిలో ఈ సందేహాన్ని విన్నపించి, వారు పలికే సమాధానాన్ని తెలిసికొనిరండి"– అని ఆదేశించారు. కూరేశులు తిరుక్కోట్టియూర్ నంబి వద్దకుపోయి సందేహాన్ని విన్నపించి, వారికి శుశ్రూష చేస్తూ ఆఱు నెలలకాలం వేచి ఉన్నారు. అయినా నమ్బి ఏమీ సమాధానం చెప్ప లేదు. కూరేశులు "ఇక నేను ఆచార్యులను సేవించి వస్తాను" అని నమ్బివద్ద అనుమతిని ప్రార్థించగా అపుడు నమ్బి– "కూరేశా! ఆళ్వార్లు **'అడియేనుళ్ళాన్'** అని అనుగ్రహించారు. చూచారా" అని పల్కి సందేహనివృత్తిని చేశారు. కూరేశులుకూడా **"కృతార్థుణ్ణి అయ్యాను"** అని అంటూ వారినుండి అనుమతిని తీసికొని శ్రీరామానుజులవద్దకు చేరి, తిరుక్కోట్టియూర్ నంబి పల్కిన సూక్తిని విన్నపించారు.

ఇక్కడ తిరుక్కోట్టియూర్ నంబి ఇచ్చిన సమాధానంలోని తాత్పర్యం కొంచెం గమనిద్దాం. నమ్మాళ్వార్లు తిరువాయ్‌మొళిలోని ఎనిమిదవ శతకం– ఎనిమిదవ దశకంలో గల **"కణ్‌గళ్ శివన్దు"** అనే మొదటి పాశురం, **"అడియేనుళ్ళాన్"** అనే రెండవ పాశురం శ్రియఃపతి స్వరూపాన్ని నిరూపిస్తున్నవి. వాటిలో, **"అడియేనుళ్ళాన్"** అనే రెండవ గాథలో ఉండే మొదటి విశేషణంతో పరమాత్మ జీవాత్మలో అనుప్రవేశించి ఉన్నాడనే విషయాన్ని ప్రతిపాదించే ఆళ్వార్లు "భగవానుని శేషభూతుడనైన నాలో ఉన్నాడు" అని అన్నారు. అందువల్ల– శేషభూతుడనే అర్థాన్ని ఇచ్చే **"అడియేన్"** శబ్దంతో ఆత్మను నిర్దేశించినందువల్ల ఆత్మకు దాసత్వాపరపర్యాయం అయిన శేషత్వమే అంతరంగ నిరూపకం– అని తెలుస్తున్నది.

శ్రీరంగాలయ పౌరోహిత్యకైంకర్యలాభం

ఒకనాడు మిట్ట మధ్యాహ్నంవేళ తీవ్రమైన ఎండ కాసే సమయంలో శ్రీరామానుజులు అముదనార్ గృహానికి వచ్చారు. "ఇంతటి తీవ్రమైన ఎండలో ఈ విధంగా దేవరవారు రావడానికి ఏమి కారణం?" అని అముదనార్ ప్రార్థించగా – "మీరు ఇంతవరకు నిర్వహిస్తున్న శ్రీరంగాలయపౌరోహిత్య కైంకర్యాన్ని మాకు ఇవ్వండి' అని అడిగారు. "మహాప్రసాదం" అని అంటూ అముదనార్ పౌరోహిత్య కైంకర్యాన్ని రామానుజులకు సహిరణ్యదానజలపూర్వకంగా దానం చేశారు. పౌరోహిత్యం అంటే–

శ్రీరంగనాథుని ఆలయంలో పురాణపఠన కైంకర్యం, వేదవిణ్ణప్పం, పంచాంగ శ్రవణం, తిరుమఞ్జన కట్టియ పారాయణం- మొదలైనవి. అపుడు యతీశ్వరులు ఆ పౌరోహిత్యకైంకర్యాన్ని కూరేశుల చేతులకు అప్పగించి, దానిని వారే నిర్వహించ వలసినదిగా ఆజ్ఞాపించారు. ఆనాటినుండి ఈనాటివరకు కూరేశుల వంశీయులు ఈ పౌరోహిత్యకైంకర్యాన్ని అవిచ్ఛిన్నంగా నిర్వహిస్తూ ఉండడం అందరికీ తెలిసినదే.

మూగవాని అదృష్టం

భగవద్రామానుజులు ఒకనాడు ఒక మూగవానిని తమ మఠానికి పిలచి, తలుపులను మూసి, అతనికి తమ శ్రీచరణాలను చూపిస్తూ, అవే అతనికి గతి అని సైగ చేశారు. వివేకి అయిన అతడు యథార్థాన్ని గుర్తిచి, శ్రీరామానుజుల చరణాలను శిరసా వహించాడు. కూరేశులు ఈ సందర్భాన్ని కవాటరంధ్రంద్వారా గమనించి, "ఆహా! ఈ మూగవాడు ఎంత అదృష్టశాలి! నేను ఎన్ని శాస్త్రాలు అభ్యసిస్తే ఏమి లాభం! నాకు ఈ భాగ్యం కలుగలేదే! మూగవాడై నేను పుట్టి ఉంటే ఎంత బాగుండేది!" అని తలబాదుకొని ఏడ్చారట.

కూరేశుల జీవకారుణ్యం

సహజంగా అత్యంతసుకుమారమైన మనస్సును కల కూరేశులు మూర్తీభవించిన దయగా కీర్తింపబడేవారు. ఇతరుల దుఃఖాన్ని కొంచెంకూడా చూచి సహించలేక పోయేవారు **"వ్యసనేషు మనుష్యాణాం భృశం భవతి దుఃఖితః"** అని కీర్తింపబడ్డ శ్రీరామచంద్రుని హృదయంవంటిది వారి హృదయం. ఒకనాడు ప్రయాణం చేస్తున్న కూరేశుల కంటికి పామునోటిలో చిక్కుకొని ప్రాణభయంతో ఆక్రోశించే కప్ప కన్పించింది. ఆ కప్ప అరుపులను విని కూరేశులు "ఎవరో వచ్చి తనను కాపాడబోతారు అనే ఆశతో ఈ కప్ప ఈ రీతిగా ఆక్రందిస్తున్నది! అయ్యో! దీని అరుపులను ఎవరు వింటారు?" అని అంటూ మూర్ఛిల్లారట. ఇంకొకసారి ఏదో పనిమీద ఒక తోటలోకి వెళ్ళారు. అక్కడ అంతకుముందే ఎవరో వచ్చి అరటిచెట్టు ఆకును కోసితీసికొని వెళ్ళారు. ఆచెట్టునుండి కన్నీళ్ళవలె కారే నీళ్ళను చూచి కూరేశులు బాధతో మూర్ఛను పొందారు. అదేవిధంగా, ఇంకొక పర్యాయం ఒకానొక అబల కావేరీనది నుండి బిందెతో నీటిని మోసికొని రాలేక అవస్థపడుతూ ఉండగా చూచి ఆమెపై జాలిపడి, ఆ బిందెను మోసి సహాయం చేశారు. కూరేశుల కరుణా పూర్ణహృదయాన్ని వ్యక్తం చేసే ఇటువంటి సంఘటనలు కోకొల్లలు.

ఆత్మగుణపూర్ణత

శ్రీరంగాలయం నెలకొని ఉండే ప్రాంతాన్ని ఆ కాలంలో ఒకానొక చోళప్రభువు పరిపాలించేవాడు. అతడు శ్రీవైష్ణవమతద్వేషి. అతడు విష్ణుప్రతిమలను ధ్వంసం చేసి,

విష్ణ్వాలయాలను కూలగొట్టి వైష్ణవులను, వైష్ణవమతానికి ఉపద్రవం కల్గించాడు. అపుడు అతని శ్రేయస్సునుగూర్చి భయపడిన శ్రేయోభిలాషులు కొందఱు "మంత్రపూర్వకంగా ప్రతిష్ఠించిన దేవతామూర్తులను పాడుచేయడంవల్ల అనర్థం తప్పదు" అని అతనితో అన్నారు. "అట్లయితే, దైవీశక్తిని ఉద్వాసనను చేసి విగ్రహాలను ధ్వంసం చేస్తాను" అని సంకల్పించిన ఆ రాజు ఒకానొక బ్రాహ్మణునకు చాలా ధనాన్ని ఇచ్చి, ప్రలోభపెట్టి, "అంజనం ధరించడంద్వారా అదృశ్యుడవై, విష్ణ్వాలయాలలోని విగ్రహాలకు ఉపద్రవాన్ని కల్గించు"- అని ఆజ్ఞాపించాడు. పాపిష్ఠివాడు, లుబ్ధుడైన ఆ విప్రుడు అదృశ్యాంజనాన్ని ధరించి ఇతరులకు కంటబడకుండా దేవతాశక్తిని ఉద్వాసనం చేసి, వాటిని తీసికొని పోయి సముద్రంలో పారవేయడం ప్రారంభించాడు. ఈ వార్తను విని శ్రీరామానుజాచార్యులవారు- "చాలా కాలం నుండి శ్రీరంగాలయాన్ని రక్షిస్తున్నాము. ఆసురవర్గం ఇపుడు విజృంభించింది. నోటితో చెప్పడానికి కూడా వీలుకాని అనర్థం ఈ కోవెలకు సంభవిస్తే ఏమి చేయగలం? ఏవిధంగా అడ్డుకోగలం?- అనే వ్యాకులంలో తమ ఆచార్యులైన మహాపూర్ణులతో పాటు ఆలోచించడం ప్రారంభించారు. అపుడు మహాపూర్ణులు- "శ్రీరంగనాథుని దేవాలయ పరిసరాలలో ఒకసారి ప్రదక్షిణాన్ని చేస్తాను. ఆ ప్రయత్నంలో నా వెంట సహాయంగా మీ శిష్యులలో ఎవరినైనా పంపండి కాని, నాతో వచ్చే వక్తి నేను ఇంకొకరికి వెనుకగా వెడుతున్నాను- అనే భావనను పొందకుండా ఉండేవారై, నన్ను నా నీడవలె అనుసరించేవారై ఉండాలి. అటువంటివారిని ఎవరినైనా పంపించండి" అని అన్నారు. ఇటువంటి గొప్ప వ్యక్తిత్వం కలవారు కూరేశులే అని పూర్తిగా తెలిసినవారైనా, శ్రీరామానుజులు ఆ విషయాన్ని మహాపూర్ణుల నోట వినాలని తలచి, "ఇక్కడ ఉండేవారిలో ఎవరు అటువంటివారు?" అని అడిగారు. "కూరేశులను మీరు పంపవచ్చు కదా!" అని మహాపూర్ణులు బదులిచ్చారు. ఆ మాటను విన్న కూరేశులు "మహాపూర్ణుల వంటివారిచే ఇంతమంది సమక్షంలో ఈ విధంగా అనుగ్రహింపబడ్డ నేనెంత అదృష్టవంతుడను" అని తలచి మహానందాన్ని పొందారు. మహాపూర్ణులవెంట వెళ్ళారు.

పుత్రోదయం

తమ సంపదను అంతటినీ దానం చేసి, ఆచార్యసేవే ప్రధానంగా భావించి, అత్యంతసాధారణమైన జీవనాన్ని గడిపే కూరేశులు తమ నిత్యజీవనాన్ని ఉంఛవృత్తి ద్వారా (భిక్షావృత్తిద్వారా) గడిపేవారు. వర్షాకాలంలో ఒకనాడు వర్షంవల్ల బయటకు నీటిని తాగి తృప్తిపడి కూరేశులు- "అన్నం తినకపోయినా నన్ను ఆకలి బాధించడంలేదు. నిజానికి ఏనాడు నేను అష్టాక్షరీమహామంత్రాన్ని జపించలేనో, నిగమపుష్పాలతో భగవానుని ఆరాధించలేనో, ఆనాడే నాకు ఉపవాసం" అని భావించారు. **"ఉణ్ణుమ్ శోరు పరుకుమ్**

నీర్ తిణ్ణుమ్ వెన్నీరైయుమ్ ఎల్లామ్ కణ్ణన్" (తినే తిండి, తాగే నీరు, అనుభవించే తాంబూలాది భోగ్యపదార్థాలు అన్నీ స్వామి అయిన కృష్ణుడే) అని ఆళ్వార్లు పల్కిన రీతిలో మనస్సులో దృఢనిశ్చయాన్ని కూరేశులు కల్గి ఉన్నారు. ఆనాటి రాత్రి శ్రీరంగాలయంలో భగవన్నివేదనసమయంలో మోగిన తిరుచిన్నాల ధ్వనిని విని కూరేశుల ధర్మపత్ని భర్త ఏమీ భుజించకుండా ఆకలితో ఉన్న స్థితిని తలచి, బాధతో "స్వామీ! శ్రీరంగనాథా! నీ భక్తుడు ఇక్కడ ఉపవాసం చేస్తూ ఉండగా, నీవు మాత్రం ఆనందంగా పలు విధాలైన భక్ష్యభోజ్యాలను ఆరగించి ఆనందిస్తున్నావా? ఇదేమయ్యా!" అని అనుకొన్నది. ఆమో మనోవేదనను గుర్తించిన శ్రీరంగనాథుడు వెంటనే అర్చకముఖంగా దేవాలయకార్యనిర్వాహకులైన ఉత్తమనంబిని ఆదేశించి, వారిద్వారా దేవాలయ మర్యాదలతో తాను ఆరగించిన పాయసాన్నాన్ని కూరేశుల ఇంటికి పంపించాడు. కూరేశులు ఆ పాయసంలో కొంత భాగాన్ని తాము భుజించి, మిగిలిన భాగాన్ని తమ పత్నికి ఇచ్చారు. ఆమె దానిని స్వీకరించింది. పూర్వం త్రేతాయుగంలో దశరథుడు చేసిన పుత్రకామేష్టియాగసందర్భంలో అగ్నిపురుషుడిచ్చిన పాయసం కారణంగా నల్గురు పుత్రులు ఉదయించినట్లే, శ్రీరంగనాథుడనుగ్రహించిన పాయసాన్నప్రభావంచేత పరాశరభట్టర్, వ్యాసభట్టర్ అనే ఇద్దరు పుత్రులు కూరేశులకు కలిగారు.

తండ్రే ఆచార్యులయ్యారు
(పితా ఏవ బ్రహ్మోపదేష్టా)

కూరేశులకు కల్గిన పుత్రులిద్దరిని చూచి చాలా ఆనందించిన శ్రీరామానుజులు పదకొండవనాడు తమ శిష్యులతో కలసి కూరేశుల ఇంటికి వెళ్ళారు. గోవిందభట్టర్ (ఎమ్బార్)ను పిలచి ఇద్దరు పిల్లలను తమ వద్దకు తీసికొని రమ్మని ఆజ్ఞాపించారు. ఎమ్బార్ పురిటి ఇంటిలోనికి పోయి బాలకులను ఇద్దఱినీ తీసికొని వస్తూ దృష్టి దోషం వారికి సోకకుండా ఉండాలని ద్వయమంత్రాన్ని ఉచ్చరిస్తూ వచ్చారు. రామానుజులు ఆ బాలకులిద్దరితేజస్సును చూచి ఆశ్చర్యపడి, కరుణాపూర్ణనేత్రాలతో వారిని కటాక్షించి, ఎమ్బార్‌ను చూచి "గోవిందభట్టారకా! వీరివద్ద ద్వయం పరిమళిస్తున్నదే! ఏమి!" అని అడిగారు. ఎమ్బార్ అపుడు "స్వామీ! పిల్లలిద్దరి రక్షణకోసం ద్వయాన్ని ఉచ్చరించాను" అని అన్నారు. యతిరాజులు "వీరి ఉజ్జీవనంకోసం మీరు ముందుగా ప్రయత్నించి నందువల్ల భవిష్యత్తులో మీరే వీరికి ఆచార్యులు" అని నిర్ణయించారు. ఆ రీతిలోనే ఎమ్బార్ కూరేశపుత్రులిద్దరికీ పంచసంస్కారాలను చేసిన ఆచార్యులయ్యారు. అందువల్లనే గురుపరంపరలో భగవద్రామానుజులు, ఎమ్బార్, భట్టర్- అనే క్రమం అనుసంధింప బడుతున్నది. కూరేశులుకూడా తమ పుత్రులిద్దరికీ ఇంకొక రీతిలో ఆచార్యులయ్యారు. కూరేశులు తిరువాయ్‌మొళి ప్రబంధంలోని అర్థాలను తమ పుత్రులిద్దరికీ ఉపదేశించే

టపుడు ప్రథమదశకం - ద్వితీయదశకంలోని **"ఎణ్‌పెరుక్కున్నలత్తు"** అనే పాశురం ప్రస్తావనకు వచ్చింది. ఆ పాశురం అష్టాక్షరీ మంత్రార్థప్రకాశకం అయినందున, మంత్రార్థం ఆచార్యసన్నిధిలో వినవలసి ఉన్నందున, ఆ పాశురార్థాన్ని ఎమ్బార్ సన్నిధిలో తెలిసికొనిరమ్మని అన్నారు. తండ్రి ఆజ్ఞానుసారం పరాశరభట్టర్, వ్యాసభట్టర్ ఎమ్బార్ వద్దకు వెళ్ళబోతూ ఉండగా, కూరేశులు వారిద్దరినీ వెనుకకు పిలచి, "శరీరం క్షణభంగురం. ఎవరు ఎంతసేపు జీవించి ఉంటారో తెలియదు. రండి. నేనే మీకు ఆ అర్థాన్ని ఉపదేశిస్తాను" అని పల్కి, వారిద్దరికీ రహస్యంగా పాశురార్థాన్ని తెలిపి ఆ పాశురం ఏ రీతిలో అష్టాక్షరీ మంత్రార్థాన్ని ప్రతిపాదిస్తున్నదో వివరించారు. అందువల్ల ఆచార్యపరంపరలో కూరేశులకుకూడా సముచితస్థానం ఉన్నది. ఈ కారణంచేతనే పరాశరభట్టర్ తమ సహస్రనామభాష్యారంభంలోని మొదటి ప్రార్థనాశ్లోకంలో **"వందే గోవిందతాతౌ"** అని ఎమ్బార్‌ను, కూరేశులను ఇద్దరిని స్తుతించారు.

శ్రీరంగనాథుడే పెళ్ళిపెద్ద

కూరేశుల కుమారులిద్దరు ఉభయవేదాంతాలలోను, సకలసామాన్య శాస్త్రాలలోను నిష్ణాతులయ్యారు. వారిద్దరూ క్రమంగా వివాహానికి తగిన వయస్సును పొందారు. ఆణ్డాళ్ అపుడు "స్వామీ! పిల్లలిద్దరికి వివాహోచితవయస్సు వచ్చింది. వివాహ ప్రయత్నం చేయవద్దా !" అని కూరేశులను ప్రోత్సహించింది. అహంకార- మమకారాలు ఈషణ్మాత్రం లేని తమ రక్షణభారం శ్రీరంగనాథునిదేనని పూర్తిగా విశ్వసించే ఆచార్యపరతంత్రులైన కూరేశులు భగవద్రామానుజుల సన్నిధిలో పుత్రుల వివాహాలను జరిపించవలసినదిగా విజ్ఞాపనచేశారు. శ్రీరామానుజులు తమ ఆచార్యులైన మహాపూర్ణుల ఇంటి కన్యను వివాహం చేసికోవడం మంచిదని నిర్ణయించారు. ఆచార్యాజ్ఞను అనుసరిస్తూ కూరేశులు మహాపూర్ణుల బంధువుల వద్దకు వెళ్ళి కన్యాదానాన్ని చేయవలసినదిగా అర్థించారు. వారు మొదట అంగీకరించినా, మళ్ళీ కొత్తసంబంధం అనే దృష్టిలో కన్యాదానానికి అనుమతించలేదు.

కొంతకాలం గడచిన తర్వాత మళ్ళీ ఆణ్డాళ్ కూరేశులతో పుత్రుల వివాహప్రస్తావనను చేశారు. పరమైకాంతులైన కూరేశులు "భగవానుని కుటుంబం యోగక్షేమాలను నిర్వహించే భారం ఆ భగవానుడే. ఎందుకు దానినిగూర్చి మనకు చింత! భగవత్సన్నిధికి కుమారులను ఇద్దరినీ పంపించు" అని ఆమెతో అన్నారు. మరునాడు తండ్రి- కుమారులు శ్రీరంగనాథుని సన్నిధికి సేవకోసం వెళ్ళారు. అపుడు శ్రీరంగనాథుడు -"కూరేశా! నాతో ఏదో చెప్పాలని మీరు అనుకుంటున్నట్లున్నదే! నీ మనస్సులో ఉన్నమాటను చెప్పండి" అని అర్చకముఖంగా అడిగాడు. కూరేశులు "శ్రీరంగనాథా! పిల్లలిద్దరికీ వివాహవయస్సు వచ్చిందని అందరూ అంటున్నారు" అని

విన్నపించారు. శ్రీరంగనాథుడు "అయితే ఎందుకు విచారం? ఆ పనిని నేను నిర్వహిస్తాను లెండి" అని బదులు పలికాడు. తదనుగుణంగానే రంగనాథుడు మహాపూర్ణుల బంధువులకు స్వప్నంలో కన్పించి కూరేశుల పుత్రులిద్దరికీ మీ ఇంటికన్యలను ఇచ్చి వివాహం జరిపించమని ఆజ్ఞాపించాడు. వారు చాలా ఆశ్చర్యపడి, మరునాడే కూరేశుల ఇంటికి వచ్చి కన్యాదానం చేస్తామని మాట ఇచ్చారు. ఎంతో వైభవంగా పరాశర-వ్యాసభట్టర్‌ల వివాహాలు జరిగాయి. ఈ విధంగా శ్రీరంగనాథుడే కూరేశుల ఇంటి పెళ్ళిపెద్ద అయ్యాడు.

శిష్యవాత్సల్యం

కూరేశుల ఆత్మగుణ సంపదను చూచి ఆకర్షితులైన పలువురు వారిని ఆశ్రయించి ఉజ్జీవించారు. వారిలో పిళ్ళెప్పిళ్ళై ఆళ్వాన్ ఒకరు. వీరు కొంతకాలం ఐశ్వర్య-ఆభిజాత్యాదులవల్ల కల్గిన గర్వంచేత భాగవతులపట్ల పలు అపచారాలను చేశారు. కూరేశులు ఇది గుర్తించి, వీరిని సంస్కరించి బాగుచేయాలని తలచారు. ఒకానొక పుణ్యతిథి నాడు అందఱు అన్నసువర్ణ వస్త్రాదిదానాలను చేస్తున్నారు. కూరనాథులు స్నానం చేసి శుచిగా ఉండే పిళ్ళె ప్పిళ్ళైఆళ్వాన్ దగ్గరకు వచ్చి దానం ఇమ్మని అడిగారు. "నేను మీ చరమావధిదాసుడను. నా సర్వస్వంమీదే కదా!" అని బదులిచ్చే పిళ్ళెప్పిళ్ళై ఆళ్వాన్‌తో "నాకు మామూలు దానం వద్దు. విలక్షణమైన దానం కావాలి. త్రికరణాలతో మీరు ఇకపై ఏ భాగవతులవిషయంలోను అపచారపడననే మాటను నాకు దానం చేయండి" అని అన్నారు. ఆళ్వాన్ కూడా "సరే" అని మాట ఇచ్చారు. అయినా, కొంతకాలం తరువాత పూర్వసంస్కారబలంచేత పిళ్ళెప్పిళ్ళై ఆళ్వాన్ భాగవతాపచారాన్ని చేయడం తటస్థించింది. తాను చేసిన అపచారాన్ని తలచుకొని ఎంతో పశ్చాత్తాప పడిన ఆళ్వాన్ బయటకు పోయి తన ముఖాన్ని కూరేశులకు చూపించలేక, ఇంటిలోపలే ఉండిపోయారు. కూరేశులు ఈ విషయాన్ని గుర్తించి, శిష్యవాత్సల్యంతో తామే స్వయంగా వారి ఇంటికి వెళ్ళారు. పిళ్ళెప్పిళ్ళై ఆళ్వాన్ ఎంతో సిగ్గుపడుతూ జరిగిన వృత్తాంతాన్ని చెప్పి, కూరేశుల పాదాలపై పడి ఏడుస్తూ- త్రికరణాలతో ఎటువంటి భాగవతాపచారాన్ని చేయనని మీకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేక పోయాను. నిర్భాగ్యుడను. ఇక ఈ పాడు శరీరం ఎందుకు? పాపాలను చేయడంకోసమేకదా ఇది పనికి వస్తున్నది! నా పాపాలకు నిష్కృతిలేదు" అని దుఃఖపడ్డారు. కూరేశులు ఆళ్వాన్‌ను ఓదారుస్తూ- "మీకు నిజమైన పశ్చాత్తాపం కల్గింది. చాలు. మీ మానసికమైన అపచారాలను యతీంద్రులు మన్నిస్తారు. రాజదండనవల్ల శారీరకంగా అపచారపడరు. ఇక, వాక్కుతో అపచారపడకుండా జాగ్రత్తపడండి" అని ఉపదేశించి వెళ్ళిపోయారు. ఇటువంటి కూరేశుల శిష్యవాత్సల్యాన్ని నిరూపించే వృత్తాంతాలు ఎన్నో ఉన్నాయి.

కూరేశుల చోళరాజసభాప్రవేశం

కూరేశులు (అన్ని విధాల కుడిభుజమై **"రామస్య దక్షిణో బాహుః"** అన్నట్లు) భగవద్రామానుజులకు దర్శననిర్వాహంలో తోడ్పాటుగా ఉండే వారు. ఆ కాలంలో కులోత్తుంగచోళుడనే రాజు రాజేంద్రచోళపురాన్ని రాజధానిగా చేసికొని ఆ ప్రాంతాన్ని పరిపాలిస్తూ ఉండేవాడు. అతడు అతిక్రూరుడైన శైవుడు. వేదబాహ్యాలైన శాస్త్రాలను ప్రమాణాలుగా తలచే అతడు విద్వాంసులను అందఱినీ తన సభకు పిలిపించి **"శివాత్ పరతరం నాస్తి"** అనే వాక్యాన్ని వ్రాసి సంతకం పెట్టమని నిర్బంధించేవాడు. రాజదండనకు భయపడి కొందఱు, ధనలోభానికి లోబడి కొందఱు అతని మాటప్రకారం చేశారు. ఈ విధంగా కొంతకాలం అయిన తర్వాత, నాలూరాన్ అనే రాజవల్లభుడైన వైష్ణవుడు "ప్రభూ! వీరి అందఱిచేత సంతకం పెట్టించడం ఎందుకు? శ్రీరామానుజులు అంగీకరిస్తే తప్ప ఈ మాటకు విలువలేదు. వారిని నీ సభకు పిలిపించి వారిని అంగీకరింపజేయి' అని రాజుకు పలుమార్లు చెప్పాడు. ప్రభువు అతని మాటలవల్ల శ్రీరామానుజులను రాజసభకు తీసికొని రమ్మని తనభటులను ఆజ్ఞాపించి పంపాడు. వారు శ్రీరంగాన్ని చేరారు. ఈ సంగతి కూరేశుల చెవిలో పడింది. రాజసభకు శ్రీరామానుజుల వెళ్ళడం జరిగితే సంభవింపబోయే మహాపదను గూర్చి భయపడి, స్వయంగా తామే శ్రీరామానుజుల వేషంలో రాజసభకు వెళ్ళాలని వారు నిర్ణయించుకున్నారు. రాజభటులు రామానుజుల వారి మఠాన్ని చేరే సమయానికి వారు స్నానం కోసం కావేరీనదికి వెళ్ళారు. అపుడు కూరేశులు శ్రీరామానుజుల త్రిదండకాషాయాలను ధరించి అక్కడకు వచ్చిన రాజభటులతో తామే శ్రీరామానుజులమని చెప్పి, మహాపూర్ణులు వెంటరాగా రాజసభకు వెళ్ళారు. ఇంతలో శ్రీరామానుజులు మఠానికి తిరిగి వచ్చారు. గోవిందభట్టర్ జరిగిన సంగతిని వారికి తెలియజేశారు. కూరేశుల ధవళవస్త్రాలను శ్రీరామానుజులు ధరించారు. రాజసభలో మహాపూర్ణులకు, కూరేశులకు ఏమి ఆపదరానున్నదో! ఏమో- అని వారు భయపడుతూ, చేయగల్గినది వేఱే ఏమీ లేనందున శిష్యులు కొంతమంది ప్రార్థననపై వారు వెంటరాగా తిరునారాయణపురం దిశలో ప్రయాణం చేశారు.

ఇక, తన సభను ప్రవేశించిన కూరేశులను, మహాపూర్ణులను చూచి చోళరాజు పూర్వంవలెనే **"శివాత్ పరతరం నాస్తి"** అనే వ్రాసి సంతకం పెట్టమని ఆదేశించాడు. కూరనాథులు అపుడు శ్రుతిస్మృతీతిహాసాగమపురాణాదులనుండి పరశతంగా ప్రమాణాలను ఉదాహరిస్తూ శ్రీమన్నారాయణుడే పరతత్త్వం అనే సత్యాన్ని నిరూపించారు. **"శేషం కోపేన పూరయేత్"** అనే సామెత రీతిలో బదులు చెప్పలేని చోళప్రభువు "నాకు తెలుసు. మీరు విదగ్ధులు. మీప్రతిభతో అన్నిటికీ సమాధానం చెప్పగలరు. కాని, నా

ఆజ్ఞను మీరు పాటిస్తూ నేను చెప్పినట్లు వ్రాసి సంతకం పెట్టండి" అని నిర్బంధిస్తూ తాళపత్రాన్ని ఇచ్చాడు. కూరేశులు తమ నిర్ణయానికి కట్టుబడి తాళపత్రంలో **"ద్రోణ మస్తి తతః పరమ్"** అని ప్రభువు మాటను పరిహసిస్తూ సమాధానం వ్రాశారు. **"శివాత్ పరతరమ్ నాస్తి"** అనే చోళరాజు మాటకు శివునికంటే పరతత్త్వం ఇంకొకటి లేదని తాత్పర్యం. కూరేశులు వక్రోక్తిని అనుసరిస్తూ, శ్లేషద్వారా చమత్కారావహంగా సమాధానం వ్రాశారు. వారి సమాధానం ప్రకారం– శివశబ్దానికి అల్పపరిమాణం కల, ధాన్యాదులను కొలిచే కొలత అని అర్థం. ద్రోణమంటే అంతకంటే ఎక్కువ పరిమితిని కల కొలపాత్ర. అందువల్ల ఎక్కువ పరిమాణాన్ని కల ద్రోణమనే కొలత ఉండగా, అంతకంటే తక్కువ పరిమాణాన్ని కల శివమనే కొలత కంటే పెద్దది లేదని అనడం లోకానుభవవిరుద్ధం కనుక, ఆమాట అసంగతమనే భావంతో కూరేశులు తమ సమాధానవాక్యాన్ని వ్రాశారు.

కూరేశులు చేసిన పరిహాసానికి పట్టలేనంత కోపాన్ని పొందిన చోళరాజు మహాపూర్ణులను చూచి మీరైనా నేను చెప్పినట్లు వ్రాసి సంతకం చేయండి – అని అన్నాడు. కాని, వారు అందులకు ఒప్పుకోకుండా, కూరేశులవలెనే పలు ప్రమాణాలను చూపుతూ శ్రీమన్నారాయణ పారమ్యాన్ని నిరూపించారు. క్రోధావిష్టుడైన రాజు, కూరేశుల, మహాపూర్ణులనేత్రాలను పెరికి వేయవలసినదిగా భటులను ఆజ్ఞాపించాడు. "ఛీ! ఛీ! ఇంతటి పాపిష్ఠివాడవైన నిన్ను చూచిన కళ్ళు నాకు ఇక వద్దు" అని అంటూ కూరేశులు తమ గోళ్ళతో తామే తమ కళ్ళను పెకలించుకొన్నారు. రాజభటులు మహాపూర్ణుల నేత్రాలను బలవంతంగా తీసివేసి, రాజసభనుండి వారిద్దరిని బయటకు నిర్దాక్షిణ్యంగా గెంటివేశారు. దర్శనరక్షణకోసం నా దర్శనాలను సమర్పించుకోగలిగానుకదా– అని కూరేశులు సంతోషించారు. చాలా వృద్ధులైన మహాపూర్ణులు నేత్రోత్పాటనంవల్ల కల్గిన బాధను తట్టుకోలేక దారిలో ఒకచోట క్షేత్రంలో కూరేశుల ఒడిలో శిరస్సును, తమ కుమార్తె అత్తుళ్ళాయమ్మ ఒడిలో శ్రీపాదాలను పెట్టుకొని తమ ఆచార్యులైన శ్రీయాముల శ్రీచరణాలను స్మరిస్తూ పరమపదానికి చేరుకున్నారు.

అపుడు పరాంతకపురం నుండి వచ్చిన శ్రీవైష్ణవులు మహాపూర్ణులకు చరమ సంస్కారాలను జరిపి, అంధులైన కూరేశులను పల్లకిలో ఎక్కించుకొని, తమ అగ్రహారంలో కొంతకాలం ఆదరించి, వారి నేత్రబాధను ఉపశమింపజేశారు. తరువాత వారిని శ్రీరంగానికి చేర్చారు. కూరేశులు శ్రీరంగనాథుని ఆలయంలోని మహాబలిపీఠాన్ని చేరి నమస్కరించి– గొప్ప ఆర్తితో "శ్రీరంగనాథా! మహాపూర్ణులకు మోక్షాన్ని ప్రసాదించినట్లే నాకుకూడా ఎందుకు మోక్షాన్ని అనుగ్రహించలేదు!" అని విజ్ఞాపనను చేసి, ఆలయం లోపలకు పోవాలని ప్రయత్నించారు. కాని రాజభటులు తమ ప్రభువు ఆజ్ఞను అనుసరించి, "భగవద్రామానుజులకు సంబంధించినవారెవ్వరూ ఆలయంలోకి ప్రవేశించరాదు" అని

అడ్డుపెట్టారు. కూరేశుల మహిమను తెలిసిన అక్కడ ఉన్న కొందఱు "కూరేశులు అసాధారణాత్మగుణపరిపూర్ణులు. వీరిని ఆలయంలోనికి వెళ్ళనివ్వండి" అని అన్నారు కూరేశులు అపుడు– "అయ్యో! ఆచార్యసంబంధం నా ఆలయప్రవేశార్హతకు అడ్డు అవుతున్నదా! ఆత్మగుణాలు దానిని సాధిస్తున్నవా! అటువంటి ఆలయప్రవేశ యోగ్యతనాకు వద్దు. ఆత్మగుణాలు వద్దు. ఆచార్య సంబంధమే పరమోపాదేయం" అని తలచి దేవాలయంలోకి వెళ్ళకుండానే తిరిగి వెళ్ళిపోయారు. తరువాత శ్రీరామానుజులేని శ్రీరంగక్షేత్రాన్నికూడా విడచిపెట్టి తిరుమాలిరుమ్‌శోలై దివ్యక్షేత్రాన్ని చేరారు.

భాగవతాగ్రగణ్యులు, వైష్ణవదర్శనపారీణులు, మహాకవులైన కూరేశులు తిరుమాలిరుమ్‌శోలైకు పయనిస్తూ, శ్రియఃపతియొక్క స్వరూపరూపగుణవిభూతులను అనుసంధిస్తూ శ్రీవైకుంఠస్తవం, అతిమానుషస్తనాలను అనుగ్రహించారు. కూరేశులు రచించిన పంచస్తవిలో శ్రీవైకుంఠస్తవం మొదటిది. ఇందులో పరవాసుదేవుని స్వరూపరూపగుణవిభూతులు చక్కగా ప్రతిపాదింపబడ్డాయి. అతిమానుషస్తవం రెండవది. ఇది విభవావతారవైభవాన్ని అనుభవింపజేస్తుంది. ముఖ్యంగా రామకృష్ణావతారాలలోని పలు అద్భుతవిషయాలనుగూర్చిన కీర్తనం ఇందులో కన్పిస్తుంది. శబ్దార్థసౌందర్యం భావగాంభీర్యం, సంఘటనాసామర్థ్యం ఈ స్తుతిలో నిరూపమానం– అని వాఙ్మయరసికుల, పరిశోధకుల నిర్ణయం.

ఈ విధంగా రెండు స్తవాలను అనుగ్రహించిన తరువాత తిరుమాలిరుమ్ శోలైను చేరిన కూరేశులు ఆ క్షేత్రంలో నెలకొని ఉండే సుందరబాహుస్వామి దివ్యమంగళవిగ్రహ సౌందర్యాన్ని మానసికంగా దర్శించి, ఆనందించి, తమ అనుభవపరీవాహాన్ని సుదీర్ఘమైన సుందరబాహుస్తవంగా ప్రబంధీకరించారు. ఆ స్తవం చివర **"హే వనగిరీశ్వర! మమ విజ్ఞాపనా మంగీకురుష్వ రామానుజార్యవశగః పరివర్తిష్యే"** (ఓ కరుణాసాగరా! యోగ్యత లేనివారిని తఱిమివేసి, శ్రీరంగంలోని అసురవర్గాన్ని నశింపజేయాలి. నేను భగవద్రామానుజుల శ్రీపాదచ్ఛాయలో మళ్ళీ వర్తించేటట్లు చేయాలి–) అని ప్రార్థించారు. కూరేశుల ప్రార్థనాఫలంగా చోళరాజు కంఠంలో తీరని వ్యాధితో బాధపడి మరణించాడు. ఈ వార్తను వినిన కూరేశులు సుందరబాహుస్వామి అనుమతిని పొంది శ్రీరంగాన్ని తిరిగి చేరారు.

శ్రీరంగానికి శ్రీరామానుజుల ప్రత్యాగమనం

కులోత్తుంగచోళునివల్ల ఏర్పడిన ఉపద్రవం కారణంగా తిరునారాయణ పురంలో సుమారు పన్నెండేళ్ళ కాలం వేంచేసి ఉన్న శ్రీరామానుజులు కూరేశులకు, మహాపూర్ణులకు కల్గిన ఆపదను విని ఉద్విగ్నులై, "చివరకు కూరేశులైనా జీవించి ఉన్నారు కదా ! అని కొంతవరకు ఊరడిల్లారు. తరువాత కొంతకాలానికి రామానుజుల పంపిన కింకరుడు

శ్రీరంగానికి పోయి, చోళరాజు మరణవృత్తాంతాన్ని తెలిసికొని, తిరునారాయణపురానికి తిరిగి వచ్చి శ్రీరామానుజులకు చెప్పాడు. ఆ వార్తను విన్న శ్రీరామానుజులు సంతోషించి, వెంటనే శ్రీరంగాన్ని చేరారు. తమ శిష్యులతోపాటు కూరేశుల ఇంటికి వెళ్ళారు. కూరేశులు ఆచార్యుల ఆగమనాన్ని విని, ఎదురేగి స్వాగతాన్ని పల్కి, వారి చరణాలపై వాలారు. రామానుజులు వారిని ఆప్యాయంగా కౌగలించుకొని, గద్గదకంఠంతో "కూరేశా! మన దర్శనానికి నేత్రభూతులైన మీరు నేత్రాలు కోల్పోయారు. మహాపూర్ణులు పరమపదించారు. ఇదంతా నా పాపఫలం" అని చాలా దుఃఖించి, కూరేశులను ఓదార్చి వారిని తమ మఠానికి తీసికొని పోయారు.

వరదరాజస్తవావిర్భావం

మఱునాడు శ్రీరామానుజులు కూరేశులు రచించిన మూడు స్తవాలను చెవులార ఆనందంగా ఆలకించి, కూరేశులతో– "మీ సూక్తి ప్రభావంచేతనే శ్రీరంగక్షేత్రానికి ఏర్పడిన ఉపద్రవం తీరింది. మేము సుఖంగా ఉన్నాము. అభిమతాధిక దానరసికుడైన వరదరాజస్వామి కాంచీపురంలో భక్తజనులకోసం వేంచేసి ఉన్నాడు. "దాసుణ్ణి అయిన నాకు నేత్రాలను ప్రసాదించండి" అని ప్రార్థిస్తూ మీరు ఆస్వామి విషయంలో ఒక స్తుతిని విజ్ఞాపన చేయండి" అని ఆదేశించారు. కాని, నిరీహులలో అగ్రేసరులైన కూరేశులు "నాకు నేత్రాలు అక్కరలేదు" అని బదులిచ్చారు. కాని, శిష్యవత్సలులైన రామానుజులు "మీరు వరదరాజస్వామి విషయంలో ఒక స్తుతిని తప్పక రచించాలి" అని నిర్బంధించారు. ఆచార్యాజ్ఞను పరిపాలిస్తూ కూరేశులు వరదరాజస్తవాన్ని విజ్ఞాపన చేశారు. అందులో **"నీలమేఘనిభ మంజనపుంజశ్యామకుంతల మనంతశయం త్వామ్, అబ్జపాణిపద మంబుజనేత్రం నేత్రసాత్కురు కరీశ! సదా మే"** అనే శ్లోకపర్యంతం రచించి, నిన్ను సదా సేవించి, ఆనందించడంకోసం తగిన అప్రాకృతనేత్రాలను నాకు అనుగ్రహించు" అని విజ్ఞాపన చేశారు. ఆనాటి రాత్రి స్వప్నంలో వరదరాజస్వామి సాక్షాత్కరించి, "మీరు ప్రార్థించినట్లే అనుగ్రహించాను" అని అన్నాడు. కూరేశులు ఆనందించి, ఉదయమే లేచి, ప్రాతఃకాలిక కృత్యాలను అనుష్ఠించి, స్తవాన్ని ముగించి, యతిరాజుల సన్నిధిని చేరి స్వప్నోదంతాన్ని నివేదించారు. **"నీలమేఘనిభ"** మిత్యాది శ్లోకాన్ని విన్న రామానుజులు "మీకు నేత్రాలను అనుగ్రహించకుండా ఉండి ఉండడు. ఏదీ మీ ముఖాన్ని చూడనివ్వండి" అని కూరేశులతో అన్నారు. "అప్రాకృతనేత్రదానాన్నే నేను భగవానునివద్ద యాచించాను" అని అనిన కూరేశులను చూచి, "ఇంత మాత్రమే చాలదు, వరదరాజస్వామి సన్నిధిని చేరి ప్రార్థించి, తిరిగివద్దాం రండి" అని కూరేశులతో పాటు కాంచీనగరానికి బయలు దేరారు.

ఉద్వేలమైన దయ

వరదరాజస్వామి సన్నిధిలో కూరేశులు వరదరాజస్తవాన్ని విన్నపిస్తూ ఉండగా శ్రీరామానుజులు ఆలయ ప్రదక్షిణను చేసే సమయంలో, అద్భుతమైన వరదరాజస్తవాన్ని అకర్ణించిన వరదరాజస్వామి ప్రత్యక్షమై "కూరేశా! మీ అభిమతాన్ని కోరుకోండి" అని అన్నాడు. కూరేశులు శ్రీరామానుజుల మాట ప్రకారంగా నేత్రాలను ప్రసాదించమని కోరకుండా, నేను పొందే ఫలం నాలూరాన్‌కూడా పొందాలి– అని ప్రార్థించారు. చోళరాజుకు తగని ఆలోచనను చెప్పి, కూరేశులకు, మహాపూర్ణులకు ఆపద కల్గడానికి హేతుభూతుడై, భగవద్రామానుజుల దేశాంతరప్రవాసానికి కారణమైన నాలూరాన్ అసహ్యాపచారాన్ని చేసినవాడైనాడు. అతనికి నరకపాతం తప్పదు. అయినా, శ్రీవైష్ణవకులానికి చెందిన ఇతడు నరకానికి పోవడం తగదు. ఇతనిని ఏవిధంగా అయినా కాపాడాలి– అనే పరమదయతో కారుణికులైన కూరేశులు వరదరాజస్వామిని ఆ విధంగా ప్రార్థించారు. తనను వధించేవానిపట్లకూడా ఔదార్యంతో అతని ఉజ్జీవనాన్ని కోరే కూరేశుల దయాళుత ఎల్లలు లేనిది, వాచామగోచరం.

వరదరాజస్వామి కూరేశుల ప్రార్థనను విని "ఆ విధంగానే కానివ్వండి" అని అనుగ్రహించాడు. రామానుజులు ప్రదక్షిణం చేసి వచ్చి ఈ విషయాన్ని దుఃఖితులై– "స్వామీ! నా కోరిక తీరలేదే" అని వరదరాజస్వామితో పల్కి, కూరేశులతో "మీరు స్వతంత్రులై, నా సంకల్పానుసారం ప్రవర్తించలేదు" అని ఖిన్నమనస్కంగా పలికారు. అపుడు వరదరాజస్వామి "రామానుజా! దుఃఖించకండి. కూరేశులు మిమ్ములను, నన్ను తప్పక నేత్రాలతో దర్శించగలరు" అని వరం ఇచ్చాడు. అపుడు కూరేశులు తమ చర్మచక్షువులతో వరదుని సేవించి, ఆస్వామి దివ్యరూపాన్ని, దివ్యాభరణాలను, దివ్యవసనాలను గుర్తించి వర్ణించారు. శ్రీరామానుజుల ప్రత్యవయవాన్ని భక్తితో దర్శించి ఆనందించారు. శ్రీరామానుజులు సంతుష్టులై శిష్యులతో కలసి శ్రీరంగానికి తిరిగి వచ్చారు.

కొన్నాళ్ల తరువాత కొంతమంది శ్రీవైష్ణవులు కూరేశుల దగ్గరకు వచ్చి– "మీ విషయంలోనేకాక, మన దర్శనానికే ఘోరమైన అపరాధాన్ని చేసిన పాపిష్ఠివాడు నాలూరాన్. అతనిని నిర్దయగా దండించవలసి ఉండగా, మీరు నాలూరాన్‌కుకూడా మోక్షం సిద్ధించాలని వరదరాజస్వామిని ప్రార్థించారు. ఇది తగినదేనా!" అని ప్రశ్నించారు. అపుడు కూరేశులు "పాపం చేసిన వారి విషయంలోనే కదా క్షమను చూపించాలి" అని సమాధానం చెప్పారు. "తనను చంపగోరినవారిని కూడా రక్షించాలనే కృతసంకల్పాన్ని కల ఈ కూరేశులు వారి ఆచార్యులకంటే మిన్న" అని ఆ శ్రీవైష్ణవులు శ్లాఘించారు.

కూరేశుల రచనలు

తిరుమాలిరుమ్‌శోలై దివ్యదేశానికి వేంచేసే సమయంలో శ్రీవైకుంఠస్తవాన్ని, అతిమానుషస్తవాన్ని, ఆ క్షేత్రవాససమయంలో శ్రీసుందరబాహుస్తవాన్ని, తదనంతరం శ్రీరంగాన్ని చేరిన తర్వాత వరదరాజస్తవాన్ని, చివరిగా లక్ష్మీస్తుతి అయిన శ్రీస్తవాన్ని ఈ విధంగా (పంచస్తవిగా పేరుపొందిన) అయిదు స్తవాల సంపుటిని కూరేశులు రచించారు. శ్రీపరాశరభట్టర్ సహస్రనామభాష్యంలో **"అవిజ్ఞాతా"** అనే నామానికి భాష్యాన్ని ప్రసాదిస్తూ, **"సర్వజ్ఞతా మేవ ముపలభామహే త్వం హ్యజ్ఞ ఏవాశ్రితదోషజోషణః"** అనే శ్లోకభాగాన్ని ఉదాహరిస్తూ **"అయం శ్లోకః తాతపాదై రనుగృహీతః"** అని అన్నారు. కాని, ఈ శ్లోకం పంచస్తవిలో కన్పించడంలేదు. దీనినిబట్టి పై అయిదు స్తవాలకంటే ఇంకా కొన్ని స్తుతులను కూరేశులు రచించి ఉంటారని ఊహించే అవకాశం ఉన్నది.

శ్రీదేశికులు రహస్యత్రయసారం చరమశ్లోకాధికారంలో "పరాశరభట్టర్, శ్రీవత్సచిహ్నమిశ్రులు తమ తమ నిత్యగ్రంథాలలో" అని అన్నందున కూరేశులు కూడా ఒక నిత్యగ్రంథాన్ని రచించారని తోస్తుంది. కాని ఇది ఇపుడు అలభ్యం. ఆ సందర్భంలోనే శ్రీదేశికులు "శ్రీవత్సాంకుల చరమశ్లోకవ్యాఖ్యలో ఇంతమాత్రమే వివక్షితం కనుక ఏవిరోధం లేదు" అని ఉన్నందున కూరేశులు చరమశ్లోకానికి ఒక వ్యాఖ్యను అనుగ్రహించారనికూడా తోస్తుంది. ఇదికూడా ఇపుడు దొరకడం లేదు. యమకరత్నాకరమనే శ్రీకృష్ణావతారపవిత్రచరిత్రను వర్ణించే యమకాలంకారమయం అయిన గ్రంథం కూరేశుల పేరుతో చాలాకాలం క్రితం ముద్రింపబడింది. దీని గొప్పతనం, రచనలోని వైలక్షణ్యం వాచామగోచరం. ఈగ్రంథకర్తృత్వవిషయంలో పండితులలో భిన్నాభిప్రాయా లున్నాయి. ఈ గ్రంథంలో కొన్నిచోట్ల శ్రీరామానుజుల సూక్తికి విరుద్ధంగా ఉన్నందున ఇది కూరేశకర్తృకం కాదని, ఈ గ్రంథకర్త కూరేశులు ఇంకొకరు అయిఉండాలని **కాంచీమహావిద్వాన్ ప్రభ. అణ్ణాస్వామివారు** అభిప్రాయ పడగా, **వాచస్పతి ఉ.వే. శ్రీమాన్ డా. ఎన్.సి.వి. నరసింహాచార్యస్వామివారు** పంచస్తవి వ్యాఖ్యానాన్ని సంస్కరిస్తూ వ్రాసిన భూమికలో ఈ గ్రంథం కూరేశులు రచించినదని పలువురు పండితులు అభిప్రాయ పడుతున్నట్లు తెలిపారు. కూరేశ విజయమనే ఇంకొక సంస్కృతగ్రంథం కూరేశులు చోళరాజసభలో శ్రీమన్నారాయణ పారమ్యాన్ని నిరూపించిన సందర్భాన్ని, అప్పటి వాదప్రతివాదాలను వర్ణిస్తున్నది. కొందఱు దీనిని కూరేశకృతమని అన్నారు. కాని, దీనిని అర్వాచీనులెవరో వ్రాసి ఉంటారని చెప్పవలసి ఉన్నది. పెరియతిరుమొళి ప్రబంధానికి గల **"నెఞ్ఞుక్కు"** అనే తనియన్ పాశురాన్ని, నిత్యానుసంధేయాలైన **"లక్ష్మీనాథ", "యో నిత్యమ్"** అనే సంస్కృత తనియన్ శ్లోకాలను కూరేశులు అనుగ్రహించారు. పెరియ తిరుముడి అడైవు ప్రకారం కూరేశులు గద్యత్రయానికి ఒక వ్యాఖ్యను రచించినట్లు

తెలుస్తున్నది. ఇదేకాక, పలు సందర్భాలలో కూరేశులు చేసిన వివరణలు. సమన్వయాలు నిర్వాహాలు, వార్తలు, ఐతిహ్యాలరూపంలో గ్రంథస్థం అయినవి.

కూరేశుల పరమపదయాత్ర

ఈ విధంగా కూరేశులు లోకోజ్జీవనాలైన శ్రీసూక్తులను అనుగ్రహిస్తూ, తమ జ్ఞానానుష్ఠానాలతో నిస్సమాభ్యధికం అయిన రీతిలో ప్రకాశిస్తూ చిరకాలం ఈ విభూతిలో వేంచేసి ఉన్నారు. ఒక పర్యాయం శ్రీరామానుజుల సన్నిధిలో తిరువాయ్‌మొళి కాలక్షేపం జరిగే సందర్భంలో ముక్తుని అర్చిరాదిగతిని తెలిపే **"శూழ్ విశుమ్బు"** అనే (10-9) దశకం ప్రసక్తం కాగానే అందులోని **"ముడిముదై వానవర్ ముతై ముతై ఎదిర్‌కొళ్ళ"** అనే పాశురంలో "పరమపదానికి ముందుగా చేరినవారు తరువాత చేరేవారికి స్వాగతాన్ని పల్కుతూ, ఉపచారాలను చేస్తారు" అని విస్తృతంగా వ్యాఖ్యానింపబడింది. దీనిని వినిన కూరేశులు "నేను పరమపదానికి పోవడంలో ఆలస్యం చేస్తే, అక్కడకు శ్రీరామానుజులే ముందుగా వేంచేయవచ్చు. అపుడు నాకు వారు స్వాగతాన్ని పల్కి, ఉపచరించేటట్లు ఏర్పడుతుంది. ఇది మహోపచారం. **"అత్ర పరత్ర చాపి నిత్యం యదీయచరణౌ శరణం మదీయమ్"** అని అన్నట్లు ఈ విభూతిలో, నిత్యవిభూతిలో రెండుచోట్ల నాకు శ్రీరామానుజుల శ్రీపాదాలేకదా పరమప్రాప్యం. కనుక నేనే ముందుగా పరమపదానికి పోవడం యుక్తం" అని నిశ్చయించుకొని, ఈ సంగతిని ఎమ్బెరుమానార్ సన్నిధిలో విన్నపించకుండానే శ్రీరంగనాథుని సన్నిధిలోకి పోయి మౌనంగా నిలచారు. భగవానుడపుడు అర్చకముఖంగా- "కూరేశా! ఏమి మీ మనస్సులో అభిప్రాయం? ఏదో చెప్పాలని వచ్చినట్లున్నారు!" అని అన్నాడు. కూరేశు లపుడు ఒక శ్లోకాన్ని విన్నపించి, చాలా ఆర్ద్రంగా శ్రీరంగనాథుని మనస్సు కఱగే రీతిలో ఉపన్యసించగా, శ్రీరంగనాథుడు చాలా ఆనందపడి "మీకు అవశ్యకమైనదానిని అంతటినీ ఇస్తాను. ఏం కావాలో అడగండి" అని అన్నాడు. "దాసునకు ఇంతకు ముందే అన్నీ అనుగ్రహించావుకదా స్వామీ!" అని కూరేశులు అనగా, శ్రీరంగనాథుడు- "ఆవిధంగా కాదు, ఇపుడుకూడా అడగండి, నా దేవేరులపై ఆన. మన శ్రీరామానుజులపై ఆన. ఏదయినా సరే ఇస్తాను" అని నిర్బంధించాడు. కూరేశులు- ఈ శరీరంతో ఇక ఈ లోకంలో జీవించి ఉండలేను. ముక్తిని ప్రసాదించి, పరమపదానికి తీసికొనిపొమ్మని విజ్ఞాపన చేశారు.

శ్రీరంగనాథుడు వారి వేడికోలును విని- "అయ్యో! కూరేశులను ఇక విశ్లేషించవలసి వస్తున్నదే!" అని చాలా బాధపడి, "ఈ వరాన్ని తప్ప ఇంకొక వరాన్ని దేనిని అయినా అడగండి" అని అన్నాడు. **"రామో ద్విర్నాభిభాషతే"** అని అన్న నీవు ఆ మాటను అసత్యం చేయవచ్చునా? రెండు మాటలను పలికేవాడవు కావు కదా నీవు! అడిగినదానిని దేనినైనా

ఇస్తానని అని ఇపుడీరీతిలో అనవచ్చునా ! దాసుడు ప్రార్థించిన దానిని ప్రసాదించు" అని కూరేశులు మళ్ళీ అన్నారు. "ఇక చేయగల్గినది ఏదీ లేదు" అని నిశ్చయించుకొని శ్రీరంగనాథుడు "మీకు, మీ సంబంధాన్ని కల వారికి, మీ తిరునామాన్ని అనుసంధించేవారికి పరమపదాన్ని అనుగ్రహిస్తున్నాను" అని పలికి తిరుప్పరివట్టం, నిర్మాల్యం, ప్రసాదం, తులసీమాల మొదలైనవానిని అనుగ్రహించి కూరేశులను పంపించాడు.

శ్రీరామానుజుల ఆనందం, విచారం

ఈ విధంగా కూరేశులు శ్రీరంగనాథునివల్ల పరమపదప్రాప్తినిగూర్చి, వరాన్ని పొందిన సంగతిని గూర్చి విని శ్రీరామానుజులు "పూర్వం నేను తిరుక్కోట్టియూర్‌నమ్బి సన్నిధిలో రహస్యార్థోపదేశాన్నిపొందినపుడు 'ఈ అర్థాలను పరమగుహ్యాలుగా మీరు సంరక్షించాలి' అని వారు చేసిన నియమాన్ని ఉల్లంఘించి, ఆ తిరుక్కోట్టియూర్‌లోనే తెఱ్ఱూర్ సన్నిధిలో ఆస్వామి సమక్షంలో ఇంకా పలువురి సమక్షంలో ఆ రహస్యార్థాలను వెల్లడి చేశాను. ఆ ఆచార్యాజ్ఞోల్లంఘనానికి ఫలంగా నరకమే నాకు ప్రాప్తిస్తుంది; పరమపదానికి పోయే అవకాశం లేదు– అనే భయం ఇంతవరకు ఉన్నది. కాని, ఇపుడు కూరేశుల సంబంధాన్ని కలవారికికూడా పరమపదప్రాప్తి కల్గిస్తానని శ్రీరంగనాథుడు వరం ఇచ్చినందువల్ల ఇక నాకు ఆ భయం తీరింది. నాకు కూరేశులతో సంబంధం ఉన్నది కదా!" అని ఆనందంగా పల్కి తమ కాషాయాన్ని ఆకాశంలోకి విసరి ఎగురవేస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. దీనినిబట్టే– **"అర్వాంచో యత్పదసరసిజద్వంద్వమ్"** అనే ఈ చరిత్రగ్రంథం ప్రారంభంలో అనుసంధింపబడ్డ శ్లోకాన్ని పరాశరభట్టర్ అనుగ్రహించారు. ఈ సందర్భంవల్ల సదాచార్యసంబంధం వలెనే, సచ్ఛిష్యసంబంధంకూడా సద్గతికి హేతువు– అని తెలుస్తున్నది.

శ్రీరామానుజులు తమకు ఒక విధంగా కల్గిన ఆనందాన్ని వ్యక్తం చేసినా, ఇక కూరేశులు తమను విడచి పరమపదాన్ని చేరబోతారు– అని గ్రహించి మనస్సులో చాలా కొఱతపడి దుఃఖించారు. తమ శిష్యులను తీసికొని వెంటబెట్టుకొని, కూరేశులు ఉన్న చోటికి వచ్చి 'కూరేశా! ఎంతపనిని చేశారు! మమ్ములను ఈవిధంగా చిత్రవధ చేయవచ్చునా!" అని అడిగారు. కూరేశులు అపుడు తాము ముందుగా పరమపదాన్ని చేరాలని ప్రార్థించడంలో గల ఉద్దేశ్యాన్ని తెలిపారు, శ్రీరామానుజులు **"న శాస్త్రం నైవ చ క్రమః"** అనే రీతిలో ఏ క్రమం లేని నిత్యవిభూతిలో మీరు క్రమాన్ని అన్వేషిస్తున్నారా! ఈ రీతిలోకూడా ఒక విలక్షణమైన శేషత్వం ఉంటుందా! ఆహా!" అని ఎంతో ఆశ్చర్యపడి, వ్యాకులంతో కన్నీరు మున్నీరుగా దుఃఖించి, కూరేశులను కౌగలించుకొని, దుఃఖాన్ని పట్టలేక "అయ్యో! కూరేశా! మాకు ప్రాణసములైన మిమ్ములను కోల్పోయి నేను

నిలువగలనా! నన్నుకూడా మీతో తీసికొని పోవాలని మీకెందుకు తోచలేదు ? నన్ను విడచి వెళ్ళాలని మీకు ఏవిధంగా అనిపించింది? ఏవిధంగా రుచించింది? పరమపద నాథుడు, నిత్యసూరులు, ముక్తులు ఏం నోము నోచారో కదా! **"ఎన్న నోన్బు నోన్‌ఱార్‌కొలో"** ఇక్కడ మేము, శ్రీరంగనాథుడు మిమ్ములను కోల్పోవడానికి ఎంత పాపం చేశామో! **"ఇచ్చువై తవిర యాన్ పోయ్ ఇన్దిరలోక మాళుమ్ అచ్చువై పెఱినుమ్ వేణ్డేన్ అరఙ్గమానకరుళానే!"** (ఈలోకంలో కైంకర్యాన్ని చేసి పొందే అనుభవాన్నికాక, నాకు పరమపదాన్ని ఏలే ఆ ఆనందరసం లభించినా నేను దానిని ఓ శ్రీరంగనాథా! ఇష్టపడను) అనే ఆళ్వార్ల శ్రీసూక్తిని మఱచిపోయారా! ఇక నేను ఏం చేయను? చేయగలను! మీ మనస్సు గాయపడేటట్లుగా పలు మాటలు పల్కి ఏం ఫలం? మీ ప్రాప్యానికి నేను అడ్డుపెట్టవచ్చునా! సుఖంగా నిత్యవిభూతికి వేంచేయండి" అని పలు పలు విధాలుగా పల్కి, వారి చెవిలో ద్వయాన్ని అనుగ్రహించారు. అక్కడ ఉండే శిష్యులంతా "ఇపుడు ఇదేమి" అని అడిగారు. శ్రీరామానుజులు– "మీకు తెలియదా! రాజకుమారునకు కర్పూరనికరం లేకపోతే నాలుక పిడుచకట్టుకుపోయేటట్లు వీరికి ద్వయం వినలేకపోతే మనస్సు తల్లడిల్లుతుంది" అని అన్నారు. తరువాత కూరేశుల వీపును తడిమి, అంజలిని ఘటించి, అనుమతిని తీసికొని బయలుదేరబోయారు. ఈ విధంగా తమ పరమపద గమానానికి శ్రీరామానుజుల అనుమతిని పొందిన కూరేశులు వారి శ్రీపాదాలపై వేరు తెగిన వృక్షంవలె పడి నమస్కరించగా, వారు ప్రీతితో చేతులతో లేవనెత్తారు. శ్రీరామానుజుల శ్రీపాదాలను కూరేశులు నేత్రాలలో, వక్షఃస్థలంలో అద్దుకొని శ్రీపాదతీర్థం గ్రహించి, చేతులను జోడించి "ఇక దేవరవారు మఠానికి వేంచేయండి" అని విన్నపించారు. శ్రీరామానుజులను సాగనంపడంకోసం కూరేశులు వారిని ఉత్తరకావేరీ నదీతీరంవరకు అనుసరించారు. శ్రీరామానుజులు అపుడు కూరేశులతో "కూరేశా ! ఇక చాలు నిలవండి" అని అన్నారు. కూరేశులు ఇంకొకమారు వారికి అంజలిని చేసి వెనుకతిరిగి తమ ఇంటికి సమీపంలో ఉండే మండపాన్ని చేరి, తమ పత్ని ఆణ్డాళ్ దేవిని పిలిపించి, "నీ మనస్సులో ఇపుడు ఏమని అనుకుంటున్నావు ?" అని అడిగారు. ఆమె "మీ అభిప్రాయాన్ని అనుసరించడం తప్పక నాకు ఇంకొక వేఱే ఉద్దేశ్యం ఏమీ లేదు" అని దండం పెట్టి నిలుచున్నారు. కూరేశులు అపుడు శ్రీపరాశరభట్టర్‌ను, శ్రీరామపిళ్ళైను పిలిపించి, "శ్రీరంగనాథుడు, శ్రీరంగనాయకి వేంచేసి ఉండగా మీకు ఏ కొఱత లేదుసుమా! శ్రీరంగనాథుని వరం వల్ల జన్మించి, వారి కృపవల్ల పెరిగాము– అనే గర్వంతో వర్తించకుండా, శ్రీరామానుజుల శ్రీపాదాలే శరణం అని నమ్మి ఉండండి. మీ తల్లి ఆణ్డాళ్ మనస్సును గాయపరచకుండా ప్రవర్తించండి. భగవద్భక్తులపట్ల త్రికరణాలతో ఏ అపచారం చేయకుండా, వారిని అనువర్తించి, సేవించండి" అని

హితాన్ని పల్కి, తమ పాదాలపై పడిన భట్టర్‌ను, శ్రీరామపిళ్ళైను పైకి లేవనెత్తి, చేతులతో వారి దుఃఖాశ్రువులను తుడిచారు. "మీరు ప్రాకృతసంబంధాన్ని తలచి దుఃఖిస్తే శ్రీరామానుజుల శ్రీపాదసంబంధాన్ని నిందించినవారవుతారు. ఆత్మసంబంధాన్ని స్మరించి దుఃఖిస్తే మాతో విడదీయరాని సంబంధాన్ని తెలియని వారవుతారు దుఃఖించకండి, ధైర్యంగా ఉండండి" అని వారిని ఊరడింపజేశారు. శ్రీరంగానికి నేరుగా తమ శిష్యులు పిళ్ళైపిళ్ళై ఆళ్వాన్ ఒడిలో శిరస్సును, ఆణ్డాళ్ ఒడిలో శ్రీచరణాలను పెట్టుకొని ఆళ్వార్ల, శ్రీయాముల, శ్రీరామానుజుల శ్రీపాదాలను ధ్యానిస్తూ పరమపదాన్ని చేరుకున్నారు. తరువాత శ్రీరామానుజులు దగ్గర ఉండి కూరేశుల చరమకైంకర్యాలను యథావిధి వారి కుమారులద్వారా నిర్వర్తింపజేశారు.

కూరేశులు పరమపదించిన తరువాత శ్రీరామానుజులు తమ దుఃఖాన్ని **"ఉలకమ్ నిఱైన్ద పుకళ్మాల్ తిరుమకళ్‌పోల్ వళర్త్తేన్ శెఞ్చణ్‌మాల్‌తాన్ కొణ్డుపోనాన్"** అనే పెరియాళ్వార్ల పాశురాన్ని అనుసంధిస్తూ వ్యక్తం చేశారని ఐతిహ్యం. కులశేఖరుల పెరుమాళ్ తిరుమొళికి **"ఇన్నముదమ్ ఊట్టుకేన్"** అనే తనియన్‌ను అనుగ్రహించే రామానుజులు ఆ పాశురాన్ని **"ఇజ్గే వా పైజ్కిళియే"** అని తమ పెంపుడు చిలుకను పిలిచి అంటున్నట్లుగా పలికారు. ఈ పాశురంలో నిర్దేశింపబడ్డ పెంపుడు చిలుక వేఱెవ్వరోకాదని, వారు శ్రీరామానుజులకు అత్యంతప్రియశిష్యులైన కూరేశులేనని శ్రీపిళ్ళైలోకం జీయర్ సూక్తి. **"పవిత్రీకృతకూరేశః"** అనే శ్రీరామానుజాష్టోత్తర శతనామస్తోత్రంలోని నామం కూరేశులు శ్రీరామానుజులకు పవిత్రంవలె నిత్యం సన్నిహితులై పరిచర్యచేశారనే విషయాన్ని తెలుపుతున్నది. కూరేశులను ఆశ్రయించి తరించిన శిష్యులు పలువురు ఉన్నారు. వారిలో పిళ్ళైపిళ్ళైయాళ్వాన్, తిరువరఙ్గత్తముదనార్, నాలూరాన్– మొదలైనవారు. సుదర్శనశతకర్త అయిన కూరనారాయణజీయర్ కూడా వీరి శిష్యులేనని కొందఱి అభిప్రాయం. కూరేశులు 108 సం.లు జీవించి ఉన్నట్లు పెరియతిరుముడి అడైవు అనే తమిళగ్రంథంలో తెలుపబడింది.

కూరేశులు ఇపుడు ఈ లోకంలో భౌతికంగా వేంచేసి ఉండకపోయినా, వాచామగోచరం అయిన తమ కీర్తి శరీరంతోను, అర్చావతారతిరుమేనులతోను ఈ విభూతిలో అంతటా వేంచేసి ఉండి, తమ విలక్షణమైన అనుష్ఠానంతో మనకు ఆదర్శంగా నిలచి ఉన్నారు. వారు అనుష్ఠించిన మార్గం సదా అనుసరణీయం. పల్కిన శ్రీసూక్తులు మనకు సదా స్మరణీయాలు. **"జయంతి తే సుకృతినో రససిద్ధాः కవీశ్వరాः, నాస్తి తేషాం యశः కాయే జరామరణజం భయమ్"** అని అన్నట్లు కూరేశులవంటి మహనీయుల కీర్తిమూర్తి సదా అజరామరమై ఆచంద్రార్కం ఈ లోకంలో ప్రకాశిస్తుంది.

కూరేశుల తిరునక్షత్రతనియన్

మకరే హస్తనక్షత్రే సర్వనేత్రాంశసంభవమ్ ।
శ్రీమత్కూరకులాధీశం శ్రీవత్సాంక ముపాస్మహే ॥

కూరేశుల నిత్యతనియన్

శ్రీవత్సచిహ్నమిశ్రేభ్యో నమ ఉక్తిమధీమహి ।
యదుక్తయ స్త్రయీకంఠే యాంతి మంగళసూత్రతామ్ ॥

వాళి తిరునామమ్

శీరారుమ్ తిరుప్పతికళ్ శిఱక్క వన్దోన్ వాళియే
తెన్నరఙ్గర్ శీరరుళై చ్చేరుమవన్ వాళియే
పారారు మెతిరాశర్ పదమ్ పణిన్దోన్ వాళియే
పాషియత్తి నుట్పొరుళై ప్పకరుమవన్ వాళియే
నారాయణన్ శమయమ్ నాట్టినాన్ వాళియే
నాలూరాన్ తనక్కు ముత్తి నల్‌కినాన్ వాళియే
ఏరారుమ్ తైయిలత్తిఱ్ఱు వన్దాన్ వాళియే
ఎళిల్ కూరత్తాళ్వాన్‌తన్ ఇణైయడికళ్ వాళియే

వాళితిరునామమ్

పొరుళ్ విరిక్కు మెతిరాశర్ పొన్నడియోన్ వాళియే
పొన్‌వట్టిల్‌తనై యెఱిన్ద పుకళ్‌డైయోన్ వాళియే
మరుళ్ విరిక్కుమ్ ముక్కుఱుమ్బై మాఱ్ఱవన్దోన్ వాళియే
మయర్వఱవే మెయ్‌జ్ఞానమ్ విళఙ్గిడువోన్ వాళియే
ఇరుళ్ విరిక్కుమ్ శివమెదిరిట్టెళుత్తిట్టోన్ వాళియే
ఏత మఱ వెవ్వుయిర్క్కుమ్ ఇత మళిత్తోన్ వాళియే
అరుళ్ విరిక్కు మరఙ్గత్తానడియినైన్దోన్ వాళియే
అళకారు మాళ్వాన్ తన్నడియినైకళ్ వాళియే

నాళ్‌పాట్టు

మట్టవిళ్గుమ్ పొళ్గిల్ శూళ్ కురుకేశర్ మత్తైత్తమిళ్ వాళ్ర్నిదునాళ్
మణ్ణులకిల్ శ్రీభాష్యమ్ విళజ్గిద వన్దు పిఱన్దవర్‌నాళ్
ఎట్టు మిరణ్డు మిశైన్ద శులోక మిశైత్తిద వన్దవర్ నాళ్
ఇట్టై యెన చ్చివ మెన్నే యెదిరిట్టెళుత్తిద వన్దవర్ నాళ్
తుట్ట కుదిర్‌ట్టికళ్ మాయికళ్ వాళ్వై త్తుణిత్తిద వన్దవర్‌నాళ్
అట్ట తిశైక్కుమ్ నిత్తై పుకళ్న్దణర్ వాళ్ కూరత్తాళ్వాన్
అవతరిత్తదునాళ్ తైయిల్ విళజ్గిదు అత్తమతు నన్నాళే

తిరుమఞ్జన క్కట్టియమ్

అర్వాంచో యత్పదసరసిజద్వంద్వ మాశ్రిత్య పూర్వే
మూర్ధ్నా యస్యాన్వయ ముపగతా దేశికా ముక్తి మాపుః ।

సోఽయం రామానుజముని రపి స్వీయముక్తిం కరస్థాం
యత్సంబంధా దమనుత కథం వర్ణ్యతే కూరనాథుః ॥

కాషాయశోభి కమనీయశిఖానివేశం
దండత్రయోజ్జ్వలకరం విమలోపవీతమ్ ।
ఉద్యద్దినేశనిభ ముల్లసదూర్ధ్వపుండ్రమ్
రూపం తవాస్తు యతిరాజ! దృశో ర్మమాగ్రే ॥
జయ విజయీ భవ!

1) యతిరాజవేషత్తాల్ కృమికంఠశళై నడువిల్ శెన్ఱు వెన్ఱ విదాయ్ తీరవో!
2) ఎళ్ళళవుమ్ అఞ్ఞామల్ "ద్రోణ మస్తి తతః పరమ్" ఎన్ఱు ఎళుత్తిట్ట శ్రమమ్ తీరవో!
3) దర్శనత్తై ఉద్ధరిత్తు దర్శనజ్గట్కు అళివిన్ఱి వరమ్ పెఱ్ఱ విదాయ్ తీరవో!
4) దయైయుడనే నాలూరాన్ పిళ్ళై పొరుత్తు తన్ కతియై అవర్‌క్కళిత్త శ్రమమ్ తీరవో!
5) కూరేశవిజయత్తాల్ కుదృష్టికళై కుడియోట్టి వెఱ్ఱిది పెఱ్ఱ వేర్వై యారవో!
6) కులకురువామ్ ఎతిరాశర్ విరకత్తాల్ నెడుజ్కాలమ్ నొన్దిరున్ద ఇళైప్పారవో!
7) శ్రీభాష్య మిడుమ్బొదు బ్రహ్మసూత్రవృత్తి యెల్లామ్ తరిత్తురైత్త విదాయ్ తీరవో!
8) శ్రియఃపతియిన్ శేషత్వమ్ జీవాత్మలక్షణ మెన్ఱతివిత్త విదాయ్ తీరవో!
9) శ్రీకూరప్రభవ! దర్శనస్థాపనాచార్య! శ్రీకూరనకర్ తళైక్కవే జగమేళుమ్ కుళిర
నిన్ఱ తిరుమఞ్జనమ్ కణ్డరుళవే! జయ! విజయీభవ!

కూరేశగాథామృతలహరి

దివ్యప్రబంధాలలో కూరేశుల అర్థనిర్వాహాలు, ఐతిహ్యాలు

1. పెరియాళ్వార్ తిరుమొళి-1-7-11 తిరువాయ్ మొళిప్పిళ్ళై వ్యాఖ్యానమ్.

మక్కళై పెఱువర్‌కళే-1... కూర్‌న్దు ఆళ్వార్, నఞ్జీయార్ తిరువడి చ్చార్‌న్దవాఱే పిన్ను ఆవర్‌త్తిప్పతాక అఱుతియిట్టతు కూడుకిఱవళివిల్ తమ్ముడైయ పుత్రరాన ఆళ్వానుడైయ శ్రీవైష్ణవత్వత్తై క్కణ్డు, "ఇతినుడైయ ఇడుప్పు ఇరున్దమై కణ్డోముక్కు, ఆళ్వానుక్కు అన్వశేషత్వమ్ వరవొణ్ణాతు" ఎన్ఱు ఆవర్‌త్తిక్కై తవిర్‌న్దారిత్తే.

సందర్భం:- తమ ప్రబంధంలో ఒక దశకాన్ని అభ్యసించినవారికి కలిగే ఫలాన్నిగూర్చి ఆళ్వార్లు తెలిపే సందర్భం ఇది. **"మాయన్ మణివణ్ణన్ తాళ్ పణియుమ్ మక్కళై పెఱువర్‌కళే"** (ఆశ్చర్యచేష్టితుడు, మణివర్ణుడైన భగవానుని శ్రీపాదాలను సేవించే సంతానాన్ని పొందుతారు) అని అంటూ ఆళ్వార్లు ప్రథమశతకంలోని సప్తమదశకాన్ని పఠించినందువల్ల కలిగే ఫలాన్ని తెలిపారు. దీనిని వివరిస్తూ వ్యాఖ్యాత **"మణివణ్ణన్ తాళ్ పణియుమ్ మకన్"** (మణివర్ణుని శ్రీచరణాలను సేవించే పుత్రుడు)గా కూరత్తాళ్వాన్‌ను భావించదగిన విషయాన్ని ఒక ఐతిహ్యం ద్వారా తెలుపుతున్నారు.

వివరణం:- కూరత్తాళ్వార్ (కూరేశుల తండ్రి) తమ పత్ని పరమపదించిన తరువాత పునర్వివాహం చేసికోవాలని తలచారు. ఇంచుమించుగా వారి ప్రయత్నం కార్యరూపం దాల్చే క్షణంకూడా ఆసన్నమైనది. అయితే, తమ కుమారులైన కూరేశులు శ్రీవైష్ణవచిహ్నాలను అన్నీటినీ పరిపూర్ణంగా కల్గి ఉండడాన్ని గమచించిన కూరత్తాళ్వార్ అటువంటి కూరేశుల తమ పునర్వివాహంవల్ల సవతితల్లికి దాస్యం చేయవలసిన స్థితి ఏర్పడుతుందని, సవతితల్లి అసూయతో కూరేశులను బాధపెట్టినట్లయితే, తమకు భాగవతాపచారం ఏర్పడుతుందని భావించి తిరిగి వివాహమాడే ప్రయత్నాన్ని విరమించారు.

ఈ ఐతిహ్యంవల్ల బాల్యంలోనే కూరేశులు శ్రీవైష్ణవలక్షణపూర్తి వ్యక్తమైనది. తిరువాయ్‌మొళి (5-5-1). పాశురం. ఈడు వ్యాఖ్యలో కూడా ఈ ఐతిహ్యం ప్రస్తావింపబడింది.

2. పెరియాళ్వార్ తిరుమొళి - 3 - 8 - 4 - మణవాళమహామునుల వ్యాఖ్య.

ఆళ్వాన్ తిరునాట్టుక్కు ఎళున్దరుళినపోతు ఉడైయవర్ విశ్లేషమ్ పొరుక్క మాట్టామల్ "ఒరుమకళ్ తన్నైయుడైయేన్" ఎన్ఱుమ్, "ఉలకమ్ నిత్తైన్ద పుకళ్ తిరుమకళ్‌పోల్ వళర్‌త్తేన్" ఎన్ఱుమ్ "శెఙ్గణ్‌మాల్ తాన్ కొణ్డు పోనాన్" ఎన్ఱుమ్ అరుళిచ్చెయ్‌తార్ ఎన్ఱు ప్రసిద్ధమిత్తే". "ఉపమాన మశేషాణాం సాధూనాం యస్సదాఽ

భవత్" ఎన్గిఱపడియే సాధుక్కళుక్కెల్లామ్ ఉపమానమాక చ్చొల్లలామ్బడి ఇరుక్కైయాలే ఉలకమ్ నిత్తైన్ద పుకళ్ళుళ్లతు ఆళ్వానుక్కేయితే.

సందర్భం:- శ్రీకృష్ణుని అన్ని చరిత్రలను వరుసగా మానసికంగా అభవించిన పెరియాళ్వార్లు మిగిలిన ఆళ్వార్లవలెనే భగవానుని చేరి అనుభవించాలని నిత్యకైంకర్యాన్ని చేసి ఆనందించాలని ఆశపడ్డారు. వెంటనే ఆ అనుభవం లభించనందువల్ల ఆర్తి అధికమై, తాము జన్మతః పురుషులమనే భావం పోయి, భక్త్యుత్కర్షంవల్ల నాయికాభావాన్ని పొందారు. అపుడు తాము పడే బాధను తమ నోటితే తెలిపే శక్తినికూడా లేనివారై, తమ స్థితిని తెలిపే తల్లి మాటల రూపంలో పలు పాశురాలను అనుగ్రహించారు. రాత్రిలో శయ్యపై పరుండిన కుమార్తెను, తల్లి అయిన తనకుకూడా తెలియకుండా ఉండే రీతిలో స్వామి పిలుచుకొనిపోగా, అపుడు తల్లి కుమార్తెను తలుస్తూ బాధపడేటపుడు- **"ఒరుమకళ్తన్నై ఉడైయేన్ ఉలకమ్ నిత్తైన్ద పుకళ్ళాల్ తిరుమకళ్పోల్ వళర్త్తేన్ శెఙ్గణ్మాల్ తాన్ కొణ్డుపోనాన్"** (ఒకే ఒక కుమార్తెను కల్గినదానను నేను. లోకంలో అంతా కీర్తి వ్యాపించేటట్లుగా లక్ష్మీదేవివలె ఆమెను పెంచాను. అటువంటి అరుదైన నా కుమార్తెను పుండరీకాక్షుడు తీసికొని వెళ్ళిపోయాడే!) అని అంటూ తల్లి బాధపడడం ఈ పాశురంలోని సారం. ఈ పాశురాన్ని కూరత్తాళ్వాన్ విషయంగా భగవద్రామానుజులు అనుగ్రహించిన ఒక ఐతిహ్యాన్ని శ్రీవరవరమునులు తమ వ్యాఖ్యలో ఉట్టంకించారు.

వివరణం:- భగవద్రామానుజులు తమ పూర్ణానుగ్రహానికి పాత్రం అయిన కూరత్తాళ్వాన్‌ను కోల్పోవలసి వచ్చినపుడు (కూరేశుల పరమపదయాత్రాసమయంలో) ఈ పాశురాన్ని స్మరించి బాధపడి రోదించారు - అనే విషయం సంప్రదాయంలో సుప్రసిద్ధం. శ్రీరామానుజులకు ఎంతోమంది శిష్యులు ఉన్నా, వారికి కూరేశులపైన ఉన్న ప్రేమ అత్యంతం అధికం. (దీనికి దృష్టాంతంగా తిరువిరుత్తప్రబంధంలోని 99వ పాశురానికి పెరియవాచ్చాన్‌పిళ్ళై అనుగ్రహించిన వ్యాఖ్యలోని కూరేశులకు సంబంధించిన ఐతిహ్యంకూడా స్మరణీయం. అది కూడా క్రమశః వివరింపబడుతుంది) అందువల్లనే వారు కూరేశులను ఉద్దేశించి **"ఒరు మకళ్ తన్నైయుడైయేన్"** అని పల్కుతూ రోదించారు. లోకంలో అంతటా వ్యాపించిన కీర్తిని కల్గినవారు కూరేశు లొక్కరే ఎందుకు ? అని అంటే, **"ఉపమాన మశేషాణాం సాధూనాం యస్సదా ఽ భవత్"** (సత్పురుషులకు అందరికీ ఎల్లప్పుడూ ఉపమానంగా ఎవరు అయ్యారో) అని చెప్పే రీతిలో వెలిగిన వైభవం కూరేశులకు ఒక్కరికే ఉన్నది. తిరువరఙ్గత్తముదనార్‌కూడా ఇరామానుశనూఱ్ఱన్దాదిలో - **"మొళ్ళియై క్కుడక్కుమ్ పెరుమ్పుకళ్వాన్. . . . . నమ్ కూరత్తాళ్వాన్"** (7) (వాచామగోచరం అయిన గొప్ప కీర్తిని కలవారు మన కూరేశులు) అని అన్నారు. శ్రీమణవాళ మహాములు సైతం **"వాచామగోచరమహాగుణదేశికాగ్ర్యకూరాధినాథ"** అని ఈ అర్థాన్ని అనుసంధించారు.

ఈ పాశురం **"ఒరు మకళ్తన్నై యుడైయేన్, ఉలకమ్ నిత్తైన్ద పుకళ్వాల్ తిరుమకళ్పోల్ వళర్త్తేన్, శెఙ్గణ్ మాల్ తాన్ కొణ్డుపోనాన్"** - అని ప్రారంభమవుతున్నది. అయితే పైన ఉట్టంకింపబడ్డ ఐతిహ్యంలో **ఉడైయవర్", "ఒరుమకళ్ తన్నైయుడైయేన్"** అని, **"ఉలకమ్ నిత్తైన్ద పుకళ్వాల్ తిరుమకళ్పోల్ వళర్త్తేన్"** అని, **"శెఙ్గణ్మాల్‌తాన్ కొణ్డుపోనాన్"** అని అనుగ్రహించారు. అని మూడు చోట్ల మధ్య మధ్యలో **"ఎన్ఱుమ్, ఎన్ఱుమ్, ఎన్ఱుమ్"** (అని, అని, అని) అని అంటూ వ్యాఖ్యానంలో శ్రీమణవాళ మహాములు మూడు భాగాలుగా ఈ పాశురఖండాన్ని ఉదాహరించారు. అందువల్ల, కూరేశుల విశ్లేషంవల్ల దుస్సహమైన దుఃఖాన్ని పొందిన శ్రీరామానుజులు ఈ పాశురాన్ని ఒకే మాఱు చెప్పలేక ఒక వాక్యాన్ని చెప్పి, కొంచెంసేపు రోదించి, కన్నీరు విడచి, మళ్ళీ తరువాత అనంతర వాక్యాన్ని పలికారు. అంతగా కంఠాన్ని అడ్డగించే పరిమితిలో దుఃఖాన్ని శ్రీరామానుజులు పొందారు - అని తెలియజేయడంకోసమే శ్రీవరవరమునులు ఈ పాశురభాగాన్ని మూడు భాగాలుగా విభజించి చూపించారు - అని కాంచీమహావిద్వాన్ శ్రీ ప్ర.భ.అణ్ణఙ్గరాచార్యస్వామివారి సూక్తి.

3. పెరియాళ్వార్ తిరుమొళి -4-1-4- మణవాళమహాముని వ్యాఖ్య.

(మాయ మిత్యాది) శిఱుడివై క్కొణ్డు పెరియ లోకఙ్గళై వయిఱ్ఱిలే వైత్తు ఒరు పవనాన అలన్తళిరిలే కణ్వళర్న్దరుళిన అఘటితఘటనాసామర్థ్యత్తాల్ వన్ద ఆశ్చర్యత్తై యుడైయ అన్ద క్కుళవియై. "ముగ్ధ శిశు ర్వటదళే శయితోఽతితన్వా తన్వా జగన్తి బిభృషే సవికాస మేవ, ఐశీ మిమాం తవ తు శక్తి మతర్కితవ్యామ్ అవ్యాజతః ప్రథయసే కిమిహావతీర్ణః!" (అతిమానుషస్తవమ్ 14) ఎన్నానిఱే ఆళ్వాన్...

సందర్భం:- "తోయమ్ పరన్ద నడువు కుళలిన్ తొలై వడివు కొణ్ డ మాయక్కుళవి" (అంతటా వ్యాపించిన జలం మధ్యలో ఉపాయంగా తన పెద్ద రూపాన్ని సంకోచింపచేసి కొనిన ఆ ఆశ్చర్యభూతుడైన బాలుడు) అని భగవానుడు వటపత్రశాయి అయిన సన్నివేశాన్ని గూర్చి పెరియాళ్వార్లు పలికారు. **"మాయక్కుళవి"** అనే ప్రయోగానికి ఆశ్చర్యకరం అయిన సామర్థ్యాన్ని కలవాడు - అనే అర్థాన్ని పల్కి శ్రీమణవాళ మహాములు ఈ అర్థానికి అనుగుణంగా కూరేశుల అతిమానుషస్తవంలోని **"ముగ్ధ శిశు ర్వటదళే శయితోఽ తితన్వా తన్వా జగంతి బిభృషే సవికాస మేవ, ఐశీ మిమాం తవ శక్తి మతర్కితవ్యా మవ్యాజతః ప్రథయసే కిమిహావతీర్ణః"** అనే శ్లోకాన్ని ఉట్టంకించారు.

వివరణం:- "చిన్నమఱ్ఱి ఆకులో శయనించిన బాలుడవైన నీవు చాలా చిన్న రూపంతో లోకాలకు అన్నిటినీ చాలా అనాయాసంగా ధరించావు. ఇటువంటి నీవు ఊహించడానికి వీలుకాని నీ శక్తిని ఈ లోకంలో అవతరించి, కారణం ఏమీ లేకుండానే ఎందుకోసం వ్యక్తం చేస్తున్నావు స్వామీ?" - అని అంటూ కూరేశులు అతిమానుషస్తవంలోని **"ముగ్ధశిశుః"** (14) ఈ శ్లోకంలో భగవానుని అతిమానుషలీలలనుగూర్చి ప్రశ్నిస్తూ

అన్నారు. చిన్నబాలుడై అవతరించినపుడు లోకాలను అన్నిటినీ తన ఉదరంలో పెట్టుకొని ఉండడం అత్యంతం ఆశ్చర్యకరమైన లీల కనుక **"మాయక్కుళవి"** అని భట్టనాథులు అనుగ్రహించినందులకు అనుగుణంగా వరవరమునులు ఈ అతిమానుషస్తవ శ్లోకాన్ని ఉదాహరించారు.

4. పెరియాళ్వార్ తిరుమొళి -4-2-5- మణవాళమహాముని వ్యాఖ్య.

(కడల్ వణ్ణన్ తిరువాయై కూఱ త్తిరియుమ్) అన్న దివ్యాజ్ఞకు ఇళైత్తు పోకమాట్టామల్ మీళుమ్. "సున్దర దోర్దివ్యాజ్ఞాలమ్భనకాతరవశానుయాయిని కరిణి, ప్రణయజకలహ సమాధి ర్యత్ర వనాద్రి స్స ఏష సుందరదోష్ణః" (సుందర బాహు-8.) ఎన్ఱ ఇవ్వృత్తాన్తత్తై అరుళిచ్చెయ్తారిత్తే ఆళ్వాన్.

సందర్భం:- తిరుమాలిరుమ్‌శోలైలోని రమణీయాలైన, సహజమైన సన్నివేశాలను వర్ణించే పెరియాళ్వార్లు **"కరువారణమ్ తన్ పిడి తుఱన్దోడ క్కడల్‌వణ్ణన్ తిరువాయై కూఱత్తిరియుమ్ తణ్ మాలిరుమ్ శోలైయే"** (నల్లని ఏనుగు, తన ఆడఏనుగు ప్రణయరోషంతో తన నుండి దూరంగా పరుగెత్తినపుడు "సముద్రవర్ణుడైన సుందరబాహుస్వామివై అన" అని పల్కగా, అపుడు ఆ ఆడఏనుగు ఆ ఆనకు కట్టుబడి అక్కడినుండి ముందుకు వెళ్ళ లేక వెనుతిరిగే చల్లని తిరుమాలిరుమ్‌శోలై పర్వతం) అని అనుగ్రహించారు. ఈ పాశురంలోని అర్థాన్ని అనుసరిస్తూ కూరేశులు అనుగ్రహించిన సుందరబాహుస్తవంలోని శ్లోకాన్ని శ్రీమణవాళమహాములులు తమ వ్యాఖ్యానంలో ఉట్టంకించారు.

వివరణం:- తిరుమాలిరుమ్‌శోలైలో నివసించే గజదంపతులలో ఆడ ఏనుగు మగఏనుగుతో ప్రణయకోపంతో స్పర్ధించి, దూరంగా పరుగెత్తి పోయినపుడు మగఏనుగు **"తిరుమాలిరుమ్ శోలై**లోని సుందరబాహుస్వామిపై ఆన; నీవు నన్ను వదలిపోవద్దు" అని అన్నది. ఆడఏనుగు ఆ మాటకు కట్టుబడి నిలచింది - అనే పాశురంలోని అర్థాన్ని అనుసంధించే కూరేశులశ్లోకం ప్రమాణంగా చూపబడింది.

5. పెరియాళ్వార్ తిరుమొళి -4-4-7- మణవాళ మహాముల వ్యాఖ్య.

ఆళ్వానుక్కు "ఒరు శ్రీవైష్ణవర్ తిరువడిచ్చార్న్దార్" ఎన్ను విణ్ణప్పమ్ శెయ్య, "భాగవతకైంకర్యమే యాత్రైయాయ్ పోనవరై అప్పడి శొల్లలాకాతు. తిరునాట్టుక్కు పోనార్ ఎన్ను శొల్లవేణుమ్ కాణుమ్" ఎన్ఱ అరుళిచ్చెయ్తారామ్.

సందర్భం:- **"పత్తర్‌కళ్ ఇరున్ద ఊరిల్ ఇరుక్కుమ్ మానిదర్ ఎత్తవఙ్గళ్ శెయ్‌దార్ కొలో?"** (భగవద్భక్తులు ఉండే ఊరిలో ఉన్న మానవులు ఏ తపస్సులు చేశారో కదా) అని అంటూ పెరియాళ్వార్లు భక్తులు నివసించే ఊరిలో నివసించడమే కోరదగినది- అని పల్కడానికి నిదర్శనంగా ఈ క్రింది ఐతిహ్యాన్ని వ్యాఖ్యాత ఉట్టంకించారు.

వివరణం:- భాగవతకైంకర్యాన్ని చేయడమే లక్ష్యంగా కల్గి ఉండే శ్రీవైష్ణవులు ఒకరు ఒకనాడు కాలం చేశారు. ఈ వార్తను ఒక శ్రీవైష్ణవులు కూరేశులకు తెలుపుతూ. **"అవర్ తిరువడి చ్చార్న్దార్"** (భగవానుని శ్రీచరణాలను చేరారు) అని అన్నారట. వెంటనే కూరేశులు "భగవద్భక్తులకు కైంకర్యం చేయడమే చిహ్నంగా కల్గిన ఒక మహానుభావులను గూర్చి ఈ విధంగా పలుకకూడదు. భగవానుని దాసులైన నిత్యసూరులు నిండి ఉండే చోటు కనుక **"వానవర్ నాడు"** అని కీర్తింపబడే తిరునాడుకు వేంచేశారు - అని అనాలి" అని అన్నారట.

వ్యాఖ్యానంలో **"తిరునాడు"** అనే పదం లక్షణయా పరమపదంలోని నిత్యసూరులను నిర్దేశిస్తుంది. ఈ సందర్భంలో ఒకటి రెండు వక్తవ్యాంశాలు విన్నపింపబడుతున్నాయి.

పరమపదం అనబడే తిరునాడు భగవద్భక్తులైన నిత్యసూరులతో నిండినది కావడంవల్ల చాలా గొప్పది. నమ్మాళ్వార్లుకూడా **"అడియార్‌కళ్ కుళాఙ్గళై ఉడన్ కూడువదు ఎన్ఱుకొలో!"** (నిత్యసూరుల సమూహాలతో కలవడం ఎపుడో కదా) అని తిరువాయ్ మొళి (2-3-10)లో పల్కుతూ పరమపదంలో ఉండే నిత్యసూరుల గోష్ఠితో కలసి ఉండాలనే ఆశపడ్డారు. ఈ ఆశకు అనుగుణంగానే తాము చివరలో పొందిన ఫలాన్ని **"అన్దమిల్ పేరిన్బత్తు అడియరోడు ఇరున్దమై"** (అంతు లేని మహానందాన్ని కల దాసులైన నిత్యసూరులతో కలసి ఉండడాన్ని) అని అంటూ (10-9-11) తాము ఆశించిన రీతిలోనే పొందానని అన్నారు. అందువల్ల పరమపదం **"అడియార్ నిలాకిన్ఱ వైకున్దమ్"** (భగవద్భక్తులు అయిన నిత్యసూరులు నివసించే వైకుంఠం) (తిరువిరుత్తం - 75) అనే నిర్దేశింపబడుతున్నది. భగవద్భక్తుల విషయంలో చాలా అభినివేశాన్ని కల ఒక మహనీయులు అటువంటి భగవద్భక్తులచేత వైలక్షణ్యాన్ని పొందిన చోటుకు చేరారు - అని పల్కడమే వారి మనస్సుకు తగిన అన్నది కూరేశుల సూక్తిలోని తాత్పర్యం.

(భగవద్భక్తులపై కూరేశులకు ఉన్న ఆదరాతిశయాన్ని తెలిపే ఇటువంటి ఐతిహ్యాలే పెరియాళ్వార్ తిరుమొళి (4-4-7)లో, తిరుప్పావై 9వ పాశురం ఆఱాయిరప్పడి వ్యాఖ్యలో కన్పిస్తాయి. వీటి వివరణం క్రమంగా తెలుపబడుతుంది)

6. పెరియాళ్వార్ తిరుమొళి -4-4-7- మణవాళమహామునివ్యాఖ్య.

ఆళ్వాన్ సంసారత్తిల్ ఆర్తియిన్ కనత్తాలే పెరుమాళ్ తిరువడిగళిలే "అడియేనై తిరునాట్టిఱ్ పోయ్ప్పిడి తిరువుళ్ళమాకవేణుమ్" ఎన్ను విణ్ణప్పమ్ శెయ్య, పెరుమాళ్ తిరువుళ్ళమాయ్. ఆళ్వార్ తిరువరఙ్గప్పెరుమాళరైయర్ తిరుమాళికైయిలే పుఱవీడు విట్టిరుక్కిఱవళవిలే, ఇత్తై ఉడైయవర్ కేట్టరుళి పఱ్ఱు క్కొట్టున్ తిరువాశల్ అళవాక ఎళున్దరుళి, "పెరుమాళుక్కు విణ్ణప్పమ్ శెయ్‌దాల్ విణ్ణప్పమ్ శెయ్‌తతు పెరుమాళుమ్ శెయ్‌తరుళువర్. నామడియాక ప్పెరుమాళ్ ఇరణ్డుమ్ వారై అరుళిచ్చెయ్తారాక ఒణ్ణాతు"

ఎన్ను మీణ్డుమ్ ఆళ్వాన్ ఇరుక్కిఱ ఇడత్తిల ఎళున్దరుళి 'ఏన్ ఆళ్వాన్ ?' ఎన్న, 'అడియేన్ మఱన్దేన్' ఎన్ను విణ్ణప్పమ్ శెయ్తాన్.

సందర్భం:- గత ఐతిహ్యం ప్రస్తావింపబడ్డ పాశురవ్యాఖ్యలోనే ఇదికూడా ఉదాహరింప బడింది. సందర్భంకూడా అదే.

వివరణం:- భగవద్రామానుజుల శిష్యులైన కూరేశులు ఒకనాడు ఇక తాము ఈ లోకంలో నివసించడానికి ఇష్టపడక, శ్రీరంగనాథుని సన్నిధిని చేరి "దాసునకు మోక్షాన్ని ప్రసాదించాలి" అని పదే పదే ప్రార్థించారు. భగవానుడు కూడా "సరే, అట్లే కానివ్వండి" అని తన అనుమతిని ఇచ్చాడు. సన్నిధినుండి ఇంటికి బయలుదేరిన కూరేశులు తమ ఇంటిని నేరుగా వెళ్ళకుండా ఆళ్వార్ తిరువరఙ్గప్పెరుమాళ్ అరైయర్ (శ్రీరామానుజుల పంచాచార్యులలో ఒకరు) తిరుమాళిగలో పరస్థానం చేశారు. పరస్థానం చేయడం అంటే - తాము బయలుదేరడానికి ముందుగా ఒక మంచి దినాన తాము వెళ్ళదలచిన దిశలో ఉండే ఒకరి ఇంటిలో తమ సామానులను పెట్టి, తరువాత తాము పోదలచిన దినంలో అక్కడనుండి ప్రయాణం చేయడం. అదే రీతిలో కూరేశులుకూడా తాము పరమపదానికి బయలు దేరడానికి ముందుగా పరస్థానంగా అరైయర్ ఇంటిలోకి వచ్చి ఉన్నారు. శ్రీరామానుజులు దీనిని విని తల్లడిల్లారు. తమ అభిమానానికి పరిపూర్ణంగా లక్ష్యభూతులైన కూరేశులను విడచి ఉండలేక, "కూరేశులకు ఈ విధంగా మోక్షాన్ని అనుగ్రహించి, నానుండి వారిని విడదీయడం ఏ విధంగా న్యాయం ?" అని శ్రీరంగనాథుని నిలదీయడంకోసం కోవెలకు బయలుదేరి. **"పఱ్ఱు క్కొట్టన్"** వాకిలివరకు వచ్చిన తరువాత శ్రీరామానుజులు ఒక క్షణం ఆలోచించారు. కూరేశులకు ఇపుడు మోక్షాన్ని ఇవ్వకూడదని నేను శ్రీరంగనాథుని నిర్బంధిస్తే, స్వామి కాదనలేక నామాలకు సమ్మతించి, కూరేశులకు మోక్షాన్ని అనుగ్రహించడం మానివేయవచ్చు. అయితే, అపుడు ఏమవుతుంది? నాకు ఒక మాటను, కూరేశులకు వేఱొక మాటను- శ్రీరంగనాథుడు రెండు మాటలు పల్కినట్లవుతుంది. **"రామో ద్విర్నాభిభాషతే"** - కదా. కనుక ఆ రీతిలో జరగడం సబబు కాదు. కూరేశులకు శ్రీరంగనాథుడిచ్చిన మాటయే నిలబడనీ. ఆ విధంగానే కానీ" అని నిశ్చయించుకొని కూరేశులున్న అరైయర్ గృహానికి వెళ్ళారు. "ఏమి! కూరనాథా! నన్ను విడచి మోక్షానికి పోవడానికి ఏవిధంగా మీకు మనస్సు వచ్చింది?" అని ఆర్ద్రంగా ప్రశ్నించారు. వెంటనే కూరేశులు - "స్వామీ! ఈ లోకంలో నివసించినానాళ్ళలో కల్గిన దుఃఖాలు నన్నీ విధంగా ప్రార్థించేటట్లు చేశాయి. అయితే, నేను మోక్షాన్ని పొందితే, దేవరవారితో కలిగి ఉండే ఈ స్థితిని కోల్పోతాను కదా! - అని ఆలోచించలేకపోయాయి. ఆ మాటను మఱచిపోయాను" అని అన్నారు.

పిన్బళగియ పెరుమాళ్ జీయర్ అనుగ్రహించిన ఆఱాయిరప్పడి గురుపరంపరా ప్రభావంలో కూరేశులు ఈ సందర్భంలో పల్కిన సమాధానం వివరంగా ఉన్నది. అది ప్రకృతంలో సంగ్రహంగా విన్నపింపబడుతున్నది.

శ్రీరామానుజులు, కూరేశులకు శ్రీరంగనాథుడు మోక్షాన్ని అనుగ్రహించి వార్తను విని శోకార్తులై, తమ శిష్యులను అందఱినీ వెంటబెట్టుకొని కూరేశులున్న చోటికి వచ్చి, "కూరేశా! మీరీ విధంగా చేయవచ్చునా?" అని అడిగారు కూరేశులు మౌనంగా ఉండి పోయారు. అపుడు శ్రీరామానుజులు "కూరేశా! మీరు ముందుగా పరమపదాన్ని చేరుకోవాలని అనుకోవడంలో ఏమి ఉద్దేశ్యం? మాటలాడకుండా ఉంటే ఎట్లా!" అని మళ్ళీ అడిగారు. కూరేశులు "పరమపదంలో నడిచే క్రమానికి భంగం కల్గుతుందని భయపడి" అని అన్నారు. "అది ఏమో మాకు తెలియజేయండి" అని రామానుజులు అనగా, కూరేశులు **"ముడియుడై వానవర్ ముత్తై ముత్తై ఎదిర్ కొళ్ళ"** (కిరీటాలను కల పరమపదవాసులు క్రమానుసారంగా ఎదురు రాగా) అనే రీతిలో తమకు ముందు పరమపదానికి పోయినవారు తమకు పిమ్మట పరమపదాన్ని చేరేవారికి స్వాగతాన్ని పల్కుతారు. ఆ క్రమంలో దాసుడు వెనుకబడితే క్రమభంగం కల్గుతుంది" అని అన్నారు. శ్రీరామానుజులు ఆ మాట విని - **"న శాస్త్రం నైవ చ క్రమః"** (శాస్త్రం లేదు, క్రమమూ లేదు) అని అన్నట్లు క్రమంలేని ఈ భోగవిభూతిలో మీరు క్రమాన్ని అన్వేషిస్తున్నారే! అయ్యో! - ఇదేమి శేషత్వంలోని వైలక్షణ్యం! అని ఇంకా చాలా శోకార్తులయ్యారు.

ఈ వివరణాన్నిబట్టి శ్రీరామానుజులకు తరువాత తాము పరమపదానికి చేరితే, తమకు శ్రీరామానుజులు ఎదురువచ్చి నమస్కరించి, స్వాగతం చెప్పే పరిస్థితి ఏర్పడుతుంది. శిష్యులైన తమకు అది కూడదు. దానిని తప్పించాలి - అనే భావంతో, పరమపదంలో శ్రీరామానుజులకు తాము నమస్కరించి స్వాగతాన్ని పల్కాలి ; ఆ క్రమంలో ముందుగానే తాము పరమపదాన్ని చేరాలి అని తలచినట్లు తెలుస్తున్నది. అందువల్ల శ్రీరామానుజులకు తరువాత కూడా ఈ లోకంలో నిలబడి ఉండి తరువాత పరమపదానికి పోతే సంభవించబోయే అపచారాన్నిగూర్చిన భావనవల్ల కల్గిన దుఃఖాన్నే కూరేశులు ఈ ఐతిహ్యంలో సంసారంలో ఆర్తి (ఇహలోకనివాసంలోని ఆర్తి) అని అన్నారని చెప్పవచ్చు.

7. తిరుప్పావై - 1వ పాశురం- ఆఱాయిరప్పడి వ్యాఖ్యానమ్ :

(ఇళమ్ శిఙ్గమ్) - "శిఙ్గక్కురుకు" ఎన్ను ఆళ్వాన్ వార్తై.

సందర్భం : శ్రీకృష్ణుని గోదాదేవి **"నన్దగోపన్ కుమరన్"** అని, **"అశోతై ఇళమ్ శిఙ్గమ్"** అని కీర్తించారు. శ్రీకృష్ణుడు తన తండ్రి వసుదేవుని చూస్తే చాలా భయంతో, వినయవిధేయతలతో ప్రవర్తిస్తూ, అతని దగ్గరకు వెళ్ళేవాడు కనుక, **"నన్దగోపన్ కుమరన్"** అని, తల్లి అయిన యశోదవద్ద కొంచెంకూడా భయం లేకుండా ధీవిగా వెళ్ళేవాడు కనుక, **"అశోతై ఇళమ్ శిఙ్గమ్"** అని గోదాదేవి అన్నది- అని వ్యాఖ్యానించిన పెరియవాచ్చాన్ పిళ్ళై ఆ సందర్భంలో కూరేశుల ఈ వార్తను ఉట్టంకించారు.

వివరణం : "ఇళమ్ శిఙ్గమ్" అనే పదాన్ని కూరేశులు **"శిఙ్గక్కురుకు"** అని వివరించేవారట. **"శిఙ్గక్కురుకు"** అంటే బాలసింహం అని అర్థం. అంటే- శ్రీకృష్ణుడు

ఠీవిని కల్గిన సింహపు పిల్లవలె యశోద దగ్గర నడచుకొనేవాడని కూరేశుల అభిప్రాయం. (తిరుప్పావై నాలాయిరప్పడి, మూవాయిరప్పడి వ్యాఖ్యలలో ఈ వివరణాన్ని భట్టర్ చేసినట్లు తెలుపబడడం గమనార్హం. బహుశః కూరేశులు పల్కిన వివరణను భట్టర్ ప్రస్తావించి ఉండవచ్చు.)

8. తిరుప్పావై – 2వ పాశురం – ఆఱాయిరప్పడి వ్యాఖ్య.

(శెయ్యాదన శెయ్యోమ్) "ఆఴ్వానై. దేవరీర్ దేవతాన్తరభజనమ్ పణ్ణతొళిగిఱతెన్!?" ఎన్న, "ఎఙ్గళ్ పూర్వర్కళ్ దేవతాన్తరభజనమ్ పణ్ణమైయాలే" ఎన్తానామ్.

సందర్భం:– తిరుప్పావై వ్రతంలో ఆసక్తిని కలవారు చేయకూడని కార్యాలనుగూర్చి రెండవ పాశురంలో తెలిపే గోదాదేవి, **"శెయ్యాదన శెయ్యోమ్"** అని అన్నారు. "పూర్వులు చేయనివానిని చేయము" అని ఈ సూక్తి తాత్పర్యమని అంటూ వ్యాఖ్యాత ఈ క్రింది ఐతిహ్యాన్ని ఉట్టంకించారు.

వివరణం:– కూరేశులను కొందఱు "మీరు ఎందువల్ల శ్రీమన్నారాయణుని తప్ప వేఱొక దైవాన్ని కొలువరు?" అని అడిగారు. అపుడు కూరేశులు "మా పూర్వులు ఎవరూ అన్యదైవాలను కొలువలేదు. కనుక మేము కూడా ఆరాధించము" అని సమాధానం పలికారు.

"శివాత్ పరతరం నాస్తి" అని వ్రాసి సంతకం చేయమని నిర్భంధించిన చోళ రాజును ఎదిరించి, "శ్రీమన్నారాయణుడే పరతత్వం" అని వాదించి, తమ మతాన్ని స్థాపించినవారు కూరేశులు. ఆ కూరేశులే ఈ విధంగా పల్కడం గమనార్హం. శాస్త్రాలలో చెప్పబడినా, పెద్దల అనుష్ఠానంలో లేనివి కనుక తాముకూడా వానిని చేయడంలేదని, వారి అనుష్ఠానంలో ఉన్నవానినే ఆచరిస్తామని కూరేశులు పల్కడం పెద్దల అనుష్ఠానాన్ని అనుసరించాలనే విషయాన్ని బలపరుస్తున్నది. దీనికి పిమ్మట ప్రస్తావింపబడబోయే ఐతిహ్యం కూడా దేవతాంతరారాధననుగూర్చి కూరేశులు పల్కి సూక్తినిగూర్చినదే కావడంకూడా గమనించదగినది.

10. తిరుప్పావై – 4వ పాశురం – నాలాయిరప్పడి వ్యాఖ్య.

ఆఴ్వానై ఒరు భట్టన్ "దేవతాన్తరఙ్గళై నీఙ్గళ్ కణ్డాల్ పణ్ణుమ్ ఆచారమ్ ఎన్? ఎన్ను కేట్క, "శాస్త్రవిరోధమాక క్కేళాతే కొళ్ళుమ్. దేవతాన్తరఙ్గళ్ ఉఙ్గళై క్కణ్డాల్ పణ్ణుమ్ ఆచారమ్ ఎన్? ఎన్ను కేళాయ్"– ఎన్తార్.

సందర్భం:– శ్రీకృష్ణుని మనస్సుకు ప్రియతమలైన గోపికలు (వీరి భావనతో గోదాదేవి) తిరుప్పావై వ్రతాన్ని చేయాలని ప్రారంభించగానే వర్షాధిపతి అయిన పర్జన్యుడు" నేను మీకు చేయవలసిన సహాయం ఏమి?" అని చాలా ఆదరంతో అడిగాడు. అపుడు

గోపికలు పర్జన్యుడు ఏరీతిలో వర్షాన్ని కురవాలో తెలుపుతూ **"ఆఴిమళై కృణ్ణ"** అనే నాల్గవ పాశురాన్ని పలికారు. అన్యదేవతలు కూడా భగవానుని దాసులకు కైంకర్యం చేయాలని నిరీక్షిస్తూ ఉంటారని అంటూ వ్యాఖ్యాత ఈ సందర్భంలో ఒక సంవాదాన్ని ఉదాహరణగా ఉట్టంకించారు.

వివరణం:– కూరేశులను చూచి బ్రహ్మణుడొకడు "ఇతరదేవతలను చూస్తే మీరు ఏవిధంగా నడచుకొంటారు?" అని ప్రశ్నించగా, దానికి కూరేశులు "నీవు శాస్త్రవిరుద్ధంగా ప్రశ్నిస్తున్నావే! శ్రీవైష్ణవులను చూస్తే అన్యదేవతలు ఏ రీతిలో నడచుకొంటారు? అని కదా అడగాలి" – అని అన్నారట. భగవద్భక్తులను చూస్తే మిగిలిన దేవతలు నమస్కరించి, సేవ చేస్తారు – అనే భావాన్ని మనస్సులో ఉంచుకొనే కూరేశులు ఈ విధంగా పలికారు. **"ద్రవంతి దైత్యాః ప్రణమంతి దేవతాః, నశ్యంతి రక్షాంస్యపయాంతి చారయః, యత్కీర్తనాత్ సోఽద్భుతరూపకేసరీ మమాస్తు మాంగల్యవివృద్ధయే హరిః"** (ఏ హరిని స్తుతించేవారిని చూస్తే అసురులు పరుగెత్తి పోతారో, దేవతలు నమస్కరిస్తారో, రాక్షసులు నశిస్తారో, శత్రువులు తొలగిపోతారో, అటువంటి, అద్భుతమైన రూపసౌందర్యాన్ని కల నృసింహమూర్తి ఆ హరి నా శుభాలకు అభివృద్ధిని కల్గించాలి) అనే విష్ణుధర్మ – మాంగల్యవివృద్ధిస్తోత్రంలోని శ్లోకంలో – అన్యదేవతలు విష్ణుభక్తులను చూస్తే నమస్కరిస్తారు – అని చెప్పబడిందికదా. (ఆఱాయిరప్పడి వ్యాఖ్యలో కూడా ఈ ఐతిహ్యం– **"ఇవైతాన్ శ్రీవైష్ణవర్కళై అనువర్తియాతొళిగిఱతెన్? –ఎన్నుకేళాయ్–ఎన్న ఆఴ్వాన్"** అని ప్రస్తావింపబడింది.

11. తిరుప్పావై 9వ పాశురం – ఆఱాయిరప్పడి వ్యాఖ్య.

ఆఴ్వాన్ "హితాంశత్తుక్కు ఒరు శ్రీవైష్ణవనుడైయ గృహయాత్రైయై అనుసంధిక్క అమైయుమ్" ఎన్తాప్పోలే, ఇవర్ కళుమ్ ఇవళుడైయ మాళికైయిల్ అఴ్గై అనుభవిక్కిఱార్కళ్.

సందర్భం:– గోపికాభావనతో వేఱొక గోపికను నిద్రలేపే గోదాదేవి ఆ గోపిక భవనాన్ని గూర్చి **"తూమణి మాడమ్"** అని ప్రశంసిస్తూ పల్కింది. భగవద్భక్తులు వేంచేసి ఉండే భవనాలను కీర్తించడం చాలా గొప్పది – అనే ఈ అంశానికి కూరేశులు పల్కిన ఈ క్రింది సూక్తిని ప్రమాణంగా వ్యాఖ్యాత ఉట్టంకించారు.

వివరణం :– "ఎవరైనా ఉజ్జీవించాలంటే దానికి అనుగుణంగా ఒక శ్రీవైష్ణవుల తిరుమాళిగ గొప్పతనాన్ని మనస్సులో తలచినా చాలు" అని కూరేశులు అనేవారు. అంటే, ఆ శ్రీవైష్ణవుడు తన ఇంటిని భగవద్భక్తుల ఆనందంకోసం మణిమయంగాను, దీపమయం గాను, సదా ధూపం పరిమళించేటట్లు, శయ్య, తలదిండు వారు విశ్రమించడానికి సిద్ధంగా ఉండేటట్లు – ఈ విధంగా తన సంపదను అంతటినీ ఉపయోగించే అతని ప్రవర్తనను మనసులో తలచినా చాలు. దాసులకు దాసుడై, విధేయుడై

ఉండడం అనే అతిముఖ్యమైన స్వభావాన్ని కలవారికి ఆ దాసులతో సంబంధాన్ని కల వస్తువులు కూడా ఉన్నతంగానే సాక్షాత్కరిస్తాయి – అన్నది ఇక్కడి సారం.

12. తిరుప్పావై 15వ పాశురం – మూవాయిరప్పడి వ్యాఖ్య.

"నీ యెరువర్కుమ్ విరోధి యిల్లై. నీ పుక్కు త్తిరువడి త్తొళు" ఎన్న, ఆళ్వాన్ వార్తైయై నినైప్పతు.

సందర్భం:– ఇంటి లోపల పరుండి ఉండే గోపికను బయట ఉండే గోపిక ప్రబోధించేటపుడు "త్వరగా నీవు లేచిరా. మిగిలినవారు అందఱు కలిసి, భగవానుని దర్శించి ఆనందించాలని ఉండగా, నీవుమాత్రం ప్రత్యేకంగా భగవానుని అనుభవించాలని తలుస్తున్నావా! నీకు మాత్రం ప్రత్యేకమైన దారి ఉన్నదా ఏమి! అని అంటూ బయట ఉండే గోపికలు ప్రశ్నిస్తున్న సందర్భం ఇది. ఇక్కడ వ్యాఖ్యాత కూరేశులకు సంబంధించిన ఈ ఐతిహ్యాన్ని ప్రస్తావించారు.

వివరణం:– తీవ్రమైన శైవమతాహంకారాన్ని కల చోళరాజు (కృమికంఠుడు) ఒకడు "శివునికంటే పరతత్త్వం ఇంకొకటి లేదు" అని వ్రాసి సంతకం చేయమని పండితులను అందఱినీ నిర్బంధించాడు. శ్రీరామానుజులనుకూడా ఆ విధంగానే సంతకం చేయమని నిర్బంధించడంకోసం రాజసభకు వారిని తీసికొని రమ్మని తన భటులను పంపాడు. శ్రీరామానుజులు రాజసభకు వెడితే, వారికి ఏదైనా గొప్ప ఆపద సంభవిస్తుందని భావించి, కూరేశులు శ్రీరామానుజుల వేషంలో మహాపూర్ణులతో కలసి రాజసభకు వెళ్ళారు. అపుడు చోళరాజు కూరేశులను చూచి **"శివాత్ పరతరం నాస్తి"** అని వ్రాసి సంతకం పెట్టమని అన్నాడు. కూరేశులు ఆ విధంగా సంతకం పెట్టడానికి సమ్మతించకపోవడమే కాక, శ్రీమన్నారాయణుడే పరతత్త్వం అనే సత్యాన్ని తగిన ప్రమాణాలతో వాదించి స్థాపించారు. దీనిని చూచిన ప్రభువు ఆగ్రహోదగ్రుడై కూరేశుల నేత్రాలను పెకలించి వేయమని భటులను ఆజ్ఞాపించాడు. అపుడు కూరేశులు రాజును చూచి "పాపిష్ఠివాడవు అయిన నిన్ను చూచిన ఈ కళ్ళు ఇక నాకు వద్దు" అని అంటూ తామే గోళ్ళతో తమ కన్నులను పెరికివేసికొన్నారు. ఇందులకు మఱింతగా క్రోధాన్ని పొందిన రాజు – "శ్రీరామానుజులు కాని, వారికి సంబంధించిన వారు కాని శ్రీరంగాలయాన్ని ప్రవేశించనీయవద్దు" అని అజ్ఞాపించి, ఆ విధంగా కాపలా కాయమని కావలి వాళ్ళను నియోగించాడు.

ఈ సంగతి తెలియని కూరేశులు ఒకనాడు శ్రీరంగనాథుణ్ణి సేవించాలని ఆలయానికి వెళ్ళినపుడు కోవెల వాకిటిలో ఉండే ద్వారపాలకులలో ఒకడు రాజాజ్ఞ ప్రకారం వారిని కోవెలలోకి పోనివ్వకుండా అడ్డగించాడు. ఇంకొక సేవకుడు "మీరు శ్రీరామానుజుల శిష్యులే. అయినా, మీరు చాలా మంచివారు. మీరెవ్వరికీ విరోధులు

కారు. శమదమాదులను కలవారు. అందువల్ల మీరు కోవెల లోపలకు పోయి స్వామిని సేవించవచ్చు" అని వారిని లోపలకు వెళ్ళడానికి అనుమతించాడు. ఈ మాటను విని కూరేశులు "శమదమాది సద్గుణాలను కల్గి ఉండడం ఆచార్యులతో సంబంధానికి కారణం అవుతుంది – అని ఇంతవరకు నేను భావిస్తూ వచ్చాను. అయితే, ఇపుడు అవే ఆచార్యులైన శ్రీరామానుజులతో దాసునకుండే సంబంధాన్ని తెంచుకోవలసినదానికే కారణమవుతున్నవా! 'సద్గుణాలను కలవాడను' అనే సంబంధంవల్ల శ్రీరంగనాథుణ్ణి సేవించడంకంటే, శ్రీరామానుజుల శిష్యులు అనే సంబంధంతో ఆలయం లోపలకు వెళ్ళకుండా ఉండడమే మేలు" – అని పల్కి కోవెల లోపలకు వెళ్ళకుండానే వెనుదిరిగి పోయారు. ఆ తరువాత శ్రీరంగంలో నివసించడానికికూడా ఇష్టపడక అక్కడనుండి బయలుదేరి తిరుమాలిరుమ్ శోలైదివ్యక్షేత్రానికి చేరారు. (ఈ ఐతిహ్యానికి సంబంధించిన మఱింత వివరాన్ని గురుపరంపరా ప్రభావంలో గమనించవచ్చు.)

13. తిరుప్పావై 20వ పాశురం – ఆఱాయిరప్పడి వ్యాఖ్య

సందర్భం :– నప్పిన్నై ప్పిరాట్టిని ప్రబోధం చేసే పాశురం ఇది. **"తిరువే! తుయిలెళాయ్"** అని ఆమెను గోదాదేవి నిద్రలేపుతున్నది. భగవానునకుకూడా లక్ష్మీ సంబంధ పురస్సరంగానే అతిశయం ప్రతిపాదింపబడుతున్నది – అని వివరిస్తూ వ్యాఖ్యాత ఈ క్రింది విషయాన్ని ప్రస్తావించారు.

వివరణం :– భగవానునకు గొప్పతనాన్ని పలికేటపుడు తిరుమఙ్గైయాళ్వార్ **"తిరువుక్కుమ్ తిరువాకియ శెల్వా"** (పెరియ తిరుమొళి–7–7–1) (లక్ష్మీదేవికికూడా లక్ష్మి అయిన సంపద్రూపా!) అని అన్నారు. భగవద్యామునులు ఈ అర్థాన్ని **"కః శ్రీః శ్రియః"** అని స్తోత్రరత్నంలో అనువదించారు. కూరేశులు **"యస్యాః కటాక్షణం... శ్రియః శ్రియమ్"** (వైకుంఠస్తవం–22) అని అనుసంధించారు. భట్టర్‌కూడా **"శ్రియః శ్రీః! శ్రీరంగేశయ!"** (శ్రీగుణరత్న కోశం–9) అని అన్నారు. ఈ విధంగా భగవానునకు పరత్వాన్ని చెప్పే సందర్భాలలో లక్ష్మిని పురస్కరించుకొనే అతనికి పరత్వాన్ని పల్కిన తిరుమఙ్గై యాళ్వార్, శ్రీయామునులు, కూరేశులు, భట్టర్ మొదలైనవారు ఉదార వాక్కులను కలవారుగా కీర్తింపబతున్నారు– అని వ్యాఖ్యాత **"ఉదారవాక్కుకళాకిఱార్– తిరుమఙ్గై యాళ్వారుమ్, ఆళవన్దారుమ్, ఆళ్వానుమ్, భట్టరుమ్"** అని అన్నారు.

14. తిరుప్పావై – 27వ పాశురం – మూవాయిరప్పడి వ్యాఖ్య.

(యామ్ పెఱు శమ్మానమ్) "పతిసమ్మానితా సీతా" ఎన్ఱు పెరుమాళ్ తోళిల్ మాలైయై వాఙ్గియిట్టార్" ఎన్ఱు ఆళ్వాన్ పణిక్కుమ్.

సందర్భం:– శ్రీకృష్ణభగవానుని ఉద్దేశించి నోమును నోస్తున్న గోదాదేవి ఆ శ్రీకృష్ణుని వద్దనుండి తాము పొందాలని ఆశపడే బహుమానాన్నిగూర్చి గొప్ప పల్కుతూ **"యామ్**

పెఱు శమ్మానమ్" అని అన్నారు. శ్రీరామచంద్రుడు సీతాదేవికి అనుగ్రహించిన సమ్మానం వంటి సమ్మానాన్నే తాము పొందాలని ఆశపడుతున్నారు – అని వివరిస్తూ వ్యాఖ్యాత పెరియవాచ్చాన్ పిళ్ళై, సీతాదేవి శ్రీరామచంద్రుడు కృపజేసిన బహుమానం ఏది ? అనే అంశాన్ని కూరేశుల శ్రీసూక్తులను ఉట్టంకిస్తూ వివరించారు.

దశరథునిచేత పిలువబడ్డ శ్రీరాముడు అంతఃపురంనుండి బయలుదేరేటపుడు సీతాదేవికూడా అతనిని వెంబడిస్తూ వాకిటివరకు వచ్చింది. అపుడు ఆమె శ్రీరాముని చేత సత్కరింపబడిందని అంటూ వాల్మీకి **"పతిసమ్మానితా సీతా భర్తార మసితేక్షణా, ఆద్వార మనువవ్రాజ మంగళాన్యభిదధ్నుషీ"** (రామా – అయో – 16 – 21) (నల్లని నేత్రాలను కల్గినదై మంగళవచనాల పల్కుతూ వాకిలివరకు రాముని వెంట వచ్చిన సీతాదేవి తన భర్తచే సమ్మానింపబడింది) అని అన్నారు.

ఈ శ్లోకంలోని **"పతిసమ్మానితా సీతా"** అనే సూక్తిని వివరిస్తూ కూరేశులు – "శ్రీరాముడు తన భుజాలలో ఉండే మాలను తీసి సీతాదేవి మెడలోనే వేశాడు. ఇదే శ్రీరాముడు సీతకు చేసిన సమ్మానం – అని అన్నారు.

15. నాచ్చియార్ తిరుమొళి 10–2 – పెరియవాచ్చాన్‌పిళ్ళై వ్యాఖ్యానమ్

అజ్ఞనన్నిక్కే, ఆప్పాన్ పణిక్కుమ్బడి– ఆళ్వాన్ పణిక్క క్కేట్టిరుక్కువుమామిఱే; "అవన్ కొడువర చ్చొన్నవర్‌కళై త్తవిర్‌న్దు మాఱ్ఱోలైప్పట్టోమ్" ఎన్ఱ అవర్‌కళ్ తిరళిలే ఎన్నై వైక్కవలైయే! ఎన్గిఱాళ్"– ఎన్ఱ.

సందర్భం : "భగవానుని విశ్లేషించినందువల్ల కల్గిన దుఃఖంలో మునిగి ఉండే గోదాదేవికి వర్షాకాలంలో విరిసే పూలను చూడగానే విరహతాపం ఏర్పడి అతిశయించింది. అందువల్ల ఆ పూలను చూచి, "నన్ను ఇంకా బాధించడంకోసమే భగవానుడు మిమ్ములను పంపించాడా? ఏమి!" అని ప్రశ్నించింది. ఆ బాధనుండి తప్పించుకోవడం కోసం ఆ పూలను చూచి "నన్ను ప్రకృతిమండలాన్ని విడిచివెళ్ళిన ముక్తుల సంఘంతో నన్ను చేర్చగలరా?" అని వారితో అన్నది"– అని అంటూ కూరత్తాళ్వాన్ శిష్యులైన ఆప్పాన్ అనుగ్రహించిన ఒక నిర్వాహాన్ని ఈ సందర్భంలో వ్యాఖ్యాత పెరియవాచ్చాన్‌పిళ్ళై ఉట్టంకించారు.

వివరణం : కూరత్తాళ్వాన్ శిష్యులైన ఆప్పాన్ అనే ఆచార్యులు ఈ సందర్భానికి వివరణాన్ని అనుగ్రహించారు. అయితే, తాము పల్కిన వివరణాన్ని కూరేశులే వారికి అనుగ్రహించి ఉండాలి. "భగవానుడు నన్ను బాధించడంకోసంగా మిమ్ములను పంపించాడు. వేఱు కొంతమందిని తానే నేరుగా బాధించాలి– అని వారిని తనవద్దకు తీసికొనిరమ్మని చెప్పి, మిమ్ములను పంపించారు. మీరు బాధించవలసినవారి సమూహంనుండి నన్ను తప్పించి, భగవానుడే స్వయంగా బాధించాలని అనుకొని

పిలిపించేవారి సమూహంలోకి నన్ను చేర్చండి. ఒకవేళ స్వామి "ఈమెను ఈ సమూహంలోకి ఎందుకు తీసికొనివచ్చారు ?" అని ప్రశ్నిస్తే, "అయ్యో! చీటీ మాఱి పోయింది" అని అనండి. అతడే స్వయంగా నన్ను బాధించినా, అతనిని నేరుగా దర్శించిన తృప్తి అయినా నాకు కల్గుతుంది కదా!" అని అంటున్నది –అనేది ఆప్పాన్ తెలిపిన వివరణం. (ఇక్కడ ఈ అర్థం **"మాఱ్ఱోలైప్పట్టు అవర్ కూట్టత్తు"** అనే అన్వయంద్వారా లభిస్తుంది)

16. నాచ్చియార్ తిరుమొళి–12–2– పెరియవాచ్చాన్‌పిళ్ళై వ్యాఖ్య.

నాణియినియోర్ :– నాచ్చియార్ తిరు. 12–2

"ఆళ్వానుమ్, అణ్ణానుమ్ ఓరాఱు మాసమ్ సేవిత్తిరున్ద సన్నివేశత్తై క్కణ్డు పోరుమ్బోతు ఒరు వార్తై కేట్టు ప్పోరువర్‌కళే. ఆళ్వాన్ ఒరువిశై అఱుమాసమ్ సేవిత్తు నిన్ఱ పోర ప్పుకానిఱ్ఱచ్చెయ్‌తే ఆళ్వానై "నమ్మాళ్వార్ అడియేనుళ్ళాన్ (తిరువాయ్ 8–8–2) ఎన్ననపడి కణ్డాయే!" ఎన్ఱ పణిత్తారామ్. "అడియేన్ కృతార్థనానేన్" ఎన్ఱ పోన్దానామ్.

సందర్భం:– భగవద్విరహంవల్ల తాను పొందే బాధను **(నాలయలారుమ్ అతిన్దొళిన్దార్)** నాల్గు పక్కలలోని ఇరుగుపొరుగు వారు అందరూ గ్రహించారు – అని గోదాదేవి పల్కే పాశురం ఇది. తిరుక్కోట్టియూర్ నమ్బి – అమూల్యమైన భగవద్విషయాన్ని ఎవరంటేవారు తెలిసికోకూడదు – అనే భావంతో రహస్యంగా దాచి ఉంచినట్లే, ఈమె కూడా తన స్థితిని ఎవ్వరూ తెలియరాదని మఱుగు పఱచి ఉన్నది కాబోలు! అని వ్యాఖ్యాత చమత్కరిస్తూ, ఈ సందర్భంలో ఈ క్రింది ఐతిహ్యాలను ఉట్టంకించారు.

వివరణం:– తిరుక్కోట్టియూర్‌నంబి తమవంటి వాకిలి తిన్నెపై కూర్చుండి, ఎవ్వరూ గ్రహించకుండా ఉండేటట్లుగా భగవానుని గుణాలనే భావిస్తూ ఉండేవారు. భగవద్రామానుజులు గీతాచరమశ్లోకార్థాన్ని వినడంకోసం తిరుక్కోట్టియూర్‌కు వచ్చి, "తిరుక్కోట్టియూర్‌నంబి గృహం ఏది?" అని అక్కడ ఉన్నవారిని అడిగారు. వారు చూపించిన దిక్కువైపు దండంపెట్టి శ్రీరామానుజులు అంజలి ఘటించారు. అపుడు అక్కడ ఉన్నవారు నంబి గొప్పతనాన్ని గ్రహించి, ఆ పిమ్మటనే ఆ మహనీయుని అతిశయాన్నిగూర్చి పూర్తిగా తెలిసికొన్నారు. ఈ విధంగా తిరుక్కోట్టియూర్ నమ్బి రహస్యార్థాలను ఎల్లప్పుడూ మఱుగుపఱచే ఉంచారు. కూరేశులు, ముదలియాణ్డాన్ మొదలైనవారు ఒక్కొక్క సమయంలో ఆఱు ఆఱు మాసాలపాటు తిరుక్కోట్టియూర్ నమ్బికి సేవ చేసి, అనుమతిని పొంది తిరిగి వెళ్ళిపోయే సమయంలో నమ్బి వారికి ఒక్కొక్క వార్తను అనుగ్రహించారు.

శ్రీరామానుజుల గోష్ఠిలో ఒక పర్యాయం జీవాత్మకు అంతరంగనిరూపకంగా చెప్పతగినది ఏది? జ్ఞాతృత్వమా? లేక, శేషత్వమా? – అనే ప్రశ్న చర్చకు వచ్చింది. ఈ

విషయాన్నిగూర్చి తెలిసికొని రావలసినదిగా తిరుక్కోట్టియూర్ నమ్బి దగ్గరకు కూరేశులను శ్రీరామానుజులు పంపించారు. కూరేశులు నంబికి ఆఱు నెలల కాలం కైంకర్యం చేసి తిరిగి వచ్చారు. తిరిగి రాబోయే ముందు నమ్బివద్దకు అనుమతి తీసికొనే సమయంలో కూరేశుల ప్రశ్నకు బదులిస్తూ నమ్బి" కూరేశా! నమ్మాళ్వార్లు **"అడియేనుళ్ళాన్"**-అని పల్కిన సూక్తిని గమనించావా!" అని అన్నారు. (నంబి ఈ విధంగా ఇచ్చిన సమాధానం తిరువిరుత్తం 85వ పాశురానికి పెరియవాచ్చాన్ పిళ్ళై అనుగ్రహించిన వ్యాఖ్యలో, తిరువాయ్మొళి 8-8-2-వ పాశురానికి ఈడు వ్యాఖ్యలో కూడా ప్రస్తావింపబడింది) తిరుక్కోట్టియూర్‌నమ్బి సూక్తిని వినిన కూరేశులు "కృతార్థుణ్ణి అయ్యాను" అని పల్కి శ్రీరామానుజులవద్దకు వెళ్ళి పోయారు.

ముదలియాణ్డాన్ ఆఱునెలల పాటు నమ్బికి సేవ చేసి, చివరలో వారివల్ల ఉపదేశాన్ని పొందిన సంగతి ఆఱువేలపడి గురుపరంపరా ప్రభావంలో కూడా ఉన్నది.

17. ("ఇన్నముదు మూట్టుకేన్) - (పెరుమాళ్ తిరుమొళి - తనియన్) పిళ్ళైలోకమ్ జీయర్ వ్యాఖ్య

"అర్థిత్తపత్తర్ అభిమానత్తిలే"... ఒదుఙ్గి పోరుకిఱ ఆళ్వాన్ పోల్‌వారై యాయ్‌త్తు "ఇన్నముత మూట్టుకేన్ ఇఙ్గే వా పైఙ్గిళియే" ఎన్గిరాఱుకపుమామ్. కిళియుమ్ "కఱ్ఱిత్తతే శొల్లుమ్. ఇవరుమ్ "కఱ్ఱియా వైత్త మార్థిత్త"మితే శొల్లువతు. మేల్ శొల్లుమ వరన్తే. శొన్నతై శొల్లుమవరితే. ఆకైయాల్, కూరత్తాళ్వాన్ పోల్వారైక్కొణ్డు కులశేఖరాళ్వార్ వైభవతై క్కూఱుకిఱార్ "ఇన్నముత మూట్టుకేన్ "కూఱు" ఎన్ఱు.

సందర్భం:- భగవద్రామానుజులు కులశేఖరపెరుమాళ్ అనుగ్రహించిన పెరుమాళ్ తిరుమొళి ప్రబంధానికి తనియన్ పాశురాన్ని అనుగ్రహిస్తూ **"ఇన్నముత మూట్టుకేన్"** అని చేసిన ప్రయోగంలోని అంతర్యాన్ని వ్యాఖ్యాత శ్రీపిళ్ళైలోకం జీయర్ వివరించే ఘట్టం ఇది.

వివరణం :- ఈ సందర్భంలో శ్రీ రామానుజులు **"పైఙ్గిళియే"** అని చేసిన సంబోధన కూరేశుల వంటివారిని ఉద్దేశించి. కులశేఖరుల వైభవాన్ని స్తుతిద్దాం రమ్మని అంటూ శ్రీరామానుజులు వారిని ఆహ్వానిస్తున్నారు. చిలుక నేర్పించిన మాటలనే తప్పకుండా పలుకుతుంది. కూరేశులు కూడా తమ కృతులలో శ్రీరామానుజులు తమకు ఉపదేశించిన విషయాలనే పలికారు. అందువల్ల కూరేశులు పెంపుడు చిలకవంటి వారు. కాబట్టి ఈ ప్రయోగం సాభిప్రాయకం.

"ఇన్ అముదు" - అనే ప్రయోగ స్వారస్యాన్ని బట్టి **"ఇన్"** - అనే విశేషణం ద్వారా పెరుమాళ్ తిరుమొళి ప్రబంధానికి దేవతల అమృతంకంటే గల వైలక్షణ్యం భాసిస్తుంది. దేవతల అమృతం కేవలం రూపాన్ని మత్రమే కాపాడుతుంది. ఈ ప్రబంధం అయితే స్వరూపాన్ని కూడా కాపాడుతుంది అనే ఆధిక్యం భావ్యం.

18. తిరుమాలై 7వ పాశురం - పెరియవాచ్చాన్ పిళ్ళై వ్యాఖ్య.

"కలైయఱ క్కర్థిత్త మాన్దర్" శ్రుతిస్మృతీతిహాసజ్ఞలిల్ నిలైనిన్ఱవర్‌కళాయ్, వేదతాత్పర్యమ్ కైప్పట్టవర్‌కళ్. అవర్‌కళ్ ఆకిఱార్- కూరత్తాళ్వాన్‌పోల్ వారితే. (కాణ్బరో కేట్పరోతాన్!) ఆళ్వాన్ "ఇష్టసిద్ధి" వాశిక్కిఱవర్‌కళోడే యిరున్దు తాళ్త్తువర ఆళ్వానుక్కు చ్చొన్న వారైయై అనుసన్ధిప్పతు.

సందర్భం:- **"పులై యఱ మాకి నిన్ఱ పుత్తొడు శమణమ్ ఎల్లామ్ కలై యఱ క్కర్థిత్త మాన్దర్ కాణ్బరో? కేట్పరో తామ్"** (వేదబాహ్యాలైన బౌద్ధ, జైనాదిమతాలను వేదాలలో పారంగతులైన వారు మనస్సులో అయినా తలపరు. చెవులతో వినరు) అనే తొణ్డరడిప్పొడి ఆళ్వార్ల సూక్తిని వివరిస్తూ వ్యాఖ్యాత ఈ క్రింది ఐతిహ్యాన్ని ప్రస్తావించారు.

వివరణం :- కూరేశులు చిన్న వయస్సులో ఉండేటపుడు ఒక పర్యాయం ఒక చోట ఎవరో ఒకరు **"ఇష్టసిద్ధి"** అనే సాంఖ్య మతగ్రంథాన్ని వివరిస్తూ ఉండడాన్ని చూచి, అక్కడనే కొంచెంసేపు నిలచిపోయారు. తరువాత కొంచెంసేపయిన తర్వాత ఇంటికి తిరిగి వచ్చారు. ఆలస్యంగా ఇంటికి వచ్చిన కూరేశులను తండ్రి వారి ఆలస్యానికి కారణం అడుగగా, కూరేశులు జరిగి సంగతిని చెప్పారు. అపుడు తండ్రిగారు పై తొణ్డరడిప్పొడి ఆళ్వార్ల సూక్తిని పల్కి, ఆళ్వార్లను తిరిగి స్నానం చేసి రమ్మని పల్కి, శ్రీపాదతీర్థాన్ని ఇచ్చి పరిశుద్ధులను చేసిన తరువాతనే ఇంటి లోపలకు రానిచ్చారు.

19. తిరుమాలై - 41వ పాశురం - పెరియవాచ్చాన్ పిళ్ళై వ్యాఖ్య

(ఏలుమ్) - సర్వాస్థితిలే అకప్పట్ట మండూకత్తినుడైయ ఆర్తియై క్కేట్టు, "ఇతు ఆర్ అఱిన్దు విడువిక్కక్కూప్పిడు కిఱతు?" ఎన్ఱు ఆళ్వాన్ మోహిత్తాన్.

సందర్భం :- ఇతరుల ద్వారా క్రూరకర్మలను చేసేవారైనా, భగవన్నామాలను చెప్పే వారైతే, వారు చాలా ఉన్నతులు" - అని తొణ్డరడిప్పొడి ఆళ్వార్లు పల్కిన సూక్తిని వివరించే సందర్భం ఇది. దీనిని వివరిస్తూ వ్యాఖ్యాత, భగవన్నామాలను చెప్పేవారు క్రూరమైన పనులను చేయడమన్నది సంభవించదు. కనుక వారు పూర్వం ఉన్న స్థితిని గూర్చియే ఇక్కడ ఆళ్వార్లు ప్రస్తావించారు - అని అన్నారు. ఆ రీతిలో యథార్థజ్ఞానం కల్గితే వారు ఇతరులకు దుఃఖాన్ని తమ పనుల ద్వారా కల్గించరు - అన్నది మాత్రమే కాదు; ఇతరుల దుఃఖాన్ని చూచి, మోహాన్ని పొందుతారు కూడా- అని వ్యాఖ్యాత అంటూ, ఆ విధంగా పరుల కష్టాలను చూచి మోహాన్ని పొందిన కూరేశులను గూర్చిన ఐతిహ్యాన్ని ఈ క్రిందివిధంగా తెలిపారు.

వివరణం:- ఒకసారి ఒక కప్పను పాము పట్టుకొన్నపుడు, ఆ కప్ప ప్రాణభీతితో అరిచింది. ఆ దారిలో ప్రయాణం చేస్తున్న కూరేశులు అ కప్ప అరుపులను విన్నారు. సహజంగా మృదుహృదయులు కావడంచేత, కూరేశులు క్షోభిల్లి - "ఈ కప్ప తనను

ఈ పాము నోటి నుండి ఎవరు విడిపింపబోతారనే ఉద్దేశ్యంతో ఈ రీతిలో అఱుస్తున్నది! అయ్యో!" అని అంటూ మోహాన్ని పొందారు. ఈ ఐతిహ్యమే తిరువాయ్‌మొళి (4-9) దశకప్రవేశంలో ఉట్టంకింపబడడాన్ని గమనించవచ్చు.

20. తిరుమాలై - 43వ పాశురం - పెరియవాచ్చాన్ పిళ్ళై వ్యాఖ్య.

(తామ్ పులైయర్) పిళ్ళైపిళ్ళై ఆళ్వానుక్కు ఆత్మహితమ్ శొన్న సమనంతరత్తిలే ఆళ్వాన్ పణిత్త వారైయై స్మరిప్పతు.

సందర్భం:- ఉన్నతమైన బ్రాహ్మణకులంలో పుట్టినవారైనా, వారు భగవానుని పట్ల భక్తిని కల దాసులను ఎవరినైనా వారి అధమజన్మ కారణంగా నిందిస్తే, ఆ బ్రాహ్మణులు **"పులైయర్"** (ఛండాలురు)తో సమానులే - అనే తొణ్డరడిప్పొడి ఆళ్వార్ల సూక్తిని వివరించే సందర్భం ఇది. ఈ పాశురంలోని తాత్పర్యాన్ని దృష్టిలో పెట్టుకొని కూరేశులు తమ శిష్యులైన పిళ్ళై పిళ్ళై ఆళ్వాన్‌కు ఉపదేశంచేసిన సూక్తిని వ్యాఖ్యాత ఈ సందర్భంలో ఉట్టంకిస్తున్నారు.

వివరణం:- పిళ్ళై పిళ్ళై ఆళ్వాన్ అనే వారు కూరేశుల శిష్యులు. వీరు ఉన్నత వంశసంజాతులు. వీరు ఇతరులపట్ల ఏ మాత్రంకూడా ఆదరాభిమానాలు లేకుండా ప్రవర్తించేవారు. ఈ కారణంగా వీరు పలువురు భాగవతుల విషయంలో అపచారపడ్డారు. ఒక పుణ్యకాలంనాడు అందఱూ కావేరీనదిలో స్నానం చేసి, దానం చేసి వస్తున్న సమయం. కూరేశులు పిళ్ళై పిళ్ళై ఆళ్వాన్‌ను పిలిచి, "ఇకపై భగవద్భక్తులు అయిన ఎవరి విషయంలోను మనస్సు - వాక్కు - శరీరాలనే త్రికరణాలద్వారా అపచారపడను, అని నాకు మాటను దానం చేయండి" అని అడిగారు. వారు కూడా సరేనని దాన జలధారాపూర్వకంగా మాట ఇచ్చారు. అయినా, తరువాత ఒకనాడు పిళ్ళై పిళ్ళై ఆళ్వాన్ పూర్వంవలె మనస్సుద్వారా భాగవతాపచారం చేయడం తటస్థించింది. ఆళ్వాన్‌కు తాము మాట తప్పినందులకు చాలా నొచ్చుకొని బాధపడ్డారు. కూరేశులు వారిని చూచి "మనస్సుతో చేసిన అపచారానికి మనస్సుతో బాధపడడమే పరిహారం. రాజదండన లభిస్తుందనే భయంతో శరీరంతో ఎవరిపట్ల ఇక ఎవరి విషయంలోను మీరు అపచారపడరు లెండి. అందువల్ల వాక్కుతోమాత్రం ఎవరిపట్ల అపచారం చేయకుండా జాగ్రత్తపడండి చాలు" అని ఓదార్చారు. ఈ ఐతిహ్యం శ్రీవచనభూషణం 59వ సూత్రవ్యాఖ్యలో కూడా ఉదాహరింపబడింది. (పిళ్ళై పిళ్ళై ఆళ్వాన్‌కు సంబంధించిన పలు ఐతిహ్యాలు వ్యాఖ్యానాలలో కన్పిస్తాయి. ఉదాహరణకు తిరుప్పావై - 6వపాశురం మూవాయిరప్పడి వ్యాఖ్య, తిరుమాలై 37వ పాశుర వ్యాఖ్య - ఇత్యాదులు)

21. కణ్ణినుణ్ శిఱుత్తాంబు - 3వ పాశురం - పెరియవాచ్చాన్ పిళ్ళై వ్యాఖ్య.

"ఉడైయవర్ వెళ్ళై శాత్తి ఎళున్దరుళిన కాలత్తిలే తిరువడికళిల్ సంబన్ధముడైయారై "పెరుమాళై త్తిరువడి త్తొళవేణ్డా" ఎన్ను విలక్క, ఆళ్వాన్ "నీరారేనుక్కుమ్ విరోధియో? నీర్ పుక్కు త్తిరువడిత్తొళలాకాతో!" ఎన్న. "ఆత్మగుణమ్ మోక్షహేతు ఎన్నిరున్దోమ్. అతు బంధహేతువానపిన్బు ఎమ్పెరుమానార్ తిరువడికళిల్ సంబంధత్తై యఱుత్త కొళ్ళవో?" ఎన్ను మీణ్డుపోన్దార్.

సందర్భం:- ఇది **"తిరితన్దాకిలుమ్ దేవపిరానుడై క్కరియ కోల త్తిరువురు క్కాణ్బన్"** అనే మధురకవుల సూక్తిని వివరించే సందర్భం. ఆళ్వార్లకు అభిమతవిషయం కాబట్టే భగవానుని నేను ఆశ్రయిస్తున్నాని మధురకవులంటున్నారు - అని వివరించే వ్యాఖ్యాత, ఆత్మగుణాలకంటే ఆచార్యసంబంధమే గొప్పది - అనే దానికి కూరేశులకు సంబంధించిన ఒక ఐతిహ్యాన్ని ప్రస్తుతించారు.

వివరణం:- ఈ ఐతిహ్యమే తిరుప్పావై 15వ పాశురంలో ప్రస్తావింపబడింది. పునరుక్తి అవుతుంది కనుక మళ్ళీ ఇక్కడ వివరింపబడలేదు.

22. కణ్ణినుణ్ శిఱుత్తాంబు - 4వ పాశురం - నంజీయర్ వ్యాఖ్య.

("ననైయాల్ మిక్క నాన్మఱైయాళర్కళ్)- పరదుఃఖాసహిష్ణుక్కళాయ్, పరసమృద్ధ్యేక ప్రయోజనరాయ్ "పూర్వభాషీ ప్రసన్నాత్మా" ఎన్నుమ్, "విమలమతిః" ఎన్నుమ్ ఇత్యాదికళిల్ శొల్లుకిఱపడికళైయుముడైయ కూరత్తాళ్వానుమ్, ఆణ్డాళుమ్, పిరాట్టియుమ్ పోల్వార్.

సందర్భం :- **"నన్మైయాల్ మిక్క నాన్మఱైయాళర్కళ్ పున్మైయాక క్కరుదువర్"** అనే సూక్తిని వివరించే సందర్భం ఇది. తమకు చెడ్డను తలపెట్టేవారికికూడా మంచిని కోరేవారే **"నన్మైయాల్ మిక్క నాన్మఱైయాళర్కళ్"** అనబడతారు - అని వ్యాఖ్యాత వివరిస్తూ, ఇందుకు దృష్టాంతంగా కూరేశులను, ఆణ్డాళ్ (వీరు గోదాదేవి కాదు, కూరేశుల ధర్మపత్ని)ను, పిరాట్టిని (సీతాదేవి) తెలుపుతున్నారు.

వివరణం :- కూరేశులు, తాము నేత్రాలను కోల్పోవడానికి కారణభూతుడైన నాలూరాన్ (చోళరాజు మంత్రి) మంచిని పొందాలి అని కంచి వరదరాజస్వామిని ప్రార్థించారు. కూరేశుల ధర్మపత్ని అయిన ఆణ్డాళ్ తాము శ్రీరంగాన్ని విడచి బయటకు పోవడానికి కారణం అయిన అకలంక నాట్టాళ్వాన్ మరణం పొందినపుడు, అతడు తన పాపాలకు పరిహారం చేసికోకుండానే చనిపోయాడే- అని బాధపడ్డారు. సీతాదేవి తనను అశోకవనంలో పలు రీతుల్లో బాధించిన రాక్షసస్త్రీలను హనుమానుని బారినుండి రక్షించింది. ఈ విధంగా తమకు హానిని కల్గించినవారికికూడా మంచి కలగాలని కోరుకొనేవారే **"నన్మైయాల్ మిక్క నాన్మఱైయాళర్కళ్"** అని వ్యాఖ్యాతహృదయం.

23. కణ్ణినుణ్ శిఱుత్తాంబు - 11వ పాశురం - పెరియవాచ్చాన్ పిళ్ళై వ్యాఖ్య.

"కూరత్తాళ్వాన్ మకన్ పిఱన్ద పిన్బు సంసారముమ్, పరమపదముమ్ ఇడచ్చువరై త్తళ్ళి యొరుపోకియాయ్ నీర్ నుక్కాణ్! ఎన్ట పెరినీర్ పణిత్తార్" ఎన్ట పిళ్ళై అరుళిచ్చెయ్‌వర్.

సందర్భం:– మధురకవులు తాము అనుగ్రహించిన దివ్యప్రబంధం కణ్ణినుణ్ శిఱుత్తాంబును అభ్యసించేవారికి కలిగే ఫలాన్ని తెలిపే పాశురం ఇది. మధురకవి అని **"శొన్నశొల్ నమ్బువార్ పది వైకున్దమ్ కాణ్మినే"** (మధురకవులు పల్కిన మాటను నమ్మేవారు ఉండే చోటు వైకుంఠమేసుమా)– అని మధురకవులు అంటున్నారని వ్యాఖ్యాత తెలుపుతూ నమ్బితిరువళ్ళూదివళనాడు దాసర్, పెణ్ణ్ణి అనే వారు పల్కిన సూక్తులను ఉట్టంకించారు.

వివరణం:– నమ్బితిరువళ్ళూదివళనాడు దాసర్ అనే మహనీయులు (వీరు భట్టర్ సమకాలికులు) **" 'నమ్బువార్ పది వైకున్దమ్'** అనే సూక్తినిబట్టి కణ్ణినుణ్‌శిఱుత్తాంబును అభ్యసించేవారు ఏ ఊరిలో ఉంటారో ఆ ఊరే పరమపదం అవుతుంది" అని అనేవారట. ఈ లోకమే పరమపదం ఏ విధంగా అవుతుంది? అనే ప్రశ్నకు పెణ్ణ్ణి (ఈమె నఞ్జీయర్ శిష్యురాలు) పల్కిన ఈ క్రింది సూక్తిని సమాధానంగా వ్యాఖ్యాత తెలిపారు. "కూరేశులు పుత్రులైన భట్టర్ పుట్టిన తర్వాత పరమపదాన్ని, ఈ లోకాన్ని విభాగం చేసే అడ్డుగోడ కూలగొట్టబడి, రెండు లోకాలు ఒకటిగా అయినందువల్ల, పరమపదం వేఱు, భూలోకం వేఱు అనే భేదం లేదు" అని పెణ్ణ్ణి పల్కినట్లు నమ్బిళ్ళై పలికేవారట. దీనిని వ్యాఖ్యాత ఇక్కడ ఉట్టంకించారు.

ఈ సూక్తి నంజీయర్ వ్యాఖ్యలోను, నమ్బిళ్ళైవ్యాఖ్యలో కూడా కన్పిస్తున్నది. అయితే దీనిని పెణ్ణ్ణి చెప్పినట్లుగా కాక, తిరువళ్ళూదివళనాడు దాసర్ పల్కినట్లుగానే ఆ వ్యాఖ్యలలో కన్పిస్తున్నది. ఈ వాక్యం ఎవరు చెప్పినది అయినా, ఈ సూక్తి భట్టర్ వైభవాన్ని తెలుపుతున్నది. పరంపరయా వారికి తండ్రి అయిన కూరేశుల గొప్పతనాన్ని కూడా సూచిస్తున్నదనే భావంతోనే ఇక్కడ ఉదాహరింపబడింది.

24. పెరియ తిరుమొళి -3-8-1- పెరియవాచ్చాన్‌పిళ్ళై వ్యాఖ్య.

విభుత్వత్తాలుమ్, మణ్ణ్ణుముణ్డాన గుణవిభూత్యాదికళాలుమ్ అపరిచ్ఛేద్య నానవనే! "సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ" ఎన్గిఱార్ కాణ్ – ఎన్ఱ ఆళ్వాన్ పణిక్కుమ్.

సందర్భం:– తిరుమఙ్గై ఆళ్వార్ **"నన్దా విళక్కే అళత్తుక్కిరియాయ్"** (ఏ నాడూ ఆరని దీపమా! పరిచ్ఛేదించడానికి సాధ్యం కానివాడా!) అని భగవానుని సంబోధిస్తూ పల్కిన సూక్తిని వ్యాఖ్యాత వివరిస్తూ, ఈ సూక్తినిగూర్చి కూరేశులు పల్కిన ఒక నిర్వాహోన్ని ప్రస్తావిస్తున్నారు.

వివరణం:– **"నన్దా విళక్కే"** – అంటే ఏనాడూ ఆరిపోని దీపమా! అని అర్థం. తమిళంలో **"నన్దుతల్"** అంటే – దీపం ఆరిపోవడం. తేజస్సుతో ప్రకాశించే వస్తువు దీపం. అదే రీతిలో భగవానుడుకూడా నిత్యంగా ఎల్లప్పుడు ఉండేవాడై, స్వయంప్రకాశం అయిన జ్ఞానాన్ని గుణంగాను, స్వరూపంగాను కలవాడై ఉండేవాడు. అందువల్ల అతడు **"నన్దా విళక్కు"** అనబడుతున్నాడు. **"అళత్తుక్కు అరియాయ్"** – ఇంతటివాడు,

ఇటువంటివాడని పరిచ్ఛేదించి చెప్పడానికి సాధ్యం – కానివాడా! అని భావం. **"సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ"** అనే ఉపనిషద్వాక్యాన్నే ఆళ్వార్లు ఈ సూక్తి ద్వారా తెలియజేశారని కూరేశుల సూక్తి. **"సత్యమ్"** అనే పదం ఎల్లప్పుడూ పరమాత్మ ఉండేవాడని తెలుపుతున్నది. ఇది ఇక్కడ **"నన్దా"** అనే విశేషణంద్వారా తెలుపబడింది. **"జ్ఞానమ్"** అనే పదం స్వయంప్రకాశకం అయిన జ్ఞానాన్ని గుణంగా, స్వరూపంగా కలవాడు – అనే విషయాన్ని తెలుపుతున్నది. అది ఇక్కడ **"విళక్కు"** అనే పదంద్వారా తెలుపబడింది **"అనంతమ్"** అనే పదం పరమాత్మ పరిచ్ఛేదాతీతుడు అనే అర్థాన్ని చెబుతున్నది. అది ఇక్కడ **"అళత్తుక్కిరియాయ్"** అనే పదంద్వారా తెలుపబడింది. అందువల్ల ఈ దివ్యసూరి సూక్తి **"సత్యం జ్ఞాన మనంతమ్ బ్రహ్మ"** అనే ఉపనిషద్వాక్యార్థాన్ని అనువదిస్తున్నదని కూరేశుల హృదయం. ఇటువంటి ఉభయవేదాంతైకకంఠ్యాన్ని తెలిపే దివ్యప్రబంధసూక్తులు ఎన్నో ఉన్నవనే విషయం పూర్వాచార్యవ్యాఖ్యలలో అడుగడుగునా గోచరిస్తాయి. **"సత్యమ్"– స్వరూపతో గుణత స్సదైకరూపమ్ ఎన్నాయ్, 'నన్దా' ఎన్నతిన్ అర్థమ్. "జ్ఞానమ్"– స్వయంప్రకాశమ్. ఇతువుమ్, స్వరూపతో గుణతః స్వయంప్రకాశమ్ ఎన్నాయ్, 'విళక్కు' ఎన్న పదార్థమ్. "అనన్తమ్" ఎన్నత్తాలుమ్, స్వరూపతో గుణతో రూపాదితశ్చ పరిచ్ఛేదరాహిత్యమాయ్, 'అళత్తుక్కిరి యాయ్' ఎన్నతిన్ అర్థమ్–** అని అరుంబద సూక్తి.

25. పెరియ తిరుమొళి -6-7-4- పెరియవాచ్చాన్ పిళ్ళై వ్యాఖ్య.

(ఆప్పుణ్డు) వంగిప్పురత్తునమ్బి పలకాలుమ్ తిరువారాధనక్రమమ్ అరుళిచ్చెయ్య వేణుమ్ ఎన్ఱు పోరుమాయ్, అవసరహానియాలే అరుళిచ్చెయ్యాతే పోన్దారాయ్, తిరుమలైయిలే ఎழున్దరుళి యిరుక్కచ్చెయ్తే. ఆళ్వానుక్కుమ్, నంబి శ్రీహనుమ ద్దాసర్‌క్కుమ్ అతుతన్నై అరుళిచ్చెయ్తారాయ్, చ్చుమైకిఱవళవిలే నంబి తోణ్ణ తిరువుళ్ళమ్ తుణుక్కెన్ఱఞ్జి అప్పోతు అరుళిచ్చెయ్త వార్తై. "ఎన్ఱుముళ్ళ ఇస్సమయమ్ తీరప్పెణ్ణ్ణోమాకిఱతు. నియామకన్ నియామ్యఞ్గళిలే శిలర్‌క్కు అఞ్జిక్కట్టుణ్డు, అడియుణ్డు అழుతు నిన్నాన్ ఎన్ఱిరున్దాల్, "ఇతుకూడుమో?" ఎన్ఱిరున్దోమ్. ఇరణ్డు. ఇழవుక్కుమ్ నమ్ముడైయ హృదయమ్ అఞ్జి నొన్దపడియాల్ అతువుమ్ కూడుమ్" – ఎన్ఱు.

సందర్భం:– శ్రీకృష్ణుడు వెన్నను దొంగిలించి పట్టుబడి రోటికి కట్టుబడి వెక్కుతూ ఏడ్చి నిలచిన సన్నివేశాన్ని **"ఒళియా వెణ్ణె యుణ్డానెన్ఱు ఉరలోడు ఆయ్చ్చి ఒణ్ కయిణ్ణాల్ విళియా ఆర్‌క్క ఆప్పుణ్డ విమ్మి అழుదాన్"** అని ఆళ్వార్లు పలికారు. పరమాత్మ అయిన శ్రీకృష్ణుడు ఈ విధంగా ఇతరుల చేతిలో చిక్కి ఏడ్చి ఉంటాడా! అనే ప్రశ్నకు బదులుగా వ్యాఖ్యాత ఈ క్రింది ఐతిహ్యాన్ని ఉదాహరించారు.

వివరణం:– భగవద్రామానుజుల శిష్యులలో ఒకరైన వఙ్గిపురత్తు నమ్బి అనేవారు తమకు భగవదారాధనక్రమాన్నిగూర్చి ఉపదేశించవలసినదిగా పలుమార్లు భగవద్రామానుజులను ప్రార్థించారు. అయినా, సందర్భం కుదరనందున వారి కోరిక

ఫలించలేదు. ఇట్లా ఉండగా, ఒకానొక సమయాన శ్రీరామానుజులు తిరుమలలో వేంచేసి ఉన్నపుడు కూరేశులకు, హనుమద్దాసర్‌కు తిరువారాధనం చేసే క్రమాన్నిగూర్చి ఉపదేశించవలసిన అవసరం ఏర్పడింది. ఆ క్రమాన్ని ఉపదేశించి ముగించే సమయంలో శ్రీరామానుజులు వఙ్గి పురత్తు నమ్బి అక్కడకు రాగా "వఙ్గి పురత్తునమ్బి నన్ను అడిగినా, నేను వారికి తిరువారాధన క్రమాన్ని చెప్పలేకపోయానే! అంతేకాక, ఇపుడైనా, వీరిద్దరికీ ఉపదేశించేటపుడు అయినా, వీరిని పిలిచి ఉండి ఉండవచ్చు. ఆ పని కూడా చేయలేకపోయాను. ఎంతటి తప్పును చేశాను! ఈ విధంగా రెండు మార్లు తప్పుచేసినవాడను అయ్యానే! అయ్యో!" అని మనస్సులో చాలా బాధపడి, వఙ్గిపురత్తు నమ్బిని చూచి – "నాకు చాలా దినాలుగా మనస్సులో ఉన్న సందేహం ఒకటి తీరిపోయింది. భగవానుడుసైతం (యశోదవంటి) ఇతరులకు భయపడి, కట్టుబడి, కొట్టబడి, ఏడ్చి, వెక్కిళ్ళు పెట్టాడు – అని ఆళ్వార్ అంటున్నారే! అందఱినీ శాసించేవాడైన పరమాత్మ కొందఱి పట్ల భయపడ్డాడు – అని అంటే ఇది సంభవమా! అనే సందేహం ఈ నాటివరకు నా మనస్సులో ఉండేది. ఇపుడు నేను మిమ్ములను చూచి భయపడ్డానంటే, భగవానుడు అపుడు ఆ విధంగా భయపడడం సంభవమే! అని తోచి, నా మనస్సులో ఇంతకాలంగా ఉన్న సందేహం తీరిపోయిందిసుమా!" అని అన్నారట.

ఈ ఐతిహ్యం కూరేశులు గొప్పతనాన్ని నేరుగా చెప్పకపోయినా, కూరేశులకు తిరువారాధన క్రమాన్ని భగవద్రామానుజులు తిరుమలలో ఉపదేశించారనే విశేషం దీనివల్ల వ్యక్తమవుతున్నందున ఇక్కడ ప్రస్తావింపబడింది. దీనినిబట్టి శ్రీరామానుజులు నిత్యగ్రంథాన్ని తిరుమలలో అనుగ్రహించి ఉంటారని ఏర్పడుతున్నది.

ఈ ఐతిహ్యంలో భగవద్రామానుజుల పేరు ప్రస్తావింపబడక పోవడానికి కారణం **"గురో ర్నామ న కీర్తయేత్"** అనే నియమాన్నిబట్టి.

26. పెరియ తిరు-6-9- ప్రవేశం – పెరియవాచ్చాన్ పిళ్ళైవ్యాఖ్య :

"సకృదేవ" ఎన్నెక్కు "సహసైవ" ఎన్ఱు ఆళ్వాన్ నిర్వహిప్పతొరు పొరుళుణ్డిఱే.

సందర్భం : "పెఱై యడర్త్త" అని ఆరంభం అవుతున్న ఈ దశకంలో తిరుమఙ్గైయాళ్వార్ తమ మనస్సును ఉద్దేశించి "భగవానుని శ్రీచరణాలనే శరణంగా ఆశ్రయించు" అని ఉద్బోధించారు. దీనికి ముందుకూడా **"వానిలా ముఱువల్"**(1-6), **"తాయే తన్నై"** (1-9), **"ఏళ్ళై ఏతలన్"** (5-8) అని ప్రారంభమయే దశకాలలో ఆళ్వార్లు పలుమార్లు శరణాగతి చేసినందువల్ల ఇపుడు శరణాగతిని ఎందుకోసం మళ్ళీ ఇంకొక మాఱు చేస్తున్నారు? **"సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే, అభయం సర్వభూతేభ్యో దదామ్యేతద్వ్రతం మమ"** (నేను నిన్ను శరణాగతి చేశానని ఒక్కమారు యాచించిన సకల ప్రాణులకు నేను అభయాన్ని ఇస్తాను. ఇది నావ్రతం) అని భగవానుడే పల్కినపుడు

ఒక పర్యాయంకంటే ఎక్కువమార్లు శరణాగతి చేయవచ్చునా? అనే ప్రశ్న కల్గుతున్నది. దీనికి సమాధానంగా కూరత్తాళ్వాన్‌యొక్క నిర్వాహం ఇక్కడ ప్రస్తావింపబడుతున్నది.

వివరణం : "సకృదేవ" అనే పదానికి 'ఒక పర్యాయం' అని అర్థాన్ని చెప్పడం పరిపాటి. అయితే, కూరత్తాళ్వాన్ **"సకృదేవ"** అనే పదానికి **"సహసైవ"** (వెంటనే) అనే అర్థాన్ని చెప్పవచ్చు– అని ఇంకొక నిర్వాహాన్ని చెప్పారు. అంటే – ఎపుడు శరణాగతిని చేయాలని అనిపిస్తుందో అపుడే ఆలసించకుండా శరణాగతిని చేసేవానిని – అనే అర్థాన్ని గ్రహించవచ్చునని కూరేశుల నిర్వాహం. ఈ నిర్వాహాన్ని తనిశ్లోకవ్యాఖ్యానంలో, స్తోత్రరత్నవ్యాఖ్యానంలోను, పరన్దరహస్యమనే గ్రంథంలోను పెరియవాచ్చాన్‌పిళ్ళై ఉట్టంకించారు.

తిరుమఙ్గైయాళ్వార్ పలుమార్లు పలు సందర్భాలలో ప్రపత్తి చేసినట్లు కన్పడుతున్నది. (**"సకృదేవ హి శాస్త్రార్థః"** అనే శాస్త్రనియమాన్నిబట్టి చూస్తే) ఈవిధంగా పలుమార్లు ప్రపత్తి చేయడం **'సకృదేవ'** అనే భగవద్వాక్యానికి విరుద్ధం కదా! అనే ప్రశ్నకు సమాధానిస్తూ కూరేశులు పల్కిన సూక్తి ఇది. **"విళంబనిషేధపరమా మిత్తనై యొళ్ళియ ఇవ్వధికారిక్కు ఆవృత్తినిషేధ మన్ఱు ఎన్ఱుమ్; ఆవృత్తినిషేధ పరమ్, ఆనాలుమ్ భక్తిక్కు వేణ్డినాప్పోలే అనేక జన్మవృత్తి వేణ్డామై ఆకలామ్ ఎన్ఱుమ్ పరిహరిత్త పుదైకళుణ్డు"** అని అరుంబద వివరణం. ఇందులో మొదటి సమాధానాన్ని కూరేశులు అనుగ్రహించగా, రెండవ సమాధానాన్ని ఎమ్బార్ అనుగ్రహించారు. ఈ వివరణం తనిశ్లోకి స్తోత్రరత్న వ్యాఖ్యలలో, పరందరహస్యంలో కూడా ఉన్నది.

27. పెరియతిరుమొళి -7-5-2- పెరియవాచ్చాన్ పిళ్ళై వ్యాఖ్య.

(తేరిల్ పాలకనాయ్ ఊర్న్ద) ఆళ్వానుక్కు మూలమ్ వాశిత్తు ప్పోన్దార్ శిలరిలే. ఒరువర్‌క్కు గ్రంథమ్ పార్క్కవేణ్డి ఆళ్వానోడే తిరుముడిక్కుత్తైయిలే యిరున్దు పారా నిఱ్ఱచ్చెయ్‌తే అరైయన్ వన్దానాయ్, అవ్వళవిలే అవర్ కైయిల్ గ్రంథత్తై ఆళ్వాన్ తాన్ వాఙ్గి ప్పిడిత్తు క్కొణ్డిరున్దానామ్.

సందర్భం:- పారిత్తు ఎళున్ద పడైమన్నర్‌తమ్మై మాళ ప్పారతత్తు త్తేరిల్ పాకనాయ్ ఊర్న్ద తేవతేవన్" (విజయాన్ని పొందాలని ఆశపడి వచ్చిన రాజులు నశించేటట్లుగా భారత సంగ్రామంలో పార్థునకు సారథిగా ఉండి రథాన్ని నడపిన దేవదేవుడు) అని భగవానునిగూర్చి తిరుమఙ్గై యాళ్వార్లు అనుగ్రహించారు. ఈ రీతిలో భగవానుడు తనను తక్కువ చేసికొని, అర్జునునకు సారథిగా ఉండడానికి ఉదాహరణంగా వ్యాఖ్యాత ఒక ఐతిహ్యాన్ని ఈ క్రింది రీతిలో ఉదాహరించారు.

వివరణం :- కూరేశులు గ్రంథకాలక్షేపాన్ని అనుగ్రహించేసే సమయంలో మూలగ్రంథాన్ని పఠిస్తూ ఉండేవారికి ఒకరికి, ఒక గ్రంథానికి వివరణం కూరేశులవల్ల

వినాలనే కూతూహలం కల్గింది. కాని, వారు తమను తాము గొప్పగా భావించేవారు కావడంవల్ల, తాము కూరేశులవద్ద అధ్యయం చేయడం ఎవరికీ తెలియకూడదు – అని తలచారు. ఈ విషయాన్ని పసిగట్టిన కూరేశులు, ఆ ఆచార్యుల అభిప్రాయానికి అనుగుణంగానే, ఎవరికీ తెలియకుండా వారికి కాలక్షేపాన్ని అనుగ్రహించడానికి అంగీకరించారు. శ్రీరంగంలో ఉభయకావేరుల నడుమన గల ఒకచోట గ్రంథకాలక్షేపాన్ని కూరేశులు వారికి అనుగ్రహిస్తూ వచ్చారు. ఈ విధంగా కొన్ని దినాలు జరిగిన తరువాత ఒకనాడు యాదృచ్ఛికంగా అక్కడకు ప్రభువు వచ్చాడు. కూరేశులు వెంటనే ఆ ఆచార్యుల చేతిలోని గ్రంథాన్ని తమ చేతులలోకి తీసికొని, చదవడం ప్రారంభించి, తాము వారివద్ద అధ్యయనం చేస్తున్నట్లుగా ఇతరులు భావించే రీతిలో సన్నివేశాన్ని కల్పించారు. అంటే, తమను శిష్యునిగా, ఆ ఆచార్యులను ఉపాధ్యాయులుగా చూచేవారు భావించే రీతిలో చేశారు. కూరేశులు వద్ద ఈ విధంగా తాము గ్రంథాధ్యయనం చేస్తున్న విషయం ఎవరికీ తెలియకూడదనే ఆ ఆచార్యుల అభిప్రాయం వ్యర్థం కాని రీతిలో కూరేశులు తామే వారివద్ద అభ్యసిస్తున్నట్లుగా అన్యులు భావించేటట్లు చేసికొన్నారు. శ్రీకృష్ణుడు పార్థునకు సారథియై తనను తక్కువ చేసికొని రథంలో నిలచినట్లే, కూరేశులుకూడా తమను తక్కువగా చేసికొన్నందున వారి సౌలభ్యగుణం ఇక్కడ ప్రకటితమైనది.

తన విజయాన్ని ఇతరులపై ఆరోపించిన సందర్భానికి ఉదాహరణగా ఈ ఐతిహ్యం ప్రస్తావింపబడిందని అరుంబదవివరణం.

28. పెరియతిరుమొళి -8-1- ప్రవేశం – పెరియవాచ్చాన్ పిళ్ళై వ్యాఖ్య.

రాజేంద్రశోళనిలే ఒరు బ్రాహ్మణన్‌మకన్ బుద్ధరోడే సంప్రదాయముణ్డాయ్, పూణ్ నూలైయుమ్, కుడిమైయైయుమ్ అఱత్తుప్పొకట్టాన్. కూరత్తాళ్వాన్ అజ్ఞై నడన్దవళవిలే శిఖాయజ్ఞోపవీతజ్ఞళై ధరిత్తుక్కొణ్డు వన్దు పుకున్దాన్. పితావానవన్ "కూరత్తాళ్వానై సన్దిత్తాయో?" ఎన్ఱు కేట్టాన్. "పుఱప్పుళ్ళార్ నీ ఇతఱిన్దపడి ఎజ్గనే?" ఎన్ఱు కేట్క ఆళ్వాన్ సన్నిధియిల్ తమోభిభూతరుమ్ సత్వస్థరావర్‌కళ్ కాణ్" ఎన్దాన్.

సందర్భం :- భగవానునితో కలసి ఉండి, కైంకర్యాన్ని చేసి ఆనందించాలనే తమ ఆశ వెంటనే కార్యరూపం దాల్చనందున తిరుమఙ్గై యాళ్వార్లు తమకు జన్మతః సిద్ధించిన పురుషభావనను వీడి, నాయికా భావాన్ని పొంది, భగవానుని ఉద్దేశించి పలవరించారు. దీనిని చూచిన ఆ నాయిక తల్లి ఈమె ఈ విధంగా పలవరించడంవల్ల ఈమె తిరుక్కణ్ణ పురంలోని భగవానుని దర్శించి ఉంటుందని తోస్తున్నది – అని తలుస్తున్న పద్ధతిలో **"శిలై యిలఙ్గు పొన్నాళి"** అనే దశకం అనుగ్రహింపబడింది. ఈ విధంగా తల్లి నాయికస్థితినిగూర్చి కారణాన్ని ఊహించడానికి ఉదాహరణంగా వ్యాఖ్యాత ఒక ఐతిహ్యాన్ని ఈ క్రింది రీతిలో తెలిపారు.

వివరణం:- రాజేంద్రచోళపురంలో నివసించే ఒక బ్రాహ్మణుని కుమారునకు బౌద్ధమతానికి చెందినవారితో స్నేహం ఏర్పడింది. అందువల్ల అతడు బౌద్ధులవలెనే కేశాలను తీయించుకొని, గుండు చేయించుకొని, యజ్ఞోపవీతాన్ని తీసివేశాడు. తర్వాత ఒక సమయంలో కూరేశులు ఆ ఊరికి వచ్చినపుడు వారి కటాక్షం ఈ బ్రాహ్మణకుమారునిపై పడింది. తత్ప్రభావంగా అతని మనస్సు మాఱింది. మళ్ళీ యజ్ఞోపవీతాన్ని ధరించి, కేశాలను పెంచుకొని అతడు పూర్వావైదికరూపాన్ని పొందాడు. అపుడు ఆవిధంగా అతనిని చూచిన తండ్రి- "ఏమి? మళ్ళీ ఈ విధంగా మార్పు! ఒక వేళ నీవు కూరేశులను సేవించావా! ఏమి?" అని అడిగాడు. అక్కడ ఉన్నవారు "నీ కుమారుడు కూరేశులను సేవించినందువల్లనే మనస్సులో మార్పును పొందాడు – అనే సంగతిని నీవు ఏ విధంగా గుర్తించావు?" అని అడిగారు. అతడు "ఎటువంటి దుర్మార్గులపై అయినా కూరేశుల కటాక్షంపడితే వారి మనస్సు మాఱి మంచివారు తప్పక గలరు సుమా!" అని బదులిచ్చాడు.

ఈ ఐతిహ్యంవల్ల కూరేశుల కటాక్షమహిమ ఎంతటిదో తెలుస్తున్నది. అత్యంత సుందరమైన కూరేశుల వైదికవేషాన్ని చూచిన బ్రాహ్మణకుమారుని మనస్సు ఆకర్షింపబడినట్లే, తిరుక్కణ్ణపురంలోని అర్చామూర్తి సౌందర్యానికి పరకాలనాయిక మనస్సు ఆకర్షింపబడిందని ప్రకృతంలో అన్వయం.

29. తిరువిరుత్తం – 33వ పాశురం – నమ్బిళ్ళై ఈడు వ్యాఖ్య.

"భట్టర్ వివాహప్రాప్తరాననసమయత్తిలే ఆణ్డాళ్ ఆళ్వానుక్కు "పిళ్ళైకళ్ వివాహ ప్రాప్తరాయిరుక్క ఇతుక్కొన్ఱు విచారియాతే యిరుక్కిఱతెన్?" ఎన్న "భగవత్కుటుమ్బత్తుక్కు ఎన్నై క్కురైయు చ్చొల్లుకిఱాయో? వేణుమాకిల్ కోయిలిలే పెరుమాళ్ పాడే వరక్కాట్టుకిఱాయ్' ఎన్న, పిన్‌నైనాళ్ ఆళ్వాన్ వాశియఱ నిఱ్ఱచ్చెయ్‌తే, ఇవర్‌కళై ప్పోకవిట్టాళ్. పెరుమాళ్ ఆళ్వానై ప్పార్‌త్తు "ఒన్ను శొల్లువాయ్‌పోలే ఇరున్దాయా" ఎన్న "ఇవర్‌కళ్ వివాహప్రాప్తరెన్నానిన్ఱార్ కళ్" ఎన్న పిన్ను ఇరణ్డు మూన్ఱు నాళైక్కుళ్ళే మన్నియై కొణ్డువన్దు నీర్ వార్‌త్తార్‌కళ్.

సందర్భం:- అన్ని లోకాలను రక్షించే బాధ్యతను కలవాడైన నాయకుడు (భగవానుడు) నాయకిని (ఆళ్వార్లను) మాత్రం **"మదేకవర్జమ్"** అన్నట్లు రక్షించకుండా పోయినది ఎందువల్ల? అని సఖి ప్రశ్నించే రీతిలో **"అరుళార్ తిరుచ్చక్కరత్తాళ్"** అనే పాశురం రచింపబడింది. అందఱినీ కాపాడే బాధ్యత భగవానునిదే అనే దానికి సాక్షిగా వ్యాఖ్యాత ఈ క్రింది ఐతిహ్యాన్ని ప్రస్తావిస్తున్నారు.

వివరణం:- కూరేశుల కుమారులైన పరాశరభట్టర్‌కు వివాహోచిత వయస్సు వచ్చింది. అయినా వారి వివాహాన్నిగూర్చి ఏ చీకు చింతా లేకుండా ఉండే కూరేశులను చూచి, ధర్మపత్ని ఆణ్డాళ్, "కుమారునకు యుక్తవయస్సు వచ్చిన తర్వాతకూడా

వివాహాన్నిగూర్చి యోచనను చేయకుండా ఉన్నారే! ఇది ఏమి"? అని అడిగారు. దానికి కూరేశులు "భగవానుని కుటుంబంకోసం నన్ను పాటు పడనుంటావా! కావాలంటే, రేపు భగవానుని సన్నిధిలో పురాణాన్ని పఠించేటపుడు పిల్లలను అక్కడకు పంపించు" అని అన్నారు. ఆ విధంగా మరునాడు కూరేశులు భగవానుని సన్నిధిలో పురాణపఠనాన్ని చేసేటపుడు పరాశరభట్టర్‌ను, వారికి అనుజులైన శ్రీరామప్పిళ్ళైను ఆణ్డాళ్ పంపించారు. పురాణాన్ని పఠించి ముగించిన తరువాత కూరేశులు కొంచెం ఒదిగి నిలచి ఉండడాన్ని గమనించిన శ్రీరంగనాథుడు "ఏమి కూరేశా! ఏమి మీ అభిప్రాయం ? ఏదో చెప్పాలని ఉన్నట్లు తోస్తున్నదే!" అని అడిగాడు. కూరేశులు మెల్లిగా – "పిల్లలు వివాహయుక్త వయస్సుకు వచ్చారని అందరూ అంటున్నారు." అని అన్నారు. అపుడు శ్రీరంగనాథుడు "మేమే తగిన సంబంధాన్ని చూచి, వివాహాలను జరిపిస్తాము లెండి. మీరు కళవళపడవద్దు" అని అన్నాడు. తరువాత రెండు మూడు దాళ్ళలోనే శ్రీపరాశరభట్టర్‌కు తగిన కన్యకతో వివాహం నిశ్చయం జరిగింది.

ఈ ఐతిహ్యం తిరువాయ్‌మొళి (7–2) దశక ఈడువ్యాఖ్యాన ప్రవేశంలోకూడా ప్రసక్తమైనది.

30. తిరువిరుత్తమ్ – 85వ పాశురం – పెరియ వాచ్చాన్ పిళ్ళై వ్యాఖ్య.

ఆళ్వాన్ తిరుక్కోటియూర్ నమ్బిపాడునిన్ఱుమ్ వన్ద అనన్తరత్తిలే "పిళ్ళైప్పిళ్ళాయ్! ఎన్నుళ్ళాన్ ఎన్న వేణ్డుమ్ స్థానే ఆళ్వార్ "అడియేనుళ్ళాన్" ఎన్ఱపడికణ్డాయే!" ఎన్ఱపణిత్తాన్.

సందర్భం:– **"అడియేన్ అడియావి అడైక్కలమే"** అని అంటూ ఈ పాశురంలో నమ్మాళ్వార్లు ఆత్మసమర్పణాన్ని చేస్తున్నారు. ఇక్కడ నిర్విశేషంగా **"ఆవి"** అని మాత్రం అనకుండా **"అడియావి"** అన్నందున ఆత్మ భగవానునకు శేషభూతం అని తెలుపబడింది. ఆత్మభగవానునకు శేషభూతం– అని **"అడియేనుళ్ళాన్ ఉడనుళ్ళాన్"** అనే ఆళ్వార్ల సూక్తిని ఉదాహరిస్తూ తిరుక్కోట్టియూర్‌నమ్బి కూరేశులకు తెల్పిన ఐతిహ్యాన్ని వ్యాఖ్యాత ఇక్కడ ఉట్టంకించారు.

వివరణం:– ఈ ఐతిహ్యం 13వ ఐతిహ్యంగా (నాచ్చియార్ తిరుమొళి–12–2) ఇంతకు ముందే వివరింపబడింది. ఇక్కడ ఒక విశేషం ఉన్నది. కూరేశులు తిరుక్కోట్టియార్ నమ్బివల్ల తాము ఆలకించిన. "ఆత్మ భగవానునకు శేషభూతం" అనే లక్షణమే ఆత్మకు అంతరంగనిరూపకం అనే విషయాన్ని, నంబివద్దనుండి తిరిగి వచ్చిన తరువాత దానిని తమకు శిష్యులైన పిళ్ళై ప్పిళ్ళై యాళ్వాన్‌కు చెప్పారనే విశేషం ప్రస్తుతపాశురవ్యాఖ్యలో ఉండే **"పిళ్ళై ప్పిళ్ళాయ్"** అనే సంబోధనబట్టి తెలుస్తున్నది. లేక నంబి కూరేశులను ఈ సంబోధనతో గౌరవంగా పిలిచారని కూడా చెప్పవచ్చు. నంబిళ్ళైవ్యాఖ్యలో కూడా ఈ ఐతిహ్యం ఉట్టంకింపబడింది. అయితే అందులో **"పిళ్ళాయ్"** అని మాత్రమే సంబోధింపబడింది. ఈ ఐతిహ్యమే తిరువాయ్ మొళిలోని (8–8–2) పాశురం ఈడు వ్యాఖ్యలోకూడా ఉట్టంకింపబడడాన్ని గమనించవచ్చు.

31. తిరువిరుత్తమ్ – 99వ పాశురం – నమ్బిళ్ళై ఈడు వ్యాఖ్య.

ఆళ్వాన్ తిరువాయ్‌మొళి నిర్వహిక్కప్పుక్కాల్ పిళ్ళైయుఱజ్గా విల్లిదాసర్ కణ్ణుమ్ కణ్ణీరుమాయ్ అత్తై ఇత్తై ప్రసంగిత్తు చ్చిథిలరాయ్ క్కిడప్పర్. అత్తై కూరత్తాళ్వాన్ కణ్డు "మహాభాష్యమ్ కఱ్ఱు చతురశ్రమాక ఒన్ఱై నిర్వహిక్కిఱ ఎఙ్గళైప్పోలన్ఱిక్కే భగద్గుణ ప్రసంగత్తిలే శిథిలరామ్బడి పిఱన్ద ఉమ్ముడైయ జన్మమ్ ఒరు జన్మమే!" ఎన్ఱు కొణ్డాడినాన్. ఆళ్వాన్ వీరాణత్తిల్ ఒరు పెణ్‌పిళ్ళైయైక్కుడజ్గావిట్టు "కళ్వన్‌కొల్! యానఱియేన్" ఎన్ఱు శ్నైయిట్టు, మేలడి తోఱ్ఱామల్ మోహిత్తారామ్. ఇప్పడి యిరుక్కిఱపరిఱే తన్నై వన్నెఞ్ఞారాక చ్చొల్లుకిఱార్.

సందర్భం:– **"నెఞ్ఞుల్ నినైప్పరితాల్ వెన్ణెయూణెన్ఱుమ్ ఈనచ్చొల్లే"** అని ఆళ్వార్లు దీనికి ముందు పాశురంలో పలికారు. శ్రీకృష్ణుని నవనీతచౌర్యవృత్తాంతాన్ని తలచినంత మాత్రంలోనే ఆళ్వార్లు మోహిస్తారు – అని భావించి అక్కడనే వారి సమీపంలో ఉండే మధురకవి ఆళ్వార్ చటుక్కున "మాకు రక్షకంగా ఉండే ఒకమాటను తమరు అనుగ్రహించాలి" అని ప్రార్థించారు. అపుడు నమ్మాళ్వార్లు **"ఞానప్పిరానై యల్లా లిలై నాన్ కణ్ణ నల్లదువే"** అని ఆళ్వార్లు అన్నారు – అని వ్యాఖ్యానించే వ్యాఖ్యాత భగవానుని నవనీతచౌర్యాదిలీలలను స్మరించినంతలోనే మోహాన్ని పొందేవారుంటారు – అనే దానికి దృష్టాంతంగా కొన్ని వృత్తాంతాలను ఉట్టంకించే సందర్భం ఇది.

వివరణం:– కూరేశులు తిరువాయ్‌మొళి పాశురాలకు వివరణం అనుగ్రహించాలని ప్రయత్నించేటపుడు పిళ్ళై ఉఱజ్గావిల్లి దాసర్ (ధనుర్దాసు) ఆ పాశురాలపట్ల చాలా అభినివేశాన్ని కలవారై, భగవానుని పరత్వ – సౌలభ్యాలనుగూర్చి పలు రీతుల్లో పల్కి, కన్నీరు మున్నీరై భక్తివిహ్వలులు కావడం వారికి అలవాటు. దీనిని చూచి కూరేశులు "మహాభాష్యం మొదలైన శాస్త్రగ్రంథాలను అధికరించి, చాలా స్థిరంగా వాటిని వివరించడానికి తగిన కఠినమైన మనస్సును కల్గి ఉండే మావలె కాకుండా, భగవానుని గుణాలనుగూర్చి పల్కగానే మనస్సు శిథిలం అయేటట్లుగా జన్మించిన మీ జన్మ ఏమి మహనీయమైన జన్మ!" అని కీర్తించారు. ఇటువంటి కూరేశులు వీరనారాయణపురంలో (కాట్టుమన్నార్ కోయిల్) వేంచేసి ఉన్నపుడు ఒడిలో ఒక చిన్న బాలికను పెట్టుకొని కొంతమందికి దివ్యప్రబంధాన్ని సంత చెబుతున్నారు. కూరేశులు అపుడు **"కళ్వన్ కొల్! యానఱియేన్ కరియాన్ ఒరు కాలై వన్దు"** అనే తిరుమజ్జై యాళ్వార్ల పాశురాన్ని సంత చెబుతున్నారు. (సంత చెప్పడం అంటే ఆచార్యులు పాశురంలోని పదాలను ఒక మాఱు ఉచ్చరించగా, శిష్యులు వానిని ఆక్రమంలో మూడుమార్లు పల్కడం. వేదాధ్యయనాన్ని చేసే రీతిలోనే దివ్యప్రబంధాధ్యయనంకూడా చేయబడుతుంది) పరకాలనాయకిని

భగవానుడు తీసికొనిపోయిన సంగతిని తెలిసిన తల్లి పలవరించే రీతిలో ప్రస్తుత పాశురం రచింపబడింది. ఈ పాశురాన్ని కూరేశులు చేప్పేటపుడు, కూరేశుల ఒడిలో ఉండే బాలికను ఆమె భర్త అక్కడకు వచ్చి తీసికొని పోయాడు. అపుడు కూరేశులకు పాశురంలోని భావమే మనస్సులో బలంగా మెదలుతున్నందున పరకాలనాయకిని భగవానుడు పిలుచుకొని పోయాడనే తలచి మోహించి, ఇక ఆపై సంతను చెప్పలేకపోయారు. ఈ విధంగా ఆళ్వార్ల పాశురాలలో అభినివేశాన్ని పొందే కూరేశులేకదా తమను కఠినమైన మనస్సును కలవారని చెబుతూ, పిళ్ళై ఉఱ్ఱంవిల్లి దాసర్‌ను మృదుమనస్కులుగా కీర్తించారు.

ఈ పాశురానికి పెరియవాచ్చాన్ పిళ్ళై అనుగ్రహించిన వ్యాఖ్యానంలోకూడా ఈ ఐతిహ్యం ఉట్టంకింపబడింది. అయితే, నంబిళ్ళైవ్యాఖ్యలోని **"ఆళ్వాన్ వీరాణత్తిల్ ఒరు పెణ్ పిళ్ళై కుడఙ్గలిట్టు"** అనే దానికి బదులుగా **"ఆళ్వాన్ తన్ వీరాణత్తిలే ఒరు పెణ్‌పిళ్ళై పుక్కాళాయ్, మడియిలే వైత్తుక్కొణ్డిరున్దు"** అని ఉన్నది. ఈ సూక్తిలో **"పెణ్‌పిళ్ళై పుక్కాళాయ్"** అని ఉన్నందున కూరేశులకు ఒక కుమార్తెకూడా జన్మించిందని, ఆమెను వారు వీరనారాయణపురంలో ఉండే ఒకరికి ఇచ్చి వివాహం చేశారని, ఆ బాలికను తమ ఒడిలో పెట్టుకొని సంతను కూరేశులు చెబుతున్నారని అరుంబదంలో వివరింపబడింది. కాని, కూరేశులకు పుత్రికాసంతానం కల్గినట్లు ఏ గ్రంథంలోను కానరాదు. ఈ విషయంలో పెద్దల సూక్తి ప్రమాణం.

32. తిరువిరుత్తమ్ – 99వపాశురం – నమ్బిళ్ళై ఈడు వ్యాఖ్య.

'కిడామ్బియాచ్చాన్ ఆళ్వానోడే తిరువాయ్‌మొళి కేట్కిఱ నాళిలే ఒరు నాళ్ తాళ్‌త్తు పుక "ఏన్ నీ వైకి నాయా?" ఎన్న 'ఆళ్వాన్ పాడే తిరువాయ్‌మొళి కేళానిన్ఱేన్' ఎన్న, "ఇన్ఱు ఎన్న తిరువాయ్‌మొళి నిర్వహిత్తాన్" ఎన్ఱు కేట్టరుళ, "పిఱన్ద వాఱుమ్" ఎన్ను విణ్ణప్పమ్ శెయ్య, "అతిల్ శొన్న విశేష మెన్?" ఎన్న, "ఒన్ఱుమ్ విశేష మిల్లై" ఎన్న, "ఆకిల్ నీ కేట్టపడి ఎన్ ? అవన్ శొన్నపడి ఎన్?" ఎన్న, "నిర్వహిప్పతాక ఆరమ్బిత్తు ఇయల్ శొల్లి అనన్తరమ్ ఆళ్వారుడైయ పారవశ్యత్తై అనుసన్ధిత్తు నెడుమ్మొఴి కణ్ణమ్ కణ్ణనీరుమాయ్ యిరున్దు, "ఇవ్వాళ్వారుమ్ ఒరువరే ? ఇవర్‌క్కు ఓడుకిఱ భావవృత్తిక్కు నా మిరున్దు పాశుర మిడుగై యావదెన్ ? ఎన్ఱు ఇన్ఱైక్కు విడలాకాతే" ఎన్ఱ విట్టాన్! ఎన్ఱ కేట్టరుళి ఎమ్బెరుమానార్. 'ఎన్న పరమచేతనో!' ఎన్ఱు అరుళిచ్చెయ్‌తార్.

సందర్భం:– ఇంతకుముందు తెలిపిన సందర్భమే ఈ ఐతిహ్యానికికూడా వర్తిస్తుంది.

వివరణం:– కిడాంబి ఆచ్చాన్ కూరేశుల సన్నిధిలో తిరువాయ్‌మొళి కాలక్షేపాన్ని ఆలకించే సమయంలో ఒకనాడు చాలా ఆలస్యంగా తిరిగి వచ్చారు. అపుడు శ్రీరామానుజులు వారి రాకలోని ఆలస్యానికి కారణం అడిగారు. కిడాంబి ఆచ్చాన్ "కూరేశుల వద్ద తిరువాయ్‌మొళి అర్థాన్ని వింటున్నందున ఆలస్యం అయినది" అని బదులిచ్చారు.

"ఈనాడు కూరేశులు ఏ పాశురాన్ని వివరించారు?" అని మళ్ళీ శ్రీరామానుజులు అడిగారు. **"పిఱన్ద వాఱుమ్"** (5–10) అనే పాశురాన్ని వివరించారని ఆచ్చాన్ అన్నారు. ఇందులో కూరేశులు తెలిపినది ఏమని? అన్నారు రామానుజులు. "ఏ మాట చెప్పలేదు" అని ఆచ్చాన్ సమాధానం చెప్పారు. "అయితే కూరేశులు చెప్పినది ఏమి ? నీవు విన్నది ఏమి?" అని అన్నారు రామానుజులు. ఆ దశకాన్ని వివరించాలని ఆరంభించిన కూరేశులు మొదట ఒకసారి పాశురాన్ని అనుసంధించారు. వెంటనే దాని భావం వారి మనస్సులో మెదిలి, మనస్సు కఱిగి, ఆళ్వార్ల అభినివేశాన్ని తలుచుకొంటూ చిరకాలం కన్నీరు విడచారు. "ఈ ఆళ్వార్లు కూడా ఒకరా! వీరికి ఉన్న అభినివేశం ఏమి! అటువంటి అభినివేశాన్ని లేని మనం దీనిని వివరించడం ఏవిధంగా?" అని పుస్తకాన్ని మడచివేశారు – అని అన్నారు ఆచ్చాన్. దీనిని విన్న రామానుజులు "కూరేశుల అభినివేశం ఎంత ఆశ్చర్యకరమైనది! ఆహా!" అని అన్నారు.

ఈ ఐతిహ్యం పెరియవాచ్చాన్‌పిళ్ళైవ్యాఖ్యలోకూడా వ్యాక్య సన్నివేశంలో కొంచెం మార్పుతో ఉన్నది.

33. తిరువిరుత్తమ్ – 99వ పాశురం – పెరియవాచ్చాన్ పిళ్ళై వ్యాఖ్య.

ఒరువిశై తిరుక్కోట్టియూర్‌నమ్బి తిరునాళుక్కు ఎళున్దరుళిన సమయత్తిలే ఇవ్వర్థత్తై అరుళిచ్చెయ్‌వతాక ఒరు ఏకాన్త స్థలత్తే ఎళున్దరుళి ఎమ్బెరుమానారైయుమ్ కొణ్డుపుక్కారాయ్, తిరుప్పణిశెయ్ వాన్ ఒరుత్తన్ అఙ్గే ఉఱఙ్గి క్కుఱట్టై విడానిఱ్ఱు, అవనై క్కణ్డు "అనర్థప్పట్టోమ్" ఎన్ఱు అవ్విశై తవిర్న్దు పిన్ఱ్ఱై విశైయిలే ఇత్తై నమ్బి అరుళిచ్చెయ్య క్కేట్టరుళి ఆళ్వాన్ అకత్తిలే అముతు శెయ్‌తిరుక్కిఱవళవిలే ఉచ్చి వెయిలిలే వన్దు పుకున్దు, "నమ్బి ఇవ్వర్థత్తై ఒరువర్‌క్కుమ్ శొల్లాతేకొళ్" ఎన్ఱు అరుళిచ్చెయ్‌తార్. ఉనక్కు శ్శొల్లాతిరుక్కమాట్టుకిఱిలేనిఱే" ఎన్ఱు సహకారినైరపేక్ష్యత్తై అరుళచ్చెయ్‌తారిఱే.

సందర్భం:– **"ఞానప్పిరానై అల్లాలిల్లై నాన్ కణ్డనల్లతువే"** అని అంటూ నమ్మాళ్వార్లు అనుగ్రహించిన సూక్తికి భగవానుడొక్కడే ఉపాయం, మిగిలినది ఏదయినా ఉపాయంకానే కాదు – అని భావమంటూ, దీనికి దృష్టాంతంగా తిరుక్కోట్టియూర్‌నమ్బి శ్రీరామానుజులకు కృపజేసిన వార్తను ఇందులో వ్యాఖ్యాత ప్రస్తుతిస్తున్నారు.

వివరణం:– ఒక పర్యాయం తిరుక్కోట్టియూర్ నమ్బి శ్రీరంగంలో ఉత్సవాన్ని సేవించాలని వచ్చినపుడు, "భగవానుడు తప్ప వేఱు ఏదీ ఉపాయం కాదు" అనే అర్థాన్ని వివరంగా శ్రీరామానుజులకు తెలియజేయాలని అనుకున్నారు. అది చాలా రహస్యంగా ఉపదేశించవలసిన, అపూర్వమైన, ఉన్నతమైన అర్థం కనుక, ఎవరూ లేని ఒక ఏకాంతమైన చోటుకు శ్రీరామానుజులను పిలుచుకొనిపోయి, చుట్టూ అంతా పరికించి చూచారు. అక్కడ శ్రీరంగం ఆలయంలో పనిచేసే వారొకరు నిద్రించడాన్ని గమనించి "నేను ఎంతో

రహస్యంగా ఉపదేశించడం ఎవరి చెవిలో అయినా పడితే దోషం అవుతుంది" – అని అనుకొని, ఆ నాడు శ్రీరామానుజులకు ఉపదేశించకుండానే తిరుక్కోట్టియూర్‌కు తిరిగి వెళ్ళిపోయారు. మళ్ళీ ఇంకొకసారి శ్రీరంగానికి నమ్బి వేంచేసినపుడు భగవద్రామానుజులకు చాలా రహస్యంగా ఆ అర్థాన్ని ఉపదేశించారు. ఆ ఉపదేశాన్ని ఆలకించి శ్రీరామానుజులు వెంటనే ఎండ చాలా తీవ్రంగా ఉన్న మధ్యాహ్న సమయంలోని ఎండనుకూడా ఏమీ లెక్కచేయకుండా కూరేశుల తిరుమాళిగకు వచ్చారు. అపుడు కూరేశులు సాపాటు చేసే సమయం. కూరేశులను పిలిచి "కూరేశా! తిరుక్కోట్టియూర్‌నమ్బి ఎవరికీ చెప్పరాదని అంటూ నాకు ఈ అర్థాన్ని చెప్పారు. అయితే, నేను మీకు మాత్రం చెప్పకుండా ఉండడం నా వల్లకాలేదు" అని పల్కి, భగవానుడు తప్ప వేఱెవ్వరూ ఉపాయం కానేకాదు – అనే అ అర్థాన్ని (సహకారనైరపేక్ష్యాన్ని) కూరేశులకు తెలియజెప్పారు.

సహకారినైరపేక్ష్యం అంటే – కర్మయోగ, జ్ఞానయోగ, భక్తియోగ ప్రపత్తియోగాలలో ఏదీ ఉపాయం కాదు. వీనిలో దేని సహకారాన్నీ ఆశించకుండా, తానొక్కడే ఉపాయమై, మోక్షాన్ని ఇవ్వగలవాడు భగవానుడొక్కడే అని కర్మజ్ఞాన భక్తులు ఉపాయాలు కావు – అనే విషయం. చరమశ్లోకంలోని **"సర్వధర్మాన్ పరిత్యజ్య"** అనే ప్రయోగంవల్ల, ప్రపత్తికూడా ఉపాయం కాదు అనే విషయం **"ఏకమ్"** అనే పదంవల్ల స్ఫుటమవుతున్నది. ఈ ఐతిహ్యం నమ్బిళ్ళైవ్యాఖ్యలోకూడా తెలుపబడింది.

33. తిరువాశిరియమ్ -1 పెరియవాచ్చాన్‌పిళ్ళై వ్యాఖ్యానమ్ :

(కవర్‌తలై) "అనన్దాళ్వాన్ తిరుక్కోట్టియూరుక్కు నడన్దవిడత్తిలే భట్టరై క్కణ్డు అవర్ తిరుమేనియిలే ఇప్పడి చ్చెయ్‌దారామ్. ఆణ్డాళుక్కు మున్ను ఒరు పిళ్ళై యుణ్డాయ్, అవనై యిళ్ళక్క, అజ్గనే శెయ్యవొణ్ణాతు. ఇవన్ జీవిక్క వేణుమ్– ఎన్ను ఎమ్బెరుమానార్ పెరియపిరాట్టి యారుక్కు నీరాట్టి మఞ్జళ్‌నీర్ కుడిత్త పిళ్ళైయాక వళర్క్కవేణుమ్ ఎన్ను కాట్టిక్కొడుత్తరుళి నారాయిణ్ణు. అన్ద వాసనైయాలే "పెరియపిరాట్టియార్‌మకన్" ఎన్ను తాన్ భట్టరై అనన్దాళ్వాన్ శొల్లువతు.

సందర్భం : ఆదిశేషుని ఒడిలో భగవానుడు శయనించి ఉండే సన్నివేశాన్ని నమ్మాళ్వార్లు వర్ణిస్తూ **"కవర్‌తలై అరవిన్ అమళి ఏఱి"** అని అన్నారు. ఈ సందర్భంలో "చిన్నశిశువును తన ఒడిలో పెట్టుకొన్న తల్లివలె ఆదిశేషుడు తన ఒడిలో భగవానుని పెట్టుకొన్నాడు" అని వ్యాఖ్యానించిన వ్యాఖ్యాత ఈ ప్రయోగానికి ఒక ఐతిహ్యాన్ని ఉట్టంకించారు.

వివరణం : ఒకసారి భట్టర్ తిరుక్కోట్టియూర్‌లో వేంచేసి ఉన్నపుడు అక్కడకు వచ్చిన అనన్దాళ్వాన్ భట్టర్‌ను కౌగలించుకొని తమ ఒడిలో పెట్టుకొన్నారట. కూరత్తాళ్వాన్ సతీమణి ఆణ్డాళ్‌కు మొదట ఒక కుమారుడు కలిగి, మరణించాడు. ఆణ్డాళ్‌కు భట్టర్ కుమారుడుగా అవతరించిన తరువాత 'ఈ కుమారుడు కూడా ఆ విధంగా కాకూడదు

అని, చిరకాలం జీవించాలని భగవద్రామానుజులు శ్రీరంగనాయకికి తిరుమంజనం చేయించి, ఆ అభిషేకంలోని హరిద్రాజలాన్ని (పసుపునీళ్ళను) తాగించిన కుమారునిగా పెంచాలని తలచి భట్టర్‌ను శ్రీరంగనాయకికి దత్తపుత్రునిగా దానజలధారాపూర్వకంగా దత్తత చేసేటట్లు ఏర్పాటుచేశారు. అందువల్ల అనన్దాళ్వాన్ భట్టర్‌ను **"పెరియపిరాట్టియార్ మకన్"** అని అనేవారట.

(జన్మించిన సంతానం చిన్నవయస్సులో చనిపోతే, అది కన్నవారి దోషం అని, అందువల్ల మళ్ళీ బిడ్డ జన్మించినపుడు ఆ బిడ్డను ఎవరికైనా స్వీకారం ఇచ్చినట్లయితే, కన్నవారి దోషం ఆ బిడ్డను బాధించదు అని, దానివల్ల ఆ బిడ్డకు చిరాయుస్సు కల్గుతుందని అంటారు. ఈ సంప్రదాయానుసారం భగవద్రామానుజులు భట్టర్‌ను శ్రీరంగనాయకికి స్వీకారం ఇచ్చారు.)

శ్రీరంగనాథుని పాయసప్రసాదాన్ని స్వీకరించినందువల్ల కూరత్తాళ్వాన్‌కు పరాశరభట్టరు, వేదవ్యాస భట్టర్ జన్మించారని మాత్రమే, ఆఱాయిరప్పడి గురుపరంపరాప్రభావాది సంప్రదాయచరిత్ర గ్రంథాలలో ఉన్నది. అంతకు ముందు ఒక బిడ్డ జన్మించినవృత్తాంతం వాటిలో కన్పించడంలేదు.)

34. తిరువాయ్‌మొళి -1-1-1 ఈడు వ్యాఖ్య

ఆళ్వాన్ పిళ్ళైపిళ్ళైయై ప్పార్‌త్తు "నిర్గుణ మెన్బార్ మిడర్‌న్రై ప్పిడిత్తాళ్పోలే ఆళ్వార్ 'నల ముడైయవన్' ఎన్నపడి కణ్డాయే?" ఎన్ను పణిత్తాన్.

సందర్భం:– నమ్మాళ్వార్లు తిరువాయ్ మొళిని ప్రారంభించేటపుడు **"ఉయర్వఱ ఉయర్ నలమ్"** (దీనికి మించి గొప్పది లేదు అనేటట్లుగా ఉన్నతమైన ఆనందం అనే గుణాన్ని కలవాడు) అని అన్నారు. దీనినిగూర్చి కూరేశులు పల్కిన సూక్తిని వ్యాఖ్యాత ఉదాహరిస్తున్నారు.

వివరణం:– కూరేశులు తమ శిష్యులైన పిళ్ళై ప్పిళ్ళై ఆళ్వాన్‌ను చూచి "భగవానునకు గుణాలు లేనే లేవు – అని పలికేవారి కంఠాన్ని పట్టుకొనేటట్లుగా ఆళ్వార్లు ప్రారంభంలోనే **"నల ముడైయవన్"** అని అనుగ్రహించారుసుమండీ" అని అన్నారు. పరబ్రహ్మకు గుణాలు లేవని అద్వైతుల సిద్ధాంతం. ఈ ఐతిహ్యం ఇరుపత్తునాలాయిరప్పడి వ్యాఖ్యలోకూడా ఉట్టంకింపబడింది.

"భూమనిన్దాప్రశంసాసు నిత్యయోగేఽతిశాయనే, సంసర్గేఽస్తి వివక్షాయాం భవన్తి మతుబాదయఃు" అనే ప్రమాణాన్నిబట్టి నిత్యయోగాన్ని తెలిపే మతుప్‌ను **"నలముడైయవన్"** అనే ప్రయోగంలో చెప్పాలి. కనుక భగవానుడు సమస్తకల్యాణ గుణాత్ముడనే విషయాన్ని ఆళ్వార్ల ఈ సూక్తి తెలుపుతున్నందున, గుణవిభూతులు ఔపాధికాలని, ఉపాసనార్థమేనని వాదించేవారి వాదం నిరస్తమని ఆళ్వాన్ హృదయం.

35. తిరువాయ్‌మొళి -1-1-9 – ఒన్బదినాయిరప్పడి వ్యాఖ్య – (నంజీయర్)

ఈశ్వరన్ ఉళన్ ఎన్నాతల్, ఇలన్ ఎన్నాతల్– ఇరణ్డు పడియాలుమ్ ఉళనామ్. ఇవ్వళియాలే వేదముణ్డాయిన్ఱన. అతిల్ శొన్నపడియే అవన్దానెఱ్ఱుమ్ పరన్దుళనావాన్. ఇప్పొరుళ్ ఇప్పాట్టిల్ మేలిరణ్డడియాలుమ్ శొల్లుకిఱతు. ఇప్పాట్టు ఆళ్వాన్ యోజిత్తపడి.

సందర్భం:– నంజీయర్ ఒన్బదినాయిరప్పడి వ్యాఖ్యలో **"ఉళన్ ఎనిల్ ఉళన్"** అని ప్రారంభం అవుతున్న ఈ పాశురానికి వ్యాఖ్యానాన్ని ప్రసాదిస్తూ, ఈ కూరేశుల సూక్తిని ఉదాహరించారు. "భగవానుడు ఉన్నాడు" అని అంటే ఉన్నాడని. లేడు అని అంటే కూడా ఉన్నాడనే అర్థం – అని ఆళ్వార్లు అంటున్నారని కూరేశుల సూక్తి.

వివరణం:– భగవంతుడనేవాడొకడు లేనే లేడు– అని పలికే నీవు దానిని ఏవిధంగా ప్రతిపాదిస్తావు? ఉన్నాడనే పదంతో భగవానుడు లేడని అంటావా! లేక, లేడు అనే పదంతో ఈశ్వరుడు లేడని అంటావా? "ఉన్నాడు" అనే మాటతో ఏవిధంగా ఈశ్వరసత్త వ్యక్తమవుతున్నదో, ఆవిధంగానే లేడనే మాటతో కూడా అతడు ఉన్నాడనే పర్యవసిస్తుంది. లోకంలో ఒకడు "ఘటం లేదు" అని అంటే, ఘటం ఇక్కడ లేదు, ఇపుడు లేదు, ఈ విధంగా లేదు – అనే అర్థం సిద్ధిస్తుందే తప్ప, ఘటమనే పదార్థమే లోకంలో అసలు లేదు– అనే అర్థం సిద్ధించదు. ఎందుకంటే, ఘటమనే పదార్థమే లోకంలో అసలు లేనే లేదంటే, ఘటమనే పదం మనం ప్రయోగించే అవకాశమే లేదు. లోకంలో బొత్తిగా లేని వస్తువునుగూర్చి మనం తెలిసే అవకాశమే లేదు. కనుక ఆవిధంగా ఒక వస్తువును మనం నోటితో నిర్దేశించే అవకాశం ఏవిధంగాను లేదు. ఎపుడు ఒక వస్తువు ఒకపదంచేత నిర్దేశింపబడిందో, అపుడు ఆ వస్తువు లోకంలో తప్పక ఉండి తీరాలి. ఈశ్వరుడు లేడు అని వాదించే సైతం ఈశ్వరుడు అనే మాటను నిర్దేశించేకదా అతడు లేడని చెప్పాలి. అపుడు నీవు "ఈశ్వరుడు లేడు" అనే మాటతో సైతం అతని సత్తనే సాధిస్తున్నావు తప్ప, అసత్తను కాదు సుమా! అని అంటూ ఆళ్వార్లు సర్వశూన్యవాదిని ఈ పాశురంలో నిరసిస్తున్నారు – అని కూరేశులు ఈ పాశురానికి వివరణాన్ని ప్రసాదించారు.

తిరువాయ్‌మొళి వ్యాఖ్యానాలు అన్నిటిలోను ఈ పాశురానికి వివరణం ఈ విధంగానే చేయబడినా, ఈ వివరణం కూరేశులుచేత చేయబడింది – అనే విషయం మాత్రం నంజీయర్ ఒన్బది నాయిరప్పడిలోమాత్రమే కన్పిస్తున్నది. శ్రీరామానుజులు శ్రీభాష్యంలో **"సర్వథా అనుపపత్తేశ్చ"** అనే సూత్రంలో సర్వశూన్యవాదిని నిరసించేటపుడు ఈ పాశురంలోని క్రమాన్ని పూర్తిగా అనుసరిస్తూ వాదించారన్నది సుస్పష్టం.

36. తిరువాయ్ మొళి -1-2-10– ఈడు వ్యాఖ్య.

"ఆళ్వాన్ ఇప్పాట్టళవుమ్ వర పణితు, ఇప్పాట్టళవిలే వన్దవాతో" ఇత్తై ఉన్దమ్ ఆచార్యర్‌కళ్ పక్కలిలే కేట్టు క్కొళ్ళుఞ్ఞోళ్ "ఎన్న, భట్టరుమ్, శీరామప్పిళ్ళైయుమ్ ఎళున్దిరున్దు పోరప్పుక్కవాతే అవరకళై యుళ్ళత్తు "ఇన్నపోతు ఇన్నార్ ఇరుప్పార్, ఇన్నార్ పోవార్ ఎన్ఱు తెరియాతు. ఇరున్దు కేళుఞ్ఞోళ్" ఎన్ఱు తిరుమంత్రత్తై ఉపదేశిత్తు "ఇప్పాట్టై నిర్వహిత్తు ఇప్పాట్టై ఇతుక్కర్థమాగ నినైత్తిరుఞ్ఞోళ్" ఎన్ఱు పణిత్తాన్.

సందర్భం:– నమ్మాళ్వార్లు **"ఎణమ్ పెరుక్కున్నలత్తు ఒణ్ పొరుళ్ ఈతిల వణ్ పుకళ్ నారణన్ తిణ్ కళల్ శేరే"** అనే ఈ పాశురంలో తిరుమంత్రార్థాన్ని అనుగ్రహిస్తున్నారు. దీనిని వివరించే వ్యాఖ్యాత ఈ క్రింది ఐతిహ్యాన్ని ప్రస్తావించారు.

వివరణం:– కూరేశులు తిరువాయ్‌మొళి ప్రబంధంయొక్క అర్థాన్ని తమ కుమారులు పరాశరభట్టర్, శ్రీరామప్పిళ్ళై (వ్యాసభట్టర్)లకు ఉపదేశించారు. తిరుమంత్రాన్ని, దాని అర్థాన్ని తమ ఆచార్యుల సన్నిధిలోనే ఉపదేశంగా పొందాలి కనుక, ఈ పాశురంవరకు అర్థాన్ని వివరించిన కూరేశులు, ఈ పాశురార్థం ప్రసక్తంకాగానే తమ కుమారులైన భట్టర్‌ను, శ్రీరామప్పిళ్ళైను చూచి "ఈ పాశురార్థాన్ని మీరు మీ ఆచార్యుల సన్నిధిలో వినండి" అని అన్నారు. వెంటనే భట్టర్, శ్రీరామప్పిళ్ళై లేచి, తమ ఆచార్యులైన గోవింద భట్టర్ (ఎమ్బార్) వద్దకు వెళ్ళడానికి బయలుదేరారు. కూరేశులపుడు వారిద్దరిని వెనుకకు పిలచి, "ఈ సమయంలో వీరు ప్రాణాలతో ఉంటారు; ఈ సమయంలో వీరు గతిస్తారు – అన్నది ఎవరికీ తెలియదు. మీరు మీ ఆచార్యులవద్దకు వెళ్ళేంతవరకు ప్రాణాలను కల్గి ఉండాలి కదా! ఆ విధంగా కాకుండా, ఒకవేళ ప్రాణాలు పోతే, తిరుమంత్రార్థాన్ని తెలిసికోకుండానే ప్రాణాలు పోయే పరిస్థితి కల్గుతుంది. ఈ స్థితి మీకు కలుగకూడదు అనే భావంతో నేనే మీకు ఈ తిరుమంత్రార్థాన్ని ఉపదేశిస్తాను వినండి" అని అంటూ తిరుమంత్రార్థాన్ని పల్కి పాశురార్థాన్ని ఉపదేశించి, ఈ పాశురం తిరుమంత్రార్థాన్ని అనుసంధించే తీరును తెలిపారు.

ఈ ఐతిహ్యంలో కూరేశులు ముందు పల్కిన సూక్తికి మంత్రంయొక్క గౌరవ్యతలో దృష్టి, తరువాత పల్కిన సూక్తికి భోగ్యతలో దృష్టి. **"అస్యార్థస్య ఆచార్యోపదేశైక వేద్యత్వమ్, ముముక్షూణా మవశ్యాపేక్షితత్వం చ ప్రకాశయన్ ఐతిహ్యముఖేన ఉక్తార్థసమ్మతి మాహ"** అని అరుంబద వివరణం.

37. తిరువాయ్ మొళి -1-5-11– ఈడు వ్యాఖ్య

(పాలేయ్ తమిళర్) ఆళ్వాన్ ఓరువివిలే, "శ్రీపరాంకుశనమ్బియై – పాలేయ్ తమిళర్ ఎన్గిఱతు. ఇశైకారర్ ఎన్గిఱతు – ఆళ్వార్ తిరువరఙ్గ పెరుమాళ్ అరైయరై. పత్తర్ ఎన్గిఱతు –పిళ్ళైయురఙ్గా విల్లి దాసరై– ఎన్ఱు పణిత్తానామ్.

సందర్భం:– నమ్మాళ్వార్లు తమ తిరువాయ్ మొళి ప్రబంధాన్నిగూర్చి **"పాలేయ్ తమిళర్ ఇశైకారర్ పత్తర్ పరవుమ్ ఆయిరమ్"** అని అన్నారు. దీని అర్థాన్ని వివరించే వ్యాఖ్యాత పూర్వాచార్య నిర్వాహాలను ఈ క్రింది విధంగా ఉట్టంకించారు.

వివరణం:– ఆళ్వాన్ (కూరేశులు) ఈ సూక్తిని వివరిస్తూ, ద్రావిడభాషలో చాలా సమర్థులైన శ్రీపరాంకుశనంబివంటివారిని **"పాలేయ్ తమిళర్"** అని చెప్పవచ్చు. భగవానుని సన్నిధిలో ఆళ్వార్లు అనుగ్రహించిన పాశురాలను తీయని రాగంతో పాడే ఆళ్వార్ తిరువరఙ్గప్పెరుమాళ్ అరైయర్‌వంటివారిని **"ఇశై కారర్"** అని చెప్పవచ్చు "భగవానునకు ఏ కీడూ రాకుండా ఉండాలి" అని చాలా భక్తితో ఉండే పిళ్ళై ఉఱఙ్గావిల్లి దాసర్ వంటివారిని **"పత్తర్"** అని చెప్పవచ్చు– అని అన్నారు. ఈ ఐతిహ్యం ఇరుపత్తు నాలాయిరప్పడివ్యాఖ్యలోకూడా తెలుపబడింది.

38. తిరువాయ్ మొళి -1-10-8 ఇరుపత్తు నాలాయిరప్పడి వ్యాఖ్య

ఆళ్వాన్, 'నమ్బియే' ఎన్ఱ స్వరతః, "ఇవనైయే పూర్ణన్ ఎన్ఱతు" ఎన్ఱర్.

సందర్భం :– ఆళ్వార్లు **"నల్‌కి ఎన్నై విడాన్ నమ్బినమ్బియే"** అని అంటూ ఈ పాశురంలో అంటున్నారు. ఈ సూక్తి – "నేను భగవానుని వదలివేయాలని అనుకున్నా, నన్ను అతడు నమ్మి విడువకుండా ఉన్నాడు" అని అర్థం. ఇక్కడ భగవానుని **"నమ్బి"** అనే పదంతో ఆళ్వార్లు నిర్దేశించారు. **"నమ్బి"** అనే పదానికి అన్ని విధాలుగా పూర్తిని కలవాడు – పూర్ణుడు– అని అర్థం. **"ఎన్నై విడాన్ నమ్బియే"** – ఏ రీతిలోను పూర్తిలేని నన్ను పూర్ణుడైన తాను విడువకుండా ఉన్నాడే! – అనే అర్థాన్ని వ్యాఖ్యాత తెలిపే (ఈ అర్థం **"నమ్బియే"** అనే పదంలోని ప్రశ్నార్థకం అయిన ఏకారం వల్ల వ్యక్తమవుతున్నది). ఈ సందర్భంలో ఈ క్రింది కూరేశుల నిర్వాహాన్ని ప్రస్తావించారు.

వివరణం:– **"నమ్బియే"** అని స్వరంలోని వైలక్షణ్యంవల్ల – "ఏ రీతిలోను పూర్తిలేని నన్ను పొందినందున సంతోషించే ఇతనినా నమ్బి అని అనడం! అని ఆళ్వార్లు అంటున్నారని కూరేశులు అర్థాన్ని చెప్పారు. నమ్బియే ? – నమ్బియా కాదు – అనే అర్థం ఇక్కడ తెలుపబడింది. ఈ అర్థం ఈడు వ్యాఖ్యలో కూడ తెలుపబడినా, దీనిని తెలిపినవారు కూరేశులనే విషయం అందులో లేదు.

39. తిరువాయ్ మొళి -2-10-4– ఈడు వ్యాఖ్య

ఇతు నమ్మాల్ శెయ్‌తు తలైక్కట్టప్పోమో? తిరుమలైయై యాశ్రయిక్కుమతొళియ– ఎన్ఱు ఆళ్వాన్ ఓరురువిలే పణిత్తానామ్. అఙ్గనుమ్ నిర్వహిక్క క్కడవతు. అన్ఱిక్కే, "కరుమ వన్ పాశమ్ కళ్ఱిక్కైక్కాకవుమ్, ఉళన్ఱు ఉయ్‌కైక్కాకవుమ్" ఎన్ఱు ఇఙ్గనే ఎమ్బెరుమానార్ అరుళిచ్చెయ్యుమ్బడి.

సందర్భం:– **"కరుమవన్ పాశమ్ కళ్ఱిత్తుళన్ఱు ఉయ్యవే.... తిరుమలై అదువే అదైవదు తిఱమే"** అనే సూక్తిలోని **"ఉయ్యవే"** అనే పదంలో గల ఏకారాన్ని కూరేశులు, శ్రీరామానుజులు వివరించిన తీరును వ్యాఖ్యాత తెలుపుతున్నారు.

వివరణం:– కూరేశులు ఒకసారి ఈ పదానికి అర్థాన్ని వివరించేటపుడు ఈ ఏకారాన్ని అన్యయోగవ్యవచ్ఛేదకంగా గ్రహించి, **"కరుమ్ వన్‌పాశమ్ కళ్ఱిత్తు ఉళన్ఱు ఉయ్యవుమ్ ముడియుమా!"** (బలమైనకర్మ పాశాలను తొలగించుకొని ఉజ్జీవించడానికి సాధ్యమా!) సాధ్యం కాదు. ఇక సాధ్యం అయేది ఏది ? అంటే, తిరుమాలిరుమ్ శోలై పర్వతాన్ని ఆశ్రయించడమే" – అని అర్థం చెప్పారు.

భగవద్రామానుజులు ఈ ఏకారాన్ని నిశ్చయార్థకంగా గ్రహించి, బలమైన కర్మపాశాలను తొలగించుకోవడం కోసం, ఉజ్జీవించడం కోసం తిరుమాలిరుమ్ శోలై పర్వతాన్ని ఆశ్రయించడమే యుక్తం" అని వివరించారు.

మనకు అన్ని కర్మల ఫలాలను అనుభవించి, తీర్చుకొని ఆ తరువాత ఈ పర్వతాన్ని ఆశ్రయించడం – అనేది ఎప్పటికీ వీలు అయే పని కాదు. అది సముద్రంలోని కెఱటాలు శాంతించిన తరువాత స్నానం చేయాలని చూడడంవంటిదే. **"సముద్రే శాంతకల్లోలే స్నాతు మిచ్ఛతి మూఢధీఃʼʼ** కదా – అన్నది కూరేశుల భావం. తిరుమాలిరుమ్ శోలై పర్వతాన్ని ఆశ్రయించగానే కర్మఫలాలు తనంత తామే నశించిపోయి, భగవానునకు కైంకర్యాన్ని చేసే భాగ్యం కల్గుతుంది – అని శ్రీరామానుజుల భావం.

కూరేశుల నిర్వాహంలో **"ఉయ్యవే"** అనే పదంలోని ఏకారం వ్యతిరేక పర్యవసాయి. ఇది కాకుస్వరంద్వారా లబ్ధం. భగవద్రామానుజుల నిర్వాహంలో నిశ్చయార్థకం. ఇది కూడా కాకుస్వరలబ్ధమే. **"అతిక్షుద్రా వయం స్వయత్నేన కర్మరూప దృఢతరపాశాన్ వినాశ్య భగవత్కైంకర్యం కృత్వా ఉజ్జీవితుం శక్తాः కిమ్? అశక్తా ఏవ. తస్మాత్ వనగిరిసమాశ్రయణ మేవ ప్రాప్త మితి కూరేశనిర్వాహాः"** – అని అరుంబదంలో కూరేశ నిర్వాహం తెలుపబడింది. ఇది **"వన్‌పాశమ్"** అనే పదంలోని **"వన్"** అనే విశేషణానుకూలం. భగవద్రామానుజ నిర్వాహం **"పరిత్రాణాయసాధూనామ్"** అనే గీతా సూక్తికి అనుకూలం. రక్షణ అంటే ఇష్టప్రాప్తి, అనిష్ట నివృత్తులే కదా! ఆఱాయిరప్పడి, ఇరుపత్తు నాలాయిరప్పడి వ్యాఖ్యలలో భగవద్రామానుజ నిర్వాహం మాత్రమే ప్రస్తావింపబడింది.

40. తిరువాయ్ మొళి -3-5-7 – ఈడు వ్యాఖ్య.

(ఉత్తమర్‌కట్కు ఎన్ శెయ్‌వారే) ఆయిరత్తళియలే రాజా ఇరుక్కచ్చెయ్‌తే పెరియనమ్బియుమ్, ఆళ్వానైయుమ్ నలిన్దానాయ్ ఆళ్వాన్‌మడియిలే శాయ్‌న్దు కిడక్కచ్చెయ్‌తే పెరియనమ్బి తిరునాట్టుక్కు ఎళున్దరుళినార్. అవ్వళవిలే "ఒరువరుమ్ ఇల్లాతారై ప్రతిపత్తి పణ్ణక్కడవోమ్" ఎన్ఱు తిరికిఱార్ శిలర్ అఙ్గే వన్దు ఆళ్వానై క్కణ్డు "ఒరువనుణ్డితే" ఎన్ఱు పోకప్పుక, ఒరువరైయుమ్ ఒరు కుఱై శొల్లి యఱియాతవన్ "వారికోళ్ మాణిక్కాళ్! వైష్ణవనుమాయ్, ఒరువనుమ్ ఇల్లాతాన్ ఒరువనై త్తేడి ప్రతిపణ్ణ

ఇరుక్కితికళో నీఙ్గళ్! ఈశ్వరనుమ్, ఈశ్వరవిభూతియుమ్ వైష్ణవనుక్కు కించిత్కరిక్క ఇరుక్క, వైష్ణవనుమాయ్ అఱివైయుమాయ్ ఇరుప్పాన్ ఒరువనై నీఙ్గళ్ ఎజ్గే తేడువికోళ్?" ఎన్దానామ్.

సందర్భం:- భగవానుని పాడి, ఆడి, మనస్సు శిథిలమై, నిలువ లేని స్థితిని పొందకుండా, శరీరాన్ని బాగా పెంచి తిరిగే వారి వల్ల శ్రీవైష్ణవులకు ఏ ప్రయోజనం ఉండదు - అని ఆళ్వార్లు ఈ పాశురంలో అంటున్నారు. శ్రీవైష్ణవులకు ఉపయోగపడ దగిన జన్మయే జన్మ. కానిది వ్యర్థం. భగవానుడుసైతం తనను, తనకు చెందిన అన్నిటిని శ్రీవైష్ణవులకు అధీనం అయేటట్లుగా చేశాడు - అని దీనికి అర్థం - అని వ్యాఖ్యాత అంటూ అందుకు దృష్టాంతంగా ఈ క్రింది ఐతిహ్యాన్ని ప్రస్తుతించారు.

వివరణం:- **"ఆయిరత్తళి"** అనే చోట ఉండే చోళరాజు కూరేశులను, పెరియ నంబిని బాధించినపుడు, ఆ బాధను తట్టుకోలేక పెరియనంబి అక్కడనే కూరేశుల ఒడిలో తమ శిరస్సును పెట్టుకొని, పరమపదాన్ని చేరారు. అపుడు "అనాథప్రేత సంస్కారా దశ్వమేథ ఫలం లభేత్" అనే సూక్తిని బట్టి బంధువులు, ఆప్తులు ఎవరూ లేకుండా మరణించిన శ్రీవైష్ణవులకు సంస్కారం చేయాలి అనే ఉద్దేశ్యంతో కొందఱు అక్కడికి వచ్చారు. పెరియనంబి పరమపదాన్ని చేరినట్లు విని, వారి సంస్కారానికి సహాయపడాలని దగ్గరకు వచ్చారు. అక్కడ కూరేశులు ఉండడాన్ని చూడగానే వీరికి సహాయంగా ఒకరు ఉన్నారు - అని అక్కడి నుండి వెళ్ళిపోబోయారు. ఎవరినిగూర్చి ఏ విధమైన లోపాన్ని పలుకని కూరేశులు వారిని చూచి - "రండి బ్రాహ్మణులారా! "పరిజనపరిబర్హా భూషణా న్యాయుధాని ప్రవరగుణగణాశ్చ జ్ఞానశక్త్యాదయ స్తే, పరమపద మథాన్యాత్మదేహా స్తథాత్మా వరద! సకల మేతత్ సంశితార్థం చకర్థ" అని, "న తే రూపం న చాకారో నాయుధాని న చాస్పదమ్, తథాపి పురుషాకారో భక్తానాం త్వం ప్రకాశసే" అని అన్నట్లు భగవానుని సర్వస్వం భక్తులకోసమై యుండగా, బంధువులు, ఆప్తులు ఎవరూ లేని శ్రీవైష్ణవుడు బంధువులు, ఆత్మీయులు ఎవరూ లేనివాడై ఉండేవాడు ఎవడైనా ఉంటాడా! అటువంటివారిని మీరు ఎక్కడ చూడగలరు?" అని అన్నారట. (**"ఆయిరత్తళి"** కృమికంఠ చోళుని పట్టణం పేరు.)

41. తిరువాయ్ మొళి - -4-4-10 - ఈడు వ్యాఖ్య.

(వల్వినైయేన్) ఆళ్వాన్ తిరునయనఙ్గళ్ నోవుపట్ట పిన్బు ఎమ్బెరుమానార్ తిరువుళ్ళమ్ నోవు పట్టాఱ్పోలే కాణుమ్ తిరుత్తాయార్ తిరువుళ్ళముమ్ పడుకిఱతు.

సందర్భం:- భగవానుని స్వభావాల వంటి స్వభావాలను కల కొన్ని వస్తువులను చూచి, వానిని భగవానునిగానే తలచి మోహించిన పరాంకుశనాయకివద్దకు వచ్చిన ఆమె తల్లి "ఏం చేయను? పాపిష్ఠిదాన్ని?". ఈమెను ఈ విధంగా చూడడానికి నేను

ఏం పాపం చేశానో!" అని వాపోతున్నది. దీనికి అనుగుణంగా వ్యాఖ్యాత ఇదే రీతిలో భగవద్రామానుజులు బాధపడిన వృత్తాంతాన్ని ఉట్టంకిస్తున్నారు.

వివరణం:- చోళరాజు సభలో **"శివాత్ పరతరం నాస్తి"** అని వ్రాసిన సంతకం చేయమని బలవంతం చేసినపుడు, కూరేశులు అందులకు అంగీకరించకుండా తిరస్కరించారు. అందు కోపించిన ప్రభువు కూరేశుల నేత్రాలను పెకిలించి వేయవలసినదిగా ఆజ్ఞాపించాడు. "పాపి అయిన నిన్ను చూచిన ఈ కళ్ళతో ఇక నాకు పని లేదు" అని కూరేశులు తామే స్వయంగా తమ నేత్రాలను తీసివేసికొన్నారు. ఈ విధంగా కూరేశుల నేత్రాలకు కల్గిన హానిని విని శ్రీరామానుజులు చాలా బాధపడి దీనికి అంతటికీ కారణం తమ పాపమే అని దుఃఖించినట్లే, ఇక్కడకూడా పరాంకుశ నాయకి తల్లి తన పాప ఫలంగానే తన కూమార్తె మోహాన్ని పొంది, బాధపడుతున్నదని తలచి, తనకు **"వల్ వినైయేన్"** అని నిర్దేశించుకొన్నది. (తన వద్ద తప్పు లేకపోయినా **"నానే దాన్ ఆయిడుక"** (నేనే దోషిని కానివ్వండి) అని అనడం ఉత్తమ శ్రీవైష్ణవలక్షణం - అని ఇక్కడ సూచింపబడింది. ఆ రీతిలోనే ఇక్కడ భగవద్రామానుజులు, పరాంకుశనాయకి తల్లి తమ పాపంవల్లనే బాధకల్గిందని పల్కి శ్రీవైష్ణవలక్షణాన్ని అనుష్ఠించి చూపించారని గమనించాలి)

భగవద్రామానుజుల కూరేశులను తమ పుత్రికగా భావించి ఆదరించారనే విషయాన్ని ఈ ఐతిహ్యం నిరూపిస్తున్నది. పెరియాళ్వార్ తిరుమొళిలోని **"ఒరు మగళ్తన్నై యుడైయేన్"** అనే సూక్తి వ్యాఖ్య కూడా దీనికి అనుగుణంగా స్మరణార్హం.

42. తిరువాయ్ మొళి - 4-6-1- ఈడు వ్యాఖ్యానమ్

(ఓర్ప్పాల్) ఇవళ్ తాన్ ఒరు కూరత్తాళ్వానోడు ఒక్కుమ్ కాణుమ్.

సందర్భం : నమ్మాళ్వార్లు **"తీర్ప్పారై యామిని"** అనే దశకంలో నాయకీ భావంతో మోహించి పడి ఉండగా, ఆమె ఆర్తికి కారణం ఇది అని తెలియలేక తికమకపడి, దానిని తెలిసికోవడంకోసం సోదెకత్తెను (కట్టు విచ్చి) పిలిచారు. అపుడు ఆ నాయకి చెలికత్తె ఆమె బాధకు కల కారణాన్ని విచారించి తెలిపే సందర్భం ఇది. **"ఓర్ ప్పాల్ ఉణ్ర్ర నన్నోయితు తేఱినోమ్"** (విచారించి చూస్తే ఈమె పొందిన బాధ ఇది అని తెలిసికొన్నాము) అని సఖి అంటున్నది. ఇక్కడ సఖి పరిశీలించి చూడడానికి కూరత్తాళ్వాన్‌ను ఉదాహరణంగా వ్యాఖ్యాత పేర్కొంటున్నారు.

వివరణం : పరిశీలించి చూడడంలో ఈ సఖి కూరత్తాళ్వాన్‌తో సరిపోతుంది- అని వ్యాఖ్యాత అంటున్నారు. వేదాంతవిషయాలను చక్కగా పరిశీలించి చూచి, తత్త్వాలను యథాతథంగా తెలిసి పల్కడంలో కూరత్తాళ్వాన్ చాలా సమర్థులు. వారివలె ఈ సఖికూడా నాయకి స్థితిని పరిశీలించి చూచి పల్కడంలో చాలా సమర్థురాలు- అని వ్యాఖ్యాత అభిప్రాయం.

"ఆరాయ ప్పుక్కాల్ ఒరు కూరత్తాళ్వానోడు ఒక్కుమ్ కాణుమ్ ఇత్తోళ్పిపడి" అని ఇరుపత్తు నాలాయిరప్పడిలో కూడా ఈ ఉదాహరణం ఉట్టంకింపబడింది.

43. తిరువాయ్ మొళి -4-7-5- ఈడు వ్యాఖ్య.

("ఏళ్గైయేన్") ఎన్ చాపలమేయితే యుళ్ళతు. ఆళ్వాన్ పణిత్త వరదరాజస్తవత్తిలే ఒరు శ్లోకత్తై క్కేట్టు ఎమ్బెరుమానార్ ఇప్పాశురమ్ కేట్టాల్ పెరుమాళ ఇరజ్గామై ఇల్లై. ఆళ్వాన్! ఉన్ ముకత్తై క్కాట్టికాణాయ్- ఎన్ను పార్త్తరుళినార్.

సందర్భం:- "ఇప్పొళ్దే వన్దిడాయ్ ఎన్ను ఏళ్గైయేన్ నోక్కువనే" (ఇపుడే నీవు రావాలి- అని ఆశను కలవాడనై నిరీక్షిస్తున్నాను) అని ఆళ్వార్లు కోసం ఎదురు భగవానుని చూస్తున్నారు. మధురమైన వచనాలకు భగవానుడు వశుడై, దాసులు అపేక్షితాలను తప్పక నెఱవేరుస్తాడు - అని దాసులు నమ్మడానికి వ్యాఖ్యాత ఒక చక్కని ఐతిహ్యాన్ని ఉట్టంకిస్తున్నారు.

వివరణం:- చోళరాజువల్ల నేత్రాలను కోల్పోయిన కూరేశులను చూసి బాధపడిన భగవద్రామానుజులు "కూరేశా! నేత్రాలు లేనివారుగా మిమ్ములను చూడడం నా వల్ల కావడం లేదు. స్వరూపవిరుద్ధమైనా కానివ్వండి. కంచి వరదరాజస్వామిని ఉద్దేశించి మీకు కన్నులను ప్రసాదించమని ప్రార్థించండి. వరదరాజస్వామి **"వరత్తరుమ్ పెరుమాళ్"** కనుక మీకు తప్పకుండా నేత్రాలను ప్రసాదిస్తాడు" అని అన్నారు. కూరేశులుకూడా అదే విధంగా వరదరాజస్తవం అనే ఒక గొప్ప స్తుతిని రచించారు. ఆ స్తుతిలోని **"నీలమేఘనిభ మంజనపుంజశ్యామకుంతల మనంతశయం త్వామ్, అబ్జపాణిపద మంబుజనేత్రం నేత్రసాత్కురు కరీశ! సదా మే"** (హస్తిగిరినాథా! కారుమబ్బువంటివాడవై, కాటుకరంగులో ఉండే నల్లని అందమైన కేశపాశాన్ని కలవాడవై, అనంతునిపైన పరుండి ఉన్నవాడవై, తామరలవంటి శ్రీహస్తాలను, శ్రీపాదాలను కలవాడవై, తామరలవంటి నేత్రాలను కలవాడవైన నిన్ను ఎల్లప్పుడు నేను నా కళ్ళతో సేవించేటట్లు అనుగ్రహించు) అనే శ్లోకాన్ని (23) వినిన శ్రీరామానుజులు "కూరేశా! ఈ శ్లోకాన్ని వింటే నిశ్చయంగా వరదరాజస్వామి మీకు నేత్రదానాన్ని చేయకుండా ఉండలేదు. మీ ముఖాన్ని స్వామి చూపించండి. మీకు దృష్టిని కల్గించే ఉంటాడు చూస్తాను" - అని అన్నారు.

ఈ ఐతిహ్యం వరదరాజస్తవంలోని **"త్వా ముదార భుజం మే"** (24) అనే శ్లోకానికి చెందినదని ఈడు వ్యాఖ్యానానికి గల **"అదైవళైన్దాన్ అరుమ్బదమ్"** లో తెలుపబడడం గమనార్హం. లభించని విషయంలో కూడా చాపలం కలుగుతందనే విషయానికి ఈ ఐతిహ్యం ఒక సంవాదంగా ఉట్టంకింపబడింది.

44. తిరువాయ్మొళి -4-9 ప్రవేశం - ఈడు వ్యాఖ్య.

ఆళ్వాన్ అజ్ఞనన్తిక్కే "ఏళాళు మిత్తైయోనిల్ తమ్ముడైయ ఆళ్వారైక్కు కూట్టావార్ ఉణ్డో? ఎన్ను లోకవృత్తాన్తత్తై అన్వేషిత్తు సంసారికళై ప్పార్త్తార్. అవర్కళ్, తామ్

ఇవ్విషయత్తిల్ ప్రవణరాయ్ అవళ్నిన్నిడైయ పేఱు, ఇవ్వులకిలే లాభాలాభమామ్బడి ఇరున్దార్కళ్. వాళేఱు కాణ త్తేళేఱు మాయ్న్దు అత్తై క్కణ్డవాఱే తమ్ ఇవ్వైవై మఱన్దార్. ఇవర్కళుడైయ ఇవ్వవే నెఞ్జిల్ పట్టతు. సర్వేశ్వరనై ప్పార్త్తార్. అవన్ సర్వజ్ఞనాయ్, సర్వశక్తియాయ్, ప్పరమోదారనాయ్, ఎల్లారుడైయ రక్షణత్తిలే దీక్షిత్తిరుక్కుమవనాయ్, సర్వాపరాధ సహనాయ్, సర్వనియంతావా యిరున్దాన్. అవన్ పడి ఇదువా యిరుక్క, ఇవై ఇప్పడి నోవు పడువైక్కు ఇవ్వడమ్ తన్నరశునాడో! ఎన్ను పార్త్తు, "నీ సర్వేశ్వరనాయ్, పరమకృపావానాయ్, ప్రాప్తనుమాయ్, ఇవళ్నిన్ క్లేశమ్ అఱిన్దు పరిహరిక్కైక్కు ఈదాన జ్ఞానశక్తియై ఉడైయైయుమా యిరుక్క, ఇవై ఇజ్గనే కిడన్దు నోవు పడువైక్కై పోరుమో! ఇవళ్నిన్నైక్కరమరమ్ శేర్క్కవేణుమ్"- ఎన్ను అవన్తిరువడికళై ప్పిడిక్క, "నమ్మాల్ శెయ్యలావతుణ్డో! ఇవై చేతనరాన పిన్బు, ఇవై తనక్కే రుచి ఉణ్డాక వేణుమే! నామ్ కొడుక్కిఱ ఇతు పురుషార్థమాకవేణుమే! పురుషన్ అర్థిక్క క్కొడుక్క మతితే పురుషార్థ మావతు. అచిత్తాయ్, నామ్ నినైత్తపడి కారియమ్ కొళ్ళుకితోమ్ అల్లోమే! ఇవళ్నిన్ను క్కునమ్ పక్కలిలే రుచిపిఱక్కైక్కు నామ్ పార్త్తువైత్త వళ్ళికళై అడైయ త్తప్పినపిన్బు నమ్మాల్ శెయ్యలావదిలై కాణుమ్. నీర్ ఇత్తై విడుమ్. "ఎన్ను సమాధానమ్ పణ్ణ, "నీ పణ్ణిన ఇతు పరిహారమాయ్, నాన్ సమాహితనావతు ఇవై తమ్ కార్యత్తుక్కు త్తామ్ కడవాయ్ నోవు పడుకిన్రన - ఎన్ను ఉమ్మాల్ శొల్లలామన్రో!" ఎన్న, "ఇవై చేతన రాకైయాలే ఇవళ్నిన్నిన్ వాశి అఱియవేణు మెన్ను నమ్మై ఒరు తట్టుమ్, శబ్దాదికళై ఒరు తట్టుమాకవైత్తు, ఉజ్గళుక్కు వేణ్డిళ్నిన్రొన్నైక్కొళ్ళుజ్గోళ్ "ఎన్న, శబ్దాదికళ్ ఇరున్ద తట్టు తాళ్నిన్రిరుక్కైయాలే అత్తట్టై అమైయుమ్ ఎన్ను పళ్నిన. నాముమ్ ఆన్డనైయుమ్ పార్త్తు ముడియుమై కాణుమ్ కైవాజ్గిళ్నిన్ను. ఇని నమ్మాల్ శెయ్యలావదిలై. ఇని నీరుమ్ ఇత్తై విడుమ్" ఎన్న, "ఆకిల్, ఉన్నై యొళ్గియ పుళుమ్బై పేఱుమ్ ఇవ్వవు మాయిరుక్కిఱ ఇవర్కళ్ నడువిల్ నిన్ఱుమ్ ఎన్నై మున్నమ్ వాజ్గవేణుమ్" ఎన్న, "మున్బే ఉమ్మై వాజ్గినోమే! సంసారికళోడు పొరున్నాద పడి పణ్ణినోమాకిల్, సంసారానుసంధానత్తాలే వన్ద క్లేశ మెల్లామ్ పోమ్బడి ఉమ్ముడైయ ఇరుప్పు ఇతుకాణుమ్- ఎన్ను పరమపదత్తిల్ అయర్వఱు అమర్కళ్ అడిమై శెయ్యప్పెరియ పిరాట్టియారుమ్ నాముమాక వ్యావృత్తమాక ఇరుక్కిఱ ఇఱుప్పై కాట్టిత్తన్దు, "అజ్గే ఉమ్ముడైయ నెఞ్జ ప్రవణమామ్బడి పణ్ణినోమాకిల్ ఇని ఉమక్కు ప్పేళ్నిన్ను క్కువాలుణ్డో! నామ్ శెయ్యవేణ్డువతెన్?" ఎన్న, ఇదై ఇరణ్డైయుమ్ అనుసంధిత్తు త్తరిత్తు, క్కృతార్థరాయ్ త్తలైక్కట్టుకిఱార్" ఎన్ను పణిక్కుమ్ ఆళ్వాన్. ఓరిడత్తే వళ్ళిపోకా నిఱ్ఱు, ఒరుసర్పమ్ తవళైయై ప్పిడిత్తు క్కూప్పిదా నిఱ్ఱు, "ఇతు ఆర్ అఱియ క్కూప్పిడుకిఱతు?" ఎన్ను మోహిత్తానామ్. ఇవ్వాళ్వాన్ ప్రకృతిక్కు చ్చేరుమే ఇవర్ నిర్వాహముమ్.

సందర్భం :- **"ఏళాళుమ్ ఇత్తైయోనుమ్"** అనే తిరువాయ్ మొళి దశకంలో (4-9) భగవానునకు ఉపయోగపడని శరీరం వద్దు, ప్రాణాలు వద్దు - అని అన్నిటినీ

ఆళ్వార్లు త్యజించడానికి సిద్ధపడ్డారు. అయితే, ప్రాణత్యాగం చేయాలన్నా అతనినేకదా కోరాలి. అందువల్ల – "స్వామీ! నన్ను నీవే కడతేర్చు" అని ఈ దశకంలో (4–9) అంటున్నారు. ఈ దశకార్థానికి కూరేశులు, ఎమ్బార్ మొదలైనవారు చేసిన అర్థనిర్వాహాలను వ్యాఖ్యాత ఈ సందర్భంలో ప్రస్తావిస్తున్నారు.

వివరణం :– "నిన్ను విశ్లేషించి పడే బాధకంటే, నిను ఏ నాడూ స్మరించని మహాపాపిష్ఠివారైన ఈ లోకుల మధ్యలో ఉండడం నాకు ఇంకా గొప్ప దుఃఖం కల్గిసున్నది. నీ విశ్లేషాన్ని ఏదో విధంగా భరించవచ్చు. కాని, నిన్ను తప్ప మిగిలినవారిని ఆశించే ఈ క్రూరలోకాల నడుమన ఉండడం భరించ వీలుకాకుండా ఉన్నది. అందుచేత, ఈ లోకంలో స్థితిని లేకుండా చేయాలి" అని ఆళ్వార్లు ప్రార్థిస్తున్నట్లు ఎమ్బార్ అభిప్రాయపడ్డారు. కూరేశులు వేఱు రీతిలో సువిశదమైన ఈ క్రింది వివరణాన్ని ఈ దశకానికి ప్రసాదించారు. **"ఏఱాళుమ్ ఇఱైయోనుమ్"** అనే గత దశకంలో భగవానునకు ఉపయోగపడని తమ శరీరం, ప్రాణం మొదలైనవి వద్దు – అని పల్కి తమ ఆర్తిని ఆళ్వార్లు వెలువరించారు. ఇదే రీతిలోని ఆర్తిని కలవారు ఎవరైనా తమకు సహాయంగా ఉన్నారా ? అని లోకులను గమనించారు. ఆ లోకులను చూస్తే, ఆళ్వార్లు భగవానుని విషయంలో ఎంతగా అభినివేశాన్ని కల్గి ఉన్నారో, అంతగా వారు ఈ లోకంలోని సుఖాలపైనే అభినివేశాన్ని కల్గి ఉన్నారు. కత్తిగాయం వల్ల కల్గిన బాధను చూచి తేలు కుట్టిన బాధ తెలియకుండా పోయినట్లు (అంటే – ఒకడు తేలు కుట్టినందువల్ల కల్గిన బాధతో అల్లాడుతూ ఉండగా, అతకి ఎదురుగా ఇంకొకడు కత్తిగాయంవల్ల మరింతగా బాధపడుతూ ఉన్నాడు. మొదటి వాడు, రెండవవాడు పడే ఎక్కువ బాధను చూచి అల్పమైన తన బాధను మఱచి పోయే రీతిలో) ఆళ్వార్లుకూడా తమ బాధను కొంచెం సేపు మఱచిపోయి, లోకులు పడే గొప్ప బాధను మనస్సులో భావించినవారై భగవానుని చూచారు. అతనిని చూస్తే, సర్వజ్ఞుడై, సర్వశక్తియై, మహోదారుడై, అందఱినీ రక్షించడంలో దృఢమైన దీక్షను కలవాడై, అన్ని దోషాలను క్షమించేవాడై, అందఱినీ నియమించి శాసించేవాడై ఉన్నాడు. అయినా, ఈ లోకులు ఈ విధంగా బాధపడడానికి ఏమి కారణం? అరాచకం అయిన కాడా ఈ లోకం!" అని ఆళ్వార్లు తలచారు. "స్వామీ! నీవు అందఱికీ నాథుడవు. దయాసముద్రుడవు. సర్వవిధబంధువువు. ఈ జీవుల కష్టాలను తెలిసి, వాటిని తీర్చగల జ్ఞానం, శక్తి – అనే వీనిని కలవాడవు. అయినా, ఈ లోకాలు క్లేశాలతో అలమటించడం తగునా? వీనిని నీవే దరిచేర్చాలి" అని అంటూ అతని శ్రీపాదాలను పట్టుకొని వేడారు. భగవానుడుపుడు – "ఆళ్వార్లూ! నేనేం చేయను? వీరు జ్ఞానాన్ని కలవారు. కనుక వీరికే మొదట రుచి (ఆశ) కలగాలి కదా! నేను వీరికి ఇచ్చే ప్రయోజనం పురుషార్థం అని కదా చెప్పబడుతున్నది. జీవుడు ప్రార్థించి పొందేదే కదా పురుషార్థం అవుతుంది. నేను తలచినట్లుగా వీరినుండి కైంకర్యాన్ని పరిగ్రహించడానికి వీరు చైతన్యరహితాలైన పదార్థాలు కావు కదా! వీరికి నా విషయంలో అభినివేశం కల్గడంకోసం

సృష్టించడం, అవతారాలను ఎత్తడం – మొదలైన పలు పలు కార్యాలను నేను చేసినా, వాటిలో అన్నిటినీ తప్పిన వీరినిగూర్చి నేను ఏమీ చేయలేను. వీరిని మీరు విడచి పెట్టండి" అని సమాధానం పలికాడు.

దీనిని విన్న ఆళ్వార్లు "నీవు పల్కిన ఈ బదులు విని, నేను సమాధానం పొందడానికి సాధ్యం కాదు. "వీరు తమ తమ కార్యాలకు తామే బాధ్యులు. అందువల్ల ఈ రీతిలో వాటిని తగిన ఫలాలను దుఃఖాల రూపంలో పొందుతున్నారు" అని నీవు అనడం తగునా! వీరిని ఈ విధంగా నియమించి, ప్రవర్తింపజేసేది నీవే కదా!?" అని మళ్ళీ అన్నారు. భగవానుడు – "ఆళ్వార్లూ! వీరు జ్ఞానాన్ని కలవారు కనుక, వీరే ఏది మంచి, ఏది చెడు – అని తెలిసికోవాలి"– అని భావించి నన్ను ఒక వైపు, ఈ లోకాలను ఒక వైపు ఉంచి, "మీకు కావలసిన దానిని తీసికోండి" అని అనగా, ఈ లోకంలోని సుఖాలు కిందకు తూగడంవల్ల, వాటినే కోరారు. ఈ జీవులు, నేను కూడా నాకు సాధ్యమైనంత వరకు చూచి, ఇక నా వల్ల కాదని అనుకొని వదలిపెట్టాను. ఇక, నా వల్ల ఏమీ చేయడానికి సాధ్యం కాదు. మీరు ఇకపై వీరిని వదలిపెట్టండి" అని పలికారు.

"ఆ విధంగా అయితే, నిన్ను తప్ప వేఱే విషయాంతరాలతో కాలక్షేపాన్ని చేసే వీరి మధ్యలో ఉండే నన్ను ముందుగా పిలుచుకొని పో"! అని ఆళ్వార్లు ప్రార్థించారు. భగవానుడు – "మిమ్ములను నేను ఇంతకుముందుగానే పరిగ్రహించాము కదా! ఈ లోకులతో సమానంగా కాకుండా విలక్షణులుగా మిమ్ములను చేసినపుడే మీ అభీష్టం పూర్తి అయినది కదా! ఈ లోకజీవనాన్నిగూర్చి ఆలోచిస్తే కలిగే దుఃఖం అంతా తీరేటట్లు ఏదైనా చూపిస్తాను ఉండండి" అని అంటూ. ఏ భ్రమవిప్రలంభాదులు లేని నిత్యసూరులు సేవించే లక్ష్మీదేవి, తాను కలసి పరమపదంలో ఉండే సన్నివేశాన్ని దర్శింపజేసి, ఈ నా సన్నివేశంలో మీ మనస్సు అభినివిష్టం అయేటట్లు చేసిన తర్వాత, ఇక మీ ప్రాప్యవిషయంలో నేను నెఱచేర్చవలసినది ఇంకా ఏమైనా ఉన్నదా?" – అని అన్నాడు. ఈ లోకులతో సమానంగా కాకుండా ఉండేటట్లు తమను చేయడం, లక్ష్మీదేవి, తాను కలసి వేంచేసి ఉండే సన్నివేశాన్ని తమకు దర్శింపజేయడం – అనే రెండిటిని తలచి సమాశ్వాసాన్ని పొందిన ఆళ్వార్లు **"ఒణ్డొళియాళ్ తిరుమకళుమ్ నీయుమే నిలా నిఱ్ప కణ్డు శదిర్న్దాళ్గిన్దేన్ అడైన్దేన్ ఉన్ తిరువడియే"** (అందమైన చేతిగాజులను కల శ్రీదేవి, నీవు వేంచేసి ఉండగా దర్శించి, ఆనందించాను. దుఃఖాలను అన్నిటినీ విడచాను. నీ శ్రీపాదాలను ఆశ్రయించాను) అని అనుసంధిస్తూ పరమానందాన్ని పొందారు – అని కూరేశులు ఈ దశకాన్ని వివరించారు. ఈ లోకాలు పడే దుఃఖాలను చూచి సహించలేని కరుణవల్ల ఆళ్వార్లకు ఏర్పడిన దుఃఖాన్ని వివరించే రీతిలో చేయబడింది – కూరేశులు ఈ వివరణం. కూరేశులు ఈ విధంగా వివరణాన్ని చేయడానికి కారణం వారు కరుణాపూర్ణమైన మనస్సును కల్గి ఉండడమే. దీనిని నిరూపించే ప్రయత్నంలో వ్యాఖ్యాత పూర్వం 15వ ఐతిహ్యంలో వివరింపబడ్డ కప్ప వృత్తాంతాన్ని ఉదాహరించారు. ఈ

విధంగా ఒక కప్ప విషయంలో కరుణను కల్గి ఉన్న కూరేశుల స్వభావానికి వారు చేసిన ఈ వివరణం చాలా తగినది కదా!

కూరేశుల అర్థనిర్వాహంలో, ఆళ్వార్లు **"కణ్ణాళా కడల్ కడైన్దాయ్! నణ్ణాతార్ ముఱువలిప్ప, నల్లు్ర్రార్ కరన్దేఙ్గ ఎణ్ణారా త్తుయర్ విళైక్కు మివై ఎన్న ఉలకియత్తై?"** అని ప్రారంభించి, భగవానుని సద్గుణానుసంధానం చేసి, సంసారుల నష్టాన్ని అనుసంధించి, నీవు ఇటువంటి గుణాధికుడవు అయినా వీరు ఈ విధంగా నష్టపోతున్నారే ! ఏమిది !" అని విన్నపించగా, భగవానుడు "మీరు ఈ విషయాన్ని విడచి మీ ఫలాన్ని గూర్చి మీరు గమనించండి" అని అన్నాడు. అపుడు ఆళ్వార్లు –"అయితే ఈ సంసారుతో సహవాసం నాకు దుస్సహం. వీరి మధ్యలో ఇక నేను లేకుండా నీ దగ్గరకు చేర్చుకో స్వామీ"– అని ప్రార్థిస్తున్నారని భావం. కూరేశుల నిర్వాహంలో పరరక్షణార్థంగా భగవానుని గుణానుసంధానం. ఎమ్బార్ నిర్వాహంలో స్వరక్షణానుగుణంగా అన్వయించాలి. ఆళ్వాన్ నిర్వాహంలో గుణవాచకశబ్దాలను ముందుగా కూర్చి అర్థాన్ని చెప్పాలి. ఎమ్బార్ నిర్వాహంలో పాశురక్రమంలో అన్వయం.

45. తిరువాయ్ మొళి – 5-3-7 – ఈడు వ్యాఖ్య.

"ఇత్తిరువాయ్మొళియై ఆళ్వాన్ రాజేంద్రశోళనిల్ సంధ్యాసదస్సిలే నిర్వహియా నిఱ్ఱు, ఆమరువి నిరై మేయ్త్తాన్ నమ్బియారెన్ఱు నూఱు వయస్సు పోన్దిరుప్పారొరువర్ నడుఙ్గ నడుఙ్గ ఎళున్దిరున్ద నిన్ఱ "ఆళ్వాన్ ! తలైమకళ్ తలైయాలే వణఙ్గ ప్పెఱుమో?" ఎన్న "పెఱుమ్. శిష్టాచార ముణ్డుకాణుమ్. శ్రీజనకరాజన్‌తలైమకళ్ అనుష్ఠిత్తాళ్ కాణుమ్. "శిరసా చాభివాదయ" ఎన్ఱు, "కర్మణైవ హి సంసిద్ధిం ఆస్థితా జనకాదయః" ఎన్ఱు జనకకులత్తిలుళ్ళార్క్కు మేలిల్లైయిరే ఆచారత్తుక్కు. ఇతుతాన్ ప్రణయరోషమ్ తలై ఎడుత్త చ్చొల్లుకిఱ వార్త్తైయో? ఆపేక్షై తోన్ఱ్ఱ చ్చొల్లుకిఱ వార్త్తైయో? ఎన్న, "కీళ్, తిరువడి వన్దపోతు ప్రణయరోషత్తాలే వన్ద శివిట్కు తోన్ఱ్ఱ చ్చొన్న వార్త్తైకళ్ అదైయ మాఱుమ్బడి కుళిర అవన్ వార్త్తై చ్చొల్ల, అనన్తనరమ్ తిరువుళ్ళత్తిలే ఒరు ప్రసాదమ్ పిఱన్దు, ప్రాప్తి ఇల్లామైయాల్ వద్ద అనప్తియుమ్ కిడక్క అరుళిచ్చెయ్కిఱ పాశురమ్" ఎన్ఱరుళిచ్చెయ్దార్.

సందర్భం :– **"ఆళ్విప్పిరాన్‌తన్నై . . . . తలైయిల్ వణఙ్గవుమాఙ్గిలో"** అని ఈ పాశురంలో పరాంకుశనాయకి భగవానుని కళ్ళతో చూచి, తన శిరస్సుతో నమస్కరించాలి– అనే తన ఆశను తెలుపుతున్నది. వ్యాఖ్యాత దీనికి సంబంధించిన సంవాదాలను కొన్నిటిని తెలియజేస్తున్నారు.

వివరణం:– ఒకసారి కూరేశులు **"రాజేంద్రశోళన్"** అనే ఊరిలో సాయంవేళ సభలో ఈ తిరువాయ్ మొళి దశకాన్ని వివరిస్తూ ఉన్నారు. అపుడు నూఱు సంవత్సరాలున్న **"అమరువి నిరై మేయ్త్తాన్ నమ్బియార్"** అనేవారు వినమ్రంగా లేచి,

"కూరేశా! ఇక్కడ నాయకి తన తలతో నమస్కరించాలని అంటున్నదే! విశ్లేషవ్యసనంలో మునిగి ఉండే నాయకి ఆ విధంగా తన శిరస్సుతో నమస్కరిస్తుందా?" అని అడిగారు. అందులకు కూరేశులు – "నమస్కరిస్తుంది. ఇంతకు ముందే ఈ విధంగా చేసినవారూ ఉన్నారు. రావణునిచేత విశ్లేషాన్ని పొంది, అశోకవనంలో చెఱలో పెట్టబడ్డ సీతాదేవి హనుమానునితో పలికేటపుడు – **"కౌసల్యా లోకభర్తారం సుషువేయం మనస్వినీ, తం మమార్థే సుఖం పృచ్ఛ శిరసాఽఽచాభివాదయ"** (రామా సుందర –38-56) (మంచి మనస్సునుకల కౌసల్య లోకానికి అంతటికీ నాయకుడైన ఎవరిని కన్నదో, అతని క్షేమాన్నిగూర్చి విచారించు. శిరస్సులో నమస్కరిస్తున్నదని చెప్పు) అని అన్నది కదా! అందువల్ల నాయకి శిరస్సుతో నమస్కరించడం అనేది ఉన్నది" అని బదులిచ్చారు.

"ఈ విధంగా సీతాదేవి శిరస్సుతో నమస్కరించినట్లుగా చెప్పడం ప్రణయకలహం వల్ల ఏర్పడిన కోపం తల ఎత్తి పల్కి మాటా!, లేక, ఆదరంతో పల్కిన మాటా?" అని ప్రశ్నించగా, "మొదట హనుమానుడు తన వద్దకు వచ్చినపుడు ప్రణయరోషంతో కొన్ని కఠినోక్తులను సీతాదేవి పలికింది. ఆమె కోపం అంతా తీరేటట్లుగా హనుమానుడు చల్లని మాటలను కొన్నిటిని చెప్పాడు. దానివల్ల సీతాదేవికి మనస్సులో గల కోపం తీరి, ఆశ్వాసం కల్గింది. శ్రీరామునితో కలియనందువల్ల కల్గిన కొఱత మనస్సులో కొంత ఉండడంవల్ల ఈవిధంగా ఏదో ఒక మాటను సీతాదేవి అన్నది – అని బదులిచ్చారు. (ఈడు వ్యాఖ్యలో ఈ సమాధానాన్ని ఇచ్చినది ఎవరు ? అనే విషయం స్పష్టంగా లేదు. దీనికి ముందున్న ప్రస్తావన కూరేశులకు సంబంధించినది కనుక, ఈ సమాధానాన్ని కూడా కూరేశులే ఇచ్చినట్లుగా నమ్బిళ్ళై చెప్పారని అనవచ్చు. లేక, నమ్బిళ్ళైయే ఈ బదులును ఇచ్చారని భావించినా విప్రతిపత్తి లేదు.)

46. తిరువాయ్‌మొళి –5-5-1– ఈడు వ్యాఖ్య.

కూరత్తాళ్వాన్ ఓరళవిలే నఞ్జీయార్ తిరువడి శార్న్దవాఱే ఇన్నముమ్ ఒరు వివాహమ్ పణ్ణువోమ్ ఎన్ఱు విచారిత్తు' ఇతుతాన్ క్రమత్తాలే వన్దు ఆళ్వానుక్కు విరోధమాయ్ త్తలైక్కట్టుమ్. ఇనిత్తాన్, "అనాశ్రమీ న తిష్ఠేత్' ఎన్ను శాస్త్రార్థమ్ శొల్లానిన్ఱతు. ఇశ్శాస్త్రార్థత్తై అనుష్ఠిప్పోమో? భాగవత పరిచర్యై ప్పణ్ణువోమో? ఎన్ఱు విమర్శియా, అస్సామాన్య ధర్మత్తిఱ్కట్టిల్ ఇవ్విశేషధర్మమే ప్రబలమ్– ఎన్ఱు తవిర్న్దార్.

సందర్భం:– తిరుక్కుఱుఙ్గుడినమ్బియొక్క రూపసౌందర్యంలో అభినివేశాన్ని పొందిన ఆళ్వార్లు, నాయకీ భావాన్ని పొంది, తమ తల్లిని చూచి పలికేటపుడు **"ఎఙ్గనేయో! అన్నైమీర్ కాళ్! ఎన్నై మునివదు నీర్!"** (ఓతల్లులారా! ఏమిటిది! మీరు నాపై కోపిస్తున్నారే! ఎందుకు?) అన్ని అన్నది. భగవద్విషయంలో అభినివేశాన్ని కలవారు వయస్సులో పుట్టినవారైన, శిష్యులైనా వారు కీర్తింపబడతగినవారే తప్ప కోపించగినవారు కారు – అని తెలుపుతూ వ్యాఖ్యాత దానికి ఉదాహరణంగా ఒక ఐతిహ్యాన్ని ప్రస్తావిస్తున్నారు.

వివరణం:– **"కూరత్తాళ్వార్"** (కూరేశుల తండ్రి) తమ పత్నిని నడువయస్సులోనే కోల్పోయారు. వారు పునర్వివాహాన్ని చేసికోవాలని ఆలోచించారు. అయితే తాము మళ్ళీ వివాహం చేసికొంటే, రాబోయే భార్య సవతితల్లి భావంతో ద్వేషాన్ని కల్గి పరమభాగవతులైన కూరేశులకు బాధ కల్గిస్తే, అది భాగవతాపచారంగా పర్యవసిస్తుంది కదా! అని కూడా తలచారు. గృహస్థులుగా ఉండడానికి వీలు లేదు. **"బ్రహ్మచారీ గృహస్థో వా వానప్రస్థోఽథ భిక్షుకః, అనాశ్రమీ న తిష్ఠేత్తు దిన మేక మనాపది"** (ఏ ఆశ్రమ ధర్మాలను అనుష్ఠించినవాడై ఉండకూడదు) అని మనుధర్మశాస్త్రం అంటున్నది. కనుక మళ్ళీ వివాహమాడి, శాస్త్రానుసారం ప్రవర్తించడమా? లేక, భగవద్భక్తుడైన కూరేశులకు సేవచేయడమా? ఏది మంచిది? అని ఆలోచించారు. చివరకు సామాన్యధర్మం అయిన గృహస్థాశ్రమాన్ని అనుసరించడంకంటే విశేషధర్మం అయిన భగవద్భక్తులకు సేవ చేయడమే ముఖ్యం. గొప్పది – అని నిర్ణయించుకొని కూరేశులకోసం తాము రెండవ వివాహం చేసికోవాలనే ఆలోచనను విరమించుకొన్నారు.

తిరువాయ్ మొళి పిళ్ళై అనుగ్రహించి పెరియాళ్వార్ తిరుమొళి (1–7–11) వ్యాఖ్యలో ఉట్టంకించిన ఈ ఐతిహ్యం మొట్టమొదటి ఐతిహ్యంగా ప్రస్తావింపబడింది.

47. తిరువాయ్‌మొళి 5–5–7 ఈడు వ్యాఖ్యానమ్

(నిత్తైన్దిత్యాది) ఆణ్డాళ్ ఒరునాళ్ భట్టరైయుమ్, శీరామప్పిళ్ళైయుమ్ కాట్టి "ఇవర్‌కళ్ వివాహప్రాప్తరానార్‌కళ్ పేశాతే ఇరుక్కిఱదెన్ ?" ఎన్న, "అకిల్, నాళై పెరుమాళ్ పాడే పోనవాఱే వరక్కాట్టు" ఎన్న, "అవర్‌కళైయుమ్ కొణ్డు తిరుమునేఱ్ నిఱ్క చ్చెయ్‌తే పెరుమాళ్ అరుళప్పాడిట్టు "ఒన్ఱు శొల్లువాయ్ పోలే యిరున్దాయా!" ఎన్ఱ తిరువుళ్ళమాక, "ఇవర్‌కళ్ వివాహప్రాప్తర్ ఆనార్‌కళ్ ఎన్ఱ శొల్లానిన్ఱార్‌కళ్" ఎన్న "నామే సదృశమాన ఇడత్తిలే సంబంధిత్తు తరుకిఱోమ్" ఎన్ఱ అరుళిచ్చెయ్య, పిన్‌నై నాళ్ మన్నియై క్కొణ్డు వన్దు నీర్ వార్‌త్తార్‌కళ్.

సందర్భం : భగవానుని సౌందర్యంలో అభినివేశాన్ని పొందిన మనస్సును కల పరాంకుశ నాయకి **"నిత్తైన్ద వన్ పళి నమ్ కుడిక్కు ఇవళ్ ఎన్ఱ అన్నై కాణకొడాళ్"** (మన కులానికి గొప్ప అపవాదును తీసికొనివస్తుంది– ఈమె అని తల్లి ఈమెను భగవానుని చూడడానికి అనుమతించడంలేదు) అని అంటున్నది. భగవానుడే అనుగ్రహాన్ని చూపాలి తప్ప, మనమే స్వయంగా ఆశపడడంకూడా దోషమే– అని తలచేది తల్లి– అని ఈసూక్తిని వివరించే వ్యాఖ్యాత ఈ సందర్భంలో ఉట్టంకించిన ఐతిహ్యం ఇది.

ఈ ఐతిహ్యం ఇరుపత్తు నాలాయిరప్పడివ్యాఖ్యలో కూడా **"పిళ్ళైకళ్ వివాహ ప్రాప్తమాక ఆళ్వాన్ ప్రతిపత్తియై నినైప్పతు"** అని ప్రస్తావింపబడింది. తిరువాయ్ మొళిలోని 7–2 దశకవ్యాఖ్యాన ప్రవేశంలో పెరియవాచ్చాన్ పిళ్ళై, తిరువిరుత్తంలోని 33వ పాశురాన్ని వ్యాఖ్యానిస్తూకూడా నమ్బిళ్ళై ప్రస్తావించారు.

వన్బళి– స్వప్రయత్నం అనే అర్థాన్ని వివక్షించి పై ఐతిహ్యం ఉట్టంకింపబడింది.

48. తిరువాయ్‌మొళి –5–10 దశక ప్రవేశమ్ – ఈడు వ్యాఖ్య.

ఇవర్ అవనుడైయ అవతారజ్ఞళైయుమ్ జగత్సృష్ట్యాదివ్యాపారజ్ఞళైయుమ్, "తాయార్ మకిళ్ ఒన్నార్ తళర తళర్ నడై నడన్ద" ఎన్గిఱపడియే ఆశ్రితరై వాళ్విక్కుమ్, అనాశ్రితరై యళియచ్చెయ్యుమ్ అడియిట్ట అప్పడి వళర్‌న్దరుళిన కృష్ణావతారత్తైయుమ్ అనుసన్ధిత్తు, మికవుమ్ శిథిలరాన ఇవర్ 'ధరిత్తు నిన్ఱున్నై అనుసన్ధిక్కవల్లేనాయ్ఱుడి పణ్ణియరుళ వేణుమ్' ఎన్ఱ అవనై శరణమ్ పుకుకిఱార్"– ఎన్ఱ ఆళ్వాన్ పణిక్కుమ్.

సందర్భం :– **"పిఱన్ద వాఱుమ్ వళర్‌న్ద వాఱుమ్"** అనే ఈ దశకంలో ఆళ్వార్లు శ్రీకృష్ణావతారంలో అత్యంతాభినివేశాన్ని పొంది, పాశురాలను అనుగ్రహిస్తున్నారు. ఇక్కడ వ్యాఖ్యాత నమ్బిళ్ళై మూడు పూర్వాచార్యోక్తనిర్వాహాలను ప్రస్తావిస్తున్నారు. అందులో కూరేశుల నిర్వాహం ఇక్కడ తెలుపబడుతున్నది.

వివరణం :– ఆళ్వార్ భగవానుని అవతారాలను, లోకాలను సృష్టించడం మొదలైన లీలలను అనుభవించారు. **"తాయార్ మకిళ్ ఒన్నార్ తళర"** (తల్లి సంతోషించేటట్లు, విరోధులు తల్లడిల్లేటట్లు) అని అంటూ పెరియాళ్వార్లు తమ ప్రబంధంలో (1–7–11) అని అన్నట్లే, భగవద్భక్తులను ఉజ్జీవింపచేయడంకోసం, దుష్టులను నశింపజేయడంకోసం పెరిగిన శ్రీకృష్ణావతారాన్ని తలచి ఆళ్వార్లు మనస్సులో ద్రవించిపోయారు. అందువల్ల ఆపైన భగవదనుభవాన్ని పొందలేకపోగా, "మనస్సు నీరుకాకుండా, ధరించగల్గి ఉండి, నిన్ను అనుభవించగల్గినవానినిగా నన్ను చేయాలి స్వామీ!" అని అంటూ భగవానుని శ్రీపాదాలలో శరణు పొందుతున్నారు – అనే వివరణాన్ని ఈ దశకానికి కూరేశులు పలికారు.

కూరేశుల ఈ నిర్వాహం ప్రకారం పాశురంలోని పదాలను **"నిన్ఱ నిన్ఱ నైకిన్ఱేన్ ఉన్నై ఎఙ్గనమ్ నినైకిఱ్పన్**? అని అన్వయించుకోవాలి.

ఈ సందర్భంలో కూరేశుల నిర్వాహం, ఎమ్బార్ నిర్వాహం, పిళ్ళాన్ నిర్వాహం– మూడు నిర్వాహాలు తెలుపబడ్డాయి. ఆళ్వాన్ నిర్వాహం **"నిన్ఱ నిన్ఱ నైకిన్ఱేన్"** అనే సూక్తిని అనుసరించి చేయబడింది. లేక, **"ఎన్నైయున్ శెయ్‌కై నైవిక్కుమ్"** అనే సూక్తిని బట్టికూడా చేయబడిందని అడైయవళైన్దాన్ అరుంబద వివరణం. ఆళ్వాన్ నిర్వాహం ఈ దశక ప్రమేయాన్ని మొత్తం కలుపుకొని చేయబడింది.

"కృష్ణావతారత్తిలే పోన్దార్ ప్రత్యాసత్తియాలే, అతువుమ్ తీర్థమ్ ప్రసాదిక్కైయాలే పట్టుత్తెతిన్దదు – ఎన్ఱ కూప్పిడుకిఱార్ – ఎన్ఱు ఆళ్వాన్ నిర్వాహమ్" – అని ఇరుపత్తు నాలాయిరప్పడిలో ఉన్నది.

49. తిరువాయ్‌మొళి -5-10-4- ఈడు వ్యాఖ్య.

(ఉయిరుణ్ణ ఉపాయఙ్గళుమ్) పణ్ణి ఒరు రాజా "రుద్రత్వమే పరత్వమ్ ఎన్నెళ్గుతి ఎళుత్తిట్టుత్తారుఙ్గోళ్" ఎన్న, అప్పడి పలరుమ్ ఎళుత్తి నిఱ్కచ్చెయ్‌తే, ఒరువర్, "వారాయ్! నీ ఇవ్వోలై కెడామల్ నోక్కి వైత్తాలిఱే ఇవనుడైయ పరత్వమ్ సాధిక్కలావతు. నీ నినైక్కిఱ దేవతైకళుక్కు ఉణ్డాన ఉచ్చ్రాయఙ్గళ్ సర్వేశ్వరనాలే- ఎన్ఱ ప్రమాణఙ్గళ్ శొల్లానిన్ఱన. ఆనపిన్ఱు, ఇన్ఱ నీ శొల్ల నాన్ ఎళుత్తిట్టు పోక్‌కిఱేన్. నాళై ఒరు విపక్షితన్ తోన్ఱి "ఇవన్ అజ్ఞనా యిరున్దానీ" ఎన్నక్కేట్పదిల్ ఇన్ఱ నీ నినైత్తదై చ్చెయ్‌దు కొళ్ళమాటాయో! ఎన్దార్.

సందర్భం:- **"కళ్ళవేదత్తై క్కొణ్డు పోయ్ పురమ్ పుక్కవాఱుమ్ కలన్దు అశురరై ఉళ్ళమ్ పేదమ్ శెయ్‌దిట్టు ఉయిరుణ్ణ ఉపాయఙ్గళుమ్"** (కపటవేషాన్ని ధరించి త్రిపురాలలో ప్రవేశించిన తీరు, అసురులతో కలసి, వారి మనస్సులలో భేదాన్ని కల్గించి, వారి ప్రాణాలను గ్రసించిన ఉపాయాలు) అని అంటూ భగవానుడు బుద్ధావతారంలో చేసిన లీలలను ఆళ్వార్లు ఇక్కడ ప్రస్తావిస్తున్నారు. ఈ విధంగా భగవానుడు చేసినా, త్రిపురాలను సంహరించినది శివుడేనని అందఱు భావించేటట్లుగా అతనికి అతిశయాన్ని కల్గించాడు. భగవానుడు అంతర్యామిగా నిలిచినందువల్లనే దేవతలు అందఱికీ అతిశయం కల్గుతున్నదనే విషయాన్ని వ్యాఖ్యాత ఈ క్రింది ఐతిహ్యాన్ని ఉదాహరిస్తూ సమర్థిస్తున్నారు.

వివరణం:- పూర్వం ఒక ప్రభువు "శివుడే పరతత్త్వం అని తాళపత్రంలో వ్రాసి, సంతకం చేసి ఇవ్వండి" అని అందఱినీ నిర్బంధించాడు. పలువురు అతనికి భయపడి సంతకం చేసి ఇచ్చారు. అపుడు ఒకరు (కూరేశులు) తమను ప్రభువు ఆ రీతిలో బలవంతం చేసినపుడు ఆ రాజును చూచి. "నీవు ఈ పత్రాన్ని జాగ్రత్తగా కాపాడితేనే శివుడు పరతత్త్వం అని నీవు నిరూపించగలవు. నీవు కొలిచే దేవతలకు ఉండే అతిశయాలు అన్నీ సర్వేశ్వరుడైన శ్రీమన్నారాయణుని అనుగ్రహంవల్ల వారికి లభించాయి - అని వేదాది ప్రమాణాలు అన్నీ ఘోషిస్తున్నాయి. అందువల్ల నీవు ఈనాడు ఈ విధంగా అన్నందుకు బదులుగా నేనుకూడా వీరివలెనే నీవు చెప్పినట్లు వ్రాసి సంతకం చేసి నీకు ఇచ్చాననే అనుకో. మఱునాడు తెలివైన విజ్ఞుడొకడు పుట్టి "వేదాలు అన్నీ నారాయణుడే పరదైవం అని చెబుతూ ఉండగా, ఇతడు ఈ విధంగా వ్రాసి పోయాడే! ఇతడు మూర్ఖుడు సుమా" అని కదా నన్ను తలుస్తాడు. ఈ విధంగా ఒకడు నన్ను మూర్ఖుడు అని అనడాన్ని వినడంకంటే, ఇపుడు నీవు నన్ను ఏమే చేయాలని అనుకుంటున్నావో, ఆ విధంగా చేసికో" అని అన్నారు.

ఈ ఐతిహ్యంలో రాజు పేరు, కూరేశుల పేరు శబ్దతః నిర్దేశింపబడకపోయినా, ఈ సంఘటన కూరేశులకు సంబంధించినదనే విషయం సుప్రసిద్ధం.

50. తిరువాయ్‌మొళి -6-8-1- ఈడు వ్యాఖ్య.

"అరుళాళప్పెరుమాళ్ ఎమ్బెరుమానార్ నోవిలే పిళ్ళై యుఱఙ్గావిల్లి దాసరై క్కొణ్డు ఆళ్వాన్ పుక, "ఆళ్వాన్ పణ్ణిన నెఞ్జాఱల్ ఆఱువతు ఆళవన్దార్ శ్రీపాదత్తేఱ పోనాలితే" ఎన్ఱ వార్తైయై నినైప్పతు. (అతావతు : ఆళ్వాన్ పెరుమాళ్ తిరువడికళిలే యెరు వార్తై విణ్ణప్పమ్ శెయ్‌తారాకిల్ అభిమతి సిద్ధియామెన్నై.)

సందర్భం :- భగవానునకు తన స్థితిని తెలియజేయవలసినదిగా పక్షులను దూతలుగా పంపే పరాంకుశ నాయకి, అవి చేసే పనికి ప్రత్యుపకృతిగా నిత్యవిభూతి, లీలావిభూతి - అనే విభూతిద్వయాన్ని వారి వశం చేస్తానని అంటున్నది. భగవానుడు తన సొత్తు అయిన విభూతిద్వయాన్ని ఈమెకు యథేష్టవినియోగార్హంగా చేశాడు. అందువల్లనే ఈమె ఈ విధంగా అన్నది- అని వివరిస్తూ వ్యాఖ్యాత ఈ క్రింది ఐతిహ్యాన్ని తెలిపారు.

వివరణం :- **"అరుళాళ పెరుమాళ్ ఎమ్బెరుమానార్"** అనే పూర్వాచార్యులు తమ శరీరంలో అస్వస్థతను పొంది బాధపడుతున్న సమయంలో వారి శరీర స్థితినిగూర్చి విచారించడం కోసం కూరేశులు పిళ్ళై ఉఱఙ్గావిల్లిదాసర్‌తో కలిసి వచ్చారు. అపుడు అరుళాళ పెరుమాళ్ ఎమ్బెరుమానార్ - "కూరేశులవల్ల కల్గిన దుఃఖం తీరడం ఆళవన్దార్ శ్రీపాదాలను పొందినపుడే కదా" అని అన్నారు.

ఈ మాటలోని ఆంతర్యం ఏమంటే - పరమపదాన్ని ఇచ్చే సామర్థ్యం కూరేశులకు ఉన్నప్పటికీ వారు తమకు దానిని అనుగ్రహించకుండా, ఈ విధంగా తాము బాధపడేటట్లు ఈ లోకంలో నిలిపి ఉంచడాన్ని, శరీరస్వాస్థ్యాన్నిగూర్చి విచారించడంకోసం కూరేశులు రావడాన్ని చూచి, "వీటివల్ల కల్గిన మనోవేదన పరమపదానికి పోయినపుడే తీరుతుంది"- అని అరుళాళప్పెరుమాళ్ ఎమ్బెరుమానార్ అన్నారు. తమకు ఆచార్యులైన ఎమ్బెరుమానార్ ఇంకా ఈ విభూతిలోనే వేంచేసి ఉన్నందున, "ఆళవన్దార్ శ్రీపాదాలను చేరినపుడే ఈ దుఃఖం తీరుతుంది- అని - అన్నారు.

ఈ ఐతిహ్యం సదాచార్యునకు (పరంపరయా) మోక్షప్రదత్వం ఉన్నదని తెలుపు తున్నది. అచార్యులైన భగవద్రామానుజులను విడచిపెట్టి **"ఆళవన్దార్ శ్రీపాదాలను చేరినపుడే"** అని అనడం ఎందుకంటే, భగవద్రామానుజులు అప్పటికి ఈలోకంలో వేంచేసి ఉన్నందువల్ల.

51. తిరువాయ్‌మొళి 7-5-1- ఈడు వ్యాఖ్యాన ప్రవేశం.

ఆళ్వాన్ ఒరుకాల్ ఇత్తిరువాయ్‌మొళి అడఙ్గలుమ్- రామావతార విషయమాక్కి నిర్వహిత్తాన్. అతుక్కడి ఆయిరత్తిలొన్ఱుమ్ కడలిల్ కుళప్పడియుమ్బోలే పెరుమాళుడైయ గుణత్తిల్ ఏకదేశఙ్గళిఱే అల్లాత అవతారఙ్గళెల్లావఱ్ఱిలుమ్ ఉళ్ళతెన్ఱు.

సందర్భం :- **"కళ్వార్ ఇరామైపిరానై అల్లాల్"** అని ప్రారంభం అవుతున్న ఒక దశకాన్ని ఆళ్వార్లు అనుగ్రహించారు. ఈ దశక ప్రవేశంలో ఈ కూరేశుల నిర్వాహం ప్రస్తావింపబడింది.

వివరణం :- ఈ దశకంలో ఆళ్వార్లు, భగవానుడు అనేక అవతారాలలో ఆవిష్కరించిన కల్యాణగుణాలనుగూర్చి పలికారు. మిగిలిన అవతారాలలో స్వామి చూపించిన గుణాలుకూడా శ్రీరాముని గుణాలలో ఏకదేశమే. కనుక కూరేశుల ఒక పర్యాయం ఈ దశకంలోని పది పాశురాలను శ్రీరామావతారపరంగా అన్వయించారు. ఈ నిర్వాహం ఇరుపత్తు నాలాయిరప్పడివ్యాఖ్యలో కూడా ఉన్నది. **"ఆళ్వాన్ పత్తుపాట్టియుమ్ రామకథావిషయమాక నిర్వహిత్తుప్పోరుమ్, రామావతారత్తిల్ పక్షపాతత్తాలే. "పేరెయిల్ శూళ్ కడల్నిన్నిలజై శెల్ల పిరాన్" ఎన్నుమ్, "మాఱునిరై త్తిరైక్కుమ్ శరజ్గళ్" ఎన్నుమ్ ప్రస్తుతమాన రామవృత్తాంతత్తై అనుసంధిత్తుమ్, అవ్వవతా రత్తిల్ ఉణ్డాన గుణచేష్టితాదికళిలే ఓరో నీర్మైకళై యుడైయ మల్ల అవతాజ్గళైయుమ్ ఇగ్గుణప్రసంగత్తాలే అనుసంధిత్తుమ్, ఇప్పడియాలే రామవృత్తాంతత్తై ప్పేశుకిఱార్" ఎన్ను ఆళ్వాన్ నిర్వాహమ్"** అని ఉన్నది.

52. తిరువాయ్ మొళి 7-10-5- దశక ప్రవేశం - ఈడు వ్యాఖ్య.

(పలరడియార్ముున్ను అరుళియా) "కిళక్కుత్తై రాజాక్కళ్ పొల్లాజ్గాలే ఇజ్గే నలివు పిఱక్కుమళవిల్ శెయ్వతెన్? ఎన్ను ఎమ్బెరుమానార్ అత్తై అనుసన్ధిత్తరుళి", "ఇద్దేశత్తై విడాతే నోక్కిక్కొణ్డిరున్దోమ్. ఇవ్విడత్తుక్కుమ్ అళివు వరుమ్బడి ఆసురవర్గమ్ మేలిడా నిన్ఱతు. మేల్ శెయ్యపడుప్ప తెన్? ఎన్ను పెరియనమ్బిక్కు అఱివిక్క, "నాన్ పెరుమాళు డైయ ఎల్లైయిలే ఒరు ప్రదక్షిణమ్ వరుమ్బడియాక ఉమ్ముడైయ శిష్యర్కళిలే ఒరువరై ప్పోరవిడువతు" ఎన్న, "అతుక్కావార్ ఆర్?" ఎన్న "ఎన్ పిన్నే పోకానిన్తాల్", "ఒరువన్ పిన్నే పోకానిన్తేన్" ఎన్ను తన్నెజ్జిల్ పదాతే ఛాయైపోలే ఎన్నై పిన్శెల్వన్ ఒరువన్ ఆకవేణుమ్" ఎన్న. "అతుక్కావార్ ఆర్?" ఎన్న 'ఆళ్వానై ప్పోక విడలాకాతో' ఎన్ఱారామ్.

సందర్భం :- **"పలర్ అడియార్ ముున్ను అరుళియ పామ్బణై అప్పన్"** (భగవద్భక్తులు పలువురు ఉండగా వారికంటే ముందుగా నాకు అనుగ్రహించిన శేషశయనుడైన స్వామి) అని ఆళ్వార్లు అనుగ్రహించారు. "వాల్మీకి, పరాశరులు, వేదవ్యాసులు, ముదలాళ్వార్లు వంటి పలువురు ఉండగా, నన్ను వెదకుతూ వచ్చి, నేను తిరువాయ్ మొళి పాడేటట్లు అనుగ్రహించాడే! - అని ఆశ్చర్యపడుతున్నారు" అని వ్యాఖ్యాత వివరిస్తూ ఈ సందర్భంలో ఒక ఐతిహ్యాన్ని ప్రస్తావిస్తున్నారు.

వివరణం :- శ్రీరంగానికి తూర్పు దిశను పాలించే చోళరాజుల అకృత్యాలవల్ల శ్రీరంగక్షేత్రానికి చాలా ముప్పు వాటిల్లింది. తీవ్రమైన స్వభావాన్ని కల ఒక చోళరాజు శ్రీవైష్ణవదివ్యాలయాలను పడగొట్టి, విగ్రహాలను పగులగొట్టడానికి ప్రయత్నించాడు.

శ్రీరంగానికి కూడా ఏదైనా ఆపదవస్తుందో! ఏమో! అని భీతిల్లిన భగవద్రామానుజులు "మేము శ్రీరంగాన్ని ఇంతవరకు రక్షిస్తూ వచ్చాము. అయితే దీన్నికూడా నాశనం చేయాలని రాజుల సైన్యం రావచ్చునని తోస్తున్నది. ఇపుడు ఏమి చేయాలి?" అని పెరియ నంబిని అడిగారు. దానికి పెరియనంబి **"శుఱ్ఱి నామ్ వలమ్ శెయ్య తుయర్ కెడుమ్ కడితే"** అనే రీతిలో భగవానునకు ప్రదక్షణం చేస్తే ఆపదలు తీరుతాయి. అందువల్ల నేను భగవానుని ప్రాకారంలో ప్రదక్షిణం చేయాలని అనుకుంటున్నాను. అపుడు నా వెనుక వచ్చేటట్లుగా మీ శిష్యులలో ఒకరిని మీ పంపండి" అన్నారు. "ఎవరిని పంపమన్నారు?" అని శ్రీరామానుజులు అడిగారు. "నా వెంటవచ్చేటపుడు వీరి వెనుకగా పోవలసి వచ్చిందే- అని భావించకుండా, నా నీడవలె నా వెంట వచ్చేవాడుగా అతడు ఉండాలి" అని పెరియ నంబి అన్నారు "అటువంటి వారెవరున్నారు?" అని మళ్ళీ శ్రీరామానుజులు ప్రశ్నించగా, అపుడు పెరియనంబి "కూరేశులను పంపవచ్చు కదా" అని అన్నారు. ఈ విధంగా భగవద్రామానుజుల కుండే పలువురు శిష్యుల మధ్యలో కూరేశులు ఒక్కరే ఈ అతిశయాన్ని కలవారని పెరియనంబి అనడం ఇక్కడ గమనార్హం. అందువల్ల ఇది కూరేశుల వ్యక్తిత్వవైలక్షణ్యానికి నిదర్శనం.

ఈ ఐతిహ్యానికి సదృశంగా - వానరవీరులెంతో మంది ఉండగా శ్రీరాముడు హనుమానుని ఒక్కని మాత్రం ప్రత్యేకంగా "ప్రీత్యా చ రమమాణోఽథ రాఘవః పరవీరహా, బహుమానేన మహతా హనూమంత మవైక్షత" అనే రీతిలో కటాక్షించడం, వేదవ్యాస మహర్షి, వాల్మీకి మహర్షి, పరాశరమహర్షి ఉండగా ఆళ్వార్లను విశేషంగా భగవానుడు కటాక్షించడం ఈడులో తెలుపబడింది. దీనివల్ల కూరేశుల వ్యక్తిత్వ గౌరవం ప్రస్ఫుట మౌతున్నది.

52. తిరువాయ్‌మొళి -8-8-2- ఈడు వ్యాఖ్య.

(అడియేన్ ఉళ్ళాన్) తిరుక్కోట్టియూర్‌నమ్బి శ్రీపాదత్తిలే అఱు మాసమ్ ఆళ్వాన్ సేవిత్తు నిన్ఱు పోర పుక్కవాతే, "ఆళ్వాన్! ఆళ్వార్ "అడియేనుళ్ళాన్" ఎన్నపడి కణ్డాయే! ఎన్న, "కృతార్థనానేన్" ఎన్ఱు పోన్దానామ్.

సందర్భం :- ఆళ్వార్లు భగవానునిగూర్చి **"అడియేన్ ఉళ్ళాన్ ఉడలుళ్ళాన్"** అని అనుగ్రహించారు. దీనికి సంబంధించిన ఐతిహ్యాన్ని వ్యాఖ్యాత ప్రస్తావిస్తున్నారు.

వివరణం :- ఆత్మకు అంతరంగనిరూపకం జ్ఞాతృత్వమా? లేక, శేషత్వమా? అనే విచారం ప్రసక్తమైనపుడు భగవద్రామానుజులు కూరేశులను తిరుక్కోట్టియూర్ నంబి దగ్గరకు ఆ సందేహ నివృత్తికోసం పంపారు. కూరేశులు ఆఱు నెలలకాలం నంబివద్ద సేవ చేస్తూ వారి వెంట ఉన్నారు. చివరకు తిరుక్కోట్టియూర్ నంబి కూరేశులను పిలచి "కూరేశా! నమ్మాళ్వార్లు **"ఎన్నుళ్ళాన్"** అని చెప్పవలసి వచ్చినపుడు **"అడియేనుళ్ళాన్"** అని అన్నారు చూచారా! (అందువల్ల ఆత్మకు శేషత్వమే అంతరంగనిరూపకం) అని అన్నారు. దీనిని విన్న కూరేశులు **"కృతార్థుణ్ణి అయ్యాను"** - అని అంటూ తిరిగి వచ్చారు.

"అడియేన్" అనే పదం ఆళ్వార్లు పలుచోట్ల ప్రయోగించారు. పలు సందర్భాలలో ఈ పదం శరీరంతో కూడిన ఆత్మనే నిర్దేశిస్తున్నది. కాని ఈ చోట (8-8-2) మాత్రం భగవానుడు చేతనాచేతనాలు అన్నిటిలో ఉన్నాడు - అనే అర్థంలో **"అడియేనుళ్ళాన్ ఉడలుళ్ళాన్"** అని ఆళ్వార్లు ప్రయోగించారు. **"ఉడలుళ్ళాన్"** అని ప్రత్యేకంగా ప్రయోగించి నందువల్ల **"అడియేనుళ్ళాన్"** అనే ప్రయోగానికి కేవలం ఆత్మ- అనే అర్థం. ఆ విధంగా ఆత్మను నిర్దేశించే టపుడు "ఆత్మలో ఉన్నాడు" అని కాని, నాలో ఉన్నాడు అనికాని ఆళ్వార్లు అనకుండా, **"అడియేనుళ్ళాన్"** అని అన్నందున ఆత్మకు శేషత్వమే అంతరంగనిరూపకం అని తిరుక్కోట్టియూర్ నంబి తెలిపారు. ఈ ఐతిహ్యం ఇరుపత్తు నాలాయిరప్పడి వ్యాఖ్యలో కూడా ఉన్నది.

ఇదే ఐతిహ్యం నాచ్చియార్ తిరుమొళి (12-2) పాశురవ్యాఖ్యలో, తిరువిరుత్తమ్ 85వ పాశురం పెరియావాచ్చాన్‌పిళ్ళై వ్యాఖ్యలో కూడా ఉన్నది. ఇంతకు ముందే ప్రస్తావింపబడింది.

"జ్ఞానానందమయ స్త్వాత్మా శేషో హి పరమాత్మనః" అని, **"జ్ఞానమయోఽమలః"** అని, **"దాస భూతా స్స్వత స్సర్వే"** అని జ్ఞానానందాలు, శేషత్వం ఆత్మకు నిరూపకాలుగా చెప్పబడుతున్నందున, వీటిలో అంతరంగ లక్షణం ఏది? అనే ప్రశ్న తల ఎత్తగా, భగవద్రామానుజులు సర్వజ్ఞులైనా, తత్త్వాన్ని ఆచార్యముఖంగా ఆవిష్కరింపజేయాలని, అదికూడా సచ్ఛిష్యుని ద్వారా ప్రకటింప జేయాలని కూరేశులను తిరుక్కోట్టియూర్ నంబి వద్దకు పంపించారు.

ఆత్మకు శేషత్వం అంతరంగనిరూపకం కావడం ఏమంటే - ఆత్మ భగవత్ప్ర కారతయా సత్తను పొందేది కనుక, ముందుగా శేషత్వాన్ని పురస్కరించుకొని నిరూపించి ఆతరువాతనే మిగిలిన రెండింటిని పుస్కరించుకొని చెప్పాలి- అని భావం.

53. తిరువాయ్ మొళి -8-9- ప్రవేశం - ఈడు వ్యాఖ్య.

"ప్రీతియల్ అన్యాపదేశముళ్ళతు ఇత్తిరువాయ్‌మొళి ఒన్ఱుమే" ఎన్ఱ ఆళ్వాన్ నిర్వహిక్కుమ్బడి.

సందర్భం :- **"కణ్‌గళ్ శివన్దు"** అనే పూర్వదశకంలో ఆత్మయొక్క స్వభావాన్ని, అంటే - ఆత్మ భగవానునకు శేషం అని ఆళ్వార్లు తెలిపారు. అందువల్ల ఆనందాన్ని పొందారు. ఆ ఆనందాతిశయంలో, తాము పురుషులమనే భావాన్ని మఱచి, ఒక నాయకీ భావాన్ని పొంది, తమ స్థితిని, అంటే - భగవానునకు తప్ప ఇంకొకరికి తగని స్వభావాన్ని (అనన్యార్హశేషత్వాన్ని) సఖీముఖంగా ఈ పాశురంలో తెలుపుతున్నారు. దీనినిగూర్చి కూరేశుల నిర్వాహాన్ని వ్యాఖ్యాత ప్రస్తుతిస్తున్నారు.

వివరణం :- "అనందంలో అన్యాపదేశంగా అనుగ్రహించిన దశకం ఇది ఒక్కటే" అని కూరేశుల సూక్తి. (ఈ వివరణం ఇరుపత్తు నాలాయిరప్పడి వ్యాఖ్యలోనూ ఉన్నది) ఆళ్వార్లు తమ స్థితిని మఱచి, ఒక నాయకియొక్క స్థితిని పొంది పలికే దశకాలు

అన్యాపదేశ దశకాలు అనబడతాయి. ఆ దశకాలలో 17 దశకాలు పిరాట్టిదశకు చెందినవి, 7దశకాలు తల్లి స్థితిలో పల్కినవి, మూడు దశకాలు సఖీ దశలోనివి. ఈ 27 దశకాలలో **"కరుమాణిక్క మలై"** అనే ఈ దశకం మాత్రమే ఆనందంతో అనుగ్రహింపబడింది. మిగిలినవి అన్నీ భగవానుని విశ్లేషించి, బాధపడే స్థితిలో అనుగ్రహించినవే - అని కూరేశుల అభిప్రాయం.

ఈ తిరువాయ్‌మొళి (దశకం) ప్రీత్యనుసంధానంలో కూడినది అనే కూరేశుల నిర్వాహానికి- **"అప్పన్ తిరువరుళ్ మూళ్‌కినళ్"** అనే ఆళ్వార్ల సూక్తి ప్రమాణం. ఈ నిర్వాహం ఇరుప్పత్తునాలాయిరప్పడి వ్యాఖ్యలో కూడా ఉన్నది.

54. తిరువాయ్ మొళి -8-10-3 ఈడు వ్యాఖ్య.

(శిఱుమా మనిశరాయ్)- "శిఱుమై పెరుమై యాకిఱ విరుద్ధధర్మద్వయత్తుక్కు ఏకధర్మియిల్ సమావేశమ్ కూడినపడి ఎఱ్ఱనే?" ఎన్ను భట్టర్ బాల్యత్తిలే ఆళ్వానై క్కేట్కు, "నమ్మోడొక్క అన్నపానాదికళ్ ధారకమ్ ఎన్నలాయ్, భగవద్విషయత్తిల్ అవగాహనమ్ పార్‌త్తాల్ నిత్యసూరికళోడొప్పర్‌కళ్" ఎన్నలాయిరుక్కిఱ అణ్డాన్, అరుళాళప్పెరుమాళ్, శ్రీగోవిందప్పెరుమాళ్ - ఇవర్‌కళ్ కాణ్ శిఱుమామనిశరా కిఱార్‌కళ్- ఎన్ఱు పణిత్తాన్.

సందర్భం:- ఆళ్వార్లు భగవానుని దాసుల గొప్పతనాన్నిగూర్చిన పల్కుతూ **"శిఱు మామనిశర్"** అని అన్నారు. దీనినిగూర్చిన ఒక ఐతిహ్యాన్ని వ్యాఖ్యాత తెలుపుతున్నారు.

వివరణం:- చాలా చిన్నతనంలో భట్టర్, తమ తండ్రి అయిన కూరేశులవద్ద **"శిఱుమామనిశర్"** అని, అంటే - చిన్నతనం, పెద్దతనం రెండింటినీ కలవారనికదా అర్థం. ఇవి రెండూ పరస్పరం విరుద్ధవిశేషణాలు కదా! ఈ రెండు ఒకే చోట ఉన్నట్లు తెలుపడంతగునా? ఈ విధంగా ఆళ్వార్లు పల్కడంలో ఆంతర్యం ఏమి?" - అని అడిగారు. కూరేశులు అపుడు **"ముదలియాణ్డాన్, అరుళాళప్పెరుమాళ్ ఎమ్బెరుమానార్, ఎమ్బార్"** మొదలైనవారు మనవలెనే అన్నపానాదులను స్వీకరించేవారు కావడంవల్ల మనవలెనే నైచ్యాన్ని కలవారు - అని తోస్తుంది. కాని, వారికి భగవానునిపట్ల ఉన్న అతిశయితమైన అభినివేశాన్ని చూస్తే చాలా గొప్పతనాన్ని కలవారని తోస్తుంది. అందువల్ల ఆకారం చిన్నవారై, జ్ఞానంలో గొప్పవారైన దాశరథి, ఎమ్బార్‌వంటివారు **"శిఱుమామనిశర్"** అని బదులిచ్చారు. ఈ ఆప్తసంవాదం ఇరుపత్తు నాలాయిరప్పడి వ్యాఖ్యలో కూడా ఉన్నది.

55. తిరువాయ్‌మొళి 9-1 ఈడు వ్యాఖ్యాన ప్రవేశమ్

ఆప్పన్ తిరువళుందూర్ అరైయర్ ఆశ్రయిత్తదుమ్, తిరువాయ్‌మొళి కేట్టతుమ్ ఆళ్వానోడేయిఱే. "శయమే అడిమై తలైనిన్ఱార్" ఎన్ఱతు శ్రీభరతాళ్వాన్ పోల్వారై;

"నీక్క మిల్లా అడియార్" ఎన్నతు ఇళైయపెరుమాళ్ పోల్వారై; "కోదిల్ అడియార్" ఎన్నరు శ్రీశత్తుళ్ళూళ్వాన్ పోల్వారై క్కాణుమ్" ఎన్ను ఆళ్వాన్ పణిత్తానాక పుణిప్పర్.

సందర్భం : "నెడుమాళ్కడిమై" అనే దశకంలో నమ్మాళ్వార్లు భగవద్భక్తుల గొప్పతనాన్ని పలు విశేషణాలతో వర్ణించారు. నమ్మాళ్వార్లు అనుగ్రహించిన విశేషణాలకు తగిన లక్ష్యభూతులైన పురాణపురుషులనుగూర్చి కూరేశులు పల్కిన వార్త ఈ సూక్తిలో ఉదాహరింపబడింది.

వివరణం : ఆప్పాన్ తిరువళుందూర్ అరైయర్ కూరత్తాళ్వాన్ శిష్యులు, వారివద్దనే తిరువాయ్ ప్రబంధంలోని అర్థాలను శ్రవణం చేశారు. అందువల్ల కూరత్తాళ్వాన్ పల్కిన సూక్తులను చక్కగా అర్థం చేసికొన్న ఆప్పాన్ తిరువళుందూర్ అరైయర్ భగవద్భక్తులనుగూర్చి నమ్మాళ్వార్లు అనుగ్రహించిన విశేషణాలకు కూరేశులు తెల్పిన వివరణాన్ని గూర్చి పలికారు. **"శయమే అడిమై తలైనిన్ఱార్"** (8-10-2) అనే సూక్తికి స్వయంగానే కైంకర్యంలో అగ్రేసరులై ఉండేవారు- అని భావం. అంటే- స్వయం ప్రయోజనంగా (ఏ ప్రత్యుపకృతిని ఆశించకుండా) భగవానుని ఆనందాన్నే మనస్సులో భావిస్తూ కైంకర్యాన్ని చేసే వారిలో ముందుండేవారిని ఈ ప్రయోగం తెలియజేస్తుంది. కనుక శ్రీరామచంద్రుని అభిప్రాయాన్ని అనుసరిస్తూ, ఆ స్వామివిశ్లేష దుఃఖాన్ని కూడా మనస్సులో భావించకుండా, అయోధ్యకు తిరిగి వెళ్ళి రాజ్యపాలన భారాన్ని మోసి, కైంకర్యనిర్వహణలోని పర్యంతసీమలో నిలచిన భరతాళ్వాన్‌వంటివారిని ఈ విశేషణం తెలుపుతుంది. **"నీక్క మిల్లా అడియార్"** (8-10-10) అనే ప్రయోగం ఎల్లప్పుడు భగవానుని విశ్లేషించకుండా, కైంకర్యాన్ని చేసే వారిని తెలుపుతుంది. కనుక, శ్రీరాముని విడిచి ఉండకుండా, ఆ స్వామి వెంటనే ఉంటూ కైంకర్యాన్ని చేసిన లక్ష్మణునివంటివారిని; **"కోదిల్ అడియార్"** (8-10-9) అనే ప్రయోగం ఏ దోషం లేని భక్తులను తెలుపుతుంది. కనుక శ్రీరామచంద్రుని ఆశ్రయించడమనే దోషం లేని, ఆస్వామి భక్తుడైన భరతాళ్వాన్‌ను మాత్రమే ఆశ్రయించిన శత్రుఘ్నాళ్వాన్‌వంటివారిని తెలుపుతుంది- అని కూరేశులు వివరించారని ఆప్పాన్ తిరువళుందూర్ అరైయర్ తెలిపారు.

"అప్పాన్ తిరువళుందూర్ అత్తైయర్" పల్కినది చాలా ఆప్తవాక్యం అనే విషయాన్ని **"అప్పాన్ .... ఆళ్వానోడే యిత్తే"** అనే ప్రయోగం సూచిస్తుంది. వీరి వ్యవహారం నామం **"అళగియమణవాళప్పెరుమాళ్ తిరువళుందూర్ అత్తైయర్"** అని అరుంబదంలో తెలుపబడింది.

56. తిరువాయ్ మొళి -10-10-1 - ఒన్బదినాయిరప్పడి వ్యాఖ్య.

"ఇప్పాట్టిల్ పదయోజనై ఆళ్వాన్ పడి.

సందర్భం:- "మునియే! నాన్ముకనే! ముక్కణ్ణప్పా!" అని ప్రారంభం అయే ఈ పాశురంలోని పదాలకు కూరేశులు అనుగ్రహించిన నిర్వాహం తెలుపబడుతున్నది.

వివరణం:- "నాన్ముకనే! ముక్కణ్ణప్పా!" అనే పదాలు చతుర్ముఖునకు అంతర్యామిగాను, త్రినేత్రుడైన రుద్రునకు అంతర్యామిగాను ఉండే భగవానునే (సామానాధికరణ్యంతో) నిర్దేశిస్తున్నది అనే అర్థాన్ని కూరేశులు అనుగ్రహించారు.

ఈ నిర్వాహాన్ని కూరేశులు చేసినట్లుగా ఒన్బది నాయిరప్పడిలో మాత్రమే తెలుపబడింది. అయితే వివరణంమాత్రం మిగిలిన అన్ని వ్యాఖ్యలలో ఉన్నది.

57. తిరువాయ్ మొళి -10-10-1 - ఇరుపత్తు నాలాయిరప్పడి వ్యాఖ్య.

సందర్భం:- "ఎన్ కళ్వా" అని ఆళ్వార్లు అనుగ్రహించిన సూక్తిని కూరేశులు వివరించిన రీతిని వ్యాఖ్యాత పెరియవాచ్చాన్ పిళ్ళై తెలుపుతున్నారు.

వివరణం:- ఏ కారణం లేకుండానే నీవే వచ్చి నీ రూపసౌందర్యాన్ని చూపి, నన్ను వశీకరించుకొన్నావే! - అని ఆళ్వార్లు అంటున్నారని కూరేశులు అర్థం చెప్పారు.

ఈ నిర్వాహం కూరేశులు చేసినట్లుగా ఇరుపత్తునాలాయిప్పడిలో మాత్రం తెలుపబడింది.

ముగింపు:- ఇంతవరకు తెలుపబడిన పలు ఐతిహ్యాలు, నిర్వాహాలు కూరేశుల రూపవైలక్షణ్యాన్ని, జ్ఞానవైభవాన్ని, ఆత్మగుణ సంపత్తిని, బుద్ధిచాతుర్యాన్ని నిరూపిస్తున్నవి. కూరేశుల విషయంలో సమకాలీనులకు, తదనంతరకాలీనులకు గల ఆదరాతిశయం, భక్తిప్రపత్తులు వీటివల్ల వ్యక్తమవుతున్నవి. "భగవద్రామానుజుల పట్ల వీరికి గల భక్తిని, భగవద్రామానుజులకు వీరిపట్ల గల ఆదరాతిశయాన్ని నిరూపించే పలు ఐతిహ్యాలు ఇందులో ఉన్నాయి. ఇవేకాక, రహస్యగ్రంథాలలో, వాటి వ్యాఖ్యలలో, పూర్వాచార్యులు రచించిన పలుగ్రంథాలలో అక్కడక్కడ కన్పించే కూరేశులకు సంబంధించిన మఱి కొన్ని ఐతిహ్యాలుకూడా విన్నపింపబడతాయి.

కూరేశుల వార్తలు

(వార్తామాలై నుండి)

1) ద్వయత్తిల్ అర్థమ్ ఉపాయాంతరజ్ఞళై ప్పెఱాతు. శబ్దమ్ సాధనాన్తరజ్ఞళై ప్పెఱాతు. ప్రపత్తియై సకృదెన్ఱు ఆళ్వాన్.

ద్వయానికి అర్థం - భగవానుడే సిద్ధోపాయం అని, ఈ సిద్ధోపాయం కర్మ - జ్ఞాన - భక్తులనే అన్యోపాయాలలో అన్వయం ఉంటే తాను ఉపాయం కాదు - అని. ద్వయంలోని శబ్దం - తిరుమంత్రం మొదలైన మిగిలినమంత్రాలవలె జప-హోమాందులతో సాధనాంతరాలకు ఉపయోగపడదు - అని తెలుపుతున్నవి పెరియవాచ్చాన్ పిళ్ళై తనిశ్లోకంలోని **"సకృదేవ"** అనే శ్లోకవ్యాఖ్యానం ఆరంభంలో గల వాక్యాలతో

సమన్వయించి ఈ క్రింది విధంగా అర్థం చెప్పుకోవాలి. **"సహసా"** అనే పదానికి బదులుగా **"సకృత్"** అనే పదం ప్రయోగించడం ఉన్నందున, **"సకృత్"** అనే పదానికి **"సహసా"** (వెంటనే) అనే అర్థాన్ని గ్రహించాలి. అంటే – తన అయోగ్యతను చూచి వెనుకంజ వేయకుండా, భగవానుని వాత్సల్యాది కల్యాణగుణాలను విశ్వసించి, చటుక్కున శరణు పొందిన వానిని అని భావం. ఇది కూరేశుల అర్థనిర్వాహం (59వ వార్త).

2) నమ్బి శ్రీగోవర్ధనదాసర్ "అర్జునన్ ప్రశ్నమ్ పణ్ణ, సర్వజ్ఞనుమాయ్, సర్వశక్తియుమాయిరుక్కిఱవన్ పణ్ణుపోల్ శొల్లమాట్టేనెన్నతెన్ ? ఎన్ను కూరత్తాళ్వాన్ కేట్క", ద్రౌపదికుఴల్ ముడిత్తపిన్ను పణ్ణుపోలే అవన్ వాయ్ పుఱప్పడుమో? – ఎన్ను తిరువుళ్ళక్కురుత్తు" ఎన్ను అరుళిచ్చెయ్దార్.

భగవద్గీతను విన్న చాలా దినాల తరువాత అర్జునుడు గీతార్థాన్ని మళ్ళీ ఉపదేశించాలని శ్రీకృష్ణుని అడిగినపుడు, గీతలో తాను చెప్పిన విషయాన్ని అంతటి నీ మఱచిపోయిన అర్జునుని చూచి, **"దుర్మేధాసి పాండవ"** ఇత్యాదిగా నిందించి, శ్రీకృష్ణుడు సంగ్రహంగా అను గీతను ఉపదేశించిన సందర్భానికి సంబంధించినది ఈ వార్త. "సర్వజ్ఞుడై, సర్వశక్తియై ఉండే శ్రీకృష్ణుడు పూర్వంవలె విస్తృతంగా గీతను ఎందుకు ఉపదేశించలేదు"? అన్నది ప్రశ్నలోని తాత్పర్యం. **"అర్జునునక్కు ప్రపత్త్యుపదేశమ్ పణ్ణిర్ర్రుమ్ ఇవళుక్కాక"** (శ్రీవచన భూషణమ్ – 22) (అర్జుననకు ఉపదేశాన్ని చేసినది కూడా ద్రౌపదికోసమే) అనే రీతిలో ద్రౌపది కేశపాశం ముడి వీడి ఉండడాన్ని చూచి, దానిని ఏ రీతిలో అయినా ముడివేయాలనే పట్టుదలతోనే ఉపనిషత్తులలో అక్కడక్కడ ఇమిడి రహస్యంగా ఉండే అర్థాలను అన్నిటినీ యుద్ధరంగంలో శ్రీకృష్ణుడు గీతరూపంలో వ్యక్తం చేశాడు. అందువల్లనే ద్రౌపది కేశాలు ముడివేసిన తర్వాత అర్జునుడు మళ్ళీ అడిగినా శ్రీకృష్ణుడు పూర్వంవలె వివరంగా పలుకలేదు – అని కూరేశుల సమాధానంలోని తాత్పర్యం **(114వ వార్త)**

3) ఎమ్బెరుమానార్ అరుళిచ్చెయ్త వార్త్తై. స్వస్వరూపవైశద్యదశైయావతు – పరస్వరూప విషయత్తిల్ స్వీకారత్యాగప్రకారప్రతిపత్తినివృత్తియిల్ వ్యవస్థితనాయ్ పోరుకై. "విట్టు పుర్ర్ర" – ఎన్తరుళిచ్చెయ్వర్ ఆళ్వాన్. "పర్ర్ర విడ" – ఎన్తరుళిచ్చెయ్వర్ ముదలియాణ్డాన్. "పిచ్చు త్తెళిన్దు కణ్ విళిక్కై" ఎన్ను ఆణ్డాన్.

(భగవద్రామానుజులు అనుగ్రహించిన వార్త – తన స్వరూపాన్ని స్ఫుటంగా తెలిసికోవడం అంటే – భగవానుని పరత్వాన్ని తెలియడంకంటే, స్వప్రయత్నాలైన అన్ని ఉపాయాలను సవాసనగా విడువడంలోను, తాను చేసే ఆశ్రయణం ఉపాయం అనే భావన తొలగిపోవడంలోను స్థిరబుద్ధిని కల్గి ఉండడమే – అని. **"మున్దుఱ ఉరైక్కేన్ విరైక్కుழల్ మడవార్ కలవియై విట్టు . . . . మాలిరుమ్ శోలై వణఙ్గుతుమ్ వా మడనెఞ్శే!"** (పెరియ తిరు–9–8–1) అనే రీతిలో విషయాంతరాలను విడచిపెట్టియే భగవానుని

ఆశ్రయించాలి" అని కూరత్తాళ్వాన్ అంటారు. ఇది కూరేశులవంటి వైరాగ్యశీలురకు తప్ప సామాన్యుల సాధ్యం కాదు"– అనే భావనతో ముదలియాణ్డాన్ విషయాంతరాలను విడచిపెట్టకపోయినా, భగవానుని ఆశ్రయిస్తే **"మాఱ్పాల్ మనమ్ శుళిప్ప మఱ్ఱైయర్ తోళ్ కైవిట్టు"** (ముదల్ తిరు–14) అనే రీతిలో భగవానుని స్వరూపాదులలోని భోగ్యత జీవుని క్రమక్రమంగా విషయాంతరాలను విడిచిపెట్టేటట్లు చేస్తుంది. పాలను తాగి పిత్తరోగాన్ని తీర్చుకొనట్లే ఇది. సామాన్యులకు విషయాంతరాలను విడచిపెట్టే భగవానుని ఆశ్రయించడం అనేది పాలు మొదలైన ఔషధాలను సేవించకుండా పిత్తరోగం పోయి, ఆరోగ్యం కల్గడంవలె సాధ్యం కాని కార్యం" అని ఆణ్డాన్ అభిప్రాయం (116వ వార్త)

4) పిళ్ళై (ఉఱ్ఱాళ్విల్లిదాసర్) కూరత్తాళ్వాన్ శ్రీపాదాత్తిలే శెన్ఱు దణ్డనిట్టు, ఆచార్యలక్షణ మిరుక్కుమ్బడి ఎఙ్గనే?" ఎన్ను విణ్ణప్పమ్ శెయ్య, ఆళ్వాన్ అరుళిచ్చెయ్దపడి – "శిష్యన్ విషయత్తిల్ ఆచార్యన్ భర్తృసమనాయ్, శరీరసమనుమాయ్ ధర్మసమనుమాయ్ ఇరుక్కుక్కడవన్. అతావదు – ఏవి క్కొళ్ళుకైయుమ్, ఎడుత్తు ఇడువిక్కైయుమ్. అతావతు – అచేతనత్తై క్కొణ్డు నినైత్తపడి వినియోగమ్ కొళ్ళుమాపోలే వినియోగమ్ కొళ్ళుకైయుమ్, ఎడుత్తు క్కొళ్ళుకైయుమ్" ఎన్ను అరుళిచ్చెయ్వర్.

పిళ్ళై ఉఱ్ఱాళ్ విల్లిదాసర్ (ధనుర్దాసు) కూరేశుల శ్రీచరణాలవద్దకు పోయి నమస్కరించి, ఆచార్యలక్షణం ఉండే తీరు ఏమి ? అని విజ్ఞాపన చేయగా, కూరేశులు "శిష్యుని విషయంలో ఆచార్యుడు భర్తతోవలె శరీరివలె, ధర్మివలె ఉండాలి. అంటే – శిష్యుని విషయంలో ఆచార్యుడు – పత్నిని భర్త నియమించి పని చేయించుకొన్నట్లుగా, ఆజ్ఞాపించి కార్యాన్ని చేయించుకొనేవాడై ఉండాలి. శరీరాన్ని శరీరి అయిన ఆత్మ నిలవడం, కూర్చోవడం, పరుండడం మొదలైన స్థితిగతులలో తన ఇష్టానుసారంగా వినియోగించుకొన్నట్లుగా వినియోగించుకొనేవాడై ఉండాలి. ధర్మి అయిన ఆత్మ తన ధర్మం అయిన ధర్మభూతజ్ఞానాన్ని ఎల్లప్పుడు తనలోనే కల్గి ఉండి, తత్కార్యాలను సాధించినట్లు, ఆచార్యుడు శిష్యుని తనవద్దనే ఉంచుకొని అతనివల్ల కార్యాలను పరింగ్రహించాలి – అని భావం. (168వ వార్త)

5) పెరుమాళ్ ఆళ్వానై ప్పార్త్తు "నీ ఉనక్కు వేణ్డువతు నమ్మై వేణ్డి క్కొళ్" ఎన్ను తిరువుళ్లమాక, "నాయన్దే! అడియేనుక్కు పణ్ణే ఎల్లామ్ తన్దరుళిర్ర్రు" ఎన్ను విణ్ణప్పమ్ శెయ్య, "ఇలై, ఇప్పోదు నమ్మై వేణ్డిక్కొళ్" ఎన్న, "ఆకిల్ నాయన్దే! అడియేనోడు సంబంధముడైయార్ ఎల్లరుమ్ పరమపదమ్ పెఱవేణుమ్" ఎన్న, "తన్దోమ్" ఎన్ను తిరువుళ్ళమాక, ఇత్తై ఉడైయవర్ కేట్టరుళి క్కాశాయత్తై ముడిన్దేఱిట్టు ఆర్త్తుక్కొళ్ళ, "ఇదు ఎన్?" ఎన్న, "నమక్కు ఆళ్వానోడే సంబంధముణ్డాకైయాలే పరమపదమ్ పెఱలామే" ఎన్ను అరుళిచ్చెయ్దార్.

శ్రీరంగనాథుడు కూరేశులను చూచి "మీరు మీకు కావలసిన దానిని నన్ను అడగండి" అని అనుగ్రహించగా, "స్వామీ! దాసుడనైన నాకు ఇంతకు ముందే అన్నిటినీ అనుగ్రహించావే" అని కూరేశులు విన్నపం చేశారు. "ఆ విధంగా కాదు. ఇపుడు నన్ను మీరు దేనిని అయినా ప్రార్థించాలి" అని శ్రీరంగనాథుడన్నాడు. "అయితే, స్వామీ! దాసునితో సంబంధాన్ని కలవారు అంతా పరమపదం పొందాలి" అని కూరేశులు వేడగా, "ఇచ్చాను (ఆ వరాన్ని ఇచ్చాను)" అని శ్రీరంగనాథుడు అనుగ్రహించాడు. దీనిని శ్రీరామానుజులు విని. తమ ఉత్తరీయకాషాయాన్ని చేతితో పట్టుకొని పైకి ఎగురవేసి ఆనందధ్వానాన్ని చేశారు. "ఇదేమి" అని అక్కడి వారు ప్రశ్నించగా – "నాకు కూరేశులతో శిష్యాచార్యరూపమైన సంబంధం ఉన్నందువల్ల పరమపదాన్ని పొందవచ్చు కదా" అని శ్రీరామానుజులు అన్నారు. (ఈ ఐతిహ్యం **"అర్వాంచో యత్పదసరసిజద్వంద్వమ్"** ఇత్యాది చాటుశ్లోకంలో ప్రస్తుతింపబడింది. (182వ వార్త)

6) ఎమ్బెరుమానారిలుమ్, ఆళవన్దారిలుమ్ వాశి యార్క్కుణ్డు? ఎన్ఱ ఆళ్వానై ముదలిగళ్ కేట్క, ఓరిరా ఎల్లామ్ విచారిత్తు, "పెరుమాళిలుమ్, పెరియపిరాట్టియారిలుమ్ వాశి యార్క్కుణ్డు?" ఎన్ఱార్. "న తృజేయమ్" ఎన్ఱార్ పెరుమాళ్; "న కశ్చిన్నాపరాధ్యతి" ఎన్ఱాళ్ పిరాట్టి. ఇప్పడి ఇరువర్క్కుమ్ వాశి – ఎన్ఱ అరుళిచ్చెయ్దార్.

శ్రీరాముడు సీతాదేవి ఈ ఇద్దఱిలో ఎవరికి ఎక్కువ గొప్పతనం ఉన్నది ? అని విచారిస్తే, మొదటగా పరబ్రహ్మత్వాన్ని పురస్కరించుకొని భగవానునకే గొప్పతనం ఉందని చెప్పవలసి ఉన్నది, "మిత్రభావంతో వచ్చిన వానిని చేయివిడువను" (రామా– యుద్ధ– 18–3) అని పల్కిన శ్రీరామునికంటే, "ఈ లోకంలో తప్పు చేయనివాడెవ్వడూ లేడు" అని పలికే సీతాదేవియే కరుణ మొదలైనగుణాలలో చాలా గొప్పది. అదే రీతిలో, ఆళవన్దార్ భగవద్రామానుజులకు ప్రాచార్యులైనందువల్ల, వారి కటాక్షంతోనే భగవద్రామానుజులు ఉజ్జీవనాన్ని పొందినందువల్ల ఆళవన్దార్‌కే ఎక్కువ గొప్పతనంఉన్నా, **"ఆశైయుడైయోర్ క్కెల్లామ్ ఆరియర్ కాళ్ కూఱుమ్"** అనే కృపామాత్రప్రసన్నాచార్యత్వం **"కారేయ్ కరుణై ఇరామానుశన్"**గా కీర్తింపబడే శ్రీరామానుజులయందే స్థిరంగా ఉన్నందువల్ల, వారికే ఎక్కువ గొప్పదనం ఉన్నది – అని కూరేశుల సూక్తిలోని భావం. (184వ వార్త)

7) ఆళ్వానుక్కు బాలమిత్రనాయిరుప్పానొరు బ్రాహ్మణనుక్కు అనేకమ్ కాలమ్ పిళ్ళైయిన్ఱిక్కే యిరున్ద పిన్బు ఒరు పిళ్ళై పిఱన్దవాఱే, కోయిలిలే ఆళ్వానుక్కు వార్త్తైయాయ్ క్కేట్టు అప్పోతే పెరియపెరుమాళ్ తిరువడికళిలే శెన్ఱు, అప్పిళ్ళైక్కు హితత్తై అరుళిచ్చెయ్దరుళి, వరువారై ఎల్లామ్ "అన్ద పిళ్ళై శెయ్వదెన్? ఎన్ఱ వినవుర్. ఒరునాళ్ ఆణ్డాళ్ "పోనత్తై వా ఎన్ఱళిత్తు ఉఱవు కొణ్డాదానిన్ఱీర్! ఇతుక్కు హేతు వెన్?" ఎన్ఱ, "నాన్ అవనుక్కొరు నల్ వార్త్తై శొన్నేన్ కాణ్" ఎన్ఱ, "అవనెజ్గే? నీరెజ్గే? ఇప్పడి శొల్లువదొరు వార్త్తై యుణ్డో?" ఎన్ఱ, "ఒరువన్ విలజ్గిలే కిడన్దాల్ విలజ్గు విడువిక్కుమ్బొదు విలజ్గిల్ కిడక్కిఱవనుక్కు

చ్చొల్లుమో? విలజ్గై యిట్ట రాజావుక్కు చ్చొల్లుమో?" ఎన్ఱరుళిచ్చెయ్దార్. అన్ద పిళ్ళై, ఉపనయనమ్ పణ్ణిన సమనంతరత్తిలే కోయిలిలే వన్దు ఆళ్వాన్ శ్రీపాదత్తిలే వన్దు శేర్న్దాన్.

వివరణం:– కూరేశులకు బాల్యస్నేహితుడైన ఒక బ్రాహ్మణునకు చాలా కాలం పుత్రసంతతి కలుగ లేదు. తరువాత కొంత కాలానికి ఒక కుమారుడు అతనికి జన్మించిన తరువాత, ఆ విషయం శ్రీరంగంలో ఉండే కూరేశులు విని, అపుడే శ్రీరంగనాథుని పాదసన్నిధిని చేరి, ఆ కుఱ్ఱవానికి హితాన్ని గూర్చి విన్నపించారు, (ఆ తరువాత) తన వద్దకు వచ్చేవారిని అందఱిని "ఆ కుఱ్ఱవాడు ఏం చేస్తున్నాడు" అని అడిగేవారు. ఒక నాడు వారి ధర్మపత్ని ఆణ్డాళ్ "పోయేవారిని అందరినీ రమ్మని పిలచి, సంబంధాన్ని విచారిస్తున్నారు. దీనికి ఏం కారణం? – అని ప్రశ్నించగా, "నేను ఆకుఱ్ఱవాని కోసం ఒక మంచి మాటను చెప్పాను సుమా" అని ఆళ్వాన్ అన్నారు. అపుడు ఆణ్డాళ్ "అతడు ఎక్కడ? మీరెక్కడ? ఈ విధంగా చెప్పే ఒక మాట ఉంటుందా!" (పుట్టిననాటినుండి ఆ కుఱ్ఱవానిని మీరు ఏ నాడు చూడనప్పుడు అతనికోసం మీరొక మంచి వార్తను పలికానని అనడం ఏ విధంగా సంగతం?) అని అన్నారు. కూరేశులపుడు "ఎవరైనా ఒకరు సంకెళ్ళలో బంధింపబడితే, ఆ సంకెళ్ళనుండి అతనిని విడిపించేటపుడు సంకెళ్ళలో ఉండేవానికి మంచిమాట పల్కుతారా! అతనిని సంకెళ్ళలో పెట్టిన రాజుకు మంచిమాట పల్కుతారా?" (సంకెళ్ళలో ఉన్న వానిని విడిపించాలంటే అతని హితాన్ని కోరేవారు అతనిని సంకెళ్ళలో పెట్టిన రాజు దగ్గర మంచి మాటలను చెప్పే రీతిలోనే, నేను శ్రీరంగనాథునివద్ద కుఱ్ఱవానిని రక్షించమని ప్రార్థించాను. అందువల్ల నేను సంకెళ్ళలో పెట్టబడినవానిని (కుఱ్ఱవానిని) నేరుగా చూడవలసిన పని లేదు) అని అన్నారు. ఆ బాలునకు ఉపనయనం చేసిన తరువాత అతడు శ్రీరంగానికి వచ్చి కూరేశుల శ్రీపాదసన్నిధిని చేరాడు. (196వ వార్త)

8) ముదలియాణ్డాన్ "స్వానువృత్తిప్రసన్నాచార్యరాలే మోక్షమ్" ఎన్న, కూరత్తాళ్వాన్ "కృపామాత్రప్రసన్నాచార్యరాలే మోక్షమ్" ఎన్న, ఆణ్డాన్ "కుఱ్ఱ మిన్ఱి క్కుణమ్ పెరుక్కి కురుక్కళుక్కు అనుకూలరాయ్" ఎన్ఱ పెరియాళ్వార్ అరుళిచ్చెయ్కైయాలే స్వానువృత్తి ప్రసన్నాచార్యరాలే ఆక వేణుమ్ – ఎన్న, ఆళ్వాన్ – అజ్గనన్ఱు; "పయనన్ఱాకిలుమ్ పాజ్గలరాకిలుమ్, శెయల్ నన్ఱాక త్తిరుత్తిప్పణి కొళ్వాన్, కుయిల్ నిన్ఱార్ పొళ్గిల్ శూళ్ కురుకూర్‌నమ్బి" ఎన్ఱ మదురకవియాళ్వార్ అరుళిచ్చెయ్కైయాలే అవరుడైయ అడిప్పాట్టిలే నడక్కిఱ నమక్కు ఎల్లారుక్కుమ్ స్వానువృత్తి కూడాయైయాలే, కృపామాత్రప్రసన్నాచార్యరాలే మోక్షమాక వేణుమ్ – ఎన్ఱ అరుళిచ్చెయ్దార్. ఆణ్డానుమ్ "అప్పడియామ్" ఎన్ఱ మికవుమ్ ప్రీతరానార్.

వివరణం:– ముదలియాణ్డాన్ – "స్వానువృత్తిప్రసన్నాచార్యులవల్ల (శిష్యుని శుశ్రూష మొదలైనవానివల్ల అనుగ్రహించే తిరుక్కోట్టియూర్‌నమ్బివంటి ఆచార్యులవల్ల) మోక్షం సిద్ధిస్తుంది" అని అనగా, కూరేశులు – "కృపామాత్రప్రసన్నాచార్యులవల్ల

(“ఆశైయుడైయోర్ క్కెల్లామ్ అరియర్‌కాళ్ కూఱుమ్” అనే రీతిలో నిర్హేతుక కృపతో ఆశను కల శిష్యులను అనుగ్రహించే భగవద్రామానుజులవంటి ఆచార్యులవల్ల) మోక్షం సిద్ధిస్తుంది అన్నారు. అపుడు ముదలియాణ్డాన్ మళ్ళీ, “శాస్త్రాలు విధించినవానిని చేయకుండా ఉండడం, నిషేధించినవానిని చేయడం (కృత్యాకరణం, అకృత్యకరణం) అనే దోషాలు లేకుండా, శమదమాదిగుణాలను అభివృద్ధి చేసికొని, తమ ఆచార్యులకు **“అనుకూలుగై”** అని పెరియాళ్వార్లు (4-4-2) అనుగ్రహించిన రీతిలో స్వానువృత్తి ప్రసన్నాచార్యులవల్ల మోక్షం సిద్ధిస్తుంది – అని అనగా, కూరేశులు “ఆ విధంగా కాదు. “ఏ విధంగాను పనికిరానివాణ్ణి అయినా, ఏ మంచి నాలో లేకపోయినా నన్ను సద్వృత్తాన్ని కలవానిని సంస్కరించి తమ దాసునిగా – కోయిలలు నిలిచి కూసే తోటలతో చుట్టబడి ఉండే తిరుక్కురుకూర్‌లోని నమ్మాళ్వార్లు నన్ను చేశారు కరుణించారు” అని అంటూ మధురకవి ఆళ్వార్లు నిర్హేతుక కృపతో, తమ వద్ద ఏ మంచి లేకపోయినా నమ్మాళ్వార్లు తమను అనుగ్రహించారని అన్నారు. కనుక, వారి అడుగు జాడలలో నడిచే మనకు అందరికి స్వానువృత్తి తగదు కనుక, కృపామాత్రప్రసన్నాచార్యులవల్లనే మోక్షం సిద్ధిస్తుంది – అని అనుగ్రహించారు. ముదలియాణ్డాన్ “ఆ విధంగానా!” అని చాలా సంతోషించారు. (214వ వార్త).

9) “సర్వాస్యగతమాన మండూకత్తినుడైయ ఆర్తనాదత్తై కృణ్ణు ఆళ్వాన్ మోహిత్తార్” ఎన్ను పిళ్ళై అరుళిచ్చెయ్‌దార్. ఇత్తాల్ పరదుఃఖాసహిష్ణుత్వముమ్, పరసమృద్ధ్యైక ప్రయోజనత్వముమ్ వైష్ణవునక్కు స్వభావమ్ – ఎన్ఱపడి.

పాము నోటిలో చిక్కుకొన్న కప్ప చేసే ఆర్తనాదాన్ని విని కూరేశులు మోహించారు– అనే వార్తను నంబిళ్ళై అనుగ్రహించారు. దీనివల్ల ఇతరుల దుఃఖాన్ని చూచి సహించలేకుండా ఉండడం, ఇతరుల మంచినే తమకు ప్రయోజనంగా కల్గి ఉండడం – శ్రీవైష్ణవునకు స్వభావమై ఉండాలి – అని తెలుస్తున్నది. (398వ వార్త)

10) అప్పన్, “ఆళ్వానుడైయ అంతిమదశైయిలే శ్రీపాదత్తిలే సేవిక్క ప్పెఱ్ఱిలేన్. ఎనక్కు హితాంశమ్ అరుళిచ్చెయ్య వేణుమ్” ఎన్ఱు భట్టరుక్కు విణ్ణప్పమ్ శెయ్య, ఊరైయుమ్, స్వాప్తత్తైయుమ్ విట్టు మేఱ్కునోక్కి ఓరడియిట్టపోతే హితాంశ మఱ్ఱతు. శొల్లవేణుమో? ఎన్ఱు అరుళిచ్చెయ్‌తార్.

వివరణం : శ్రీరంగానికి తూర్పుదెశలోని ఒక ఊరిలో ఎంతో ఐశ్వర్యంతో వైభవంగా జీవించిన అప్పన్ అనే ఆచార్యులు కూరేశులను ఆశ్రయించాలని శ్రీరంగానికి వచ్చారు. అయితే, ఆ సమయం కూరేశులకు చరమదశ అయినందువల్ల అప్పన్ వారిని ఆశ్రయించలేకపోయారు. అప్పన్ అపుడు భట్టర్‌ను చూచి “కూరేశులను ఆశ్రయించ లేకపోయాను. నా హితానికి తగిన సూక్తిని మీరు అనుగ్రహించాలి” అని ప్రార్థించారు. అపుడు భట్టర్ –“మీరుండే ఊరును, సౌకర్యాలను సంపదలను అన్నిటిని విడచి కూరేశులను

ఆశ్రయించాలనే భావనతో శ్రీరంగంవైపు మీరు ఒక అడుగు పెట్టగానే మీహితం కోసం చేయవలసినదానిని అంతటికీ మీరు చేసినవారయ్యారు. ఇకపై మీరేమీ చేయవలసిన అవసరం లేదు– అని అన్నారు. ఈవార్తలో కూరేశుల ప్రసక్తి ఉన్నందువల్ల ఇక్కడ ప్రస్తావింపబడింది. (213వ వార్త)

11) ఆళ్వాన్ కాలత్తిలే సంధ్యావందనమ్ పణ్ణ ఎళున్దరుళానిఱ్ఱు, ఇరణ్డు శ్రీవైష్ణవర్‌కళ్ అరుళిచ్చెయల్ ధ్వనియై క్కేట్టుక్కొణ్డునిఱ్ఱు, కూడ ఎళున్దరుళినవర్‌కళ్ “అనుష్ఠానత్తుక్కు క్కాలమ్ తప్పుకిఱతే!” ఎన్న, సంధ్యావందన వైకల్యమ్ పిఱన్దాల్ ప్రాయశ్చిత్తమ్ పణ్ణికొళ్ళలామ్. భగవదనుభవ వైకల్యమ్ పిఱన్దాల్ ప్రాయశ్చిత్తసాధ్య మన్ఱు” ఎన్ఱరుళిచ్చెయ్‌దార్.

వివరణం : కూరత్తాళ్వాన్ ఒకనాడు సకాలంలో సంధ్యావందనాన్ని చేస్తున్న సమయంలో దారిలో ఇద్దఱు శ్రీవైష్ణవులు దివ్య ప్రబంధానుసంధానం చేస్తున్నారు. అందులో ఆసక్తుడై చాలాసేపు సంధ్యావందనాన్నిగూర్చి కూరేశులు మఱచిపోయారు. అపుడు కూరేశులతో కలసివస్తున్నవారు కొందఱు “సంధ్యావందనానికి సమయం మించి పోయిందే” అని అన్నారు. కూరేశులు “సంధ్యావందనానికి కాలం మీరితే ప్రాయశ్చిత్తం చేసికోవచ్చు. కాని, దివ్యప్రబంధానుసంధానంలో భగవనుభవాన్ని పొందడంలో కొఱత ఏర్పడితే దానిని ఏ ప్రాయశ్చిత్తంతోను సరిచేసికోలేము” అని అన్నారు. (372వ వార్త)

12) పిత్తర్ర్తెన్ఱే ఇరున్దేన్ – ఎన్ఱార్ కూరత్తాళ్వాన్

వివరణం : కూరేశులు ఇష్టసిద్ధి అనే వేదబాహ్యమతానికి చెందిన గ్రంథాన్ని ఎవరో చదువుతూ ఉండగా వినడం తటస్థించింది. ఈసంగతిని విన్నకూరేశుల తండ్రి కూరత్తాళ్వార్ “నీవు ఆ ఇష్టసిద్ధి అనే గ్రంథాన్ని గూర్చి ఏమని అనుకుంటున్నావు ?” అని కూరేశుల తండ్రి కూరేశులను ప్రశ్నించగా, “అది ఒక ఉన్మత్త ప్రేలాపన” అని కూరేశులు బదులిచ్చి ఉండవచ్చు. (441వ వార్త)

13. ఆళ్వాన్ ఎమ్పెరుమానారై “ప్రపత్తి ఎన్ఱట్టిరుక్కుమ్ ?” ఎన్ఱు కేట్క, “అతు కర్మాదికళై విట్టల్లతాన్ ఇరుప్పతు. ఒన్ఱిల్ ఆయిర మిలై. ఆయిరత్తిల్ ఒన్ఱుణ్డు. కుళప్పడియిల్ కడలిలై. కడలిలే కుళప్పడి యుణ్డు. ఆకైయాలే, ఎల్లామ్ ప్రపత్తియిలే ఉణ్డు” ఎన్ఱరుళిచ్చెయ్‌తార్. “అదిల్ ఇవై కణ్డపడి ఎఙ్గనే ?” ఎన్ఱిల్, రాజకుమారన్ కర్పూరనికరత్తై వాయిలే ఇట్టు పల్లిలే అశైక్కుమాప్పోలే, ద్వయత్తై ఉచ్చరిక్కై కర్మమ్. అవన్ అదిన్ రసత్తై ప్పానమ్ పణ్ణుమాప్పోలే ఇదైవిదాతే అనుసంధిక్కై జ్ఞానమ్. అవన్ అన్ద రసత్తాలే తన్నై మఱన్దిరుక్కుమాపోలే ఇవనుమ్ అతిన్ అర్థానుసంధానత్తాలే రసాతిశయితనాయ్ త్తన్నై మఱన్దిరుక్కుమతు భక్తి.

వివరణం : “ప్రపత్తి అన్నది ఏ విధంగా ఉంటుంది ?” అని కూరేశులు భగవద్రామానుజులను ప్రశ్నించారు. ఆ ప్రశ్నకు భగవద్రామానుజులు “కర్మం, జ్ఞానం,

భక్తి- అనే మూడింటిని ప్రపత్తి అంతర్భవింపజేసి కొన్నది. ఒకటిలో వేయి లేదు. వేయిలో ఒకటి ఉన్నది. గోష్పాదంలో సముద్రం లేదు. సముద్రంలో గోష్పాదం ఉన్నది. అదే రీతిలో, కర్మ-జ్ఞాన- భక్తులలో ప్రపత్తి లేదు. కాని, ప్రపత్తిలో మాత్రం ఈ మూడు ఉన్నవి" అని అన్నారు. ప్రపత్తిలో కర్మ, జ్ఞాన, భక్తులు మూడు ఉండడం అంటే ఏమి ? అని అంటే, రాజకుమారుడు పచ్చకర్పూరపు ముద్దను నోటిలో పెట్టుకొని పంటితో కొఱికినట్లుగా, పరమభోగ్యం అయిన ద్వయాన్ని ఉచ్చరించడమనే ఆకారంలో ప్రపన్నునకు కర్మ ఉన్నది. అతడు ఆ కర్పూరరసాన్ని తాగి, దాని మాధుర్యాన్ని అనుభవించినట్లే, ద్వయంలోని అర్థాన్ని నిరంతరం అనుభవించడం అనే ఆకారంలో ప్రపన్నునకు జ్ఞానం ఉన్నది. అతడు ఆకర్పూర రసంలోని తీయదనంవల్ల తనను మఱచి ఉండేటట్లే, ద్వయంలోని అర్థాన్ని అనుసంధించడం వల్ల చాలా ఆనందాన్ని పొంది తనను మఱచి ఉండే భక్తికూడా ప్రపన్నునకు ఉన్నది- అని శ్రీరామానుజుల సమాధానసారం. (445వ వార్త)

పూర్వాచార్య గ్రంథాలలో కూరేశుల వార్తలు

14) మాణిక్యమాలై.

కూరత్తాళ్వాన్, ఎమ్పెరుమానార్ తిరువుళ్ళత్తిలే శీఘ్ర యరుళినార్ ఎన్ఱ కేట్ట, "ఇవ్వాత్మా అవరుక్కే శేషమాయిరున్ద తాకిల్, అవరుడైయ ఇష్టవినియోగప్రకారమ్ కొణ్డు కార్య మెన్? ఎన్ఱార్. తన్నై ఆశ్రయిత్తువైత్తు త్తన్ తిఱత్తిలే తీఱ్ఱు నినైత్తు ద్రోహియాన నాలూరానై పెరుమాళ్ "న క్షమామి" ఎన్ఱ మునిన్దరుళ, పెరుమాళోడే ఎదిరిట్ట, "అవన్ నాన్ పెఱ్ఱ లోకమ్ పెఱువేణుమ్" ఎన్ఱ విణ్ణప్పమ్ శెయ్దార్. ఆక, ఇవ్విరణ్డు అర్థత్తాలుమ్ శిష్యాచార్యక్రమత్తుక్కు సీమాభూమి కూరత్తాళ్వాన్ ఎన్ఱ అరుళిచ్చెయ్వర్.

సందర్భం : సదాచార్యుడు, సచ్ఛిష్యుడు- అనే ఇద్దరికి తగిన లక్ష్యభూతులను గూర్చి పలికే పెరియవాచ్చాన్‌పిళ్ళై, కూరత్తాళ్వాన్‌కు సంబంధించిన ఒక ఐతిహ్యాన్ని ఉట్టంకిస్తున్నారు.

వివరణం : ఒకసారి భగవద్రామానుజులు తమ శిష్యులైన కూరేశులపై చాలా కోపపడ్డారు. దీనిని విన్న కూరేశులు "నా ఆత్మ ఆచార్యులైన భగవద్రామానుజులకే శేషం. అందువల్ల వారు దాసుణ్ణి అయిన నన్ను ఏ విధంగా చేసినా అది తగినదే". అని అన్నారట. కూరత్తాళ్వాన్ శిష్యుడు నాలూరాన్ అనేవాడు కూరత్తాళ్వాన్ నేత్రాలు కోల్పోవడానికి కారణభూతుడయ్యాడు. ఇందువల్ల భగవానుడు నాలూరాన్‌పట్ల చాలా ఆగ్రహాన్ని పొంది, "క్షమించను" (న క్షమామి) అని అన్నాడు. అపుడు కూరత్తాళ్వాన్ భగవానునితో వాదించి, "నాలూరాన్ కూడా నేను పొందే ఫలాన్ని పొందాలి" అని ప్రార్థించారు. ఈవిధంగా తమపై కోపించిన ఆచార్యులైన భగవద్రామానుజులపట్ల శేషత్వాన్నే ప్రకటించడంవల్ల, తమ విషయంలో అసహ్యాపచారాన్ని చేసిన శిష్యుడైన

నాలూరాన్‌కూడా తమతో సమానంగా ఉజ్జీవించాలని భావించినందువల్ల ఉత్తమ శిష్యునకు, ఉత్తమ ఆచార్యునకు లక్ష్యభూతులయ్యారు కూరేశులు. ఈ ఐతిహ్యం ప్రమేయరత్నమనే గ్రంథంలోకూడా ఉదాహరింపబడింది.

15) శ్రీవచనభూషణమ్ - 414 సూ- మణవాళమహాముని వ్యాఖ్యానమ్

వడుకనమ్బి ఆళ్వానైయుమ్, ఆణ్డానైయుమ్ "ఇరు కరైయర్" ఎన్ఱర్.

సందర్భం : భగవానుని ఆశ్రయించడంకంటే ఆచార్యుని ఆశ్రయించడమే చాలా గొప్పది అని వివరించడంకోసం మణవాళ మహామునులు వడుక నమ్బి పల్కిన వార్తను ఉదాహరిస్తున్నారు.

వివరణం : భగవద్రామానుజులను మాత్రమే ఆశ్రయించినవారైన వడుకనమ్బి అనే ఆచార్యులు కూరేశులను, దాశరథి (ముదలియాణ్డాన్‌ను **"ఇరు కరైయర్"** (రెండు తీరాలవారు) అని అనేవారట. అంటే, "రెండు తీరాలను తాకుతూ ప్రవహించే నదివలె కూరేశులు, ముదలియాణ్డాన్ భగవానుని ఆశ్రయిస్తారు; భగవద్రామానుజులను ఆశ్రయిస్తారు" అని వడుగనంబిసూక్తి.

16) పరన్దపడి - శ్రీపిళ్ళైలోకాచార్యులవారు

"రాజపురుషః" ఎన్ఱ విడత్తిల్ రాజావుమ్ ప్రస్తుతనాయ్, పురుషనుమ్ ప్రస్తుత నాయిరుక్కచ్చెయ్తే శబ్దత్తాలే పురుషన్ ప్రధాననాయ్, అర్థతః రాజా ప్రధాననాయ్ ఇరుక్కుమ్. అప్పడియే, ఇవ్విడత్తిలుమ్ శబ్దత్తాలే చేతనన్ ప్రధాననాయ్, అర్థత్తాలే ఈశ్వరన్ ప్రధాననాయ్ ఇరుక్కుమ్" ఎన్ఱ ఆళ్వాన్ అరుళిచ్చెయ్యుమ్.

సందర్భం : తిరుమంత్రంలోని ప్రణవంలో అర్థం - భగవానునకే జీవాత్మ శేషభూతుడు- అని. ఇక్కడ జీవాత్మ స్వరూపాన్నిగూర్చే చెప్పబడింది, కనుక (శబ్దతః) జీవాత్మకే ప్రాధాన్యం చెప్పబడినట్లయింది. అయితే, ఈ జీవాత్మ భగవానునకు శేషభూతుడు అని చెప్పబడినందువల్ల, శేషభూతుడైన జీవాత్మకంటే ముఖ్యుడైన భగవానునకే(అర్థతః) ముఖ్యత్వం చెప్పబడింది. దీనిని వివరించే క్రమంలో కూరత్తాళ్వాన్ అనుగ్రహించిన నిర్వాహం ఒకటి చూపబడుతున్నది.

వివరణం: రాజపురుషుడు **("రాజపురుషః")** అనే పదంతో రాజు చెప్పబడుతున్నాడు; అతనికి శేషభూతుడైన పురుషుడు కూడా చెప్పబడుతున్నాడు. శబ్దతః గమనించినపుడు ఇక్కడ రాజపురుషశబ్దం సేవకుని సూచిస్తుంది. అయితే, అర్థం ద్వారా గమనించినపుడు ఆ పురుషుడు రాజునకు శేషభూతుడు కనుక ప్రభువుకే ముఖ్యత్వం లభిస్తుంది. అదే రీతిలో, ప్రణవంలోకూడా శబ్దతః చూస్తే జీవాత్మకు, అర్థతః చూస్తే పరమాత్మకు ముఖ్యత్వం లభిస్తుంది- అని కూరేశులు పలికారు.

18. పరన్దపడి, శ్రియఃపతిపడి– శ్రీపిళ్ళైలోకాచార్యులవారు

"అనాదికాలమ్ అనుపాయజ్ఞళిలే ఉపాయబుద్ధి పణ్ణిప్పోన్దోమ్ ఎన్ను లజ్జాపురస్సర మాన త్యాగత్తై చ్చొల్లుకిఱతు" ఎన్ను ఆళ్వాన్ పణిక్కుమ్– (పరన్దపడి)

"అనాదికాలమ్ అనుపాయజ్ఞళిలే ఉపాయబుద్ధి పణ్ణినోమ్– ఎన్ను లజ్జాపురస్సర మాన త్యాగత్తై చ్చొల్లుకిఱతు" ఎన్ను ఆళ్వాన్ పణిక్కుమ్" (శ్రియఃపతిపడి).

సందర్భం : చరమశ్లోకార్థాన్ని వివరించేటపుడు **"పరిత్యజ్య"** అనే పదానికి కూరేశులు అనుగ్రహించిన అర్థనిర్వాహం ఇక్కడ ప్రస్తుతింపబడుతున్నది.

వివరణం : అనాదికాలంగా ఉపాయాలు కానివానిని అన్నిటినీ ఉపాయం అని తలిచామే! అనే లజ్జతో విడువడాన్నే ఇక్కడ **"పరిత్యజ్య"** అనే పదం తెలుపుతుంది. అని కూరేశులు అనుగ్రహించారు.

19) తనిద్వయమ్ – శ్రీపిళ్ళైలోకాచార్యులవారు

ఆళ్వాన్ పరమపదత్తిఱ పోక్కైక్కు పెరుమాళ్ పాడే వీడు పెఱ్ఱు క్కూట్టత్తిలే వన్దిరుక్కచ్చెయ్‌తే "ఇనిప్పెరుమాళై నమ్మాల్ విలక్కప్పోకాతు. ఇని, అన్తిమకాలత్తిలే ఎన్నై అళైత్తు వారుఙ్గోళ్" ఎన్ను, అంతిమసమయత్తిలే ఎళున్దరుళి ఆళ్వానుక్కు శెవియిల్ ద్వయత్తై అరుళిచ్చెయ్‌దార్. అఙ్గిరున్ద ముదలికళ్ 'ఇస్సమయత్తిలే ద్వయత్తై చ్చొల్లవేణుమో!" ఎన్ను కేట్క, "ఆళ్వాన్ ప్రకృతి మఱియార్‌కళో! ఇద్దశైయిలే ద్వయత్తై చ్చొన్నాల్ కర్పూరనికరత్తై నావిలే ఇట్టాప్పోలే ఇరుక్కుమ్ కాణ్" ఎన్ను అరుళిచ్చెయ్‌దార్.

సందర్భం: మన పూర్వాచార్యులందఱూ సదా ద్వయాన్ని అనుసంధిస్తూ ఉండేవారు– అనే విషయాన్ని వివరించే శ్రీపిళ్ళైలోకాచార్యులవారు కూరత్తాళ్వాన్ అంతిమకాలంలో భగవద్రామానుజులు వారికి చెవిలో ద్వయాన్ని పల్కిన ఐతిహ్యాన్ని ఉట్టంకిస్తున్నారు.

వివరణం : కూరత్తాళ్వాన్ పరమపదానికి చేరాలనే వరాన్ని శ్రీరంగనాథునివద్ద పొందారు. దీనిని విన్న శ్రీరామానుజులు "కూరేశులకు భగవానుడు వరాన్ని అనుగ్రహించినందువల్ల ఇక చేయగల్గినది లేదు. వారి అంతిమ దశలో నన్ను పిలవండి" అని అన్నారు. అదే రీతిలో భగవద్రామానుజులు కూరేశుల చివరి సమయంలో వారిదగ్గరకు వచ్చి వారి చెవిలో ద్వయమంత్రాన్ని ఉచ్చరించారు. అపుడు అక్కడ ఉన్న శ్రీవైష్ణవులు కొందఱు "అంతిమ దశలో ద్వయాన్ని పలకాలా ఏమి ?" అని అడిగారు. అపుడు శ్రీరామానుజులు "కూరత్తాళ్వాన్ స్వభావం మీకు తెలియదా! ఈ స్థితిలో ద్వయాన్ని పల్కితే కూరత్తాళ్వాన్‌కు పచ్చ కర్పూరాన్ని నాలుకలో పెట్టినట్లుగాకదా చల్లగా ఉపశాంతిని కల్గిస్తుంది" అని అన్నారు.

ఈ ఐతిహ్యాన్ని పెరియాళ్వార్ తిరుమొళిలోని 4–4–7 పాశురాన్ని వ్యాఖ్యానిస్తూ పెరియవాచ్చాన్ పిళ్ళై ఉట్టంకించగా, శ్రీదేశికులు కూడా రహస్యత్రయ సారంలోని నిర్ణయాధికారంలో దీనిని ఈక్రింది విధంగా ఉదాహరించారు.

"ఆళ్వాన్ అంతిమదశైయిలే విడాయిలే నాక్కొట్టు ఎమ్బెరుమానార్ తిరువడికళై పిడిక్క, ఇవర్ అప్పోతు ఆళ్వాన్ శెవియిలే ద్వయత్తై అరుళిచ్చెయ్య", "ఇప్పేఱు నమక్కు వరుకై అరితు. నామ్ శెయ్యక్కడవోమ్! ఎన్ను అప్పోతు సేవిత్తిరున్ద ముదలికళ్ కలఙ్గ, ఇవర్‌కళ్ అభిప్రాయత్తై త్తిరువుళ్ళమ్ పఱ్ఱి "ఆళ్వాన్‌ప్రకృతి అఱియార్‌కళో! ఇవ్వవ స్థైయిల్ ఇవరుక్కు ఇతు కర్పూరత్తైయుమ్, ఖండశర్కరైయుమ్ ఇట్టమాత్రమన్రో! నామితు ఉపాయత్తుక్కు ప్పరికరమాక చ్చెయ్‌తో మల్లోమ్" ఎన్ను అరుళిచ్చెయ్య ముదలికళ్ తెఱిన్దు నిర్భరర్ ఆనార్‌కళ్.

(కూరేశుల అంతిమదశలో దాహంతో నాలుక పిడచకట్టుకొని పోగా, భగవద్రామానుజుల శ్రీచరణాలను ఆశ్రయించారు. అపుడు శ్రీరామానుజులు కూరేశుల చెవిలో ద్వయాన్ని అనుగ్రహించగా, ఆ సమయంలో దగ్గర ఉన్న శ్రీవైష్ణవులు కొందఱు "కూరేశులకు లభించిన ఫలం– (అంతిమ కాలంలో ద్వయాన్ని స్మరించే ఫలం)– మనకు లభించడం చాలా దుర్లభంకదా! ఇటువంటి స్మరణ మనకు రావడానికి మనం ఏం చేయాలి?" అని తలచి కలతపడ్డారు. వీరి అభిప్రాయాన్ని మనస్సులో తలచి– "కూరేశుల స్వభావాన్ని మీరు తెలియలేదా? ఈ దశలో వీరికి ఇది కర్పూరాన్ని, కండచక్కెరను ఇచ్చినట్లుకదా ఉంటుంది. నేను దీనిని ఉపాయానికి సాధనంగా చేయలేదుసుమా" అని అనగానే ఆ శ్రీవైష్ణవులు నిర్భరులయ్యారు.)

20. రహస్యత్రయ సారమ్ – ప్రభావరక్షాధికారమ్ – శ్రీవేదాంత దేశికులు

ఒరు వ్యాధి విశేషత్తై "ఉణ్డో!" ఎన్ను రాజా కేట్క, "అవరుమ్ ఓర్ ఉపాధ్యాయర్; ఉణ్డు" ఎన్ను భట్టర్ అరుళిచ్చెయ్‌దార్..... ఆళ్వానుళ్ళిట్టార్ పక్కలిలే ప్రసిద్ధమ్.

సందర్భం : ప్రపన్నునకు దుఃఖాలు కల్గడంకూడా అతని హితం కోసమే– అని తెలియజేస్తూ వేదాంతదేశికులు, భట్టర్ అనుగ్రహించిన ఒక వార్తను ఉదాహరిస్తున్నారు.

వివరణం : భట్టర్‌ను చూచి ఒక ప్రభువు ఒక వ్యాధి పేరును పల్కుతూ, "ఆ వ్యాధి మీకు ఉన్నదా? అని ప్రశ్నించాడు. "అవును. నాకు అటువంటి ఉపాధ్యాయు లొకరున్నారు" అని భట్టర్ బదులిచ్చారు. (ఉపాధ్యాయులు అంటే ఆచార్యులు. ఆచార్యులు మనలను సద్గతికి తీసికొని పోయేటట్లే, వ్యాధులుకూడా మనలను అన్యవిషయాలపట్ల ఆశను కల్గి ఉండకుండా నిరోధించి, భగవానుని పట్ల మనస్సును లగ్నం చేసికొనేటట్లుగా చేస్తాయి అందువల్ల భట్టర్ వ్యాధిని ఉపాధ్యాయుడని అన్నారు. (నడుముపై రాచపుండుతో భట్టర్ బాధపడ్డారు– అని వారి చరిత్రలో చెప్పబడడం ఇక్కడ గమనించదగినది) చోళరాజు చేసిన దుర్మార్గంవల్ల కూరేశులు నేత్రాలను కోల్పోయి బాధపడే సమయంలో వారికి

లౌకిక జీవనంపై వైరాగ్యం కల్గడానికి భగవానునే సదా స్మరిస్తూ కాలాన్ని గడపడానికి ఆ బాధ ఉపయోగించింది.

21) ప్రమేయరత్నమ్

పెరియనంబి చరమసమయత్తిలే ఆళ్వాన్ మడియిలే కణ్ వళర, "కోయిలుమ్, భాష్యకారరుమ్ ఇరుక్క ఇజ్గే శరీరానసామావదే!" ఎన్ఱు వెఱుక్క, "ఒరు భాగవతనుడైయ మడియిఱ్ఱిట్టిల్ కోయిల్ ఉత్కృష్ట మన్ఱు" ఎన్ఱు అరుళిచ్చెయ్దార్.

వివరణం : శ్రీరామానుజులకు మాఱుగా వారి వేషంతో కూరేశులు చోళరాజు సభకు వెళ్ళినపుడు వారితో పెరియనంబి కూడా వెళ్ళారు. శివునికంటే గొప్ప దైవం ఏదీ లేదు – అని వ్రాసి సంతకం పెట్టడానికి తిరస్కరించిన ఆ ఇద్దఱి కన్నులను పీకి వేయవలసినదిగా రాజు ఆజ్ఞాపించాడు. కూరేశులు తామే తమ కన్నులను తీసివేసికోగా, పెరియనంబి నేత్రాలను రాజసేవకులు తొలగించారు. ఆ తరువాత వారిద్దరు తిరిగి వచ్చే దారిలో పెరియనంబి బాధను తట్టుకోలేక ప్రాణాలను కోల్పోయారు. ఆవిధంగా ప్రాణాలు పోయే సమయంలో పెరియనంబి కూరేశుల ఒడిలో పరుండి ఉన్నారు. "శ్రీరంగం దివ్యాలయం, భగవద్రామానుజులు ఉండగా, ఈవిధంగా దారిలో ఒక ఊరిలో ప్రాణాలను కోల్పోవలసివచ్చిందే !" అని (కూరేశులు) బాధపడినపుడు, "పరమభాగవతుల (కూరేశుల) ఒడికంటే శ్రీరంగం గొప్పచోటు కానే కాదు" అని పెరియనంబి అన్నారు.

22) ప్రమేయరత్నమ్

ఆళ్వానుమ్, ఆణ్డాళుమ్ కోయిల్ నిన్ఱుమ్ దేశాంతరత్తుక్కు పోయ్ మీణ్డువరుకిఱ వళవిలే ఉపవాసత్తోడే వన్ద పుకున్ద ఒరు మౌష్టికన్ వాశలిలే శడక్కెన అముదుశెయ్తార్. ఆణ్డాళై అళైత్తు ప్రసాదమ్ కూడ చ్చొన్నవళవిల్ "అవరుడైయ రూపనామమ్ కొణ్డు అముదు శెయ్దీర్. అవర్ ఎదిలే నిష్ఠర్ ఎన్ఱు తెఱియాతు. నాన్ అతు శెయ్వదిల్లై." ఎన్ఱాళ్. ఆళ్వాన్. "ఉమ్ముడైయ వ్యవసాయత్తై పెరుమాళ్ తన్దరుళ వేణుమ్" ఎన్ఱు వేణ్డిక్కొణ్డార్.

వివరణం : ఒక పర్యాయం కూరేశులు, వారి సతీమణి ఆణ్డాళ్ శ్రీరంగంనుండి వేఱొక ఊరికి తిరిగి ప్రయాణం చేసేటపుడు దారిలో భుజించడానికి తగిన చోటు ఏదీ వారికి దొరకనందువల్ల ఉపవాసంతోనే ప్రయాణం సాగించారు. దారిలో ఒక చోట బిచ్చమెత్తుకొని జీవించే వాని ఇంటివాకిలిలో నిలచి, కూరేశులు తాము తీసికొని వస్తున్న ఆహారాన్ని భుజించి, ఆణ్డాళ్‌ను కూడా పిలిచి భుజించమని అన్నారు. అపుడు ఆణ్డాళ్ "ఈ ఇంటి యజమాని రూపాన్ని, పేరును చూచి వారిని వైష్ణవులుగా భావించి మీరు భుజించారు. అయితే ఇతడు భగవానునిపట్ల ప్రావణ్యాన్ని కలవాడా ! కాదా ! అనే విషయం తెలియదు. వాని ఇంటివద్ద నేను భుజించను" అని అన్నారు. దానిని విన్న కూరేశులు ఆణ్డాళ్ మనోనిశ్చయాన్ని చూచి చాలా ఆశ్చర్యపడి "ఈ విషయాన్ని

గమనించకుండానే నేను ఈ ఇంటిలో నిలిచి భుజించాను. అయితే, ఇతడు ఎటువంటివాడు అని తెలియకుండా భుజించను అని పల్కిన నీకు గల ఇటువంటి నిశ్చయమే నాకు కూడా భగవానుడు అనుగ్రహించాలి" అని అంటూ భగవానుని ప్రార్థించారు.

23) ప్రమేయరత్నమ్

శిష్యాచార్యక్రమత్తుక్కు సీమాభూమి కూరత్తాళ్వాన్– ఎజ్గనే ఎన్నిల్? తమ్ముళవిలే ఉడైయవర్ నిగ్రహమ్ పణ్ణినార్ ఎన్ఱు కేట్టు, ఇవ్వాత్మా అవరుక్కే శేషమాయిరున్దతే యాకిల్ వినియోగప్రకారమ్ కొణ్డు కార్యమెన్ ? ఎన్ఱు అరుళిచ్చెయ్కై యాలే శిష్యర్‌క్కు సీమాభూమి. సాపరాధనాన నాలూరాన్నై నాన్ పెఱ్ఱ లోకమ్ నాలూరానుమ్ పెఱువేణుమ్" ఎన్నెయాలే ఆచార్యర్‌కళుక్కు సీమాభూమి. (మాణిక్యమాలై – అనే గ్రంథంలో ఈ ఐతిహ్యాన్ని పెరియ వాచ్చాన్‌పిళ్ళై ఉదాహరించారు.)

24) ప్రమేయరత్నమ్

ఇప్పడి దోషమ్ పారామల్ హితమ్ ప్రవర్తకత్వముళ్ళతు పిరాట్టిక్కుమ్ కూరత్తాళ్వానుక్కు మిత్తే.

(ఇటువంటి వార్తనే కణ్ణినుణ్‌శిఱుత్తామ్బు 4వ పాశురవ్యాఖ్యలో నఞ్జీయర్ ఉదాహరించారు.)

25) ప్రమేయరత్నమ్

ద్వయోపదేష్టావే ఆచార్యనాకక్కడవన్. భాష్యకారరుమ్, ఆళ్వాన్ దేశాంతరత్తిల్ నిన్ఱుమ్ వరక్కణ్డు ప్రీత్యతిశయత్తాలే మీణ్డుమ్ ద్వయత్తై ఉపదేశిత్తరుళినార్.

వివరణం : అన్యమంత్రాలను ఉపదేశించేవారు ఆచార్యులు కారు. ద్వయాన్ని ఉపదేశించేవారే ఆచార్యులు. (తిరుక్కోట్టియూర్ నంబిదగ్గర ఆత్మయొక్క అంతరంగ నిరూపకాన్నిగూర్చిన ప్రమాణాన్ని తెలిసికొని) దేశాంతరంనుండి తిరిగి వచ్చిన కూరేశులకు భగవద్రమానుజులు ద్వయాన్ని ఇంకొక మాఱు ఉపదేశించారు.

26) ప్రమేయరత్నమ్

కీళ్చ్చొన్న ఉపాయఙ్గళ్ సాధ్యఙ్గళాయిరుక్కుమ్. ఇతు సిద్ధమాయిరుక్కుమ్. అవై అచేతనఙ్గళాయిరుక్కుమ్. (ఇతు పరమచేతనమాయిరుక్కుమ్. అవై పలమా యిరుక్కుమ్) ఇతు అద్వితీయమాయిరుక్కుమ్. అవై త్యాజ్యఙ్గళాయిరుక్కుమ్. ఇతు త్యాగవిశిష్ట మాయిరుక్కుమ్ –ఎన్ఱు ఆళ్వాన్ పణిప్పన్.

వివరణం: కర్మయోగం, జ్ఞానయోగం, భక్తియోగం– మొదలైనవి సాధింప వలసినవై ఉంటాయి. అయితే, భగవానుడనే ఉపాయం సాధింపవలసిన అక్కఱ లేకుండా సాధ్యంగానే ఉంటుంది. అన్యోపాయాలు జ్ఞానశూన్యాలుగా ఉంటాయి. భగవానుడనే ఉపాయం అన్నీ తెలిసిన పరమచేతనంగా ఉంటుంది. కర్మం, జ్ఞానం, భక్తి అనే అన్యోపాయాలు అనేకాలుగా

ఉంటాయి. కాని, భగవానుడే ఉపాయం సాటి లేనిదై ఉంటుంది. భగవానుడే ఉపాయం త్యాగంతో కూడినదై ఉంటుంది– అని కూరేశులు అనేవారు.

27) ప్రమేయరత్నమ్

భక్తిప్రపత్తికళ్ ఇరణ్డుమ్ తుల్యవికల్పఙ్గళెన్ఱు ఆళ్వాన్ పణిక్కుమ్. భక్తిక్కు ఆయాస గౌరవ ముణ్డు ఎన్ఱవోపాది ప్రపత్తిక్కుమ్ విశ్వాసగౌరవ ముణ్డు.

వివరణం : భక్తియోగం, ప్రపత్తియోగం – అనే ఉపాయాలు రెండు సమానమైనవే అని కూరేశులసూక్తి. అంటే భక్తియోగం అనుష్ఠించడానికి చాలా కష్టమైనది. అదే విధంగా ప్రపత్తిలో కూడా "భగవానుడు తప్పక మనలను కాపాడుతాడు" అనే నమ్మకం ఉండాలి. అందువల్ల భక్తివలెనే ప్రపత్తి కూడా కఠినమైనదే– అని కూరేశుల అభిప్రాయం.

28) ప్రమేయరత్నమ్

కృపామాత్రప్రసన్నాచార్యాంగీకారత్తు క్కొళ్ళీయ ఉపేయసిద్ధి యిలై– ఎన్ఱు ఆళ్వాన్ పణిప్పర్.

వివరణం : ఈ వార్త– వార్తామాల– 214 లో ప్రస్తావింపబడింది.

29) "వందే గోవిందతాతౌ" (సహస్రనామ భాష్యావతారిక) – పరాశరభట్టర్.

వివరణం : "తమకు తండ్రి అయిన కూరేశులను, ఆచార్యులైన ఎమ్బార్‌ను స్తుతిస్తూ భట్టర్ సహస్రనామభాష్యావతారిక ప్రారంభంలో అనుగ్రహించిన శ్లోకం ఇది.

30) "అతో హి తాతపాదాः సర్వజ్ఞతామేవోపలభామహే త్వం హ్యజ్ఞ ఏవాశ్రితదోష జోషణः" ఇతి. (విష్ణుసహస్రనామ భాష్యే– 483 తమనామభాష్యే).

వివరణం : "భక్తుల దోషాలను గమనించడం తెలియనివాడవు కనుక నిన్ను సర్వజ్ఞుడవని అనడాన్ని మేము ఖండిస్తున్నాము. అని మా జనకులైన కూరేశులు అన్నారు– అని అంటూ పరాశర భట్టర్ సహస్రనామభాష్యంలో అన్నారు. (ఈ శ్లోకం ఇపుడు పంచస్తవిలో కన్పించడం లేదు).

31) కూరత్తాళ్వాన్ "ఇవ్వాత్మావుక్కు ఉజ్జీవనమ్ ఎమ్బెరుమానుడైయ కృపై" ఎన్ఱు పణిక్కుమ్. (తత్త్వభూషణమ్).

వివరణం : జీవాత్మను ఉజ్జీవింపజేసేది భగవత్కృపే– అని కూరేశులు అన్నారు.

32) భాష్యకారర్ ఆళ్వానుక్కు చరమశ్లోకార్థత్తై ఉపదేశిత్తు. "ఇరున్దపడి ఎన్?" ఎన్ఱు కేట్టరుళ, "ఒరు జన్మత్తిలిరున్దు ఒరు జన్మత్తిలే పోన్దాప్పోలే ఇరున్దదు" ఎన్ఱు పణిత్తార్ (తత్త్వభూషణమ్).

వివరణం : భగవద్రామానుజులు, తిరుక్కోటియూర్‌నంబి తమకు ఉపదేశించిన చరమశ్లోకంయొక్క అంతరార్థాన్ని కూరేశులను ఉపదేశించి, "దీనిని వినిన తరువాత

మీకు ఏవిధంగా ఉన్నది?" అని అడిగారు. అపుడు కూరేశులు– "ఒక జన్మనుండి ఇంకొక జన్మను పొంది, కొత్తగా మళ్ళీ పుట్టినట్లున్నది" అని అన్నారు.

33) సదాచార్యసంబంధత్తోపాది సచ్ఛిష్యసంబంధముమ్ ఉపాదేయమ్. ఆకైయిత్తే. "సోఽయం రామానుజముని రపి స్వీయముక్తిం కరస్థాం యత్సంబంధా దమనుత కథం వర్ణ్యతే కూరనాథः' ఎన్ఱు పూర్వోత్తరాచార్యర్‌కళుక్కు ముక్తిప్రదాయకరాక ప్రసిద్ధరాన భగవద్రామానుజరుమ్ గురోర్వచనాతిక్రమణమ్ పణ్ణి త్తెళ్ళాళ్వాన్ కోయిలిలే అపేక్షిత్త శ్రీవైష్ణవర్‌కళ్ ఎల్లారుక్కుమ్ తిరుమంత్రార్థత్తై వెళియిట్ట అపచారత్తాలే తమక్కు దుర్గతియై నిశ్చయిత్తు "సచ్ఛిష్యరాన కూరత్తాళ్వాన్ సంబంధత్తాలే తమక్కు ముక్తి కరస్థమాయిర్ర్రు" ఎన్ఱు కాషాయవస్త్రత్తై ఏఱిట్టు క్కూత్తాడినార్ – ఎన్ఱు ప్రసిద్ధిమిత్తే. (విలక్షణ మోక్షాధికార నిర్ణయమ్ – ఎఱుమ్బియప్పా)

వివరణం : సదాచార్య సంబంధంవల్ల మంచి కలిగేటట్లే, సచ్ఛిష్యసంబంధంవల్ల కూడా హితం కల్గుతుంది. భగవద్రామానుజులకు ముందున్న ఆచార్యులకు వారి కిరీటసంబంధంవల్ల, వారికి అనంతరకాలంలో పుట్టిన ఆచార్యులు వారి శ్రీచరణ సంబంధంవల్ల మోక్షం లభిస్తుంది– అని చెప్పబడుతున్నది. అయితే, ఆ శ్రీరామానుజులు కూడా తిరుక్కోట్టియూర్‌నంబి ఆజ్ఞను అతిక్రమించి, పలువురకు తిరుమంత్రార్థాన్ని వ్యక్తీకరించినందువల్ల తమకు మోక్షం లభించకుండా పోతుందేమో!" అని తలచారు. అయితే, తమకు కూరేశులతో శిష్యాచార్య రూపసంబంధం ఉన్నందువల్ల, కూరేశులతో సంబంధం ఉన్నవారికి అందరికీ మోక్షం సిద్ధిస్తుందని శ్రీరంగనాథుడు వరం ఇవ్వడంవల్ల, తమకు మోక్షం కల్గడం నిశ్చయం– అని తలచి కాషాయోత్తరీయాన్ని పైకి ఎగురవేసి నాట్యం చేశారు. అనే వృత్తాంతం ప్రసిద్ధం కదా! – (ఇంచుమించు ఇదే వృత్తాంతం వార్తామాలలోని 182వ వార్తలో ప్రస్తావింపబడింది.)

34) ఈమైయాయిరుప్పాన్ ఒరువన్ ఆర్తనామ్బుడియై క్కణ్డు ఎమ్బెరుమానార్ దయాపర రాయ్ తమ్ముడైయ తిరువడికళై క్కాట్టి కరసంజ్ఞైయాలే ఇవై హృదయత్తిలే ఇట్టుకొళ్ళు మెన్ఱు అవన్ తలైయిలే వైక్క, అత్తై క్కూరత్తాళ్వాన్ కణ్డు "ఐయో! నామ్ కూరకులత్తిలే పిఱన్ద శాస్త్రాభ్యాసమ్ పణ్ణి క్కెట్టోమ్. నాముమ్ ఒరు ఈమైయాయ్ ప్పిఱన్దాల్ పరగత స్వీకారమ్ లభిక్కుమిత్తే" ఎన్ఱు పరితపిత్తార్ (విలక్షణ మోక్షాధికార నిర్ణయమ్– ఎఱుమ్బియప్పా)

వివరణం : మూగవాడైన, శ్రీవైష్ణవుడొకడు ఆర్తుడై ఉండడాన్ని చూచిన భగవద్రామానుజులు దయతో తమ శ్రీచరణాలను శరణంగా చూపి చేతితో సంజ్ఞచేస్తూ వాటిని తన హృదయంలోనిలుపుకొమ్మని తెలిపి, తమ శ్రీచరణాలను అతని తలపై పెట్టారు. దీనిని గమనించిన కూరేశులు– "అయ్యో ! నేను ఉన్నతకులంలో పుట్టి, శాస్త్రాలను అన్నిటినీ అభ్యసించి, విద్యాంసుడనై చెడ్డానే ! నేను కూడా ఒక మూగవాడినై

పుట్టి ఉంటే, భగవద్రామానుజులే స్వయంగా వచ్చి తమ శ్రీచరణాలను నా తలపై పెట్టి ఉండే వారుకదా" అని అన్నారట.

35. ప్రాతికూల్యప్రవృత్తికళ్ ఉణ్డానాల్ వినాశమే పిఱక్కుమ్. శిష్యాచార్యసీమాభూమియాన కూరత్తాళ్వాన్ సంబంధమ్ ఉడైయవనాయ్‌వైత్తు భగవతాపచారత్తాలే వీరసుందరన్ ఎన్గిఱ రాజా నశిత్తు పోనానితే (విలక్షణ మోక్షాధికార నిర్ణయమ్ – ఎఱుమ్బియప్పా).

వివరణం: ఆచార్యులను గౌరవించకుండా, వారి మనస్సుకు విరుద్ధాలైన కార్యాలను చేస్తే, అది ఆ పనులను చేసిన వానిని నశింపజేస్తుంది. గొప్ప శిష్యునకు, గొప్ప ఆచార్యునకు లక్ష్యభూతులై ప్రకాశించిన కూరేశులతో సంబంధాన్ని కలవాడైనా, (శ్రీరంగంలో ప్రాకారాన్ని కట్టడంలో అడ్డువచ్చిన ఇళైయాళ్వాన్ అనే ఆచార్యుల ఇంటిని కూలగొట్టవద్దని పల్కిన) పరాశర భట్టర్‌ను లెక్కించకుండా ప్రవర్తించి నశించి పోయాడు కదా!

36. నాలూరాన్, ఉపద్రవమ్ వరుమ్ ఎన్నఱియాలే దర్శన నిర్వాహత్తుక్కాక అవశాత్ ఒరు వార్‌త్తై శొల్లి ప్పిన్బు అనుతపిత్తు పోయ్‌కైయాలే అత్తై ఆళ్వాన్ అపరాధమాక నినైయాతే పొఱుత్తిరుక్కచ్చెయ్‌తేయుమ్, ఆళ్వాన్ పక్కల్ వ్యామోహత్తాలే పెరుమాళ్ శీఱినాల్, "నాన్ పెఱ్ఱ లోకమ్ నాలూరానుమ్ పెఱవేణుమ్". ఎన్ఱు ప్రార్థిత్తార్. ఇత్త నైయొళ్ళియ బుద్ధిపూర్వక అపరాధమ్ పణ్ణిన వీరసుందరనుక్కు భట్టర్ ప్రసాదిత్తార్ ఎన్ఱిలైయే! (విలక్షణ మోక్షాధికారనిర్ణయమ్ – ఎఱుమ్బియప్పా).

వివరణం : "శివాత్ పరతరం నాస్తి" (శివుని కంటె గొప్ప దైవం లేదు) అని వ్రాసి, సంతకం పెట్టమని పలువురు విద్వాంసులను చోళరాజు నిర్బంధించినపుడు, నాలూరాన్ అనేవాడు "మా రామానుజులు అంగీకరిస్తే తప్ప ఇవి స్థిరం కాదు" అని యథాలాపంగా అన్నాడు. వెంటనే చోళరాజు శ్రీరామానుజులను రాజసభకు పిలుచుకొని రమ్మని తన భటులను పంపాడు. తరువాత జరిగిన ఉపద్రవాన్ని తలచి నాలూరాన్ చాలా పశ్చాత్తాపపడ్డాడు. జరిగే పర్యవసానాన్ని గుర్తించకుండా నాలూరాన్ అన్న మాటను దోషంగా కూరేశులు గణించలేదు. కాని, "నాలూరాన్ పల్కిన మాట వల్లనేకదా కూరేశులు నేత్రాలను కోల్పోవలసి వచ్చింది" అని కూరత్తాళ్వాన్ పట్ల ఉండే ప్రేమతో శ్రీరంగనాథుడు నాలూరాన్ విషయంలో చాలా కోపాన్ని పొందితే ఏంచేయాలి? అని తలచి కూరేశులు "నేను పొందిన ఫలాన్ని నాలూరాన్‌కూడా పొందాలి" అని ప్రార్థించారు. శ్రీరంగంలో ప్రాకారం కట్టడం కోసంగా ఇళైయాళ్వాన్ అనే శ్రీవైష్ణవుల గృహాన్ని కూలగొట్టవద్దు– అని పల్కిన పరాశరభట్టర్‌ను లెక్కించకుండా ప్రవర్తించినందువల్ల వీరసుందరరాయడు వినాశాన్ని పొందాడు. ఆ విధంగా మనఃపూర్వకంగా అపరాధాన్ని చేసిన వీరసుందరునకు భట్టర్ అనుగ్రహించారని చెప్పబడలేదు. అందువల్ల మనఃపూర్వకంగా అపరాధాన్ని చేయనివానికే ఆచార్యానుగ్రహం లభిస్తుంది– అని తెలుస్తున్నది.

అనుబంధం

దివ్యప్రబంధ వ్యాఖ్యానాలలో, అరుంబదవివరణాలలో పంచస్తవి ప్రమాణాలు, వాటి ఆకరాలు

పెరియాళ్వా	–	1-2-1		అతి-14
పెరియాళ్వా	–	2-1-7	–	వరదరాజ-23
పెరియాళ్వా	–	4-2-1	–	సుందర-3
పెరియాళ్వా	–	4-3-11	–	వరద-16
కణ్ణినుణ్	–	8	–	శ్రీవైకుంఠ-2
ఇరామానుశ	–	70	–	వైకుంఠ-90
తిరుప్పావై	–	7	–	వైకుంఠ-77
తిరుప్పల్లాండు	–	4	–	వైకుంఠ-77
తిరుప్పావై	–	28	–	సుందర-107
తిరువాయ్	–	1-5-1	–	సుందర-107
పెరియాళ్వా	–	4-9-10	–	వరద-63
తిరుప్పావై	–	28	–	అతి-61
తిరుప్పావై	–	2-3-2	–	అతి-14
తిరుప్పావై	–	1-2-10	–	వైకుంఠ-36
తిరుమాలై	–	4	–	వైకుంఠ-61
తిరువాయ్	–	10-10-2	–	వైకుంఠ-27
తిరువాయ్	–	3-7-5	–	శ్రీస్తవ-1
తిరువాయ్	–	3-10-8	–	శ్రీస్తవ-1
పెరియాళ్వా	–	4-2-5	–	సుందర-8
అమల	–	3	–	వరద-55
తిరువాయ్	–	3-7-5	–	శ్రీస్తవ-1
తిరువాయ్	–	1-5-1	–	సుందర-107
తిరువాయ్	–	2-3-5	–	వైకుంఠ-36
తిరువాయ్	–	3-5-6	–	వరద-18
తిరువాయ్	–	1-5-1	–	సుందర-107
తిరువాయ్	–	మహాప్రవేశం	–	వైకుంఠ-14

తిరువాయ్	–	మహాప్రవేశం	–	వరద-
తిరువాయ్	–	1-1-1	–	వరద-11
తిరువాయ్	–	1-2-5	–	వరద-81
తిరువాయ్	–	1-3-1	–	అతి-40
తిరువాయ్	–	1-3-7	–	వైకుంఠ-28-
తిరువాయ్	–	1-5-4	–	అతి-15
తిరువాయ్	–	1-5-6	–	అతి-2
తిరువాయ్	–	1-6-7	–	అతి-32
తిరువాయ్	–	1-8-4	–	వరద-63
తిరువాయ్	–	1-8-8	–	సుందర-30
తిరువాయ్	–	1-9-7	–	వరద-25
తిరువాయ్	–	2-1-2	–	వరద-81
తిరువాయ్	–	2-2-5	–	వైకుంఠ-37
తిరువాయ్	–	2-3-4	–	వైకుంఠ-37
తిరువాయ్	–	2-5-2	–	వైకుంఠ-30
తిరువాయ్	–	2-6-4	–	వైకుంఠ-28
తిరువాయ్	–	2-10-2	–	వరద-78
తిరువాయ్	–	2-10-4	–	సుందర-5
తిరువాయ్	–	2-10-5	–	అతి-56
తిరువాయ్	–	3-1-1	–	వరద-25
తిరువాయ్	–	3-1-1	–	సుందర-63
తిరువాయ్	–	3-1-2	–	శ్రీస్తవ-8
తిరువాయ్	–	3-1-2	–	శ్రీస్తవ-3
తిరువాయ్	–	3-1-5	–	వైకుంఠ-36
తిరువాయ్	–	3-2-ప్రవేశం	–	వరద-18
తిరువాయ్	–	3-2-10	–	వరద-77
తిరువాయ్	–	3-4-3	–	వరద-25
తిరువాయ్	–	3-4-7	–	వరద-81
తిరువాయ్	–	3-4-7	–	వైకుంఠ-37

తిరువాయ్	–	3-5-ప్రవేశం	–	వరద-78
తిరువాయ్	–	3-5-6	–	వరద-17
తిరువాయ్	–	3-5-6	–	సుందర-127
తిరువాయ్	–	3-5-8	–	వరద-63
తిరువాయ్	–	3-8-ప్రవేశం	–	వరద-34
తిరువాయ్	–	4-5-8	–	సుందర-63
తిరువాయ్	–	4-7-3	–	వైకుంఠ-61
తిరువాయ్	–	4-7-6	–	వరద-23
తిరువాయ్	–	4-10-ప్రవేశం	–	సుందర-16
తిరువాయ్	–	4-10-5	–	వైకుంఠ-14
తిరువాయ్	–	4-10-9	–	వైకుంఠ-14
తిరువాయ్	–	5-1-11	–	వరద-23
తిరువాయ్	–	5-5-3	–	సుంధర-36
తిరువాయ్	–	5-5-4	–	వరద-25
తిరువాయ్	–	5-5-9	–	వరద-25
తిరువాయ్	–	5-5-9	–	వైకుంఠ-28
తిరువాయ్	–	6-5-8	–	వైకుంఠ-49
తిరువాయ్	–	6-9-8	–	వరద-83
తిరువాయ్	–	6-10-10	–	శ్రీస్తవ-1
తిరువాయ్	–	7-5-1	–	అతి-17
తిరువాయ్	–	9-2-3	–	వరద-63
తిరువాయ్	–	10-10-2	–	వరద-63
అమల-2	–	వరద-25		
తిరువాయ్	–	1-2-10		వైకుంఠ-36
తిరువాయ్	–	3-5-6		వరద-18
పల్లాణ్డు	–	వైకుంఠ-77		
తిరువాయ్	–	కణ్ణినాణ్-4	–	వైకుంఠ-2
తిరుప్పావై-7	–	వైకుంఠ-77		

రహస్యగ్రంథ వ్యాఖ్యానాలలో ఉట్టంకింపబడ్డ పంచస్తవి శ్లోకాలు, వారి ఆకరాలు

శ్రీవచన -17 సూ - వరద -79
శ్రీవచన - 145 - అతిమానుష -53
శ్రీవచన- 291 - వైకుంఠ - 88
శ్రీవచన - 358 - వరద -76
తత్త్వత్రయ చిత్ ప్రకరణ వ్యాఖ్యానం - 39 - వైకుంఠం 74
తత్త్వత్రయ చిత్ ప్రకరణ వ్యాఖ్యానం- 45 - సుందర-3
తత్త్వత్రయ అచిత్ ప్రకరణ వ్యాఖ్యానం- 3 - శ్రీస్తవం -3
తత్త్వత్రయ అచిత్ వ్యాఖ్యానం - ఈశ్వర - 8 - సుందర -26
తత్త్వత్రయ చిత్ వ్యాఖ్యానం - ఈశ్వర - 9 - వరద-15
తత్త్వత్రయ చిత్ వ్యాఖ్యానం - ఈశ్వర - 11 - వరద- 63
తత్త్వత్రయ చిత్ వ్యాఖ్యానం - ఈశ్వర - 22 - వైకుంఠ -55
తత్త్వత్రయ చిత్ వ్యాఖ్యానం - ఈశ్వర - 33 - వరద - 17
తత్త్వత్రయ చిత్ వ్యాఖ్యానం - ఈశ్వర - 45 - వరద - 16
తత్త్వత్రయ చిత్ వ్యాఖ్యానం - ఈశ్వర - 54 - వరద - 17
తత్త్వత్రయ చిత్ వ్యాఖ్యానం - ఈశ్వర - అతి-9
తత్త్వత్రయ చిత్ వ్యాఖ్యానం - ఈశ్వర - 55 - సుందర - 86
రహస్యత్రయ సారం - ప్రధానప్రతి తంత్రార్థం - వైకుంఠ -36
రహస్యత్రయ సారం - తత్త్వత్రయచింతనాధికారం - వరద-16
రహస్యత్రయ సారం - పరదేవతా పారమార్థ్యాధికారం - వైకుంఠ- 55
రహస్యత్రయ సారం - అధికారి విభాగాధికారం - అతిమా - 61
రహస్యత్రయ సారం - అధికారి విభాగాధికారం - వరద -84
రహస్యత్రయ సారం - ఉత్తరకృత్యాధికారం - వైకుంఠ -61, 77
రహస్యత్రయ సారం - సిద్ధోపాయశోధనాధికారం - వైకుంఠ - 36
రహస్యత్రయ సారం - సిద్ధోపాయశోధనాధికారం - శ్రీస్తవ- 1, 8
రహస్యత్రయ సారం - సిద్ధోపాయశోధనాధికారం - అతిమానుష- 61
రహస్యత్రయ సారం - సిద్ధోపాయశోధనాధికారం - వరద - 84, 88, 92, 81